అరుణతార

సాహిత్య, సాంస్కృతిక మాసపత్రిక

సంపుటి: 37 సంచిక: 2 డిసెంబర్ 2013

పేజీలు: 76 వెల: రు. 15

కామ్రేడ్ ఆకుల భూమయ్యకు
అరుణారుణ జోహార్లు!



నాగులేటి ఒడ్డునో
నల్లమల గట్టుమీదో
చంద్రవంక వంపులోనో
శ్రీకాకుళం శిఖరం మీదో
చిక్కటి చీకటి నిండిన ఏకాంతాల్ని దాచుకొని
మరణాల బరువుతో భారమై కరుకెక్కిన కంఠంతో

నీవు గొంతెత్తినప్పుడు
సమూహాల మీద ఏమాత్రం
సన్నగిల్లని అనుకంపనంతో
సన్నని గొంతులోని నల్లని రక్త నాళాల్ని వణికిస్తూ
నీ స్వరం విచ్చినప్పుడు

అడవి అడివంతా తుపాను హోరులో
చిక్కుకున్న నడిసంద్రమైపోయేది
ఊరుఊరంతా ఉప్పెనల జడిలో
తడిచిన మహోగ్రగానమైపోయేది

2014 జనవరి 11-12 తేదిలలో హనుమకొండలో జరిగిన విరసం 24వ మహాసభలలో ఆవిష్కరించిన పుస్తకాలు



దండకారణ్య కథలు
2005-2012
ప్రచురణ :
విప్లవ రచయితల సంఘం
వెల : రు. 125/-
పేజీలు : 224



అల్లం రాజయ్య
వసంతగీతం
రాజకీయార్థిక చారిత్రక నవల
ప్రచురణ :
పర్‌స్పెక్టివ్స్
వెల : రు. 250/-
పేజీలు : 420



ప్రతిఘాతుక విప్లవ
అత్యున్నత వ్యూహం
మంద్రస్థాయి యుద్ధం
రాజకీయ, సైనిక విశ్లేషణ
ప్రచురణ :
విప్లవ రచయితల సంఘం
వెల : రు. 100/-
పేజీలు : 183



ఒండ్రుమట్టి
ఓ తీర గ్రామం -
యాభై యేళ్ళ కథ
నల్లూరి రుక్మిణి
ప్రచురణ :
విప్లవ రచయితల సంఘం
వెల : రు. 170/-
పేజీలు : 384

రేపు
కథ
వెర్నన్ గొంజాల్విస్
అనువాదం :
ఎస్. రవి
ప్రచురణ :
విప్లవ రచయితల సంఘం
వెల : రు. 20/-
పేజీలు : 31



కాంత పున్నం వెన్నెల
రచయిత :
పద్మకుమారి
ప్రచురణ :
విప్లవ రచయితల సంఘం
వెల : రు. 20/-
పేజీలు : 31



సాహిత్య సమాలోచన
కృష్ణాబాయి
ప్రచురణ :
విప్లవ రచయితల సంఘం
వెల : రు. 300/-
పేజీలు : 551



రెండు పోరాట గాథలు
భారతి కథలు
ప్రచురణ :
విప్లవ రచయితల సంఘం
వెల : రు. 50/-
పేజీలు : 88



మిగిలేటోళ్లు
బాసిత్ కథలు
ప్రచురణ :
విప్లవ రచయితల సంఘం
వెల : రు. 50/-
పేజీలు : 87



నేను తెలంగాణోన్ని
మాట్లాడుతున్న
కాశీం
ప్రచురణ :
స్నేహ ప్రచురణలు
వెల : రు. 120/-
పేజీలు : 296

సామాజికం
వ్యాస సంపుటి
వి. చెంచయ్య
ప్రచురణ :
విప్లవ రచయితల సంఘం
వెల : రు. 50/-
పేజీలు : 79



నిత్యజీవితంలో సోషలిజం
అవును మాకు సోషలిజమే కావాలి
భూసారం శివన్న
ప్రచురణ :
శ్రామిక నేస్తం ప్రచురణలు
వెల : రు. 100/-
పేజీలు : 208

గ్రీన్‌హంట్ వ్యతిరేక కవిత్వం
పిల్లనగ్రోవి తుఫాన్
ఉదయ్ భాను
ప్రచురణ :
విప్లవ రచయితల సంఘం
వెల : రు. 20/-
పేజీలు : 48



ఆదర్శజీవులు
అమరులు
ప్రచురణ :
విప్లవ రచయితల సంఘం
వెల : రు. 30/-
పేజీలు : 53



అరణ్యపర్వం
కథల సంపుటి
ఆలూరి భుజంగరావు
ప్రచురణ :
విప్లవ రచయితల సంఘం
వెల : రు. 120/-
పేజీలు : 199

KLVA101M166

అరుణతార

సాహిత్య సాంస్కృతిక మాసపత్రిక

302 సంపుటి : 37 • సంచిక : 2 • డిసెంబర్, 2013

సంపాదకుడు
చలసాని ప్రసాద్
వర్కింగ్ ఎడిటర్
డి.వి. రామకృష్ణారావు
ఎం.ఐ.జి. - 14, ఎ.పి.ఐ.ఐ.సి. కాలనీ,
కార్బైడ్ కంపెనీ ఎదురుగా,
మౌలాలి, హైదరాబాద్ - 500 040.
* కేవలం పోస్ట్, బుక్‌పోస్ట్ ల ద్వారా
రచనలు పై చిరునామాకూ,
ఇ-మెయిల్ ద్వారా
arunatara1977@gmail.com కూ
పంపవచ్చు
సంపాదకవర్గం :
ఉజ్వల్, బాసిత్, కూర్మనాథ్
చందాలు పంపాల్సిన చిరునామా
మేనేజర్
ఎస్. రవికుమార్
5-1307, దొరసానిపల్లె రోడ్,
ప్రొద్దుటూరు, కడప జిల్లా - 516 360.
సెల్ : 9866021257
విరసం కార్యదర్శి చిరునామా
పి. వరలక్ష్మి
5-1820, గీతాశ్రమం వీధి,
ప్రొద్దుటూరు, కడప జిల్లా - 516 360.
డి.టి.పి. అండ్ లే అవుట్
డి. వైజయంతి, ఆర్. భాగ్యలక్ష్మి,
రచయితలు
1, 4 కవర్ డిజైన్
పి. వరలక్ష్మి, క్రాంతి
2, 3 కవర్ డిజైన్
ఆర్. భాగ్యలక్ష్మి
www.virasam.in
facebook.arunatara.viplava rachayitala sangham
ఈ సంచిక వెల : రు. 15/-

సంపాదక లేఖ...

కామ్రేడ్ ఆకుల భూమయ్య (65) డిసెంబర్ 24 రాత్రి హైదరాబాద్‌లోని విద్యానగర్ చౌరస్తా మలుపుపై జి.ఎచ్.ఎం.సి. టిప్పర్ ఢీకొనడంతో మృతి చెందారు. ఈ రోడ్డు ప్రమాదంపై నెలకొన్న అనుమానాలు ఈనాటికీ నివృత్తి కాకపోగా, ఇటీవల వరంగల్‌లో ఒక విప్లవ సానుభూతిపరుణ్ణి పోలీసులు 'నిన్నూ గంటి ప్రసాదం, ఆకుల భూమయ్యల వలెనే చంపుతాం' అని బెదిరించడంలో రాజ్య స్వభావాన్ని గుర్తుపట్టవచ్చు. ప్రమాదం జరిగిన వెంటనే వివిధ ప్రజా సంఘాల బాధ్యులు, కార్యకర్తలు ఘటనాస్థలికి చేరుకొని ఇది ప్రమాదం కాదని, రాజ్యం చేసిన హత్యేనని ముక్తకంఠంతో నినదించారు. కామ్రేడ్ భూమయ్య మరణంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జిచేత సమగ్ర న్యాయవిచారణ జరిపించాలని ఈ ప్రమాదానికి కారకులైనవారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆ దిశగా ఇప్పటి వరకూ పాలకులు ఎటువంటి చర్య తీసుకోలేదు. అసహజ మరణాలను, అర్ధాంతర మరణాలను రాజ్యం చేసిన హత్యలుగా.మేధావులు ఎప్పుడో విశ్లేషించారు. రాజ్యమే తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాల్సి ఉంది. కా. ఆకుల భూమయ్య ఉద్యమ ప్రస్థానం 1969 తెలంగాణ విద్యార్థి ఉద్యమంతో మొదలయి అక్కడితో ఆగకుండా, నక్సల్బరీ, శ్రీకాకుళ ఉద్యమాల ప్రేరణతో మరింత విశాలమైన ఉద్యమాల పరిధిలోకి నడిచింది. ఆయన నడవడమేకాదు నాలుగున్నర దశాబ్దాల ఆచరణలో దృఢంగా నిలబడ్డారు. తనతో పాటు అనేకమందిని నడిపించారు. కఠినమైన నిర్బంధాలకు ఎదురు నిలిచి ఆశయ సాధన కోసం తుది శ్వాస వరకు కొనసాగారు. 1973లో భూమయ్య ఉపాధ్యాయ వృత్తిలో చేరినప్పటి నుంచి ఉపాధ్యాయ ఉద్యమాలలోనూ క్రియాశీలంగా పనిచేశారు. స్వయంగా అనేక వ్యాసాలు రాయడమే కాక, సైద్ధాంతిక పత్రాలూ రాశారు. చరిత్ర, మార్క్సిస్టు తత్వశాస్త్రం, రాజకీయార్థ శాస్త్రాలపై కార్యకర్తలకు ఆయన అనేక తరగతులు చెప్పారు. మార్క్సిజం, లెనినిజం, మావోయిజంల తాత్విక వెలుగులోనే ఆయన ఆచరణ కొనసాగింది. ఉపాధ్యాయ ఉద్యమాల నుంచి మొదలు తెలంగాణ ఉద్యమం దాకా ఆయన నూతన ప్రజాస్వామిక దృష్టితోనే దేశంలోని, రాష్ట్రంలోని పీడిత ప్రజల సమస్యలకు పరిష్కారాలు వెతికారు. ఈ దేశంలోని పీడిత ప్రజల నూతన ప్రజాస్వామిక విప్లవ కల నిజం కావాలని తన వంతు కృషిని నిబద్ధతతో కొనసాగించారు. ఆ లక్ష్యంతో సాగిన అనేక సెమినార్లకు దేశం నలుమూలలా తిరిగారు.

మంద్రస్థాయి యుద్ధ వ్యూహంతో విప్లవోద్యమంపై, ప్రజా ఉద్యమాలపై రాజ్యం సైద్ధాంతిక దాడితో సహా మానసిక యుద్ధం, అసత్య ప్రచారం, పోరాడేవారిని హత్యలు గావించడం, సుదీర్ఘ కాలం జైళ్ళలో నిర్బంధించడంతో సహా బహుముఖాలుగా దాడి చేస్తోంది. ఇలాంటి సందర్భంలో కామ్రేడ్ ఆకుల భూమయ్య వలే స్థిరంగా ఆశయాలకోసం కట్టుబడి కొనసాగడమే ఆయన నుంచి మనం నేర్చుకోవాలి.

మొత్తంగా ప్రజల ఆరు దశాబ్దాల ప్రజల పోరాట ఆకాంక్ష తెలంగాణ స్వప్నం భౌగోళికంగా సాకారం అయ్యింది. అయితే కా. భూమయ్య కన్న కలలు, ఇంకా నిజం కావాల్సి ఉంది. ఆట, పాట, మాటలకు స్వేచ్ఛ, భావ ప్రకటనా స్వేచ్ఛ, పోరాడే స్వేచ్ఛలతో సహా అనేక మౌలిక హక్కుల సాధన కోసం పోరాటం కొనసాగాల్సి ఉంది. నిత్య నిర్బంధాల మధ్య నెత్తుటి మడుగైన తెలంగాణ, కాలి బొగ్గైన తెలంగాణ తన స్వప్నాలను సాకారం చేసుకోవడంలో ముందుకు సాగాల్సి ఉంది. అదే మనం కామ్రేడ్ భూమయ్యకు ఇవ్వగలిగే నిజమైన నివాళి.

మనిషి మరణించిన పద్ధతే కాదు, జీవించిన పద్ధతీ అమరత్వానికి కారణమవుతుంది. శత్రువు తూటాలకు నెలకొరిగినా, రాజ్యప్రేరిత హంతక ముఠాల చేతిలో హత్యకు గురైనా, ప్రమాదాల పేరిట మరణించినా, వృద్ధాప్యం, అనారోగ్యాలతో మరణించినా, జీవించిన పద్ధతి, జీవిత ఆచరణ వల్లే మనుషులు అమరులు అవుతారు. ఆదర్శజీవులు అవుతారు. తాను మరణించడానికి కొద్ది నిముషాల ముందు ప్రజాస్వామిక తెలంగాణ కోసం ఉద్దేశించిన చారిత్రక పత్రాలను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. అదే ఆయన చివరి ప్రసంగం. ఇవాళ ఆయన లేరు. ఆయన వదిలి వెళ్లిన ఆశయాలు మనతోనే ఉన్నాయి. ఆయన కన్న కలలు మనతోనే ఉన్నాయి. వాటిని నిజం చేయాల్సిన బాధ్యతా మనపైనే ఉంది.

విరసం సాహిత్యాన్ని కరపత్రాలను, స్టేట్‌మెంట్లను, అరుణతార పత్రికను www.virasam.in వెబ్‌సైట్‌లో చూడవచ్చు. అలాగే వివిధ సాహిత్య పత్రికల బ్లాగులు, సైట్‌ల లింకులను కూడా చూడవచ్చు.

సంపాదకీయం (5-7)
నెల్సన్ మండేలా ఎవరి విముక్తి ప్రదాత - పి. వరలక్ష్మి

వ్యాసం (6-7)
కామ్రేడ్ ఆకుల భూమయ్యకు నివాళి - ఆర్.డి.ఎఫ్. ప్రకటన

పాటలు/కవిత్వం (8-14)
ఉద్యమ జాలు భూమన్న - తంగెళ్ల సుదర్శనం
ఎర్రమందారాల భూమన్న - సిహెచ్.రమణాచారి
హక్కులనేత అమరుడు కామ్రేడ్ కన్నబిరాన్ - డప్పు రమేశ్
పూవర్తి అమరులకు ఎర్రెర్ర దండాలు - తంగెళ్ల సుదర్శనం
కలలు కల్లలేనా? - టి. వెంకటేష్
నిజమా మన్నాడే! - రివేరా
నమో! - వరవరరావు
కొత్త లోకాలు తెరుద్దాం - రాఘవాచారి
నిష్క్రమణంటే ఇంత ధిక్కారంగానా? - అనామధేయుడు

కథలు (15-43)
మార్పు - నిత్య
సోయి - మిడ్కో
లైవ్ విత్ లైవ్ - బమ్మిడి జగదీశ్వరరావు
ప్రవాసం నుంచి - ఎన్.వి. నాగభూషణ్

దండకారణ్య డైరీ (44-46)
మట్టివాసనలు : కళాకారులతో కాసేపు..... - సాధన

రిపోర్టు (47-49)
బొందల గడ్డలు ఆ బొగ్గుట్టలు - డాక్టర్ నళిని

వ్యాసం (50-64)
సాహిత్యం : సామాజిక చలనం - డా. ముదుమూరి భారతి
"నిర్జన వారధి" - ఒక విమర్శ - మిడ్కో
శుభ్రాంశు చౌధరి పుస్తకంపై మావోయిస్టుల విమర్శ

పుస్తక పరిచయం (65-71)
'నైరుతి ఋతుపవనాల కాలమిది!' - వరవరరావు
అంజుమ్ జమురుద్ హబీబ్ రాసిన
'ఖైదీ నెం: 100' పుస్తక పరిచయం - బెల్లపు అనురాధ
సామాజిక బాధ్యతల్ని చిందించిన స్వేదాశ్రువులు - దేశాయ్ అనిత

లేఖలు (70-74)
అపార్థం, గందరగోళం - వి. కవిత
తెలంగాణ ప్రత్యేక రాష్ట్రోద్యమం - గౌతమ్

(గమనిక : కె.వి. కూర్మనాథ్ - సూర్యుడు సీరియల్, ప్రత్యేక సంచికలకు వచ్చిన మిగతా కవితలు, పాటలు, ఇతర రచనలు రాబోయే సంచికల్లో ప్రచురిస్తాం - సం.)

అరుణతార చదవండి!
చదివించండి!
చందాదారులు కండి!

చందాలు, బకాయిలు మనియార్డర్, డి.డి.ల రూపంలో మేనేజర్‌కు పంపించండి.
డి.డి.లను ఎస్. రవికుమార్, ప్రొద్దుటూరు పేర తీయండి.
విడి సంచిక వెల : రు. 15/-; సంవత్సర చందా: రు. 160/-; జీవితచందా : రు. 1500/-

వెల : రు. 125/-

అమ్మకానికి సిద్ధంగా ఉంది!

అరుణతార

సాహిత్య, సాంస్కృతిక మాసపత్రిక

1970లలో తొలినాళ్ళలో వచ్చిన ప్రత్యేక సంచికలతో మొదలుకొని - 2013లో సాహిత్య విమర్శ ప్రత్యేక సంచికగా వచ్చిన 301వ సంచిక వరకు

డివిడి

ప్రతులకు :
నవోదయ బుక్‌హౌస్, కాచిగూడ చౌరస్తా, హైదరాబాద్. ఫోన్ : 040-24652387
దిశ పుస్తక కేంద్రం, చిక్కడపల్లి, హైదరాబాద్. ఫోన్ : 040-27640574

సంపాదకీయం

నెల్సన్ మండేలా ఎవరి విముక్తి ప్రదాత?

- పి.వరలక్ష్మి

నల్ల సూర్యుడిగా పేరుగాంచిన నెల్సన్ మండేలా 2013 డిసెంబరు 6వ తేదీన తన 95వ ఏట మరణించాడు. ప్రపంచ వ్యాప్తంగా సామ్రాజ్యవాద దేశాధ్యక్షులు మొదలు దళారీ పాలకులు, రివిజనిస్టు పార్టీలు, ప్రజాస్వామికవాదులు, మీడియా ఆయనకు ఘనంగా నివాళులర్పించాయి. జాతి వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడని తమిళజాతిని ఊచకోత కోసిన ఫాసిస్టు రాజపక్షే కూడా ఆయనను కొనియాడాడు. మన ప్రభుత్వం, పాలకవర్గ పార్టీలు, వామపక్షాలు కూడా గంభీరమైన సంతాప తీర్మానాలు చేశాయి. నెల్సన్ మండేలాను ఒకప్పుడు టెర్రరిస్టుగా ముద్రవేసిన అమెరికా దృష్టిలోనే కాదు, ఉదారవాదులు, ప్రజాస్వామిక వాదుల దృష్టిలో కూడా ఆయన మహోన్నత వ్యక్తిగా, ఆదర్శ పురుషుడిగా నిలవడం ఆసక్తికరమైన విషయమే.

దక్షిణాఫ్రికాలో జన్మించిన అందరు నల్లజాతీయుల్లానే నెల్సన్ మండేలా జాతి వివక్షను, పీడనను ఎదుర్కొన్నాడు. తిరుగుబాటు దారునిగా మొదలైన ఆయన రాజకీయ జీవితం, "అహింసా" మూర్తిగా సామ్రాజ్యవాద దళారీ పాలకుడిగా పరిణామం చెంది, ప్రపంచ పాలకపక్షాలకు అవసరమైన ఒక ఆదర్శవంతమైన నమూనాగా మిగిలిపోయింది. ఈ క్రమం వెనక ఒక రాజకీయార్థిక పరిణామముంది. సామ్రాజ్యవాద వలసల కింద, శ్వేతజాత్యాహంకారం కింద అణగారిపోయిన జాతి పెనుగులాట ఉంది.

దక్షిణాఫ్రికా అని సామ్రాజ్యవాదులు పెట్టుకున్న పేరుతో మనకు పరిచితమైన దేశం శతాబ్దాలుగా తన ఉనికి కోసం స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం పోరాడుతూనే ఉంది. తమ దేశాన్ని అజానియా అని గుర్తించాలని, అక్కడి ఆఫ్రికా జాతి ఉద్యమం అంటుంది. ఎనభై శాతానికిపైగా ఉన్న నల్లజాతి ప్రజలను నిరంకుశంగా పాలించి, ఇంకా ఆధిపత్యంలో కొనసాగుతున్న శ్వేత జాత్యాహంకారులు పదిహేడో శతాబ్దంలో యూరోపియన్ వలసలుగా అడుగుపెట్టారు. మూలవాసులను బలప్రయోగంతో ఓడించి, లొంగదీసుకొని బానిసలుగా అర్ధబానిసలుగా చేసుకున్నారు. మార్కెట్లు స్థిరపరచుకొని పెట్టుబడులు నిలదొక్కుకున్న క్రమమంతా అజానియన్ల నెత్తురుటేర్లు పారాయి. 1800 చివర్లో వజ్రాలు, బంగారం గనులు కనుగొన్నాక మరింతగా వారి బ్రతుకులు పిప్పి అయినాయి. మూలవాసులను తరిమేసి, మారణహోమం సృష్టించి గనులను ఆక్రమించుకున్నారు. సంపద ఎవరిదో వారు కూలీలుగా, అర్ధబానిసలుగా మిగిలిపోయారు. వీరితోపాటు ఇండియా నుండి చెరకు ప్లాంటేషన్ల కోసం కూలీలుగా తరలించబడిన వాళ్ళు కూడా ఆ దేశ శ్రామిక శక్తికి తోడయ్యారు. యూరోపియన్ సెటిలర్ల పెట్టుబడులకు విపరీతంగా లాభాలు జోడిరచారు. ఇరవయ్యో శతాబ్దం ఆరంభానికల్లా బ్రిటన్ తన రాజ్యాన్ని సుస్థిరం చేసుకుంది. మెజారిటీ నల్లజాతీయులు పరమ దారిద్ర్యంలో నికృష్టమైన జీవన ప్రమాణాలతో కునారిల్లుతుండగా, తెల్లజాతి పెట్టుబడిదారులు సంపదలతో తులతూగుతూ నిరంకుశంగా రాజ్యం చేశారు. 1994 దాకా నల్లజాతి ప్రజలకు కనీసం ఓటు హక్కు లేదు.

అజానియన్లు వివిధ రాజకీయ సంస్థల కింద. జాత్యాహంకార ప్రభుత్వంపై పోరాటం సాగించారు. యువ నెల్సన్ మండేలా 1942లో ఆఫ్రికన్ జాతీయ కాంగ్రెస్ (ఎఎన్‌సి) లో చేరాడు. స్వయంగా రాడికల్ యూత్ లీగ్‌ను ప్రారంభించాడు. తెల్ల ప్రభుత్వం అన్ని ఆందోళనలపై ఉక్కుపాదం మోపింది. నల్ల జాతి ఉద్యమ సంస్థల్ని నిషేధించింది. 1960లో షార్ప్‌విల్లీ ప్రాంతంలో జాతి వివక్షాపూరిత చట్టాలకు వ్యతిరేకంగా నిలసన తెలుపుతున్న ఆంతోళనకారులపై పోలీసులు జరిపిన కాల్పుల్లో వందలాది మంది గాయపడగా 69మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన ఉద్యమాన్ని మలుపు తిప్పింది. శ్వేతజాతి ఫాసిస్టు పాలకులను మామూలు నిరసనలు ఏమీ చేయలేవని తెలుసుకుని ఎంతో మంది యువకులు సాయుధ పోరాటం వైపు దృఢంగా అడుగులు వేశారు. కమ్యూనిస్టు రాజకీయాలతో ప్రభావితుడైన నెల్సన్ మండేలా కూడా 1961 నుండి "ఉమ్‌ఖోంటో వీ సిజ్వీ" అనే సాయుధ దళం కింద ప్రజల్ని సమీకరించాడు. అయితే తొందరలోనే (1963) ఆయన అరెస్టయ్యి జీవితఖైదు విధించబడి జైలు కెళ్ళాడు. ఆ ఇరవై ఎనిమిదేళ్ళ సుదీర్ఘ జైలు జీవితంలోనే ఆయన "శాంతియుత పరివర్తన" జరిగింది. ప్రభుత్వం ఎంత మందిని జైళ్ళలో కుక్కి చిత్రహింసలు పెట్టినా, వందలాది మందిని ఊచకోత కోసినా ఉద్యమం పురోగమించింది. ఒక్క సొవెటో మారణకాండలోనే ప్రభుత్వ బలగాలు ఆరు వందల మంది నల్లజాతీయులను చంపివేశాయి. అయినా 1970లు, "80లలో సాయుధ ప్రతిఘటన దళాల్లోకి అసంఖ్యాకంగా జనం చేరిపోయారు.

ప్రజల ప్రతిఘటన తీవ్రస్థాయికి చేరుకున్న నేపథ్యంలో ప్రభుత్వం ఆఫ్రికన్ జాతీయ కాంగ్రెస్ వంటి ఉదారవాద పార్టీలతో శాంతి చర్చలకు దిగింది. బూర్జువా, రివిజనిస్టు పార్టీల ముఖ్యులను తన వైపు తిప్పుకుంది. నల్లజాతి వ్యాపారస్తులకు ఉదారంగా అప్పులిచ్చి ప్రోత్సహించింది. నల్లజాతి బూర్జువా వర్గం తలెత్తింది. ఆఫ్రికన్ జాతీయ కాంగ్రెస్ నాయకులు కొందరు విశాలమైన ఎస్టేట్లలోకి మారారు. ఇటువంటి వారంతా ప్రభుత్వంతో శాంతి ఒప్పందాల కోసం తహతహలాడారు. ఒక వైపు ప్రజా ఉద్యమాలు జాత్యాంహకార ప్రభుత్వం నుండి తమ దేశాన్ని విముక్తం చేసి వారి కబంధ హస్తాల్లో ఉన్న జాతి సంపదను దాని సొంతదారులైన అజానియన్ల పరం చేయాలనే సంకల్పంతో ముందుకు నడుస్తున్నాయి. సామ్రాజ్య వాదులకు, దక్షిణాఫ్రికా తెల్లజాతి ఆధిపత్య ప్రభుత్వానికి ప్రజా ఉద్యమాన్ని అడ్రస్ చేయాల్సిన తప్పని పరిస్థితి. కచ్చితంగా అది

(మిగతా... 7వ పేజీలో)

వ్యాసం

కామ్రేడ్ ఆకుల భూమయ్యకు జోహార్లు

- ఆర్.డి.ఎఫ్. ప్రకటన

డిసెంబర్ 24 రాత్రి తొమ్మిది గంటలా నల్భై ఐదు నిముషాలకు తెలంగాణ ప్రజానాయకుడు ఆకుల భూమయ్యను అనుమాస్పద రోడ్డు ప్రమాదం బలిగొన్నది. తెలంగాణపై పుస్తకాన్ని ఆవిష్కరించి బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్ నుండి అప్పుడే ఆయన ఇంటికి పోతున్నాడు. విద్యానగర్ వద్ద చెత్తను మోసుకుపోతున్న మునిసిపల్ కార్పొరేషన్ వ్యాను మొదట ఆయన స్కూటర్‌ను గుద్దేసింది. జనం చూస్తుండగానే కిందపడ్డ భూమయ్య మీదుగా ఆ వ్యాను వెళ్ళిపోయింది. పారిపోతున్న డ్రైవరును అక్కడున్న వాళ్ళు పట్టుకుని సమీప పోలీసు స్టేషనుకు తీసుకెళ్ళగా హక్కుల సంఘాల వాళ్ళు పదే పదే ప్రశ్నించిన మీదట తేలిన సంగతేమంటే అతను రోజూ ఆ వ్యాను తోలే డ్రైవరు కాదని. ఇది నిజంగా రోడ్డు ప్రమాదమేనా అన్న అనుమానం ఇంకా అలాగే ఉంది.

సుదీర్ఘకాలం ఉపాధ్యాయ ఉద్యమ నాయకుడిగా కొనసాగిన కామ్రేడ్ ఆకుల భూమయ్య 1960ల నుండే తన ఆచరణను ఒక రంగానికే పరిమితం చేయకుండా, తెలంగాణ ప్రజల విప్లవ ప్రజాస్వామిక ఉద్యమాలన్నిటిలోనూ చురుగ్గా పాల్గొన్నాడు. 1960ల చివరిలో విద్యార్థిగా తొలి దశ తెలంగాణ ఉద్యమంలో నడిచాడు. తెలంగాణ ప్రజా ఫ్రంట్ నాయకుడిగా ఆయన తెలంగాణ రాష్ట్రంతో పాటు తెలంగాణలోని అన్ని పీడిత సమూహాలకు, ఆదివాసులకు భూమి మీద, వనర్ల మీద అధికారం దక్కాలని పోరాడిన వ్యక్తి. తెలంగాణలోని అన్ని పాలక వర్గ పార్టీలు తెలంగాణ రాష్ట్రాన్ని కోరుకున్నా, తెలంగాణ ప్రజా ఫ్రంట్ మాత్రమే ప్రజాస్వామిక తెలంగాణ అవగాహన కలిగి ఉన్నది. ప్రజలకు భూమి మీద, వనర్ల మీద హక్కులు కలిగి ఉండాలనే ప్రజాస్వామిక తెలంగాణ నినాదం అంటేనే పాలక వర్గాలకు కడుపు మంట. అందువల్ల భూమయ్య మరణం ప్రమాదవశాత్తూ జరిగింది కాదు, అది ప్రభుత్వ హత్య అని తెలంగాణ ప్రజా సంఘాలన్నీ చేస్తున్న ఆరోపణకు తగిన కారణాలున్నాయి.

ఆకుల భూమయ్య కరీంనగర్ జిల్లా పెద్దపల్లి మండలం కాచాపూర్ గ్రామంలో 1948లో జన్మించాడు. 1960-70లో మిలిటెంటుగా జరిగిన తెలంగాణ ఉద్యమం పియుసి చదువుతున్న భూమయ్యను గాఢంగా ప్రభావితం చేసింది. కరీంనగర్‌లో తన తోటి కాలేజీ విద్యార్థులను సమీకరించి "ఆంధ్రా గో బ్యాక్" ఉద్యమం నడిపి జైలుకు పోయాడు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని అణచివేశాక అతను వర్గపోరాట రాజకీయాల వైపు ఆకర్షితుడై మార్క్సిజాన్ని అధ్యయనం చేశాడు. 1973లో ఆయన ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించిన కొద్ది కాలానికే ''75 ఎమర్జెన్సీలో అరెస్టయ్యాడు. ''77లో జైలు నుండి విడుదలైనప్పటి నుండి ''83 దాకా పంచాయితీ రాజ్ టీచర్స్ యూనియన్ (పిఆర్‌టియు) కింద ఉపాధ్యాయులను సమీకరించాడు. ఆ తర్వాత తెలంగాణలో బలమైన ఉపాధ్యాయ ఉద్యమాన్ని నిర్మించిన ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ నాయకుల్లో భూమయ్య పాత్ర కీలకమైనది.

భూమయ్య లక్షలాది మంది భాగస్వాములుగా ఉన్న ఉపాధ్యాయ ఉద్యమ నాయకుడిగా, ఒక మంచి మిత్రుడిగా, గురువుగా, మార్గదర్శిగా ఎంతో మందికి చిరపరిచితుడు. ఆయన విస్తృతంగా అధ్యయనం చేయడమే కాక అనేక రచనలు చేసాడు. నల్భై ఏళ్ళ అవిశ్రాంత ఉద్యమ జీవితంలో ఆయన అసంఖ్యాక డాక్యుమెంట్లు, వ్యాసాలు, పుస్తకాలు రాశాడు. రాష్ట్రంలో అత్యంత వెనకబాటుకు గురైన ప్రాంతాలను గురించిన ఆయన లోతైన అధ్యయనం ఆయా ఉద్యమాలకు కచ్చితమైన దృక్పథాన్నిచ్చింది. సరైన దిశలో నడిపించగలిగింది. 1997 డిసెంబర్‌లో చారిత్రాత్మక ఎఐపిఆర్ఎఫ్ (ఆలిండియా పీపుల్స్ రెసిస్టెన్స్ ఫోరం) రెండు రోజుల మహాసభలు జరిగాయి. భారీ ఊరేగింపు అనంతరం జరిగిన బహిరంగ సభకు అయిదు లక్షలకు పైగా జనం హాజరయ్యారు. రెండో దశ తెలంగాణ ఉద్యమానికి నాంది పలికిన వరంగల్ డిక్లరేషన్ అక్కడే చేశారు. ప్రజాస్వామిక తెలంగాణ అవగాహనను రూపొందించిన వరంగల్ తీర్మానం చర్చలో భూమయ్య పాల్గొన్నాడు. తెలంగాణ ఉద్యమం కేవలం ఒక భౌగోళిక ఉద్యమం కాదు, ఆ ప్రాంత ప్రజల మౌలిక అవసరాలు తీర్చి ప్రజాస్వామిక హక్కుల్ని గ్యారంటీ చేసే ప్రజాస్వామిక ఉద్యమం అని అది నిర్వచించింది. ఈ అవగాహనను, సభల స్ఫూర్తిని ముందుకు తీసుకొని పోయి తెలంగాణ జనసభను నిర్మాణం చేశాడు. అక్కడి నుండి తెలంగాణ జనసభే ఉద్యమాన్ని నడిపించే వేగుచుక్క అయి లోపలా, బైటా అన్ని రకాల వైరుధ్యాలతో, రాజకీయ పక్షాలతో పోరాడి దానిని ఉన్నత దశకు తీసుకువచ్చింది.

అటువంటి తెలంగాణ జనసభకు కన్వీనర్‌గా భూమయ్య, ఆంధ్రప్రదేశ్‌లో అన్ని ప్రజాసంఘాలను అణచివేస్తున్న చంద్రబాబు ప్రభుత్వ ఫాసిస్టు నిర్బంధం మధ్యనే తెలంగాణ పది జిల్లాల వ్యాప్తంగా తిరిగి జనసభను నిర్మాణం చేశాడు. ఈ కాలంలోనే నల్గొండలో, కరీంనగర్‌లో తెలంగాణ సాంస్కృతికోద్యమ కార్యకర్తలైన బెల్లి లలిత, రవీందర్ రెడ్డిలు రాష్ట్ర ప్రభుత్వం చేత క్రూరంగా హత్య చేయబడ్డారు. మహబూబ్‌నగర్‌లో భూమయ్య సహోపాధ్యాయుడు కనకాచారి వంటి వాళ్ళను హత్య చేసి తెలంగాణ జనసభపైన అనధికార నిషేధాన్ని అమలు చేసింది చంద్రబాబు నాయుడు ప్రభుత్వం. ఈ పరిస్థితుల్లో భూమయ్య తెలంగాణ ఐక్య కార్యాచరణ పేరుతో విశాల ఐక్య సంఘటనను నిర్మాణం చేశాడు. ఆ కృషిలో భాగంగా సీపిఐ (మావోయిస్టు) పార్టీ మద్దతు కోరాడు. ఆ ప్రయత్నంలోనే ఆయన సన్నిహితులైన ఇద్దరిని పోలీసులు పట్టుకుపోయి బూటకపు ఎన్‌కౌంటర్‌లో కాల్చి చంపగా భూమయ్య తృటిలో తప్పించుకున్నాడు.

ఇప్పుడు తెలంగాణ ప్రజాఉద్యమానికి మార్గదర్శకత్వం చేస్తున్న తెలంగాణ ప్రజాఫ్రంట్‌ను 2010లో గద్దర్‌తో పాటు, భూమయ్య నిర్మాణం చేశాడు. గడిచిన నాలుగు సంవత్సరాల కాలం తెలంగాణ ఉద్యమం అన్ని పాలక వర్గ పార్టీల విద్రోహాలకు పదే పదే గురవుతున్న అత్యంత సంక్షుభిత కాలం. తెలంగాణ మొత్తం పోలీసు బలగాల అధీనంలో యుద్ధభూమిగా మారింది. భూమయ్య నాయకత్వంలో

తెలంగాణ ప్రజా ఫ్రంట్ బూర్జువా పార్టీల కుట్రలను, విద్రోహాలను ప్రజలకు ఎప్పటికప్పుడు తెలియజెప్పింది.

ప్రజా ఉద్యమ నాయకుడిగా, ఆలోచనాపరుడిగా భూమయ్య కార్యాచరణ తెలంగాణకే పరిమితం కాలేదు. ఆయన సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా అనేక వేదికలను కూడగట్టి యాంటీ డబ్ల్యూటీవో ఫోరం-జెఎఎఫ్ఐఎఫ్, ఫోరం అగెనెస్ట్ ఇంపీరియలిస్ట్ గ్లోబలైజేషన్ (ఫేగ్) వంటి సంఘటనలు ఏర్పాటు చేయడంలో కీలక పాత్ర పోషించాడు. 2004 ముంబై రెసిస్టెన్స్, పీపుల్స్ డెమాక్రెటిక్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా ఏర్పాటులోనూ ఆయన పాత్ర ఉన్నది. ఆయన అనేక రాష్ట్రాలు తిరుగుతూ వందలాది బహిరంగ సభల్లో, సెమినార్లలో, ఆందోళనల్లో పాల్గొన్నాడు. ఉపన్యాసాలిచ్చాడు, గైడ్ చేశాడు. దశాబ్ద కాలంగా భూమయ్య ప్రాణానికి ముప్పు పొంచి ఉంది. ఆయన ఎన్నో బెదిరింపులు అందుకోవడమే కాదు, అడిక్‌మెట్‌లో తెలంగాణ జనసభ కార్యాలయం నుండి ఒకసారి ఆయన కిడ్నాప్ కూడా అయ్యాడు. అన్ని సార్లూ ఆయన ప్రభుత్వ ప్రేరేపిత దాడులను ధైర్యంగా ఎదుర్కున్నాడు. కొన్ని సందర్భాల్లో చాకచక్యంగా తప్పించుకున్నాడు కూడా. అందుకే ఈసారేమైనా రాజ్యం లాటిన్ అమెకన్ స్టైల్‌లో మునిసిపాలిటీ వాహనం రూపంలో వచ్చిందా? రెండు దశాబ్దాలుగా ప్రజా ఉద్యమకారులను నిర్మూలించి ఆక్సిడెంట్‌గా దానిని తోసేసే పద్ధతి ఒకటి అక్కడ ఉనికిలో ఉంది.

ఏదేమైనా తెలంగాణ ఉద్యమం ఒక విధంగా ముగింపుకొచ్చే సమయంలో ప్రజలు తమ విలువైనా నాయకున్ని కోల్పోయారు. ప్రజాస్వామిక తెలంగాణ సాధన దిశగా మరెంతో దూరం పయనించాల్సిన దశలో భూమయ్య లేని లోటు తెలంగాణ ఉద్యమానిదే కాదు, దేశవ్యప్తంగా ఉన్న విప్లవ ప్రజాస్వామిక పోరాట ప్రజానీకానిదందరిదీ.

(విప్లవ ప్రజాస్వామిక వేదిక (రెవెల్యూషనరీ డెమోక్రటిక్ ఫ్రంట్ - ఆర్‌డిఎఫ్) ప్రకటన నుండి తీసుకున్న భాగాలకు తెలుగు అనువాదం)

(5వ పేజీ తరువాయి....)

బలప్రయోగంతో అణచివేయగలిగేది కాదు. అందుకే దక్షిణాఫ్రికా శ్వేతజాతి పాలకులు, బహుళజాతి కంపెనీలు, అమెరికా కలిసి మండేలా వంటి నాయకులను శాంతి ఒప్పందానికి ఒప్పించే ప్రయత్నం మొదలు పెట్టారు. చిన్న చిన్న సంస్కరణలకు ఆఫ్రికా జాతీయ కాంగ్రెస్‌లోని మితవాదులు, నెల్సన్ మండేలా అంగీకరించారు. అందు కోసం ఆంగ్లో అమెరికన్ మైనింగ్ చైర్మెన్ అయిన గెవిన్ రీలీ ఎఎన్‌సి ప్రతినిధులను కలిసి సర్దుబాటు చర్చలు జరిపారు. ఇంగ్లెండులోనూ రహస్య చర్చలు జరిపారు. అధికారంలో వాటాలు పంచుకొని పోరాటాన్ని విరమించాలన్నదే చర్చల సారాంశం. జైలులో ఉన్న మండేలాతో సంప్రదింపులు జరపడానికి అనువుగా ములాఖత్‌లను అనుమతించని పోల్స్‌మూర్ కారాగారం నుండి ఆయనను రాబిన్ దీవి జైలుకు తరలించారు. 1990 కంతా ఈ చర్చలు ఒక కొలిక్కొచ్చి నెల్సన్ మండేలా జైలు నుండి విడుదయ్యాడు. ఆ తర్వాత 1993లో మండేలాను సుదీర్ఘకాలం నిర్బంధించిన తెల్ల అధ్యక్షుడు డీక్లెర్క్‌తో కలిసి నోబెల్ శాంతి బహుమతిని ఆయన పంచుకోవడం బహుశా ప్రపంచ పాలకులు మెచ్చిన ఆదర్శం కావచ్చు. వారిరువురూ చేసుకున్న శ్మశాన శాంతి ఒప్పందం అహింసా సిద్ధాంతానికి వన్నె తెచ్చి ఉండొచ్చు. కాని మండేలా వలె జైలు పాలై, జైల్లోనే మరణించిన వారి రాజీలేని పోరాటానికి, ఆయన లాగా లొంగక చిత్రహింసలు పడుతూ ప్రాణాలొదిలిన విప్లవకారుల త్యాగాలకు, లక్షలాది అజానియన్లు చిందించిన రక్తానికి అది క్రూరమైన పరిహాసం. అదే విధంగా దేశ సంపద ఆఫ్రికా జాతి ప్రజలకే దక్కాలని, గనులను, గుత్తాధిపత్య పరిశ్రమలను జాతీయం చేయాలనే ఆయన పార్టీ విధానం కూడా "శాంతి" కోసం బలిచేయబడిరది.

విడుదలైన తర్వాత మండేలా సామ్రాజ్యవాదులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నాడు. అమెరికా వెళ్ళి గుత్తాధిపత్య మార్కెట్లకు భరోసా ఇచ్చే ఉదారవాద విధానాలను అమలు చేస్తానని హామీ ఇచ్చాడు. 1994 ఎన్నికల్లో విజయం సాధించాక అంతే నిజాయితీగా ఎఎన్‌సీ ఆర్థిక విధానాన్ని పారిశ్రామికవేత్తల ముందు ఉంచి వారి నుండి తగు సూచనలు పొందిన మీదే ఆమోదించాడు. ప్రజలకిచ్చిన హామీలను మాత్రం "శాంతి" కోసం, "దేశాభివృద్ధి" కోసం పక్కకు పెట్టేశాడు. భూసంస్కరణలను పక్కకు నెట్టేసి, ప్రైవేటు ఆస్తికి పటిష్ట రక్షణ ఇచ్చాడు. సౌతాఫ్రికా రిజర్వు బ్యాంకును జాతీయం చేయటం మాటేమో గాని అది పాత తెల్ల యాజమాన్యం కిందే నడుస్తోంది. అట్లాగే బంగారు, వజ్రాల గనులన్నీ అంతకు ముందు ఏ తెల్లజాతి ఆక్రమణదారుల చేతుల్లో ఉన్నాయో వారి కిందే కొనసాగాయి. రాజకీయాధికారం పైకి నల్ల జాతీయులదిగా కనపడినా సంపద తెల్ల జాతివారిదే. కాకపోతే పిడికెడు మంది నల్లవారికి అందులో అతి కొద్ది వాటా దక్కింది. ఇదే కార్పొరేట్ మీడియా చెప్తున్న నల్లజాతి విముక్తి. మొత్తం మీద జనాభాలో 80శాతం ఉన్న నల్లజాతి వారి చేతిలో 5 శాతం సంపద ఉండగా 87 శాతం భూమి తెల్లజాతి సంపన్నుల ఆధీనంలో కేంద్రీకృతమై ఉంది. ఉదారవాద ఆర్థిక విధానాల వల్ల మెజారిటీ నల్లజాతి ప్రజలు మరింతగా చితికి పోయారు. నిరుద్యోగం విలయతాండవం చేస్తోంది. కార్మికుల హక్కులను తీవ్రంగా అణిచేస్తున్నారు. 2012లో బ్రిటీష్ ప్లాటినం మైనింగ్ కంపెనీలో నిరసన తెలుపుతున్న కార్మికులపై కాల్పులు జరిపి 34 మంది కార్మికులను చంపిన ఘటన మండేలా నిర్మించిన నూతన రాజ్యానికి చిన్న ఉదాహరణ. ఈ రాజ్యాన్ని నెలకొల్పడం కోసమా లక్షలాది ప్రజల త్యాగాలు!

మొదట్లో ఫిడెల్ కాస్ట్రోను దేశానికి ఆహ్వానించడం, పాలస్తీనా ప్రజల పోరాటాన్ని సమర్థించి, ఇజ్రాయల్ సైన్యాలు వైదొలగాలని స్టేట్‌మెంట్లు ఇవ్వడం వంటివి అమెరికాను ఇబ్బంది పెట్టినా క్రమంగా సామ్రాజ్యవాదం అతన్ని పూర్తిగా కోఆప్ట్ చేసుకుంది. ఈ రాజీ పడటమే, వ్యవస్థలో కోఆప్ట్ కావటమే రివిజనిస్టులకు నచ్చింది. ఇవాళ ప్రజల విముక్తికి రక్తపాత విప్లవం అవసరం లేదని, అసలు వ్యవస్థను సమూలంగా మార్చడం సాధ్యం కాదని, చిన్నచిన్న సంస్కరణలు వ్యవస్థ లోపలే సాధించవచ్చని వాదించే ఉదారవాదులకు మండేలా ఒక నమూనా. అందుకే తీవ్రవాది నుండి శాంతి దూతగా మారి విప్లవం బెడద నుండి వ్యవస్థను రక్షించిన నెల్సన్ మండేలా ప్రపంచ హీరో అయ్యాడు. అట్లాగే శాంతియుత పరివర్తన ఎంత మోసపూరితమో ఇవాళ దక్షిణాఫ్రికా ఒక నమూనా.

పాటలు / కవిత్వం

ఉద్యమ జాలు భూమన్న

-తంగెళ్ల సుదర్శనం

ఉద్యమాల జాలువో అన్నో భూమన్న
నువ్ ఉపాధ్యాయ జ్వాలవో అన్నోభూమన్న "ఉ"

పుట్టింది కాచాపూర్ సదివింది పెద్దపెల్లి
కాలేజి చదువులాకు చేరినావు జమ్మికుంట
ఆదిరెడ్డి సాహు తిరుపతి పద్మక్క సదువుకున్న
వెలుగులు నింపినోడు తిరుపతయ్యసారు వున్న
ఆదర్శా కాలేజిరో అన్నో భూమన్న
ఆదర్శమయ్యినాదిరో అన్నో భూమన్న "ఉ"

అరవై తొమ్మిదిలోన తెలంగాణ పోరులోన
విద్యార్థులల్లో గలిసి నువ్ కదిలిపోయినావు
మోసగాడు చెన్నారెడ్డి అరె తెడ్డుజూపినపుడు
విద్యార్థులంత గలిసి ద్రోహాన్ని ఇప్పిచెప్పే
పోరుగర్జనయితెరో అన్నో భూమన్న
నువ్ గొంతుగలిపినావురో అన్నో భూమన్న "ఉ"

పారేటి ఏరులాగ నక్సల్బరీ పోరు
శ్రీకాకుళం దాటి పొంగిపొర్లుతుంటె
నువ్ పిడికిలెత్తినావురో అన్నో భూమన్న
పోరు బాసజేసినావురో అన్నోభూమన్న "ఉ"

పంతూలు కొలువులోనా నువ్ కాలుమోపినరుక
పంతుళ్ళ కూడగట్టి పోరు పాఠాలుజెప్పి
బూర్జువాల చదువులాను పాతరబెట్టమన్నవ్
ప్రజాబతుకు పోరు పాఠాల జెప్పమన్నవ్
శాస్త్రీయ భావాలురో అన్నో భూమన్న
సంఘంలో నిలపమన్నవో అన్నో భూమన్న "ఉ"

జనాసభకు నువ్వు జంగుసైరనయ్యినావు
చైతన్యరథమువయ్యి పల్లె పల్లె తిరిగినావు
వలసా దోపిడి పాలన అంతాన్ని కోరినావు
ప్రజాస్వామ్య తెలంగాణ పంతాన్ని బట్టినావు
నువ్ తెలంగాన పోరులో అన్నో భూమన్న
అలలయ్యి సాగినావురో అన్నో భూమన్న "ఉ"

నీ మాట తెలంగాణ నీ పాట తెలంగాణ
నీ జ్యాస తెలంగాణ నీ శ్వాస తెలంగాణ
నీ చివరి పలుకులంటరో అన్నో భూమన్న
ప్రజాస్వామ్య తెలంగాణరో అన్నో భూమన్న
నీ ఆశయాల తోవలో అన్నో భూమన్న
మా అడుగులేసి కదిలినం అన్నో భూమన్న

ఎర్రమందారాల భూమన్న

- సిహెచ్.రమణాచారి

ఎర్రమందారాల భూమన్నా
నవ్వేడికెళితివే భూమన్నా
ఎర్రమందారాల తోటలోన
నువ్వేడికెళితివే భూమన్నా
తోటలోన మము కావల ఉంచీ
మళ్ళీ వస్తనని ఏడికెళితివే

నీవిక లేవని కొందరు ద్రోహులు
గుండె బరువులను దించుకున్నరే
దారిలోన నీ తమ్ములున్నరని
ఆ బడవల కేమెరుకన్నా

పాఠాల్ జెప్పే బడిపంతులువై
బాధ్యతలనువ్ కట్టుబడితివే
బానిస సదువుల గుట్టును విప్పి
శాస్త్రీయ విద్యకు పట్టుబడితివే
విద్యార్థులను ఒక్కటి జేసి
ఉద్యమాలకు చాలుబోస్తివే

ఉపాధ్యాయ ఉద్యమాల నేతవై
సమైక్య ఉద్యమ బాటలేస్తివా
ఉపాధ్యాయుడే సమాజమర్పుకు
మార్గదర్శియని చాటిచెప్పినవ్
హక్కుల కోసం కలబడమన్నవు
బాధ్యలతకు మరి నిలబడమన్నవు

ప్రజాస్వామిక తెలంగాణమని
పట్టుబట్టి నువ్ పోరు నడిస్తే
దోపిడి సర్కార్ ఉలికిపడ్డదా
కంటికి నిదురా ఒదులుకున్నదా
కుట్రకు బలియై కూలిపోతివా
హిమ శిఖరంలా ఎదిగిపోతివా
నింగి కెగిసినా తారవైతివా

దండకారణ్యదారుల్లోనా
ఆదివాసులకు అన్నవైతివా
పేద ప్రజలకు ప్రాణమైతివా
దోపిడి గుండెలో గాలమైతివా
రైతుకూలికి అండగుంటివా
రగల్ జండలో ఎరుపువైతివా

నువ్ లేకున్నా ఓ భూమన్నా
నీ అడుగుజాడలను ఇడిచిపెట్టమే
నీ ఆశయాలను గుండెకద్దుకుని
తూరుపుదిక్కును ముద్దాడుతమే
బిగి పిడికిళ్ళను ఎత్తుకున్నమే

హక్కులనేత అమరుడు కామ్రేడ్ కన్నబిరాన్

- డప్పు రమేశ్

కన్నబిరాను నీకూ పోరూదండాలే! పోరాట దండలే
హక్కుల నేతా నీకు ఎఱ్రాదండాలే ఎఱ్రఱ్రా దండాలే
భగ భగ భగ మండినావు - ధగధగ ధగమెరిసినావు
కోర్టులా చట్టాల కుట్రలా నోడించ
హక్కులా పోరాట జెండెత్తి నడిచావు ||కన్నబి||

కలిగిన వారింట పుట్టిపెరిగిన నీవు పేదల్ని ప్రేమిస్తివన్నా
న్యాయవాదవృత్తి ఆయుధం చేపట్టి పేదలాకాపాడ్తివన్నా
అక్రమాకేసులూ జైలునిర్బంధాలు ||అక్రమ||
కుట్రకేసులాను వాదించి గెలిచినవ్ ||కన్నబి||

రాజ్యాంగములోని హక్కులు చట్టలూ
అందరికి ఒక్కటేనన్నావ్
పౌరులాకొకతీరు, పాలకులకొకతీరు
దుర్మార్గమూ ఘోరమన్నావ్
కోర్టులో నిలబెట్టి, ఎంతటీవాడ్నైన ||కోర్టులో||
న్యాయాన్ని కాపాడి, శిక్షలేయించావు ||కన్నబి||

కులమతబేధాలు దోపిడీ దారులా చేతిలో ఆయుధాలన్నవ్
అగ్రకుల మనువాద బ్రాహ్మణావాదాన్ని అంతమూచేయాలి అన్నవ్
అసమానతలు మాప - మానవతనూ నిల్ప ||అస||
తుదకంట బోధించి - ఆచరించీనావు ||కన్నబి||

నోరులేని కష్ట జీవులాను జూసి నీ బిడ్డలనుకుంటివన్నా
అక్రమాకేసులూ, అరెస్టులౌతుంటే తల్లడిల్లిపోతివన్నా
రాజ్యాంగ బద్ధంగా హక్కులను కాపాడి ||రాజ్యాం||
పేదవాళ్ళ పక్షపాతిగా బతికావు ||కన్నబి||

పందొమ్మిదొందల డెబ్బయైదులోన ఎమర్జెన్సీ వచ్చెనన్నా
రాజ్యాంగ విరుద్ధ నిర్బంధమనిదాన్ని ఎత్తేయమని లేస్తివన్నా
అక్రమ నిర్బంధఖైదీల కోసమూ ||అక్రమ||
హెబియస్సు కార్పస్సు కనిపెట్టినావన్న ||కన్నబి||

నాసాలు, మీసాలు, నల్లచట్టాలపై, టాడాలపై లేస్తివన్నా
భూస్వామ్య హత్యలూ, రాజ్యహింసాపైన, రాజీలేని పోరువన్నా
లాకప్పుడెత్తులూ, ఉరిశిక్షలాపైన ||లాకప్పు||
సింహస్వప్నామయ్యి, శిక్షలేయించినవ్ ||కన్నబి||

పేదవాల్లా కొరకు ప్రాణాలర్పిస్తున్న - నక్సలైటుల జూసివన్నా
దొంగెదురు కాల్పులా గుట్టుబైటాబెట్టి దోషుల్ని బట్టిస్తివన్నా
విప్లవా కారులా త్యాగాల సాలులో ||విప్లవ||
నిస్వార్థ జీవిగా నిలిచి పోతివన్న ||కన్నబి||

పూవర్తి అమరులకు ఎర్రెర్ర దండాలు

- తంగెళ్ల సుదర్శనం

ఎర్రెర్ర దండాలో ఎఱ్రాని దండాలో
పూవర్తి అమరూలాకు మా పోరు దండాలో
మా ఎర్రమల్లెలకు ||ఎర్రెర్ర||

ఉత్తర తెలంగాణ మేఘ గర్జనయ్యింద్రు
ఏరూలై పారింద్రు నదులయ్యి నడిచింద్రు
పోరు సంద్రంలోన అలలయ్యి ఎగిసినోళ్ళకు ||ఎర్రెర్ర||

అడవీలో మొక్కలకూ నీరయ్యి పారింద్రు
తోటమాలూలయ్యి ఏపూగ పెంచింద్రు
ఎర్రెర్ర వనమూలోన పువ్వూలై పూసినోళ్ళకు ||ఎర్రెర్ర||

తూరూపు కొండల్లో పొద్దయ్యి పొడిచింద్రు
ఆదివాసి గుండెల్లో జెండయ్యి ఎగిరింద్రు
ఎతల బతుకూలల్లో ఎరుపయ్యి నిలిచినోళ్ళకు ||ఎర్రెర్ర||

గద్దలు రాబందూలు అదవి మీద కన్నేసి
ఆకుపచ్చ వేటయ్యి పిల్లల కాటేస్తుంటే
ఆ వేటకు అడ్డూగోడయ్యి పానాలర్పించినోళ్లకు ||ఎర్రెర్ర||

ఎలుతురు పిట్టాలొచ్చి తూరూపు పాటైతే
వర్గబంధువులంతా కోరాసై పాడింద్రు
మీరిచ్చిన నెత్తుటి జెండ ఎత్తి పట్టి సాగింద్రు ||ఎర్రెర్ర||

కలలు కల్లలేనా?

- టి.వెంకటేష్

ఎండిన నేలపై హరిత లాస్యం
మండే గుండెలో సుందర స్వప్నం
ఇంకా కలలు కంటూనే ఉన్నాం
కలలు కల్లలేనా...?

బాధించే సత్యాల్ని ఎన్నాళ్ళు మోయాలి
ఒప్పందాలన్నీ శిథిల చరిత్రలయ్యాయి
ఫలించని తరాలు
నిష్ఫలమై వెక్కిరిస్తున్నాయి
నీటి రాతలు
నీటి పాలై
కన్నీటి పాటల్లో తేలుతున్నాయి
ఎల్లమ్మ సాక్షిగా
బళ్ళారి పాడి ఆవును పోగొట్టుకున్న నా తరం
బీడు భూమై కుములుతోంది
అన్నీ కోల్పోయిన జీవితాల్లో
ఇంకా చీకటి బుసకొడుతూనే ఉంది
పాలెగాండ్ల బాంబులు బరిసెలు ఆటవిక దాడుల నుండి
మా జాడల వెతుకు బాటలో
ఇప్పుడిప్పుడే కుబుసాల్ని విడుస్తున్నాము
కత్తులకు తప్ప
మెదళ్ళకు పదును లేదనే ఎకసెక్కాలు
గుండెను చీరేస్తున్నాయి
సీమ ఎదపై పారాడి
కోనసీమలో సస్యమై విరిసిన కృష్ణ
ఇక్కడ తుమ్మ కంపై మొలిచింది
ఈ నొప్పిని
ఇంద్రకీలాద్రి పట్టించుకోదు
మరే భాగ్యనగరమూ
బతుకు భరోసా ఇవ్వని
బుర్రమీసాల ఏలుబడిలో
నా సంస్కృతి ఇంకా ఖైదీనా!

నిజమా మన్నాడే!

- రివేరా

గతం పొలమారినప్పుడు
గొంతు తడారినప్పుడు
ఎడారి నింగిని పిగుల్చుకొని
సడిలేని పాడిపదాలను విదుల్చుకొచ్చే
మబ్బుతునకలా
తల వాకిట వంకీకి వేలాడేవాడివి

కలలపై పాట కరగనప్పుడు
అలలపై పైరు కదలాడనప్పుడు
తీరాలను దారపు కండిలా చుడుతూ
గాలి మరను తిప్పే
నది తరగలా
దిగులు కొండ దిగేదాకా చిలికేవాడివి

చూస్తుండగానే గాలిపటం తెగిపోయినప్పుడు
తనివితీరకుండానే కాలం తిరిగిపోయినప్పుడు
జాము మలుపులో జాగారం చేస్తూ
ప్రతి ముల్లుకు గులాబీలు పూసే
మెలుకువ పొద్దులా
కాళ రేఖపై యుగస్వరం వినిపించేవాడివి

ఎప్పటినుంచి ఈ నీడ
వెంట వస్తున్నదో తెలియదు
ఎంత నడిస్తే అంత దూరం
నీటి గొడుగు పట్టుకున్నదెవరో తెలియదు
అందరూ నీవు మరణించావంటున్నారు
కానీ నాకు మాత్రం
నీడ మరింత గాఢమవుతున్నట్టు
నీటి గొడుగు ఆకాశమంతా ఊగుతున్నట్టనిపిస్తోంది
వాళ్లంటున్నది నిజమా మన్నాడే!

నమో!

- వరవరరావు

మనువు కాలంలో
మనుషులు చేసిన దేవుడు చేసిన మనుషులు
మన కాలంలో చేస్తున్న మోడిఫికేషన్ ఏమిటి?
మనుషుల్నీ దేవుళ్లనూ బజార్లో పెడుతున్నారు

అమ్మగలిగినంత అమ్మి కొనగలిగినంత కొని
బ్రాండు మోహం మొత్తగానే
దేవుళ్లను నీళ్లున్న చోట
మనుషుల్ని నీళ్లు లేని చోట ముంచేస్తున్నారు

ఖైరతాబాదు వినాయకుడు ఆయన వాహనం
బాలాపూర్ లడ్డూ దాని బరువూ
ఒక బ్రాండు

ట్యాంక్‌బండ్ బతుకమ్మ అందులో గౌరమ్మ
చుట్టూ పేర్చిన పువ్వులూ దాని టీవీ
ఒక బ్రాండు

బర్కతపురా దుర్గమ్మ ఆమె చేతిలో ఆయుధాలూ
కాషాయ జెండాలు వాటి కవ్వింపులూ
ఒక బ్రాండు

ప్రతి తొమ్మి రోజులకూ
ఒక బ్రాండు మారుతుంది

కొలువూ కొలువూ ఒక సంరంభమే
నిమజ్జనమూ ఒక ప్రదర్శనమే
మనుషుల చెత్తకంతా డంపింగ్ యార్డ్ జవహర్‌నగర్
దేవుళ్ల డంపింగ్ యార్డ్ జలాశయాలు

మరి ఎక్కడ తేల్తం
పోలింగు బూతులో మునిగి
ఎన్నికల ఫలితాల్లో
చీలికలు పేలికలై

కొత్త లోకాలు తెరుద్దాం

- రాఘవాచారి

గండాలు గండాలు దాటి
తెలంగాణ చిన్న గట్టెక్కింది
బిడ్డల ఏడ్పు
తల్లులు తండ్రుల ఏడ్పు
కనిపించని దాడి కనిపించిన దాడి
గుండె గుండెను కోసిన గూండాల దాడి
ఎడతెగని దుఃఖం చారికలు కట్టింది
ఓదార్పు దొరకని లోకం
ఓర్పును సముద్రం చేసి పోరాడింది

తల్లిని వివస్త్రను చేసి
అపహాస్యం చేసిన ఎక్కిరింత మీద
అపజయాన్ని అదిమిపట్టి
రాశిపోసిన విజయం
చిన్నదే అయినా చిరునవ్వు
సంబరమే కదా

దిసమొలతో నిలిచి
తెగబడిన అమ్మ ఒంటిమీద
చిల్లులు మిగిలినదీ
మాసికలు వేసినదీ
చాలీచాలనిదే అయినా అంగవస్త్రం
సంబరమే కదా

ఒక చేతిలో విత్తనాలు
ఇంకొక చేతిలో పనిముట్లు
వల్లె వేసుకోవటమూ పోరాటమే
తప్పదు
పొదుగు నించి వేరు చేసిన
బిడ్డలతో గొంతు కలిపి
తెలంగాణ గోసపాడిన తీగల మీద
ముంపు బిడ్డల అలజడి పాటెత్తుకుందాం

ఆకాశం నిండా పూసిన
రంగుల సింగిడిని కమ్మిన నీడలతో
నిత్య యుద్ధంలో నిలబడదాం
దేశమంతా నిండి
ఎండిన స్తన్యంతో తండ్లాడుతున్న
బిడ్డల ఆకలి తీరాలె
తల్లిని
పచ్చని పంటపొలాలతో అలికరించి
దోసిళ్ళలో
పువ్వులు నింపుకునే తోటలకు
బాటలు వేద్దాం

నిష్క్రమణంటే ఇంత ధిక్కారంగానా?

- అనామధేయుడు

నిష్క్రమణంటే
మరీ ఇలానా?
ఇంత నిర్దయగానా?

భాగ్యక్కా! ఏడుపొస్తోంది
పదునుగా గుండె చీరుకుపోతున్నట్టుంది
కన్నీళ్ళుగా సముద్రమే బతికిపోతున్నట్టుంది

వీడ్కోలంటే
మరీ ఇలానా
ఇంత విషాదంగానా

భాగ్యక్కా! ఊపిరాగిపోతోంది
చిగురుటాకులని నిలబెట్టుకోలేని వసంతాల మీద
కాసేపైనా కినుక వహించాలనిపిస్తోంది
చివరాఖరి పుటల మీద కొంకర్లు తిరిగిపోయిన
ఆ కాసిని అపసవ్య అక్షరాల్ని అచ్చంగా
చెరిపేయాలనిపిస్తోంది

నిజమే
మనం ఆర్భాటపు అట్టహాసాల్నీ
ఉత్సవాల ఊరేగింపుల్నీ
సంతాప సందేశాల కన్నీటి మడుగుల్నీ
స్తూపాల తలాపుధూపాల్నీ
మలిగిపోయే నుసి దీపాల్నీ,

గణాచారుల కోలాహలాల్నీ
పుటల కొద్దీ కరచాలనాల్నీ
ఒలికిపోయే కౌగిలింతల్నీ
తీవ్రంగా ద్వేషించాం
గొంతెత్తి నిరసించాం

అయినా -
వెళ్ళిపోవడమంటే -
మరీ - ఇలానా?
ఇంత పిగిలిపోవడంగానా?

భాగ్యక్కా! చచ్చిపోవాలనిపిస్తోంది
సమస్త మనుకున్న ప్రవాహాన్ని
కాసేపైనా ద్వేషించాలనిపిస్తోంది
నిలబెడుతోన్న నమ్మకం
ఒక్క క్షణం బీటలు వారినట్లనిపిస్తోంది

కనుమరుగైపోవడమంటే -
మరీ - ఇలానా?
ఇంత కఠినంగానా?
భాగ్యక్కా! సోలిపోవాలనిపిస్తోంది
చిట్లిపోయిన మునివేళ్ళ సాక్షిగా
ఇది ఖచ్చితంగా మేం రాసిన గేయమే
చీరుకుపోయిన గుండెల సాక్షిగా
ఇది లోతుగా మేం చేసిన గాయమే

నిజమే -
అలా ఎండి రాలుతోన్న ఆకుల మధ్య
నిశ్శబ్దంగా సమాధుల్లోకి ఒదిగిపోవడం
పరిచిత వదనాల అపరిచిత అవనతాల్నీ
రాలీ రాలని కన్నీటి తుంపర్లనీ
హడావిడి గృహోన్ముఖాల్నీ
జ్ఞాపకాల్ని దులిపేసుకొని
ఆత్మల్ని తుడిచేసుకొని
అంతా చెల్లాచెదురైపోవడాన్ని
మనం తీవ్రంగా ధిక్కరించాం
రోతగా ఛీత్కరించాం!

నాగులేటి ఒడ్డునో
నల్లమల గుట్టమీదో
చంద్రవంక వంపులోనో
శ్రీకాకుళం శిఖరం మీదో
చిక్కటి చీకటి నిండిన ఏకాంతాల్ని దాచుకొని
మరణాల బరువుతో భారమై కరుకెక్కిన కంఠంతో
నీవు గొంతెత్తినప్పుడు -
సమూహాల మీద ఏ మాత్రం సన్నగిల్లని అనుకంపనంతో
సన్నని గొంతులోని నల్లని రక్త నాళాల్ని వణికిస్తూ
నీ స్వరం విచ్చినప్పుడు -

అడవి అడివంతా తుపాను హోరులో
చిక్కుకున్న నడిసంద్రమైపోయేది
ఊరుఊరంతా ఉప్పెనల జడిలో
తడిచిన మహోగ్రగానమైపోయేది

నీవు నడిచిన నలిగిన బాటలన్నీ
ఎర్రని చివుర్లేసిన తుపానుల వనమైపోయేది
జమ్మివనాల్లో నీవు బోధించిన ప్రతీ అక్షరం
పదునైన ఆయుధమై రూపొందేది

వెళ్ళిపోవడమంటే -
మరీ - ఇలానా;
ఇంత శిక్షాభరితంగానా?

భాగ్యక్కా! మొద్దుబారిపోయినట్టుంది
పూర్తిగా నెత్తురింకిపోయి ఎండిన నరం మీద
నల్లని ఒంటరి చీమేదో చరచరా పాకుతున్నట్టుంది
రహస్యంగా రాత్రి దూసే కత్తి అంచుమీద
వెచ్చని కన్నీటి బొట్టేదో తడి తడిగా
పొటమరించినట్టుంది

దూరమైపోవడమంటే -
మరీ - ఇలానా?
ఇంత దుఃఖభరితంగానా?
భాగ్యక్కా! పెట్లిపోతున్నట్లుంది
ఓ పిసరంత నమ్మకాన్నిచ్చి నిలబెట్టుకోలేని
చేతగానితనంతో ఉంగలు చుట్టుకుపోతున్నట్టుంది
పదునుగా చీల్చేసే సెలయేటిని
కసిగా పెనవేసుకొని
ఎప్పటికీ తీరం దాటని పెను
తుపానుగా పేట్రేగిపోవాలనుంది

మా ఉపాధ్యాయురాలా!
నిన్ను చూసినప్పుడల్లా -
ఎంగెల్స్ 'కుటుంబం-వ్యక్తిగత ఆస్తి-రాజ్యాంగాలపుట్టుక'
రెపరెపలాడుతూ నడిచొస్తున్నట్లుండేది
గడ్డకట్టుకుపోయిన గోడలన్నీ
అపనమ్మకాలతో పెట్లిపోయేవి
మూసుకుపోయిన తలుపులన్నీ
అసంబద్ధ బంధాలతో బద్దలయిపోయేవి

మా బోధకురాలా!
నిన్ను చూసినప్పుడల్లా -

వేనవేల ఓటములు ఒక విజయ వాస్తవంగా రూపొంది
ఎర్రెర్రని మార్చింగ్ గీతమై
కదంతొక్కుతున్నట్లుండేది
నీవు పాదం మోపినచోటల్లా
ఓ విశ్వకుటుంబం చివుర్లేసేది
నీవు పెదవి విప్పినప్పుడల్లా
ఓ గొప్ప నమ్మకం మోసులెత్తేది

చెరిపేసుకోవడం అంటే
మరీ - ఇలానా
ఇంత చెదిరిపోవడంగానా?

భాగ్యక్కా! చీరుకుపోతున్నట్టుంది
ఇప్పుడే అర్థమవుతోంది
ఆ నిర్లిప్తతంతా ఈ మునిమాపు వేళ కోసమేకదూ?
ఇప్పుడే తెలుస్తోంది
ఆ ఘర్షణంతా ఈ చీకటి ధారలై కురిసే
దట్టమైన క్షణం కోసమే కదూ?

నిశ్శబ్దమైపోవడమంటే -
మరీ - ఇలానా?
ఇంత నిర్దాక్షిణ్యంగానా?

భాగ్యక్కా! కుంచించుకుపోతున్నట్టుంది
ఓ లోహ హస్తమేదో దేహంలోకి
చొచ్చుకొచ్చి కెలికేస్తున్నట్టుంది
ముఖమ్మీద ఎప్పటికీ చెరిగిపోని
జిగటతనమేదో చిక్కగా కురుస్తున్నట్టుంది

క్షమించు! అంతా తెల్సికూడా -
ముదురు వెదురుల్లో పెనుగులాడే
ఆర్తగానాన్ని అలా నిర్లిప్తంగానే వింటుండిపోయాం

మన్నించు! అంతా అర్థమై కూడా -
ఉక్కుపంజరాల్లో ఓ ఒంటరి పక్షి తెగిపోయిన
రెక్కల నెత్తుటి రెపరెపల్ని అలా వీక్షిస్తుండిపోయాం

కంటికి కనిపించని హృదయపు పీలికలపై నుంచి వీస్తోన్న
చల్లగాలి సూటిగా కోసేస్తూ కకావికలు చేసేస్తోంది
ఇప్పుడిలా పచ్చని అరణ్యంలా ముడుచుకు పడుకున్న
నీ ముంగురులపై ముప్పయ్యేళ్ళ జనం పోరుచరిత్ర ప్రతిబింబిస్తోంది

నిజమే - అప్పుడు మనం నాటిన మొక్కలు
ఇప్పుడు భారీ వృక్షాలై కూలుండొచ్చు
నిజమే - అప్పుడు మనం సృజించిన
లేత మబ్బుతునకలు ఇప్పుడు చెదిరుండొచ్చు

కానీ -
చితికిపోయినా ఎక్కుపెట్టడమే కదా బతుకు లక్ష్యం
తూట్లు పడినా ఎలుగెత్తడమే కదా వేణువు నైజం
తెగిపోయినా రివ్వున దుయ్యడమే కదా ఊపిరి వడిసెల గానం

ఇప్పుడిక్కడంతా ఎవరికివారు
బీటలువారిన ఓ దుఃఖవాక్యమై
ఇప్పుడిక్కడంతా ఎవరికివారు
ఒలికిపోతున్న ఓ సందేహాస్పద పద్యమై
ఇప్పుడిక్కడంతా ఎవరికివారు
ఎంతకూ తెరిపివ్వని ముసురులో
తలదాచుకోనే శిబిరాలై

బహుశా గతించిన దారుల్లో
తల్లులందరూ బిడ్డల కోసం
నిర్విరామంగా రోదించే సమయాల్లో -
ఆకాశ దేహమ్మీద నల్లని చంద్రుడ్ని చెక్కుతూ నీవు

ఇప్పుడిక్కడంతా ఎవరికివారు మూసుకుపోయిన
ద్వారాల ముందు ఓ భిక్ష పాత్రకై
ఇప్పుడిక్కడంతా ఎవరికివారు గాలిలో
తడిచి నానిన దేహాల ముందు ఓ నిప్పుకణికై
ఇప్పుడిక్కడంతా ఎవరికి వారు పారేసుకున్న
జ్ఞాపకాల నయనాల ముందు ఓ నిష్ఫల స్వప్నమై

బహుశా అపసవ్యంగా బతకడమంటేనే
మరణించడమేనని మరోసారి ప్రకటిస్తూ
ఓ చిన్న ఆప్త వాక్యానికి దూరమై పదునుగా
గుచ్చుకున్న ఒక్కో పదాన్నీ కసిగా పెకిలించుకుంటూ
గ్రీష్మ దాహాల మీద చివరి సంతకాన్ని నమోదు చేస్తూ నీవు

భాగ్యక్కా! అరణ్య గుర్తొస్తున్నాడు
అమ్మేది అని బేలగా అడుగుతున్నట్టుంది
ఏం సమాధానం చెప్పమంటావ్?

నిరంతరం రగిలే నెగడు రవ్వవి నీవు
బారులు తీరిన జొన్నచేల వెన్నువి నీవు
కార్చిచ్చులా విచ్చుకొనే పచ్చని గరికపువ్వువి నీవు
తాకే లోపే పక్కున పగిలిపోయే పత్తికాయవి నీవు

గుండెను అలా తుంపులుగా విరజిమ్మేసి
మంచుతో కప్పేసిన దట్టని వనాల మధ్య
శోకం, శిశిరం, మరణం దారిపొడవునా జారవిడుస్తూ
ఎలా విస్మృతిలోకి కరిగిపోగలిగావు?

చెదిరిపోవడమంటే -
మరీ - ఇలానా?
ఇంత చిద్రితంగానా?
భాగ్యక్కా! సిగ్గేస్తోంది
ఓ పచ్చని పాటని చేజార్చుకున్నట్టుంది
ఓ వెచ్చని పాఠాన్ని అర్థాంతరంగా ముగించినట్టుంది

ఎన్ని దిగుళ్ళని?
ఎనలేని గుబుళ్ళని?
ఎన్ని పొంగిపొరలే గాయాల నదులు?
ఎన్ని పిగిలిపోయే గానాల జడులు?
ఎన్ని బలిదానాలని?
ఎన్ని ఆత్మహననాలని?
ప్రతీ వీడ్కోలూ ఓ దుఃఖ రుతువుగానే కమ్మేస్తోంది
ప్రతీ నిష్క్రమణా ఓ ఉప్పురాళ్ళ వనంగానే చీరేస్తోంది
నీకు తెలియందేమీ కాదుగా -
ఇది ఎన్నడూ ప్రవాహాల్ని కోల్పోని నక్షత్రాల నది
నీకు తెలియందేమీ కాదుగా -
ఇది పదునుగానే ఒరుచుకొనే యుద్ధాల ఖని.

నీడలు మసిగా ధారగా వర్షించే చోట
మరపుని కొద్దికొద్దిగా పోగేసుకుంటున్నచోట
ఎదిగిన శిఖరాలు నిశ్శబ్దంగా ఒరిగిపోతున్నచోట
వీడని చీకటి ముడులు మరింత
దట్టంగా అల్లుకుపోతున్నచోట
పెళుసెక్కిన ఎముకల్లోకి ఏకాంత
విషాదాలు ఒదుగుతున్న చోట
నేనింకా నీ కోసమే ఎదురు చూస్తున్నాను
నీ వెచ్చని కంఠస్వరం నాటిన
పచ్చని అక్షరాల నారుమళ్ళ
మధ్య నుండీ దేహమంతా
అల్లుకున్న సీతాకోకచిలుకల్తో
ఈ దారెంటే వస్తావని చూస్తున్నాను
నీవు మాత్రం -
ధారగా కురుస్తోన్న మంచుజడుల కింద
నగ్నంగా బిగుసుకుపోయిన
పసిపిల్లల సమాధుల మీద
నీ క్షతగాత్ర దేహాన్ని అలా కప్పి వెళ్ళిపోయావ్

నడచి వచ్చిన నదీ ముఖమ్మీద
నావలు వదిలెళ్ళిన
పురాతన పాదముద్రల శిథిల
శూన్యాల ఏకాంతాల మీద
ఏ పింజలైన ఊపిరిని అలా
దీపాలుగా వదిలి వెళ్ళిపోయావ్

పాలిపోయిన నీ కళ్ళు ప్రతిఫలించే
ఆ నల్లని పదాల చిరిగిన తెరచాపల్నీ
ఎక్కిళ్ళు నిండిన ఎండాకాలపు మధ్యాహ్నాల్నీ
ముక్కలుగా ధ్వంసం చేసేసిన
గడియారపు ధూళుల్నీ
ఆత్రంగా - పోగుచేసుకుంటూ -
తప్పదు - నేను కూడా ఇప్పటికి కాటికాపరినే!

సోలిపోతున్న సుదీర్ఘమైన నిశీధి రాత్రుల కోసం
కాసిని చిదుగుల్నీ రాలిపడిన ఎండుటాకుల్నీ
వాడిపోయిన పువ్వుల్నీ చివికపోయిన స్మృతుల్నీ
జారిపోయిన ఆత్మల డొల్లతనాల్నీ
పురాతన కుడ్యాల మీది హస్తాల ముద్రల్నీ
ఆత్రంగా - పొదువుకుంటూ -
తప్పదు - నేను కూడా ఇప్పటికీ శిథిల గాయకుడ్నే!

వేయి సార్లు దగ్ధమై
లక్ష సార్లు పునర్జీవించి
రివ్వున దూసుకుపోవడం ఎలానో నేర్పిన
మా ఫినిక్స్ పక్షివి నీవు
నీ ఆచరణతో, అంతులేని విశ్వాసంతో
శత్రు దుర్భేద్యం చేసిన
ఈ అద్భుత వనాన్ని ఒక్క క్షణమైనా -
నీవే 'జతింగా' గా ఎందుకు చేసావక్కా?

తప్పదు-
అవిరామ యుద్ధం పేరుతోనో
తీరికలేనితనాల వంకతోనో
నీ నిష్క్రమణను
నీ నిర్వికల్పతను
ఏ మాత్రం - ఏ విధంగానూ
సమర్థించుకోలేం
సంజాయిషీ వెదకలేం

భాగ్యక్కా!
నిన్నెప్పటికీ మా గురిని సరిచేసే
గుణపాఠంగానే నిలబెట్టుకుంటాం!
భాగ్యక్కా! ఏడుపొస్తోంది......!
(సీనియర్ - కామ్రేడ్ గద్దం లక్ష్మి (భాగ్య/రూప/మహిత) కోసం)

జతింగా : అస్సాంలోని ఒక లోయ. అక్కడకు పక్షులు వందల సంఖ్యలో వచ్చి ఆత్మహత్య చేసుకొంటాయని చెబుతారు. ఏదో భ్రమలో వేగంగా వచ్చి కొండల్ని ఢీకొని చనిపోతాయట!

మార్పు

- నిత్య

అది 2012 వసంత కాలం.. మేఘ గర్జనలు విని ఆకులు రాలిన చెట్ల చెవులు నిక్కపొడుచుకున్నాయి. వసంతకాలపు వాన జల్లులతో వడగాల్పుల నుండి సేదారుదామని ఆకాశం వైపు చూస్తున్నాయి ఆశగా..

విప్లవ ప్రజా ప్రభుత్వం అంటే జనతన సర్కారు గ్రామసభకు ఏర్పాట్లు జరిగాయి. గ్రామసభ జరిగి ఏడాది నిండింది. ఏడాదిలో ప్రభుత్వం చేపట్టిన కార్యకలాపాలను సమీక్షించిన పిదప కమిటీ ఎన్నిక జరుగుతుంది.

పంచాయితీ మిలీషియా కమాండ్ సభ్యుడు బూదు ప్రొటోకాల్ చేయిస్తున్నాడు. జనతన సర్కార్ అధ్యక్షుడు విల్లు-బాణం రెండు నక్షత్రాలు హత్తిన జెండా ఎగురవేశాడు.

ఏ కార్యక్రమం అయినా ప్రారంభించే ముందు ప్రజా యుద్ధంలో అసువులు బాసిన అమరులను స్మరించుకోవటం విప్లవ సాంప్రదాయం. అధ్యక్షుడు దసురు అమరులను పరిచయం చేస్తున్నాడు.

"ప్రజా పీడకుడైన చిన్న వెంటను అంతమొందించిన క్రమంలో మన ప్రియమైన కామ్రేడ్స్ మహరు, రాకేష్‌లు' గుండె జబ్బును కూడా లెక్క చేయకుండా మన కోసం మన మధ్యనే పనిచేస్తూ అమరులైన శ్రీకాంత్ దాద లాంటి గొప్ప నాయకులు ప్రజలకోసం ప్రాణాలిచ్చారు. వారిని స్మరించుకుందాం." పరిచయం చిన్నదే కానీ బరువుగా ఉంది.

"సావధాన్" అంటూ సభకు కాషన్ ఇచ్చాడు బూదు.

అందరూ రెండు కాళ్లూ దగ్గరకు తెచ్చి నిటారుగా నిలబడ్డారు. వారి చూపులు రేపటి సుందర భవిష్యత్తుకు ఆహ్వానం పలుకుతున్నట్లుగా ఎదురుగా నిలబడి రెపరెపలాడుతున్న జండాపై ఉన్నాయి.

"ఉల్టా శస్త్ర్" మళ్లీ కాషన్ ఇచ్చాడు బూదు.

వెంటవే తుపాకులు పట్టుకున్న వాళ్లు తుపాకుల బ్యారల్స్‌ను కిందికి చేసి, తమ తల మీది టోపిని తీసి ఎడమ చేతిలో పట్టుకుని, ఇవి రెండూ లేని వాళ్లు అందరితో పాటు అందరూ తలలు వంచి మౌనంగా నిలబడ్డారు.

సభ మౌనం పాటించింది.

"శ్రీకాంత్ దాద అమర్ హై"

"మహరు అమర్ హై"

"రాకేష్ అమర్ హై"

గ్రామ సభ కార్యవర్గ సభ్యులు దసురు, పేక, సన్ను, సాధులు విడతలు విడతలుగా ఏడాది కాలపు పని నివేదికను సభ ముందు ప్రవేశపెడుతున్నారు.

వాళ్ల చేతుల్లో కాయితాలూ లేవు, దస్త్రాలూ లేవు.

దసురు లేచి నిలబడి సభకు ఎర్ర అభివాదం చేసి, గత ఏడాది కాలంలో గ్రామసభ ఆధ్వర్యంలో సాగిన అభివృద్ధి కార్యక్రమాల నివేదిక ప్రవేశపెడుతున్నాడు.

"గత సంవత్సరం నుండి రెండు సిమెంటు బావుల నిర్మాణం చేశాం, వాటి చుట్టూ సిమెంటుతో చప్టా కట్టాం. సమిష్టి కూరగాయలు పండించాం. నది ఒడ్డున జొన్న వేశాం. సమిష్టి పొలం నుండి 15 క్వింటాళ్ల ధాన్యం పండించాం. పకడ్బందీ కంచె-కావలి లేకపోవటం మూలంగా క్వింటాలున్నర టమాటాలను గొడ్లు తినేశాయి. తోటంతా పాడు చేసేశాయి. ఆయిలు ఇంజను సకాలంలో రిపేరు చేయించలేక పోవటంతో జొన్న చేనుకు నీటి తడి పెట్టలేకపోయాం. దీంతో 3 వేల రూపాయల నష్టం వచ్చింది. ఈ సంవత్సరం మార్చి నెలకు ముందు గొడ్లను వదలకూడదని కమిటీ నిర్ణయం చేసింది. బందెలదొడ్డి కట్టాలని నిర్ణయం చేశాం, సమిష్టి ఉత్పత్తిని పెంచాలని నిర్ణయం చేశాం.

ప్రజలంతా సమిష్టి పనులకు స్వచ్ఛందంగా రావటం లేదు, సమిష్టి చైతన్యాన్ని పెంపొందించవలసిన అవసరం ఉన్నది.

రక్షణ శాఖ బాధ్యుడు పేక మట్టామి జనతన సర్కారు తీసుకున్న కార్యక్రమాలు, చేయవలసిన పనుల గురించి చెపుతున్నాడు. "మిలీషియాను సాయుధం చేయటం కోసం పది బర్మార్లు చేయాలని అనుకున్నాం, చాప్‌లు కమాండ్ వైపు నుండి మంజూరు అయినాయి. దాని కోసం 15 మంది పది రోజులు పని చేయాలి.

మన సర్కారు కార్యక్రమాలనూ, మన ఆనుపానులను పసిగట్టి శత్రువుకు సమాచారం అందించటానికి సిఐడిలు తిరుగుతున్నారు. గ్రామ పరిసరాలలో మన అదుపులో ఉన్న పిఎల్‌జిఏ సామాన్ల బడ్డీలు కాలిపోయాయి. ఇది ఖచ్చితంగా సిఐడిల పనే అయివుంటుంది. వీరిని పట్టుకోవటం కోసం మనం అడవిలో గస్తీ చేయాలి. గ్రామ పరిసరాలలో తెల్లవారుజామున, రాత్రి చీకటి పడిన తర్వాత పెట్రోలింగులు చేయాలి.

సాయంత్రం 6 గంటల నుండి ఉదయం 9 గంటల వరకూ రెగ్యులర్‌గా పెట్రోలింగులు చేయాలి."

నివేదిక ముగించారు. ప్రజా ప్రభుత్వం చేసిన నిర్ణయాలపై ప్రజల ఆమోదం తీసుకునే ప్రక్రియ నడుస్తున్నది. ఇందులో భాగంగా సభ అభిప్రాయాలను తీసుకుంటున్నారు.

"కొన్ని గ్రామాలకు సోలార్ ప్లేట్లు, బ్యాటరీలు అందినాయి. రాని ఊర్ల కోసం వచ్చి తీసుకుపోండని కబుర్ల మీద కబుర్లు వస్తున్నాయి. తెచ్చుకుంటేనే అయితదేమో..." గ్రామసభకు హాజరయిన సభ్యుడొకరు మెల్లగానే అయినా స్పష్టంగా వత్తి పలికాడు.

"ప్రభుత్వం మనకు ఎన్నో రకాల ఆశలు చూపుతున్నది. ఇప్పుడు మన మీద లేని ప్రేమ చూపుతున్నది. పేదల కోసం పని చేసే సర్కారే అయితే మన బతుకులు ఇట్ల ఎందుకుంటుండె, మనం

కార్లలో తిరక్కపోయినా కనీసం మంచి తిండి-వంటి నిండా బట్ట-ఉండటానికింత నీడయినా దొరికి ఉండేది."

నిన్నగాక మొన్న మార్చి 16 తారీఖు నాడు మాడ్ గుట్టల మీదికి ఎక్కిన పోలీసులు ఏం చేసినారో మీకు తెలుసా? వంట పాత్రలు, అన్నం తినే కంచాలు, నీళ్లు తాగే లోటాలతో సహా అన్నింటినీ చిల్లులు పడేలా గునపాలతో, గొడ్డళ్లతో పగులగొట్టారు. కప్పుకునేవి, కట్టుకునేవీ బట్టలను కాల్చివేశారు. పేదల పట్ల ప్రేమే ఉంటే ఇట్లెందుకు చేస్తారు?" దీన్ని మనం ఆలోచించాలి.

దీని వెనుక ఉన్న కుట్రను అర్థం చేసుకోవాలి. ఒకవైపు మనల్ని మట్టుబెట్టడానికి గోతులు తవ్వుతూనే మరో వేపు కొన్ని తీపి మాత్రలను ఇచ్చి మనల్ని మత్తులో ముంచే ఎత్తుగడలే ఇవి. ఆదివాసులంటే ఈ దోపిడి ప్రభుత్వాలకు ప్రేమ లేదు. మనల్ని పూడ్చిపెట్టి మన సమాధుల మీద స్టీలు ఫ్యాక్టరీలు కట్టాలని చూస్తున్నారు. మన భూమిలో ఉన్న ఇనుప ఖనిజాలను తవ్వుకుని పోయి కుబేరులవటానికి పోటీలు పడుతున్నారు. దళారీ పెట్టుబడిదారుల చెప్పుచేతల్లో ఉండే ప్రభుత్వం వాళ్ల లాభాల పంట పండించటం కోసం, వారు చెప్పినట్లుగానే పనిచేస్తుంది."

"గ్రీన్ హంట్ అనే పేరు విన్నారు కదా! పచ్చని అడవిలో బతికే ఆదివాసుల వేట. మనల్ని నయానా భయానా ఇక్కడి నుండి ఖాళీ చేయించటానికే ఆ వేట. ఈ వేట కోసం అయ్యే ఖర్చును కూడా టాటా, జిందల్‌లు ఇస్తున్నారని మొన్న మన పుష్ప దీది చెప్పింది మీకు గుర్తుండే ఉంటుంది."

ఇదంతా మన లడాయిని నీరు గార్చటానికే... చాప కింద నీరు లాగా చొప్పిస్తున్నారు. బరువులు మోసే గాడిదను తన మోస్తున్న బరువు గురించి ఆలోచించకుండా వేగంగా నడిపించటానికి కర్రకు గాజర్ గడ్డను కట్టినట్లుగానే ఈ సంస్కరణల కర్రను మనకు చూపిస్తున్నారు. ఇవి కూడా అందరికీ దొరుకుతున్నాయా? దొరికిన వాళ్లకీ దొరకని వాళ్లకీ మధ్యన జగడాలు పుట్టించి మనల్ని చీల్చటానికి కాదా ఇది... మీరే ఆలోచించండి. ఏదో దొరుకుతుందని ఆశలు పుట్టించి మనల్ని భ్రమల్లో మునిగేలా చేసే ఎత్తుగడ గురించి మనం తెలుసుకోవాలి.

సైన్యం రావటమూ, పథకాలు అమలు చేయటం ఇవి రెండూ కూడా ఆదివాసుల మీద ప్రభుత్వం తలపెట్టిన దాడిలో భాగమే.. ప్రభుత్వం అనే కత్తికి రెండు వైపులా పదును ఉంటుంది అని మనం గుర్తుంచుకోవాలి.

మనం ఇప్పుడు కత్తుల వంతెన మీద సాము చేయాలి. నిలకడ తప్పితే చీరుకుపోయేది మన కాళ్లే.

సభ వాతావరణం గంభీరంగా మారిపోయింది.

అందరూ తలలు వంచుకుని మౌనంగా ఉండిపోయారు.

మెజారిటీ సభ్యులు అధ్యక్షుని అభిప్రాయాలతో ఏకాభిప్రాయం కలిగి ఉన్నారు.

ప్రభుత్వం ఎక్కించిన నిషా తలకెక్కింది పెద్ద మనుషులకే.. అందుకే తేలు కుట్టిన దొంగల్లా చప్పుడు చేయకుండా తలలు నేలకేసి కూర్చున్నారు...కొత్త ఎత్తుగడను వెతుక్కుంటూ...

సభ ముగిసింది.

కొత్త కార్యవర్గం జండా దగ్గర ప్రతిజ్ఞ చేసిన తర్వాత జండాను దించారు.

* * *

విప్లవ ప్రజా ప్రభుత్వం కార్యవర్గం రాజకీయ పరిణతిని చూసి అబ్బురపడుతున్నది రూపి.

ఇంత చదువుకున్నా నలుగురి ముందు నిలబడి విషయాలను మాట్లాడమంటే కొన్ని తప్పిపోతుంటాయి.

చాలా సాధారణంగా కనిపించే ఈ మనుషులు ఒక్కో విషయాన్ని ఎంత స్పష్టంగా ప్రవేశపెడుతున్నారు. తను ఇంతకు ముందు కూడా ఇలాంటి మీటింగులకు హాజరయ్యింది కానీ ఇంత చక్కగా సూటిగా విషయాలను ప్రవేశపెట్టటం చూడలేదు.

ఒకరి తర్వాత ఒకరు ముందటి వాళ్లు వదిలేసిన విషయాలను కలుపుకుంటూ మాట్లాడుతున్నారు.

విషయాల పట్ల ఎంత సమగ్రత...

ప్రజల ఈ చైతన్యం కోసమే కదా తాము అహర్నిశలూ పాటుపడుతున్నది.

తన స్పందనలు ఆపుకోలేని రూపి తన పక్కనే కూర్చున్న రాజేతో తన భావాలను పంచుకున్నది.

ఇంత మార్పు ఎలా సాధ్యం అయింది. దీన్ని ఎట్లా సాధించారు?

రాజేకు ఈ విప్లవ ప్రజా ప్రభుత్వం అనే బిడ్డను కనటానికి పుష్ప, వనిత, మైనిలు పడిన పురిటినొప్పులు గుర్తుకు వచ్చాయి.

పన్నెండు వసంతాల గతం కళ్ల ముందు గిర్రున తిరిగింది.

రాజే ఆ గతాన్ని అధ్యాయాలుగా రూపి ముందు పరుస్తున్నది.

* * *

పుష్పకి బేజారుగా ఉన్నది. ఇక్కడి గ్రామాలనూ, మనుషులనూ చూస్తుంటే ఆమెకు మనసు పట్టటం లేదు. తాను కూడా ఆదివాసీ కుటుంబంలోనే పుట్టి పెరిగింది. కానీ ఇక్కడ వాతావరణం ఆమెకు మనసు పట్టటం లేదు. ఇళ్ల ముందు పెరడంతా దుమ్ము రేగి పోయి ఉన్నది. అలుకూ లేదు పూతా లేదు. ఆ ఇళ్లు తాము గొడ్లను కట్టేసే కొట్టాలకన్నా అధ్వాన్నంగా ఉన్నాయి. శుభ్రత అనే పదం వీళ్ల జీవితాలకి కోసుల దూరంలో ఉన్నదా అనిపించింది. ఇవి మహారాష్ట్ర సరిహద్దులోని ఛత్తీస్‌గఢ్ గ్రామాలు. రెండు రాష్ట్రాలను పరాలకోట నది వేరు చేస్తున్నది. నది అవలివి మహారాష్ట్ర గ్రామాలు, నది ఇవతలివి ఛత్తీస్‌గఢ్ గ్రామాలు. ఒక్క నదే ఇంత వ్యత్యాసాన్ని కలిగిస్తున్నదా? నది అవతలి గ్రామాల పరిస్థితి వేరుగా ఉన్నది. నది ఇవతలి అవతలి గ్రామాల మధ్యనే ఇంత తేడానా అని ఆశ్చర్యపోతున్నది.

పార్టీ నిర్ణయించి పంపింది కాబట్టి ఎట్లయినా నిలదొక్కు కోవలసిందే. ఇక్కడ వ్యవసాయాన్ని అభివృద్ధి చేయటం ద్వారా వారి ఆర్థిక పరిస్థితిలోనూ జీవన ప్రమాణాలలోనూ మార్పు తీసుకురావటం కోసం పార్టీ తమను ఇక్కడికి పంపింది. చిన్నపాటి మడి చెక్కలున్నప్పటికీ వారిది ప్రధానంగా పోడు వ్యవసాయం. ప్రధాన పంట కోహలు. రెండేళ్లకొకసారి పోడు నరుకుతారు. అదే వారి ప్రధాన జీవనాధారం. వర్షాకాలం పెరట్లో మొక్కజొన్నలు వేస్తారు. కనాకష్టం మీద అర బస్తెడు పంట తీస్తారు. పప్పు ధాన్యాల ఊసే లేదు. జొన్న పెరటి చుట్టూ చిక్కుడు పాదులు పెడతారు. ఒకటి రెండు కుటుంబాల వారు నది ఒడ్డున లంకలో వంకాయలు, మిరపకాయలు పండిస్తారు.

ఒక్కింటి అవసరాలకు కూడా బొటాబొటిగానే వెళ్తుంది పంట.

తమను ఇక్కడికి పంపే ముందు తమ బాద్యుడు దగ్గర కూర్చోబెట్టుకుని ఒక పూటంతా మాట్లాడాడు. తాము వంట కోసం వేరు కుంపటి పెట్టకూడదనీ, ప్రజలు ఏది తింటే తాము కూడా అదే తినాలనీ, మనం వేరుగా వంట పెట్టుకుంటే ప్రజల నుండీ దూరం అయిపోతామనీ, ప్రజలు మనల్ని తమ వాళ్ళుగా భావించరనీ, మనల్ని తమలో కలుపుకున్నప్పుడే మనం ఏమి చెప్పినా స్వీకరిస్తారనీ, ఆమోదిస్తారనీ చిలకకు చెప్పినట్లు చెప్పి పంపించాడు. ప్రజలు ముందు మన ఆచరణను మెచ్చిన తర్వాతనే మనం చెప్పే రాజకీయాలను మెచ్చుతారని చెప్పాడు.

అన్నం ముందు కూర్చుంటే నోట్లోకి ముద్ద పోవటం లేదు. గుడ్లల్లో నీళ్లు గుడ్లల్లోనే కుక్కుకుంటూ అన్నం ముద్దలను నోట్లోకి కూరుతోంది. కూర బంకలా సాగుతోంది. తాలింపు లేదు. ఉల్లిగడ్డ, వెల్లుల్లి వాసన లేదు. ఉప్పు వేసి ఉడక బెట్టిన వెదురుకక్కులు, వాసన పట్టిన రెండు ఎండు మాంసపు ముక్కలు వేసి ఉడికించారు. ముద్ద నోటికాడికి తేంగనే ముందు ముక్కు తిరస్కరిస్తున్నది.

ఏడాది తిరిగే సరికి పుష్ప తెల్లగా పాలిపోయింది.

* * *

తన సహచరుడు రాంలాల్ ఎందుకో ఎడమొఖం పెడమొఖంగా ఉంటున్నాడు. తమకు ఇంటివద్దనే పెళ్లయింది. పిల్లాజెల్లా నిండు సంసారాన్ని వదిలి తామిద్దరూ పార్టీలో పనిచేస్తున్నారు. రాంలాల్ తనకంటే రెండేళ్ల ముందే పార్టీలో చేరాడు. తనను తల్లి బంధం కట్టివేసింది. నలుగురు పిల్లలని వదిలి పోవటానికి తను సిద్ధపడలేదు. పైగా మూడు నెలల పసిబిడ్డ పాలు తాగుతున్నది. అయితే ఏడాది తిరక్కముందే ఆ మాతృత్వం కూడా పటాపంచలైపోయింది.

మహారాష్ట్ర ప్రభుత్వం పెంచి పోషిస్తున్న సి-60 కుక్కలు ఒకరోజు తెట్టవారుజామున తమ ఇంటిని చుట్టుముట్టారు. తను అప్పుడే లేచి బిడ్డకు పాలు పడుతున్నది. నెమ్మదిగా చీకటిని ఆసరా చేసుకుని దొడ్డి తోవన బయటపడింది. చీకటిని చాటు చేసుకుని వాళ్లని గమనిస్తున్నది. దేన్నో పగలగొడుతున్న శబ్దాలు వస్తున్నాయి. గొడ్డలితో నరుకుతున్నారు. కిరోసిన్ వాసన గుప్పుమన్నది. దాని వెనువెంటనే భగ్గుమని అంటుకున్న మంటలు పుష్ప హృదయంలో మంటలను లేపాయి.

కట్టుబట్టలు, చేతిలో పసిగుడ్డుతో పొరుగూరిలో ఉన్న తల్లి దగ్గరకు చేరింది. తన తల్లి ముంగొబాయి కూడా రాజ్యహింసను అనుభవిస్తున్నది. ఆమెకి కళ్లు కనిపించక పోయినా ఇప్పటికీ వాయిదాల పేరు మీద నెలలో రెండు సార్లు గడ్చిరోలికి పోయివస్తుంది. తన అన్న సాలుసరి ఆదాయం కిరాయిలకే సరిపోతున్నది. కుటుంబం కూడా ఆర్థికంగా చితికిపోయింది.

తాను కూడా మహిళా సంఘం కార్యకర్తే... ఊరి సంఘం వాళ్లను సంప్రతించింది. తాను కూడా పూర్తికాలం విప్లవ కార్యకర్తగా మారాలని నిర్ణయించుకున్నది.

చిన్నప్పటి నుండి పౌష్టికాహార లోపంతో పెరిగిన పుష్ప రక్తహీనతతో బాధపడుతున్నది. కొద్ది దూరం నడిస్తే అలసిపోతుంది. తను దళంలో చేరితే గంటలు గంటలు నడవగలుగుతుందా? బరువులు మోయగలుగుతుందా... ఎన్నో సందేహాలు... మానసిక సంసిద్ధతే అన్నింటికీ మందు అని నిర్ణయానికొచ్చిన పుష్ప ఊరి పొలిమేర దాటింది.

* * *

ఆ రోజు పొద్దంతా కట్టలు పోశారు. ఊరి వాళ్లు చూసుకుంటూ పక్కనించి పోయేవాళ్లు. ఎవరూ ఆసరాకు వచ్చే వాళ్లు కాదు. ఊరోళ్లు రాకుంటే పోనీ కనీసం ఇంటివాళ్లు కూడా పట్టీపట్టనట్లు ఉంటున్నారు. అయినా పట్టు వదలకుండా పొద్దంతా ఇద్దరూ కలిసి గట్టు పోశారు. రాంలాల్ ఊళ్లోకి పోయాడు. తాను నాలుగ్గంటలకి ఊరి మహిళలతో కలిసి నదికి పోయింది.

స్నానాలు ముగించుకుని తిరిగివస్తుంటే కూరగాయలు పండించే లంకలో గుబురుగా అల్లుకున్న చిలగడదుంప తీగలు అవుపడ్డాయి. చిలగడదుంప ఆకులో ఇనుము ఎక్కువ ఉంటుందనీ, రక్తహీనతతో బాధపడే మహిళలకు మంచి మందనీ, రోజూ పిడికెడు ఆకులు తింటే ఐరన్ టాబ్లెట్‌తో సమానమనీ రాజే దీది చెప్పిన మాటలు గుర్తుకు వచ్చి టక్కున ఆగింది. ఆకు తెంపుకుని ఊళ్లోకి వచ్చేసరికి మసక మసక చీకటి పడుతున్నది.

లోపలి వసారాలో నుండి మాటలు వినిపిస్తున్నాయి.

పుష్ప అక్కడే ఆగి పోయింది.

రాంలాల్‌ని ఊరివాళ్లు బటియో అని పేరు పెట్టారు. బటియో అంటే మట్టి పోసేవాడు అని అర్థం.

"ఏం కాదురా బటియో, మేం ఎవ్వరికీ చెప్పం. వియ్యపోళ్లు వచ్చిన్రు. కోడిని కోసినం." అంటూ కోడికూర నింపిన దోనె, జీలుగ కల్లు నింపిన గ్లాసును రాంలాల్ ముందుకు జరిపారు.

అతనిలో ఘర్షణ నడుస్తున్నది. బలహీనత ప్రోత్సహిస్తున్నది. అంతరాత్మ క్రమశిక్షణను గుర్తు చేస్తూ హెచ్చరిక చేస్తున్నది. మంచి చెడుల మధ్య ఘర్షణ నడుస్తున్నది. చెడు గెలిచింది. జీలుగకల్లు నింపిన గ్లాసు చేతిలోకొచ్చింది. గ్లాసు నిండుతూ ఖాళీ అవుతూ నిషా తలకెక్కింది.

"ఇంటికాడున్నా, పార్టీలో ఉన్నా అది నువ్వు చేసుకున్న పెళ్లాం. అది నీ మాట మీద నడవాలి. ఆడదానికి భయపడతావా?" తలకెక్కిన నిషాను తెగ పితృస్వామ్యం బుసలు కొట్టించింది.

చీకటి మాటున నిలబడి చోద్యం అంతా చూస్తున్న పుష్పకు ఆవేశం కట్టలు తెంచుకుంది. వేగంగా వారి మధ్యకు దూసుకువచ్చింది. కోపంతో ఆమె శరీరం వణుకుతున్నది. తన భర్త కల్లు తాగినందుకు కాదు ఆమె ఆవేదన. ఆయన ఇంటి దగ్గర ఉన్నప్పుడు కూడా అప్పుడప్పుడు కల్లు తాగేవాడు. కానీ ఇప్పుడాయన పార్టీ సభ్యుడు. సమాజాన్నీ, సమాజంలో చెడునీ మార్చాలని పాటుపడే సామాజిక కార్యకర్త. తానే కల్లుకు బానిస అయితే సమాజాన్ని ఆయన మార్చుతాడా? సమాజం ఆయనను మారుస్తుందా? ప్రజలకు నాలుగు రాజకీయాలు చెప్పి వారి జీవితాలను బాగుచెయ్యాలని పార్టీ తమను పంపింది. తామే కల్లుకు బానిస అయితే పార్టీకి ద్రోహం చేసినట్లే అవుతుంది. ఇది ఆమెను ఎక్కువ వేధిస్తున్నది. జీలుగ కల్లును ముందుపెట్టుకుని కూర్చున్న పెద్ద మనుషులను తిట్టింది.

"పార్టీ మనుషులను చెడగొట్టే ఉపాయం మీది. మిమ్మల్ని బాగుచెయ్యాలని పార్టీ ఆలోచిస్తే మీరు పార్టీకి చెడ్డ పేరు తెచ్చే పనులు చేస్తరా? మీకు అసలు మీ బతుకులను బాగు చేసుకోవాలని లేదు."

ఆవేశంతో ఊగిపోతున్నది పుష్ప.

రాంలాల్ లేచి వచ్చి పుష్పను వంగబెట్టి గుద్దటం మొదలు పెట్టాడు. ఇది పుష్పను గాయపరిచింది. అవమానంతో కడుపునిండిన పుష్ప ఆ పూట ఖాళీ కడుపుతోనే పడుకుంది.

జరిగిన విషయాలన్నీ పూసగుచ్చినట్లుగా పార్టీకి తెలియచేసింది.

ఈ పరిణామాలు జరిగిన తరువాత రాంలాల్ ఆచరణను పార్టీ కమిటీ చర్చించి అతనిని ఆ పని నుండి మార్చి టెక్నికల్ రంగానికి పంపాలని నిర్ణయించింది. పుష్ప అదే పనిలో కొనసాగింది.

అప్పటివరకూ ఛత్తీస్‌గడ్‌లోని బీజాపూర్‌లో పని చేసిన మరో సీనియర్ కామ్రేడ్ వనితను పార్టీ పంపించింది. పుష్ప, వనితలు వ్యవసాయ కార్యకర్తలుగా ఆ గ్రామాలలో వ్యవసాయ అభివృద్ధి పనుల కోసం నడుం బిగించారు.

* * *

అది 2002 సంవత్సరం.

అప్పటికి పీపుల్స్‌వార్ పార్టీ 9వ కాంగ్రెసు జరిగి ఏడాది దాటింది.

9వ కాంగ్రెసు ఇచ్చిన కర్తవ్యం, సిసి గైడెన్సు వెలుగులో అన్ని పార్టీ కమిటీలూ, పార్టీ శ్రేణులూ దండకారణ్యాన్ని విముక్తి ప్రాంతం చేసే కర్తవ్యాన్ని కేంద్రంగా చేసుకుని ఎక్కడికక్కడ విప్లవ ప్రజా రాజ్యాధికార అంగాల నిర్మాణం కోసం కృషి చేస్తున్నారు.

ఈ గ్రామాలు ఛత్తీస్‌గడ్‌లోని నారాయణపూర్ జిల్లా కిందికి వస్తాయి. రేంగవాయ గ్రామ పంచాయతీ నుండి గ్రామాలలో బూర్జువా పార్టీల అధికారాన్ని నడిపించటానికి ప్రయత్నాలు తీవ్రంగానే చేస్తున్నారు. ఆ గ్రామాల పేరు మీద వచ్చే నిధులను స్వాహా చేయటానికి సర్పంచ్, సచివ్‌లు ఉవ్విళ్లూరుతుంటారు. గ్రామాలను ఆనుకుని ఉన్న అడవిలో దొరికే అటవీ ఉత్పత్తుల కోసం దూరాబారాలను లెక్క చేయకుండా పొరుగున మహారాష్ట్ర నుండీ, శరణార్థులుగా వచ్చి స్థిర పడిన బెంగాలీ ప్రజలలో నుండీ కొద్ది మంది ఏదో రకంగా చుట్టరికం కలుపుకుని మేకలను, అటవీ ఉత్పత్తులను కారు చౌకగా కొనుక్కుని పోయి బయట సంతలలో అమ్ముకుని డబ్బు సంపాదించుకోవాలనే ఆశతో తరచుగా రాకపోకలు చేస్తుంటారు. జంతువుల వేట కోసం. వాగులు-నదులలో చేపలు పట్టుకోవటం కోసం కూడా రాకపోకలు జోరుగానే సాగుతుంటాయి. ఇక్కడి ప్రజలను మాయ మాటలతో మోసం చేసి అడవి నుండి తమకు కావలసినవి సేకరించుకు పోయేవాళ్లు.

* * *

కొడ్దురులో గ్రామ సంఘం నిర్మాణం కోసం ప్రయత్నాలలో భాగంగా గ్రామస్తులతో చర్చించటానికి స్త్రీలు-పురుషులు అందరూ రావాలని కబురు పెట్టారు.

కొండల ప్రాంతం కాబట్టి నీటితోపుల వద్ద జీలుగ చెట్లు పుష్కలంగా ఉన్నాయి. కుండల కొద్దీ కల్లు దిగుతుంది. పెద్దతరం ముసలివాళ్లు బియ్యం, ఉప్పు-కారం తీసుకుని పోయి వారాల తరబడి ఆ చెట్ల దగ్గరే నివాసం ఉంటారు.

జీలుగ కల్లు కోసం దూరాబారాలను కూడా లెక్కచేయరు. రెండు కోసుల దూరం ఉన్నా పోతారు. రాత్రి పూట వెదురుతో చేసిన కాగడాలను పట్టుకుని పోతారు.

ముసలి తరం అంతా మంచి లోడ్‌లో వచ్చారు.

వనిత నెమ్మదిగా విషయంలోకి దిగింది.

"వర్షాలు పడక ముందే మనం గట్లు బాగు చేసుకోవాలి. నారు పోయటానికి మడి తయారు చేయాలి. సమిష్టి జొన్న పెరడు కోసం దడి కట్టాలి. మీరు ఒక పూట జీలుగ కల్లు కోసం పోకుండా ఆగితే ఈ పనులన్నీ చేసుకోవచ్చు."

వనిత మాట పూర్తి కానివ్వకుండానే డొక్కె వాళ్ల నాన్న అందుకున్నాడు, "గట్లు బిట్లు మాకు తెల్వదు. గట్లు పోసుకుంటే పోసుకోండి, లేకుంటే లేదు. మేం మాత్రం జీలుగ కల్లు కోసం పోవుడే...భార్యనన్నా వదులు కుంటా గానీ జీలుగ కల్లును మాత్రం వదలను." - కరాఖండిగా తెగేసి చెప్పి భుజం మీద వేసుకున్న చిన్నపాటి తువ్వాలు ముక్కను దులపరించుకుంటూ లేచి వెళ్లి పోయాడు.

వనిత మరో గంట సేపు ఊరి వాళ్లతో మాట్లాడి అర్థం చేయించి చూసింది. విన్నపం, ఆదేశం ఏదీ పని చేయలేదు.

"మీటింగు తొందరగా ముగించు, నిద్ర వస్తుంది. పోతాం" అంటూ తొందర పెట్టటం మొదలు పెట్టారు.

గట్లు, నారు పోసే కార్యక్రమం అలా ముగిసింది.

* * *

అది మంగెవాడ గ్రామం. ఓ రోజు సోమని చెల్లి నౌరి ప్రసవించింది. కొడుకు పుట్టాడు. తల్లికి పాలు పడటం లేదు. వనితకు ఈ విషయం తెలిసింది. ఆ ఊరికి 7-8 కిలోమీటర్ల దూరంలో ఉండే దుకాణానికి మనిషిని పంపి ఒక కిలో అమూల్ స్ప్రే, రెండు పాల పీకలు, పాలు పట్టే సీసాలు తెప్పించింది. పుట్టిన బిడ్డను కాపాడే ఏర్పాట్లు పూర్తయినంక తల్లికి పాలు పడేపించే ప్రయత్నాలు మొదలు పెట్టింది. వేడి నీళ్లు కాగబెట్టి గోరువెచ్చని నీళ్లలో బట్టను తడిపి ఛాతీని తుడిచింది. నది ఒడ్డున దొరికే కైముల్ ఆకు తింటే బాలింతకు పాలు పడతాయి. ఆ అమ్మాయి భర్త అయిన ఇల్లరికపు అల్లుడిని పంపింది. ఒక గంట తిరిగి దొరకలేదని తిరిగి వచ్చాడు. లాభం లేదనుకుని వనిత తానే స్వయంగా బయలుదేరింది. ఒక గంట కష్టపడి వెతికి పిడికెడు ఆకు సంపాదించి తెచ్చి అప్పటికప్పుడు వండి తినిపించింది.

పుట్టిన బిడ్డకు బొడ్డు రాలేవరకూ బాలింతకు ఉప్పు వేసిన అన్నం మాత్రమే తినిపిస్తారు. బొడ్డుకు చీము పట్టకుండా తీసుకునే ఈ జాగ్రత్త ఆచారంగా మారి తల్లికి పాలు పడకుండా చేస్తుంది.

పక్క గ్రామం మూన్‌పర్సికి పోయిన పుష్పకు జ్వరంతో మంచం పట్టి పడుకున్న రామ్‌సు కనిపించాడు. ఇంట్లో ఎవరూ లేరు. రామ్‌సు తప్పటడుగులు వేస్తున్న సమయంలో అతని తల్లి ప్రసవం కాలేక చనిపోయింది. అలా తల్లిని చిన్నప్పుడే కోల్పోయిన చిన్నారి తల్లి ప్రేమనూ, ఆత్మీయ స్పర్శనూ పూర్తిగా ఆస్వాదించలేక పోయాడు. ఆ వెలితి తెలియకుండానే వాడిని ఒంటరి చేసింది. పిల్లలతో కలిసి ఆడుకోవటానికి పోడు. ఇంటిపట్టునే బిక్కుబిక్కున ఏదో ఒక పని చేసుకుంటూ కాలం గడుపుతాడు.

పుష్ప వెంటనే ఒక లోటాలో నీళ్లు పట్టుకొచ్చి తన రుమాలును నీళ్లల్లో తడిపి వాడి ఒళ్లంతా తుడిచింది. బట్ట తియ్యంగనే శరీరం ఆరిపోతున్నది. రెండు సార్లు తుడిచినంక కొంచెం చల్లబడింది. తన

పక్కసంచిలో నుండి పారాసిటమాల్ టాబ్లెట్ తీసి దాన్ని సగం ముక్క తుంచి రామ్‌సుకు తినిపించింది. పిల్లాడు నిద్రపోయాడు. పుష్ప వాడినే కనిపెట్టుకుని కూర్చున్నది. ఒక గంటకు పిల్లవాని ఒళ్లంతా చెమట్లు పోశాయి. జ్వరం జారింది. ఇంట్లో వెతికితే పొద్దున వండి పెట్టిన అంబలి కుండ కనిపించింది. అంబలితో నంజు కోసం ఇటూ అటూ చూసింది ఏమీ కనిపించలేదు.

జ్వరం వచ్చిన నోటికి ఎర్ర చీమల పచ్చడి రుచిగా అనిపిస్తుంది. అన్నం తినని వాళ్లు కూడా దాన్ని చూస్తే లేచి కూర్చుంటారు. రెండు ముద్దలైనా అన్నం తింటారు. ఎర్ర చీమల కోసం పొలాల వైపు బయలుదేరింది.

చెట్లు ఆకులు రాలి చిగుర్లు వేసే సమయంలో లేత ఆకులతో ఎర్ర చీమలు గూళ్లు కట్టుకుంటాయి. ఆ గూళ్లల్లో గుడ్లు పెడతాయి. వాటిని దులిపి తెచ్చి ఉప్పు-కారం వేసి నూరి తినిపిస్తే జ్వరంతో చేదుపట్టిన నోటికి ఎంతో కమ్మగా అనిపిస్తుంది. దాని రుచి పచ్చి చింతపువ్వుల పచ్చడికి దగ్గరగా ఉంటుంది.

దూరంగా పూసుగు చెట్టు కనిపించింది. ఎత్తుగా ఉన్న చెట్టు కొమ్మలను వెదురుగడతో వంచి ఒక గూడును దులిపింది. వెంటనే తెచ్చి చెత్తను ఏరి రెండు పచ్చిమిరపకాయలు, ఇంత ఉప్పు కలిపి బండపై మెత్తగా నూరింది. దోనెలో అంబలి, తునికాకులో చీమల పచ్చడి పెట్టి రామ్‌సును లేపి కూర్చోబెట్టింది. రెండు దోనెల అంబలి తాగాడు.

రామ్‌సుకి 14 సంవత్సరాలు నిండలేదు కాబట్టి తక్కువ డోస్ ఇవ్వాలి. తను డాక్టరీ చదవలేదు. మనిషి బతికించటం కోసం డాక్టరీ నేర్చుకున్నది. తన అనుభవం నేర్పిన పాఠంతో నేర్చుకున్న జ్ఞానంతో వైద్యం చేసింది. తన సంచిలో నుండి రెండు క్లోరోక్విన్ మాత్రలు తీసి తినిపించింది.

రేపు మళ్లీ ఇదే టైంకి టాబ్లెట్లు ఇవ్వటానికి వస్తానని చెప్పి అక్కడి నుండి బయలుదేరింది.

ఇలా ఇంటింటికీ తిరుగుతూ వారి కష్ట సుఖాలలో భాగమైనారు వనిత, పుష్పలు. వాళ్లిద్దరినీ ఆ ఏరియాలో ప్రజలు తమ వాళ్లుగా స్వంతం చేసుకున్నారు.

ముందటిలా కాకుండా ఏవైనా విషయాలు చెవితే సానుకూలంగా స్పందించటం మొదలయింది.

గ్రామాలలో విప్లవ ప్రజా సంఘాల నిర్మాణం మొదలయింది. దండకారణ్య ఆదివాసీ కిసాన్ మజదూర్ సంగటన్, క్రాంతికారీ ఆదివాసీ మహిళా సంఘాలు ఏర్పడినాయి. వాటి సమావేశాలు కావడం, కొన్ని సమస్యలను చర్చించటం, గ్రామ అభివృద్ధికి కార్యక్రమాలు రూపొందించటం, వాటి అమలు కోసం కృషి చేయటం పెరిగింది.

ఈ క్రమంలో వ్యవసాయ అభివృద్ధి కార్యక్రమాలను తమ కోసం తమవిగా స్వీకరించటం మొదలయింది.

* * *

ప్రజా సంఘాల కార్యకలాపాలు మునుపటి కంటే కొంత మెరుగయినాయి. గ్రామాలలో పిల్లలు తమకు పాటలు నేర్పించాలని డిమాండ్ చేయటం మొదలు పెట్టారు. గ్రామాలలో చేతనా నాట్య మంచ్‌ల నిర్మాణం కాలేదు. పిల్లలు ముందుకొస్తున్నారు. వారికి సాంస్కృతిక శిక్షణ కోసం జిల్లా సిఎన్‌యం నుండి ఒకరిని పంపాలని కోరగా రాజు, దసిరిలను పంపించారు. 15-20 మంది పిల్లలు జమ అయినారు.

శిక్షణ మొదలయింది.

తలలకూ, నడుములకూ ఎర్రని పట్టీలు బిగించి చేతిలో ఎర్రజెండా పట్టుకుని, "ఏ వాహనం మీద ఎక్కి వస్తావు పోలీసు,, నీలం గుర్ గుర్" అని మొదలు పెట్టి సైకిలు, బస్సు, ఓడ, విమానం ఏది ఎక్కి వచ్చినా దాన్ని మేం ధ్వంసం చేస్తాం, నిన్ను ఖతం చేస్తాం" అంటూ జోరుగా సాగుతున్నది గోండి పాట. పిల్లలంతా ఉత్సాహంగా పోటీలు పడి కోరస్ ఇస్తున్నారు.

ఇంతలో సుందరి వాళ్ల నాన్న, రాజు వాళ్ల నాన్న ఇద్దరూ కూడబలుక్కుని అన్నట్లుగా వచ్చారు.

"పక్కూరికి పోలీసులు వచ్చారట. నదిని కూడా దాటారట, ఇటే వస్తరని చర్చ నడుస్తున్నది. శిక్షణ ఆపుకుంటే మంచిది."

చావు కబురు చల్లగా అన్నట్లుగా నెమ్మదిగా అడ్డుపుల్ల వేశారు.

పిల్లలంతా చాలా నిరాశపడ్డారు. వనిత, పుష్పలు వారికి అర్థం చేయించారు. మళ్లీ జరుపుకుందాం అని భరోసా ఇచ్చారు.

ఆ శిక్షణ అలా అర్థాంతరంగా ముగిసింది.

* * *

పార్టీ కమిటీ మహారాష్ట్ర గ్రామాల నుండి వరి విత్తనాలు సేకరించి పంపాలని ఏరియా కమిటీలకు ప్రోగ్రాం ఇవ్వగా అక్కడి రైతులు స్వచ్ఛందంగా వడ్లు, పెసలు, మినుములు, చిక్కుళ్లు, బెబ్బెర్లు ఇంటికిన్ని జమ చేసి ఇచ్చారు. వనిత, పుష్పలు వాటిని ఊరూరికీ పంచారు.

ప్రతి గ్రామానికీ సమిష్టి నాట్లు వేయడం కోసం నారు పోశారు. ఆ ఏడాది కాలం కలిసొచ్చింది. దిగుబడిని చూసి రైతులు సంతృప్తిని వ్యక్తం చేశారు.

వచ్చిన పంటను ఇంటింటికీ పంచారు.

వీటితో పాటు విప్లవ ప్రజా సంఘాలు సాపేక్షికంగా సంఘటితం అయినాయి. మిలిషియాను ఏర్పాటు చేసుకున్నారు. సెకండరీ బలగాల నుండి కేటాయించిన ఇన్‌స్ట్రక్టర్లు వచ్చి శిక్షణ ఇచ్చారు.

ఆ గ్రామాలలో జరిగిన నిర్మాణ కృషితో కొంత సంఘటితం అయింది. ఈ పరిస్థితిని సమీక్షించిన పార్టీ కమిటీ 2007 సెప్టెంబరులో విప్లవ ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

పార్టీ చేసిన ఈ నిర్ణయాన్ని గ్రామాలలోని సంఘ కార్యవర్గాలతో చర్చించారు. మిలీషియాతో చర్చించారు. అందరూ తీర్మానాన్ని ఆమోదించారు.

దీంతో ఆమోదం లేని కొందరు మౌనంగా ఉండిపోయారు.

గ్రామసభ జరిపి విప్లవ ప్రజా ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారు. వనిత అధ్యక్షురాలిగా, పుష్ప ఉపాధ్యక్షురాలిగా ఏడుగురితో కూడిన కమిటీ ఎన్నికయింది.

జనతన సర్కారు మొదటి సమావేశంలోనే 7 గ్రామాల పరిధిలో భుంకాల్ స్కూల్ నడపాలని నిర్ణయమయింది.

వనిత, పుష్పలే వారికి మొదటి గురువులు.

వాళ్లిద్దరూ వ్యవసాయ కార్యకర్తలుగా, డాక్టర్లుగా, టీచర్లుగా,

ప్రజలను సంఘటితం చేసే ఆర్గనైజర్లుగా అన్ని పాత్రలనూ పోషించారు.

భుంకాల్ స్కూల్ కోసం ఎవరి పని వారికే కేటాయింపులు జరిగాయి కాబట్టి పనులు చురుగ్గా సాగుతున్నాయి.

ఇల్లు కట్టారు. బియ్యం, ఉప్పు, పప్పు సమకూర్చుకున్నారు. తాగునీటి కోసం బావిని తవ్వి సిమెంటుతో వరలు దించారు.

పిల్లలకు పలకలు, పుస్తకాలు, బలపాలు సమకూర్చుకున్నారు.

సంత నుండి పిల్లలకు యూనిఫాం బట్టలు కొనుక్కొచ్చారు.

నెలకు ఐదు వందల జీతంతో టీచర్లను, వంటమనుషులను మాట్లాడుకున్నారు.

స్కూలు ప్రారంభం అయింది.

జనతన సర్కారు స్కూలు నడుస్తున్నది. చదువును నేర్చే మొదటితరం. తల్లిదండ్రులు ఇష్టంగానే తమ పిల్లలను స్కూలుకు పంపారు. ముక్కులు కారే, చెడ్డీలలో మాత్రం పోసుకునే చిన్నారులను గుండెకు హత్తుకుని తమ ఒడిలో లాలిస్తూ ఓనమాలు దిద్దించటం మొదలు పెట్టారు.

వాళ్లకు స్నానాలు చేయించటం, పేలు పట్టిన తలలను కడగటం, దువ్వటం చేశారు. పుళ్లుపడిన తలలను వెంట్రుకలు కత్తిరించి చీడపేల బాధ నుండి ఆడపిల్లలకు విముక్తి కలిగించారు.

రోజూ పప్పు తింటే పిల్లలకి అన్నం తినబుద్ధి కాదని అడవి నుండి ఏదో ఒక కూర తెచ్చి వండి పెట్టేవారు. పిల్లల్ని వెంటేసుకుని వాగుల వెంట పోయి ఎండ్రకాయలు, చేపలు పట్టుకొచ్చి వండి పెట్టేవాళ్లు.

వీళ్లని చూసి గ్రామ మహిళలు, "కడుపున పుట్టిన బిడ్డలకన్నా మంచిగా చూసుకుంటున్నారు. కన్నవాళ్లం మేం కూడా ఇంత ఓపిగ్గా పిల్లల్ని పట్టించుకోం. ఇంత మంచిగా చేసి తినిపించటం కూడా మాకు చేతకాదు." అన్నారు.

ఇలా కొద్ది నెలలు భుంకాల్ స్కూలు మంచిగానే నడిచింది. పిల్లలు ఉత్సాహంగా చదువు నేర్చుకుంటున్నారు.

గ్రామ యువతీ యువకులు కూడా పగలంతా వ్యవసాయపు పనులు చేసుకుని రాత్రిపూట చదువు నేర్చుకోవటానికి వస్తున్నారు. మొత్తంగానే ఒక మంచి వాతావరణం తయారయింది.

దీన్ని చూసిన కొందరు తెగ పెద్దలకు కడుపు ఉబ్బరం కూడా మొదలయింది.

స్కూళ్లు, చదువులు, సంఘాలు అంటూ మా పిల్లల్ని తమతో తీసుకు పోవటానికే ఇవన్నీ నడిపిస్తున్నారని రహస్య మంతనాలు జరిపారు. ఈ కార్యకలాపాలను అడ్డుకోవాలనే తెర వెనక కుట్ర మొదలయింది.

ఒకరోజు అర్ధరాత్రి రెండు లైట్లు అవుపడ్డాయి. అడవి వైపు నుండి స్కూలు మీదుగా ఊరిని దాటి నదిని దాటిపోయాయి. తెల్లారేసరికి అదవంటుకున్నట్లుగా కబురు పాకిపోయింది.

ఉదయం గోటుల్ వద్ద గ్రామ పెద్దలు జమ అయినారు. గ్రామస్తులందరూ రావాలని కబురు చేశారు. అంతా జమ అయినంక రాత్రి కనిపించిన లైట్ల గురించి చర్చ నడుస్తున్నది. మేం పోలేదంటే మేం పోలేదని అందరూ అంటున్నారు. మరి ఎవరయి ఉంటారు?

"తప్పకుండా సిఐడిలే అయిఉంటారు. " నెమ్మదిగానే అయినా వత్తి పలికాడు సుందరి తండ్రి.

"మన స్కూలు గురించి పోలీసులకు తెలిసి ఉంటుంది. స్కూలుని కొంతకాలం మూసివేస్తేనే మంచిది." వంత పాడాడు కుమ్మ వాళ్ల తండ్రి.

పేక, బండు, తోండె, కుమ్మ, బొడిసెలకు ఈ పరిణామం కొంత నిరాశ కలిగించింది. తాము కూడా సాయంత్రం వేళల్లో స్కూలుకి పోయి కనీసం తమ పేరు రాయటం అన్నా నేర్చుకోవాలనే సంకల్పంతో ఉన్నారు. ఓనమాలు నేర్చుకున్నారు. హల్లులు, గుణింతాలు నేర్చుకునేది మిగిలింది. ఇప్పుడు అర్ధాంతరంగా స్కూలు ఆగిపోతే తమ చదువు ఆగిపోతుంది.

భుంకాల్ స్కూలు అలా మూతపడ్డది.

తమకు దొరికిన కొత్త యూనిఫారం వేసుకుని సంబరంగా స్కూలుకు పోవటానికి తయారవుతున్నారు. స్కూలు ఆగిపోయిన వార్త అడవి నిప్పులా పాకిపోయింది. ఏ ఊరికి ఆ ఊరిలో ఉన్న ఎండుటాకులు ఆ అగ్గికి ఆజ్యం పోశాయి.

ముదురు నీలం రంగు ఫ్రాకు, గులాబీ రంగు గళ్ల చొక్కాలు వేసుకున్న పిల్లలు మట్టిలో ఆడుతూ, పిట్టల వేట చేస్తూ అడవిలో చెల్లాచెదురయిపోయినారు.

భుంకాల్ స్కూలు అలా మూతపడ్డది.

* * *

రామ్‌సుకు పార్టీతో అనుబంధం పెరిగింది. చిన్నప్పటి నుండే పార్టీలోకి పోవాలనే కోరిక అతనిలో బలంగా నాటుకున్నది. పదమూడేళ్ల వయసుకే పట్టుబట్టి పిఎల్‌జిఎలో భర్తీ అయ్యాడు.

చిన్న వయసు.. వాడిని ఎలా ఇముడ్చుకోవాలి.. చదువంటే వాడికి ప్రాణం. కొంచెం సమయం దొరికినా పలక మీద రాయడం, దొరికిన కాయితాన్నల్లా విడవకుండా చదవటం చేసేవాడు. ఎవరితోనూ ఎక్కువ మాట్లాడేవాడు కాదు.

చదువు పట్ల వాని అభిరుచిని చూసి ముచ్చటపడిన రాజే వాడిని తన వెంటపెట్టుకున్నది. చిన్న పిల్లలనూ, బూర్జువా చదువులు చదివి పార్టీలో చేరిన వారికి పార్టీ ప్రాథమిక సిద్ధాంత పరిజ్ఞానం అందించటం, వారిని తర్ఫీదు చేసుకోవటం లక్ష్యంగా ప్రారంభమయిన బేసిక్ కమ్యూనిస్ట్ ట్రెయినింగ్ స్కూలుకు పంపించింది. ఆ స్కూలుకు పోవటానికి వానికి కావలసిన అర్హతలు లేనప్పటికీ ప్రత్యేక రికమండేషన్‌పై వానికి సీటు దొరికింది. ఏడాది తిరిగే లోపు మానసిక పరిపక్వత వచ్చింది. ప్రజల డాక్టరుగా పనిచేయటానికి ఆసక్తి కనపరిచాడు.

తర్వాత కొద్ది రోజులకే ఇంటికి పోవాలనే నిర్ణయానికి వచ్చాడు.

వాడి విషయ పరిజ్ఞానం చూసి ముచ్చటపడిన రాకేష్ తండ్రి తన కొడుక్కు కూడా అటువంటి స్కూలులో జాగ చూసిపెట్టమని కోరాడు.

రామ్‌సు ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నాడు.

* * *

విప్లవ ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాక బూర్జువా ప్రభుత్వ కార్యకలాపాలకు పూర్తిగా బ్రేకుపడ్డది.

విప్లవ ప్రజా ప్రభుత్వం అన్ని రకాల దోపిడికి ఆటంకంగా మారింది.

దాన్ని ఎలాగైనా కూలగొట్టాలని సంకల్పించుకున్నారు.

విప్లవ రాజకీయాలంటే పొసగని తెగ పెద్దలను రాజ్యం ఆర్గనైజు చేసింది. బూర్జువా సంస్కరణల కోసం వారిని పురికొల్పింది.

స్కూలు టీచర్లు, అంగన్‌వాడీల పేరుతో తమ ఏజంట్లను చొప్పించటానికి పన్నాగం వేశారు. వారి ఎత్తుగడ గ్రామాలలో పెద్ద మనుషుల తలకెక్కి మాట్లాడటం మొదలెట్టింది.

7 గ్రామాల పెద్దలు ఒకరోజు మీటింగు చేశారు. "మనం ఎట్లయినా ప్రభుత్వం నుండి వచ్చే పథకాలను తీసుకోవాలి. లేకుంటే ప్రభుత్వానికి కంట అయితం. పోలీసులు వచ్చి దాడి చేస్తారు. మనల్ని అరెస్టులు చేసి తీసుకుపోయి జైళ్లల్లో పడేస్తారు."

"ప్రభుత్వ పథకాలను అమలు చేద్దాం.. అమలు చేద్దాం.." అంటూ అందరూ ఒకేసారి లేచారు. ఇది 2009 మార్చిలో జరిగింది.

గ్రామస్తులు నారాయణపూర్ జిల్లా కేంద్రానికి రాకపోకలు మొదలుపెట్టారు. రేషను బియ్యం కోసం పోయిన వాళ్లను రెండు రోజులు బంధించి వారిని నయానా భయానా కౌన్సిలింగ్ చేశారు. కుమ్మని తండ్రికి పదివేల రూపాయలు దొరికాయి.

గ్రామంలో సమిష్టి వ్యవసాయ పనులకు కూడా ఏదో రకంగా ఆటంకాలు ఏర్పరచటం మొదలు పెట్టారు.

నాట్లు వేద్దామని అందరికీ కబుర్లిచ్చిన పుష్ప తను కూడా మడి దగ్గరకు చేరింది. కుమ్మని తండ్రి అకారణంగానే పుష్పపై కోపానికొచ్చాడు. నోటికొచ్చినట్టు తిడుతున్నాడు.

తన కర్తవ్యాన్ని గుర్తు చేసుకుంటూ పుష్ప మౌనంగా ఉండిపోయింది.

తోకలు లేపిన పెద్దలకు పార్టీ కమిటీ హెచ్చరికలు చేసింది.

గ్రామ గ్రామాన వీరి కుట్రలను ఎండగడుతూ సమావేశాలు నిర్వహించింది.

తమ రహస్యం బయిరంగం అవుతున్నదని గమనించిన పెద్దలు తేలు కుట్టిన దొంగలా గప్‌చుప్ అయిపోయినారు.

* * *

మళ్లీ ఏడాదికి జనతన సర్కారు ప్రతినిధి సభ జరిగింది.

పిల్లాజెల్లా ముసలీ ముతకా అంతా కట్టగట్టుకుని వచ్చారు. ప్రజా ప్రభుత్వం ఏడాది కార్యకలాపాల రిపోర్టు, సమీక్ష ప్రవేశపెట్టిన తరువాత కమిటీ ఎన్నిక జరిగింది.

ఆ కమిటీ స్కూలును పునరుద్ధరించాలని తీర్మానం చేసింది.

టీచర్ నియామకంపై చర్చ నడిచింది.

"మన రామ్‌సు ఉన్నాడు కదా... అతన్నే పెడదాం." రాకేష్ తండ్రి ప్రతిపాదనను అందరూ ఆమోదించారు.

స్కూలు కోసం ఇల్లు కట్టాలి. ఇంటి కోసం పెంకు కొనితేవటం, పనిని నడిపించడం అన్ని పనులూ దసిరి చూసుకోవాలి. పంచబడినాయి.

తాగునీటి కోసం బావుల తవ్వకాలు చేయాలి. దీనికి అవసరమైన సిమెంటు, ఇసుక, ఇనుప కడ్డీలు తెచ్చే పని కారు చూసుకోవాలి.

సమిష్టి కూరగాయల పెంపకం రెండు చోట్ల చేయాలి.

"ఈ పని నాకొదలండి." స్వచ్ఛందంగా ముందుకు వచ్చాడు కేయె.

అమరుల స్మారక స్థూపాల నిర్మాణం ఈ సంవత్సరం రాకేష్-మహరు, శ్రీకాంత్‌ల పేరు మీద చేయాలి. పడియోర్ పరివార్ కమిటీ తరపు నుండి లాల్సు బాధ్యత వహించాలి.

మిలీషియాకు అవసరమైన తుపాకులు చేయాలి. మన దగ్గర పైపులున్నాయి. మన కామ్రేడ్స్ కొంచెం ఎలిగారం అందిస్తే వాటిని ఉపయోగంలోకి తేవచ్చు.

ఊరికి కనీసం ఐదెకరాలు నాట్లు వేయాలి.

బాతుల పెంపకం చేయాలి.

"మొత్తంగా మన ఆర్‌పిసి స్వయం సమృద్ధం కావాలి." సమావేశాన్ని ముగించాడు అధ్యక్షుడు దసురు.

చర్చ రక్షణ విషయాలపైకి మళ్లింది. జనతన సర్కారు పనులకు అడ్డుపుల్లలు వేస్తున్న గ్రామ పెత్తందార్లపై చర్చ నడిచింది.

కొందరి ప్రవర్తనను అనుమానించిన రక్షణ శాఖ, సర్కారు కమిటీ ముందు ప్రతిపాదన పెట్టింది. సుందరి తండ్రి, కుమ్మని తండ్రి, రాజు వాళ్ల నాన్న వీరి ముగ్గురి ఆచరణను పరిశీలించాలి. అవసరమైన చర్యలు తీసుకోవాలి.

వీరి ముగ్గురినీ ప్రజా న్యాయస్థానంలో నిలబెట్టారు. వారు చూపిన కారణాలు, ఇచ్చిన సంజాయిషీతో గ్రామసభ సంతృప్తి చెందలేదు. విప్లవ ప్రజా ప్రభుత్వం తీసుకునే ప్రతీ కార్యక్రమాన్ని అడ్డుకుంటూ దోపిడి ప్రభుత్వం ఏజంట్లుగా పని చేస్తున్నందుకు ప్రజా న్యాయస్థానం వారికి 6 నెలల పాటు సంతల పేర్లతో టౌన్‌లకు పోవటంపై నిషేధం విధించింది. ఆరు నెలల పాటు గ్రామ సరిహద్దులను దాటకూడదని నిర్ణయించింది.

ఇది 2011 లో జరిగింది.

* * *

రోజూ స్కూలు బోర్డు మీద దినం, వారం రాసిపెడతారు.

ఆ రోజు అందరికంటే కొంచెం ముందే నిద్ర లేచిన రాకేష్ బోర్డుపై రాశాడు.

24 డిసెంబరు 2012

తెల్లారవారుజామున అయిదు గంటలకే స్కూలు బెల్లు కొట్టారు.

కళ్లు నులుముకుంటూ పిల్లలంతా లేచి బ్రష్‌లపై టూత్‌పేస్టు వేసుకుని వాగు వైపు బయలుదేరారు. దొడ్లకు పోయేవాళ్లు దొడ్లకు పోయి కాళ్లు చేతులు కడుక్కుని రోల్‌కాల్ కోసం వచ్చి లైనులో నిలబడ్డారు.

రామ్‌సు గురూజీ రోల్‌కాల్ చేస్తున్నాడు.

రోల్‌కాల్ పూర్తయిన తర్వాత పిల్లలంతా వ్యాయామం చేస్తున్నారు.

జ్వరంతో ఉన్న భాస్కర్ కూర్చుని వాళ్లను చూస్తున్నాడు.

సుమన్, సుఖదేవ్‌లు ఉదయం టిఫిన్ తయారు చేసే పనిలో ఉన్నారు. సుఖదేవ్ శనగలు ఉడకబెడుతున్నాడు. ఒక పొయ్యి మీద తాగటం కోసం నీళ్లను మరిగిస్తున్నారు.

వ్యాయామం ముగించుకున్న పిల్లలు పిల్లి-ఎలుక ఆటకు దిగారు. అది అయిపోయనంక కోకో ఆట ఆడుతున్నారు.

సిర్గో, జూరి, ఇమల, నికేష్, మనోజ్, లక్కె, రింకు, జానో, శాంత, మైని, పన్నె, సుకరేష్, దినేష్‌లు ఒక జట్టు.

కములు, జయ, మంగేష్, రాకేశ్, సుంద్రి, సురేష్, లాల్సు, నన్ని, రిక్కి, సోమి, నవిత, నీలలు మరొక జట్టుగా ఆట

కథ

సోయి

- మిడ్కో

"చైతే, ఇయ్యాల బడికి పోయేది లేదా ఏంది?" నెత్తి మీద నీళ్ల బిందెతోటి దడి దాటుకొని వచ్చుకుంట, మేలుకొచ్చినా ఇంకా మంచం దిగని బిడ్డ దిక్కు సూసుకుంట అన్నది సన్నీ.

"కడుపుల నొస్తుందమ్మా..." కొంచెం బాధ ధ్వనిస్తున్నది ఆ అమ్మాయి గొంతుల.

"అరె ఎప్పటి సంది నొస్తుంది బుజ్జీ" ఇంటి ముంగట నీళ్ల బిందెలు పెట్టుకునే గద్దె మీద బిందె దించి ఇంటికానుకొని వున్న పందిట్లకు వచ్చుకుంట అడిగింది. ఆ పందిట్లనే మంచంల పండుకొని వుంది చైతె.

"మేలుకొచ్చినప్పటి సంది నొస్తుందమ్మా"

"బాగ నొస్తుందా బిడ్డా" మంచం పట్టెపై కూసొని చైతె పొట్ట మీద చేయి వేసింది తల్లి.

"ఏదీ లేసి కూసో నేను మంత్రమేస్తా" అదే పందిట్ల నెగడు పక్కనే వేసిన మంచంల కూసొని మంట కాగుతున్న కోసాల్ అన్నడు.

"నువ్వు సప్పుడు జెయ్యకుండు తాతా. మంత్రాలకు కడుపు నొప్పి తక్కువైతదా ఎక్కడ్నన్న" కసురుకుంట పక్కకు తిరిగి కాళ్లు ముడుచుకుంది చైతె.

నిండా పన్నెండేళ్లు లేని పిల్ల తన మాటను తీసిపారేసేటప్పటికి ఉక్రోష పడిపోయిండు కోసాల్.

"ఈ వూళ్లనే కాదు, ఈ చుట్టు పక్కలున్న వూళ్లల్ల నేనెన్ని రోగాల్ని, నా మంత్రాల తోటి బాగు జేసిన్నో ఎరికేనా..."

"అవ్వన్ని మూడ నమ్మకాలని మా గురూజీ సెప్పింది తీయ్"

"ఆ సెప్పింది తీయ్, మీ గురూజీ. దానికేం ఎరుక..."

"కడుపు నొప్పితోటి అది తండ్లాడుతుంటే నడుమ నీ లొల్లేంది" అని ఒక్క కసురు కసిరి "ఒరే గుడ్డూ "మా అక్కకు కడుపు నొప్పొస్తుంద"ని జెప్పి సుక్కిని తీస్కరాపో" నెగడు పక్కన్నే చిన్న పీట మీద కూసొని మంట కాగుతున్న ఏడేళ్ల కొడుక్కు పురమాయించింది సన్నీ. తుర్రుమన్నడు గుడ్డు. తాగుతున్న చుట్టను నేలకేసి కొట్టి సయ్యిన లేచి వాకిట్లకు పోయిండు కోసాల్. ఉక్రోషం ఆగుతలేదాయనకు. కానీ ఇంకేం మాట్లాడినా కోడలు గయ్యిన లేస్తదని ఎరుకే. అందుకని తన ఉక్రోషాన్ని అక్కడున్న కోళ్ల మీద, పందుల మీద, కుక్కల మీద సూపిచ్చుకుంట అన్నింటినీ గెదుముతూ కాసేపు వాకిట్ల అటూ ఇటూ తిరిగిండు.

కాస్సేపయితే మందుల పెట్టె పట్టుకొని పళ్లికిలిచ్చుకుంట "ఏం జేత్తున్నవ్ తాతా" అని పరాశికాలాడుకుంట సుక్కి వస్తదనే సంగతి తట్టిందాయనకు. సుక్కిని జూత్తే అరికాళ్ల మంట నెత్తిలకొస్తది కోసాల్‌కు. గందుకనే దడి దాటుకొని బయటికొచ్చిండు. అనుకోకుంటనే తమ సేన్ల మొకాన నడువబట్టిండు.

సుక్కికి ఎదురుపడొద్దని అనుకుండు గని సుక్కి ఆయన్ను వెంటాడుతనే ఉంది.

నిండా ఇరవైయేండ్లన్న లేని ఆ పోరి ఇంటికొస్తున్నదంటే మొకం దాసుకొనే గతిబట్టె నాకు. ఎన్నడన్న గిట్లయితదని అనుకుండా. ఎట్ల బతికిండు. తండ్రి సచ్చిపోంగనే తండ్రి జాగల వడ్డె (భూతవైద్యుడు) అయితిని. చెట్ల మందులు, మంత్రాలు, తంత్రాలు, పూజలు అన్నిట్ల పేరుబోతిని. రోగాల్ని పోగొడితి. దయ్యాల్ని ఒదిలిస్తి. చేతబడికి ఇరుగుడు జేస్తి. ఇట్ల కొన్ని రోజులల్లనే తండ్రిని మించిపోతి. సుట్టు పక్కల పది వూర్లల్ల పేరుపడితి. తనింట్ల ఇద్దరు ముగ్గురన్న రోగాలొచ్చినోళ్లో, దయ్యాలు పట్టినోళ్లో, వాళ్లకు తోడొచ్చినోళ్లో

మొదలయ్యింది. పిల్లలు తూరీగల్లా పరిగెడుతున్నారు. సుంద్రి చాలా చురుగ్గా ఆడుతున్నది. అలసి పోకుండా మెలకలు తిరగుతున్నది. సుంద్రి జట్టు ఆట గెలిచింది.

ఆట ముగియగానే సబ్బు పెట్టె, యూనిఫాం బట్టలు పట్టుకుని వాగు వైపు పరుగులు తీశారు... ఎవరికి వాళ్లే తాము వెనక పడకూడదని పోటీపడుతూ స్నానాలు చేస్తున్నారు.

పిల్లలంతా ఉదయం టిఫిను తింటున్నారు.

నెలకు ఒక రోజు మాంసం పెడతారు. ఆ రోజు నాటు కోళ్ల కోసం వెతికి దొరకటం లేదని పౌల్ట్రీ కోళ్లు తీసుకొచ్చారు. కూర వండటం కోసం సుమన్ టమాటాలు, ఉల్లిగడ్డలు కోస్తున్నది. మైని మసాలా నూరుతున్నది. సుఖదేవ్ పొయ్యిమీద కళాయిలో నూనె పోశాడు.

ఇంతలో రామ్‌సు తండ్రి మొసపోసుకుంటా ఉరికి వచ్చాడు. ఇక్కడిని వెంటనే పోండి. గుట్ట దిక్కు పోలీసులు కనిపించారు. ఎవరికీ కనిపించకుండా నక్కి నక్కి వస్తున్నారు. ఇటే వస్తరేమో...పోండి తొందరగా..అంటూ తను ఇంటికి వెళ్లిపోయాడు.

గురూజీలు పిల్లలను తీసుకుని అడవి ఒడిలోకి జారిపోయారు.

భుంకాల్ స్కూల్‌పై గ్రీన్‌హంట్ డేగ వాలింది. కోడిపిల్లలు అడవి ఒడిలో దాక్కున్నాయి. తల్లికోడి కావలి కాస్తున్నది...తన శక్తి మేరకు ప్రతిఘటించి తన బిడ్డలను కాపాడుకోవటం దాని లక్ష్యం.

డేగ బారి నుండి పిల్లలు తప్పించుకున్నారు.

పిల్లల కోసం వడ్లు, కూరగాయలు పండించే వ్యవసాయ కార్యకర్తను డేగ తన్నుకు పోయింది.

భుంకాల్ స్కూలు మూతపడిరది.

చీకటి పడింది.

పిల్లలంతా చలిలో అడవిలో అరుణోదయం కోసం ఎదురుచూస్తూ...

వుండేటోళ్లాయె. మంత్రాలు సదవని రోజు, పూజలు సేయని రోజు, కోడో, మేకో, పందో, గొడ్డో తెగని రోజు వుండేది గాదాయె. రోగాలొచ్చినోల్లు యిచ్చే వడ్లు, జొన్నలు, ఉలవలు, బొబ్బెర్లతోటి అర్ర నిండిపోయేదాయె. గంతేనా బూమి గూడ కొంత పెరిగె. రోగాలొచ్చినోళ్లకు తోడుగ వచ్చేటోల్లందరు తన బూములల్ల పని జేసి పెట్టేటోళ్లాయె.

ఇట్ల పదిహేను, పదహారేండ్లు తన వైద్యానికి ఎదురు లేకుంటపోయే. వడ్డెగానే కాదు పెద్ద మనిషిగ కూడ తనకు పేరొచ్చె. పంచాయితీలు గూడ జేసేటోడాయె. ఇంతల పార్టీ ఒచ్చె. సంగాలొచ్చె. పార్టీ ఒచ్చినందుకు, సంగాలొచ్చినందుకు మొదట్ల సంబురపడితి. ఎందుకంటే పార్టీ ఒచ్చినంక నాకలోల్లు (ఫారెస్టోల్లు) పత్త లేకుంట పోయిరి. నాకలోల్లు వున్నన్ని రోజులు ఒక తిప్పలు కాకపోయే. ఇంత బూమి చేసుకున్నా జుర్మాననిరి, ఇన్ని కట్టెలు ఏరుకున్నా జుర్మాననిరి. మేకలున్నా పన్ను కట్టమనిరి, పందులున్నా పన్ను కట్టమనిరి, ఆఖరికి కోళ్లున్నా పన్ను కట్టమనిరి. తను సంపాయించినదాంట్ల సగం నాకలోల్లకే పెడితి. ఒక్క నాకలోల్ల తిప్పలే కాదు. పార్టీ వచ్చినంక వూళ్లె గా మూకాల్ గాని పీడ గూడ బాసిపాయె. మూకాల్ గాని తాత ఈ వూరిని పొందిచ్చిండని జెప్పి, ఇగ వాడు ఈ వూరంత వాని జాగీరయినట్టు జేసెటోడు. ఒకడు పచ్చగుంటె ఓర్వెటోడు కాదు. ముఖ్యంగ తనని జూస్తె ఆడు కండ్లండ్ల నిప్పులు పోసుకునేటోడు. వానికేడ పోటీకొస్తనో అనుకునేటోడు గావొచ్చు. పార్టీ ఒచ్చినంక, సంగాలొచ్చినంక ఆడు జనాన్ని ముంచి సంపాయించుకున్న బూములన్నీ మళ్ల జనం పాలాయె. ఆడు పగబట్టి దళాన్ని పట్టియ్యాల్నని జూసిండని ఆన్ని దళం జంపె. పీడబోయిందని అందరు ఖుషీ అయిరి. తను గూడ ఖుషీ అయితి. కని తర్వాత తర్వాత తనగ్గూడ ఎసరొస్తదని అనుకోకపోతి. తనెన్నడు సంగంల పని జేయకపోయిన గని దళమోళ్లు మొదట్ల తనతోటి మంచిగనే వుండిరి. కని తర్వాత తర్వాత "ఇగో నువ్వు మంచిగ చెట్ల మందుతోని వైద్యం జేయి. గని గా మంత్రాలు, చేతబడులు అని జనాల్ని మోసం జేయొద్దు, మూడ నమ్మకాల్ని పెంచొద్దు" అని సెప్పుడు షురూ జేసిరి. అంతేగాదు మంత్రాలు తంత్రాలు వుట్టియే. జనాన్ని మోసం జేసి పైసలు, పలుకుబడి సంపాయిచ్చుకుంటందుకు కొంతమంది జేసే మోసాలని మీటింగ్ గూడ జేసుడు మొదలుపెట్టిరి. అయినా గని శానా రోజులు తనకేం ధోకా లేకపోయే. దళం సెప్పినప్పుడు అందరు "అవునవును" అని తలూపేటోళ్లు. మళ్ల సాటుంగ మాటుంగ తన దగ్గరికే వచ్చి మంత్రాలు జేయిచ్చుకుంటోళ్లు. అట్ల ప్రజలల్ల తన మీదున్న నమ్మకం తనను మళ్లో పదేండ్లు మంచిగనే కాపాడింది. ఇంతల అవ్వేందో జనతన సర్కార్లని పెట్టిరి. అండ్ల డాక్టర్లని తయారు జేసిరి. ఆ డాక్టర్లు ఇంటింటికి బోయి వైద్యం జేసుడు షురూ జేసిరి. అయినా గని తనకు మొదట్ల ఏం ధోకా లేకుండె. ముసలోల్లకు, ముదుగోల్లకు తన మీదనే గురివుండె. అయినా రోగాలకయితే ఆ డాక్టర్లు వైద్యం జేత్తరు గని దయ్యాలకు, సేతబడులకు ఆళ్లు జెయ్యరు గద. కని ఎక్కడ దెబ్బ గొట్టిందంటే, ఇగ బతకరని, ఆయిసు తీరిందని తను జెప్పిన వాళ్లకు, ఆళ్లు వైద్యం జేసి బతికిచ్చిరి. గంతే జనంల తన మీద నమ్మకాలు పోయే.

ఇగ కోడలు గూడ ఒచ్చిరాని వైద్యం జేసి జనాన్ని సంపొద్దు సప్పుడు జెయ్యక ఇంట్ల కూసో అని కరాకండిగ జెప్పె. పూలమ్ముకున్న చోటనే కట్టెలమ్ముకునే గతి తనకొచ్చె.

తమ సేన్లకొచ్చి గుడిసెలున్న మంచంల కూలబడ్డంక గూడ కోసాల్ తలపోత తెగకుండ తీగెలు బారుతనే వుంది.

* * *

"పక్కుర్తి (ప్రకృతి)కి ఇరుద్దంగ వోతే ఏమయిద్దో జూసినవా కములూ" అంటూ తమ ఇంటి ముంగటి నుండి పోతున్న కములును ఆపిండు కోసాల్.

కోసాల్ దేని గురించి మాట్లాడుతుండో అర్థమయినప్పటికీ "అవును-కాదు" అనుకుంట నిలబడిపోయిండు కములు. కములు కోసాల్ కంటే కొంచెం చిన్నవాడు.

"మన తాత ముత్తాల కాలం నుంచి వున్న సెలిమాయె. ఎంత ఎండకాలమన్న అది ఎండిపోంగ ఎవ్వరమన్న జూసినమా. అండ్ల వానాకాలంల బురుద నీళ్లు కలుత్తున్నయట, అవి తాగితే రోగాలొత్తున్నయట. గందుకని జనతన సర్కార్ బాగు జేత్తదట. దానికి సిమిటి పూస్తదట. ఇప్పుడేమయింది? మొత్తానికే ఎండిపోయే. ఇన్ని రోజులు ఆ నీళ్లు తాగి మనందరం సచ్చినమా? ఎన్నడు లేంది ఇప్పుడు కొత్తగ వొత్తయా రోగాలు?" ఇంట్ల కొడుకు, కోడలు ఎవ్వరు లేకపోవుడు తోటి గొంతు పెంచి మాట్లాడుతుండు కోసాల్.

కములు ఎటూ తేల్చుకోనట్టు "అవును-కాదు" అన్నట్టు తలాడిచ్చిండు.

"పా ఆడిదాక పోయొద్దం" చెలిమ దిక్కు తొవ్వ దీసిండు కోసాల్.

"నేను గూడ ఆడికి బోదమనే బయలెల్లిన" కదిలిండు కములు.

మాట్లాడుకుంట సెలిమెను చేరిర్రిద్దరు.

జనతన సర్కార్ అధ్యక్షురాలు కన్ని, వికాస్ కమిటీ అధ్యక్షుడు సన్నూతో పాటు వాళ్లూ, వీళ్లు అప్పటికే అక్కడ చేరి వున్నరు. కన్ని, సన్నులిద్దరి మొకాలు కళతప్పి వున్నయి. మంచి ఊట వున్న ఆ చెలిమెను చుట్టూ గోడలు కట్టి చెలిమె లోపలి వరకూ సిమెంట్ పూసి వానాకాలం దాంట్ల వరద నీళ్లు కలవకుంట మంచిగ జేయాల్నుకున్న తమ ఆలోచన ఇట్ల ఉల్ట తిరుగుడు వాళ్లకు చాలా ఇబ్బందిగ వుంది. ఊరందరికి ఆదరువుగున్న చెలిమాయే అది.

"దేవుడిచ్చిన సెలిమెకు ఇట్ల సిమిటీలు, గిమిటీలు పూస్తే దేవునికి కోపం రాదా?" అన్న కోసాల్ మాటలకు కన్ని చురుక్కున చూసింది. ఇంకెప్పుడన్నా అయితే కోసాల్ ఆ చూపులకు వెనకకు తగ్గెటోడే. కాని ఇప్పుడు తనకు వచ్చిన అవకాశాన్ని విడిచిపెట్టదల్చుకోలేదాయన.

"ఏమన్నంటే మూడ నమ్మకాలని తీసి పడేత్తరు. గని ఇప్పుడేమయింది? ఎన్నడూ ఎండిపోని ఊట, ఇప్పుడెట్ల ఎండిపోయింది?"

కన్ని, సన్నుల మొకాలు ఎర్రబడ్డయి గని ఏమీ అనలేకపోతుండ్రు. అప్పటికే ఒకరిద్దరు కోసాల్ మాటలకు నిజమేనన్నట్టు తలాడించుడు మొదలుబెట్టిన్రు.

ఏదో ఉల్ట పల్ట అయ్యింది అనుకుంట కన్ని కాసేపు చెలిమెను తేరిపార జూసి, గడ్డపార తీసుకొని చెలిమెలకు దిగి ఒక మూలకు తవ్వుడు షురూ జేసింది. ఒక్క ఐదు నిముషాలు తవ్విందో లేదో జల జలా నీళ్లు ఊరబట్టినయి.

సన్ను పట్టలేని సంబురంతోటి ఒక్క కేక వేసిండు.

అందరి మొకాలల్ల సంబురం ఎగజిమ్మింది. కోసాల్ మొకం మాత్రం మాడిపోయింది.

చూస్తుండంగనే చెలిమె నిండిపోతుంటే విజయగర్వంతోటి పైకి వచ్చి, "సిమెంటో, రాళ్లో పడి జల పూడుకపోయినట్టుంది" అన్నది కన్ని.

"ఆ అవును గంత కింది దానుక సెమిటి పూయకుంటే బాగుండేది" సన్ను.

"అవునవును" అనుకుంట మనిషో దిక్కు మాట్లాడబట్టిన్రు.

కోసాల్ మెల్లగా జారుకోబోయిండు.

"ఏం కోస పెదనాయినా జల్ది పోతున్నవేంది?" కన్ని తన తొవ్వకు అడ్డం తిరుగుడుతోటి కోసాల్‌కు నిలబడక తప్పలేదు.

"ఇన్నేండ్లు జనంల మూడ నమ్మకాలను పెంచి సొమ్ము జేసుకున్నవు. ఇప్పుడు జనం ఆ నమ్మకాల్నుంచి బయటపడుతుంటే నీ సొమ్మంత పోయినట్టు రందిపడుతున్నవ్. ఏ చిన్న సందు దొరికినా మళ్ల ఆ మూడ నమ్మకాలను బతికియ్యాల్నని జూత్తున్నవ్. పోయినేడు గూడ ఇట్లనే జేసినవ్. పొత్తుల బూమిల ఆడోళ్లతోని మేం విత్తనాలేయిస్తే, వానల్లేక పంటలు పండకపోతే, ఏమని ప్రచారం జేసినవ్. ఆడోళ్లతోని విత్తనాలేస్తే దేవునికి కోపం రాదా అని అడిగినోనికి, అడగనోనికి జెప్పుకుంట తిరిగినవ్. అయినా గని మేం వెనుకకు పోలే. ఇయ్యేడు గూడ మళ్ల ఆడోళ్లతోనే విత్తనాలేయించినం. మరేమయింది? మంచిగ వానలు పడ్డయి. ఊరంత మంచిగ పంటలు పండినయి. ఆడోళ్లు విత్తనాలేసిన పొత్తుల బూమిల ఎన్నడు పండనంత పండింది గద. అయినా నీకు బుద్ధి రాలేదు. మళ్లా దేవుడు, దయ్యం అనుకుంట జనాన్ని ఎనుకకు నడిపించాలని జూత్తున్నవ్..." కోసాల్ ఏమన్న మాట్లాడుతడేమో అన్నట్టు కాస్సేపు ఆగింది కన్ని.

కోసాల్ మొకంల కత్తి వేటుకు నెత్తురు సుక్కలేదు. తలకాయ నేలకేసి ముందుకు కదిలిండు.

"ఆడోళ్లు విత్తనాలేసి పండించిన పంటను ఏం జేత్తున్నమో ఎరికేనా? దాన్ని అమ్మి ఆడోళ్ల కోసమే మందులు తేవాల్నను కుంటున్నం. ఇగ జూడు అంతో ఇంతో నీ మీద నమ్మకంతోటి వైద్యం జేయించుకుంటున్న ముసలమ్మలు గూడ నీ దగ్గరికి రారు" కన్ని మాటలకు అక్కడున్న వాళ్లంతా నవ్విన్రు.

కుత కుత ఉడికిపోవుకుంట దబ దబ అడుగులేసిండు కోసాల్.

ఎంత పొగరు పట్టింది దీనికి. తన కండ్ల ముంగట పుట్టి పెరిగిన పోరికి, పెద్దంతరం చిన్నంతరం లేకుంటబోయింది. లోపల్లోపల మస్తు తిట్టుకుంటున్నడు కన్నిని. థూ... దీని ముంగట నేను ఎప్పుడూ ఓడిపోతనే వుంటి... నారాజ్‌గ అనుకున్నడు.

కన్ని తండ్రి కోసాల్‌కు తమ్ముడయితడు. అంటే చిన్నాయన కొడుకు. అట్ల కన్ని కోసాల్‌కు బిడ్డ వరుసే అయితది. ఇరవై అయిదు, ఇరవై ఆరేండ్ల వయసుంటది. చిన్నప్పటి నుంచి బాలల సంగంల పని జేసుకుంట పదేళ్ల క్రితం మహిళా సంగంల చురుకైన కార్యకర్తగా మారింది.

ఉద్యమం పట్ల కోసాల్‌కు వ్యతిరేకత పెరిగినంక ఆమెను వెనుకకు గుంజాలని చూసిండు.

కోసాల్ గీసిన గీత జవ దాటని కన్ని తల్లిదండ్రులు గూడ బిడ్డను వెనుకకు గుంజాల్నని జూసిండ్రు. ఆకరికి ఆమెకు జబర్దస్తీగ పెండ్లి గూడ జెయ్యాల్ననుకున్నరు. గని కన్ని మహిళా సంగం మద్దతుతోటి కోసాల్‌తోనీ, ఆమె తల్లిదండ్రుల తోనీ గట్టిగ కొట్లాడి, ఆ పెండ్లిని తప్పించుకొంది. ఇప్పటికీ ఆమె పెళ్లి జేసుకోలేదు. సంగంల హుషారుగ పనిచేసుకుంట నాలుగూర్లకు కలిపి ఏర్పాటు జేసిన జనతన సర్కార్‌కు ఈ నడుమనే అధ్యక్షురాలైంది.

"ఇన్నొద్దులు ఎంతో కొంత నేను జెప్పినట్టు ఇన్న జనమంత ఇప్పుడు దాని మాట వినబట్టిరి. నా కండ్ల ముంగట పుట్టి పెరిగిన పోరి నన్ను ఓడగొట్టె" అని కోసాల్ మాటి మాటికి అనుకుంటడు.

* * *

"అమ్మొస్తోందీ" వాకిట్ల ఆడుకుంటున్న ముగ్గురు పిల్లలూ, తల్లి వస్తున్న దిక్కుకు ఉరికిండ్రు. చైతె అందరి కంటే ముందుగాల అమ్మను అందుకొని ఆమె కాళ్లను చుట్టుకొని బ్రేకులు వేసింది. "అరె వుండురా ఇంట్లకు రానియ్యవా ఏంది" అంటుండగనే గుడ్డు కూడ వచ్చి చుట్టుకొన్నడు. ముద్దుగ కసురుకొని ఇద్దరినీ విడిపిచ్చుకుంట, వాళ్లెనుక ఉరికి వస్తున్న చిన్న కొడుకును ఎత్తుకొని, పెద్ద పిల్లలు వేలాడబడి రాంగ, దడి దాటుకొని వాకిట్లకు అడుగు పెట్టింది. పిల్లల లొల్లి విని, సన్నీ భర్త రామాల్, ఇంట్ల నుంచి బయటకు వచ్చిండు.

ఎండకాలం. మసక మసకగ చీకటి పడుతాంది. వాకిట్ల వేసున్న మంచంల కోసాల్ కూసొని వున్నడు.

"ఇప్పటిదానుక ఏ పెత్తనాలకు పోయొస్తున్నవ్" కోపంగా వుంది కోసాల్ గొంతు.

ఒక్క క్షణం ఆశ్చర్యంతోటి ఆగిందామె. అంతే ఆ తర్వాత సరసరా అతను కూర్చొన్న మంచాన్ని దాటేసి ముందుకు పోయింది.

"నిన్నే అడుగుతుంది సెవులినబడ్తలేవా?" ఆవె లెక్కజెయ్యనితనానికి ఇంకింత ఒళ్లు మండిపోయిందాయనకు.

"ఏందీ కల్లేమన్న ఎక్కువైందా ఇయ్యాల" ఆగి వెనుకకు తిరుగకుంటనే ఎప్పటి లెక్కన పెడసరంగ అన్నది.

"కల్లెక్కువై మాట్లాడుతలేను. ఆ కన్ని కంటే మొగడూ, మొద్దూ లేదు. కాని నువ్వు ముగ్గురు పిల్లల తల్లివి. వాళ్లను గాలికిడిసిపెట్టి మీటింగులని ఊర్లు తిరుగుతవా?"

"నేనేం గాలికిడిసి పెట్టలేదు. వాళ్ల నాయినున్నడు గద జూస్కుంటందుకు. అయినా నేనెన్ని రోజులు పోయిన, పొద్దుగాల బోయి ఇప్పుడు రానేబడ్తి"

"ఏందీ నువ్వు ఊర్లు బట్టుకొని తిరిగితే వాడు ఆడిదాని లెక్క ఇంటికాడుండి, ఒండిపెట్టి, పోరగాళ్లను సవరిచ్చాల్నా?"

"వండి పెట్టుడు, పిల్లల్ని సవరిచ్చుడు ఆడోళ్ల పనేం గాదు."

"నాయినా నువ్వొకో. సన్నీ నువ్వింట్లకు పో" రామాల్ ఇద్దరి నడుమ జొరబడే ప్రయత్నం జేసిండు.

కొడుకు జోక్యాన్ని పట్టిచ్చుకోకుంట, "ఆహా అవి ఆడోళ్ల పనులు గాదు, మొగోళ్ల పనులు! లోకంలున్న మొగోళ్లందరు జేత్తున్న పనులు. సూడు సన్నీ ఇన్నొద్దులు సంగాలో గింగాలో తిరిగినవు. ఇప్పుడు రోజులు మునుపటిలెక్క లెవ్వు. సూస్తున్నవు కద. ఇండ్లను గాలబెడుతుండ్రు. పంటలను గాలబెడ్తుండ్రు. మనుషులను పిట్టల గాల్చినట్టు కాలుత్తుండ్రు. ఆడోళ్ల బతుకులు ఆగమాగం జేత్తుండ్రు. నా మాటిని ఇప్పటి కన్న జెర సంగాలు, గింగాలు ఇడిసిపెట్టు"

మామ బెదగరింపు ధోరణికి సన్నీ జరంత సల్లబడ్డది.

సంకలున్న కొడుకును భర్తకిచ్చి గలుమట్ల కూలబడ్డది. నిజంగనే మావా. సర్కారు జనాల్ని అరిగోస పెట్టవట్టే. కని సంగాలల్ల పని జేత్తున్నోల్లనే సంపుతున్నదా? ఎవర్ని బడితే ఆళ్లను సంపుతున్నది గద. నేను సంగంల పని జేసుడు బంద్ పెట్టినంత మాత్రాన పోలీసులు మనల్నేం అనరని గ్యారంటీ ఏందీ?"

"సంగాలు బలంగున్న పూర్ల మీదనే దాడులు జరుగుతున్నయి. నువ్వు సంగం పని బంద్ పెడితే నిన్ను జూసి ఇంకొకరు బంద్ పెడ్తరు. అట్ల సంగం కమ్‌జోరయితది. మనూరు మీద పోలీసుల కన్ను వుండదిగ."

"అప్పుడు మల్లా ఎనుకటి రోజులొస్తయి." ఈ మాటలంటున్నప్పుడు చిన్నబోయిన సన్నీ మొకాన్ని చీకటి దాచిపెట్టినా ఆమె గొంతు పట్టిస్తున్నది.

"ఒస్తే ఒచ్చినయితీయ్ మళ్ల ఎనుకటి రోజులు. దానికి మనమేం జేత్తం. ఎట్ల అయ్యేదుంటే గట్లనే అయితది."

"ఎంత అల్కగ అంటున్నవ్ మావా. మల్లా ఎనుకటి రోజులు వచ్చుడంటే ఏమనుకుంటున్నవ్? ఇంత కాలం జనమంత పోరాడి సంపాయించుకున్నదంతా పోగొట్టుకున్నట్టు" ఇంకేమీ మాట్లాడబుద్ధి కాక లేచి ఇంట్లకు పోయింది సన్నీ.

* * *

నడిరాత్రి దాటింది గని సన్నీకి నిద్రొస్తలేదు. "ఒస్తే ఒచ్చినయితీయ్ మళ్ల ఎనుకటి రోజులు..." అన్న మామ మాటలే గుర్తుకొస్తున్నయి.

ఎంత అల్కగ అన్నడామాట. పార్టీ, సంగం లేకుంటబోయే రోజులను ఊహించుకోలేక పోతున్నదామె. పార్టీ, సంగాలు లేకుంటే తన జీవితం తన ఇష్ట ప్రకారం నడిచేదా? తన యవ్వనపు తొలి రోజులు గుర్తుకొచ్చినయామెకు. అప్పుడప్పుడే పూళ్లో సంగాలు బలం పుంజుకుంటున్నయి. కాని అమ్మ నాయిన తనను దళం దగ్గరికి పోనిచ్చెటోళ్లు కాదు. తనకు చిన్నప్పుడే మామ కొడుకుతోటి పెండ్లి సంబంధం ఖాయమయిపోయింది. అందుకనే తనను భద్రంగ కాపాడి ఆ యింటికి తోలుడు తమ బాధ్యత అని అనుకునేటోళ్లు తన తల్లిదండ్రులు. ఒక సంతలో రామాల్ పరిచయం అయ్యే దాకా తను కూడా ఆ యింటి పిల్లనే అనుకునేది. కాని రామాల్ పరిచయం అయిన తర్వాత మేనమామ కొడుకుతో పెండ్లి అర్థం లేనిదనిపించింది. రామాల్ జతలేని జీవితం అక్కర లేదనిపించింది. రామాల్‌తోటి చెట్టాపట్టాలేసుకొని తిరుగుడు అందరికీ ఎరుకైపోయింది. తాము కొన్న పశువును గుంజుకపోయినట్టు తనను కూడా గుంజుకపోతందుకు మేనమామ, ఆయన కొడుకు వచ్చిండ్రు. బలవంతంగ కాళ్లేతులు కట్టేసయినా తోలేస్తందుకు తన తల్లిదండ్రి గూడ తయారుగున్నరు. ఇరుగు పొరుగు చుట్టాలు, పక్కాలు ఎవరికీ అది అన్యాయమనిపియ్యలేదు. తాను గింజుకుంటున్నా, మొత్తుకుంటున్నా, లెక్కజెయ్యకుంట తనను గొర గొరా గుంజుకపోతుంటే వచ్చిండ్రు దళం వాళ్లు. అన్యాయానికి అడ్డం పడ్డరు. తనను అక్కున జేర్చుకుండ్రు. తన మనసు తెలుసుకుండ్రు. రామాల్‌తోటి తన పెండ్లి జేపించిండ్రు. మామకు కూడా తమ పెండ్లి ఇష్టం లేకుండె. ఆయన రామాల్‌కు ముందే ఇంకో సంబంధం కుదిరిచ్చి పెట్టిండు. తమ పెండ్లయిన తర్వాత కూడా తను ఖాయం చేసిన పిల్లను రెండో భార్యగనన్న కొడుక్కు కట్టబెట్టాల్నని జూసిండు. తన బొందిల ప్రాణముండంగ అట్ల జరగనియ్యొద్దనుకుంది. సంగం అండతోటి మామ ప్రయత్నాలను వమ్ముజేసింది. అంతేకాదు మామను ఎదిరించుడు నేర్చుకుంది. అట్ల మహిళా సంఘానికి దగ్గరైంది. ఇప్పుడు తమ పూర్లో మహిళా సంగం అధ్యక్షురాలిగ వుంది. పార్టీ, సంగం లేకుంటే తన పెండ్లి, సంసారం తన ఇష్టంతోని సంబంధం లేకుంటనే జరిగేటియి.

పార్టీ ఇచ్చిన చైతన్యం తమ జీవితాన్ని సంతోషంతో నింపింది. ఇప్పుడు తాను సంగం పని మీద ఎక్కడికి పోయినా రామాల్ ఇంటినీ, పిల్లల్ని చూసుకుంటడు.

పార్టీ తన బతుకు చిత్రంపై అద్దిన వెలుగులను బేరీజు వేసుకుంటూ నిద్రను మరిచిపోయింది సన్నీ.

* * *

వాకిట్ల మంచంల పండుకొన్న కోసాల్‌కు కూడా నిద్రొస్తలేదు.

"అప్పుడు మళ్లా ఎనుకటి రోజులొస్తయ్" అన్న కోడలి మాటలే చెవులల్ల మల్ల మల్ల వినబడుతున్నయ్.

ఎనుకటి కాలమొస్తే మంచిదా? చెడ్డదా? ఎనుకటి కాలమొస్తే తను మల్లా మునుపటి లెక్క వద్దెగా పని జేస్తడా? తన ఇంట్ల మల్లా మంత్రాలు ఇనబడుతయా? రోగమొచ్చినోళ్లు మళ్లా తన ముందు భక్తితోటి భయంతోటి తలవంచుకొని కూసుంటరా? ఇగ మందుల పెట్టె పట్టుకొని సుక్కి "ఏం చేస్తున్నవ్ తాతా" అని పండ్లికిలియ్యదా? "ఇగో సచ్చిపోయిన మూఢ నమ్మకాలను మల్లా బతికియ్యకు" అని కన్ని కళ్లెర్రజెయ్యదా? తన కోడలు గూడ ఇగ తనతోటి పెడసరంగ మాట్లాడదా? ఆ ఆడోళ్ల సంగం జూస్కునే గద దానికా గర్ర. ఆకరికి గా పన్నెండేళ్ల పోరి గూడ నియ్యన్నీ మూఢ నమ్మకాలు తాతా అంటదా? మల్లేమన్నంటే మా గురూజీ జెప్పింది అంటదా? ఇగ గా బడుండది, గా గురూజీ గూడ వుండదు.

పదిహేనేండ్ల కిందట పోగొట్టుకున్న తన వైభోగం మళ్లా ఒస్తదనే సంబురంల కాసేపు మునిగిపోయిండు కోసాల్.

కాని ఎనుకటి కాలమంత మంచిగనే ఏం లేదు కదా. ఎనుకటి కాలమొస్తే మళ్లా నాకలోల్ల జులుం మొదలైదతా?

ఆ ఏం గాదు తీయ్, అప్పుడంటే జనమంత ఎడ్డిగ వున్నరు గాబట్టి నాకలోల్లు ఆడింది ఆట పాడింది పాటయింది. ఇప్పుడు జనం ఎంత మారిపోయిండ్రు. ఏ మాటకు ఆ మాటే సెప్పుకోవాలె. పార్టీ వొచ్చినంక జనంల సానా మార్పొచ్చింది. ఎవరు అన్యాయం జేసినా నిలదీస్తుండ్రు. ఇగ ఇప్పుడు పార్టీ లేకున్న గని నాకలోల్ల ఆటలు జనం సాగనియ్యరు లే.

మరి మూకాల్ అసుంటోవోళ్లు మళ్లా తలెగురేస్తరా? ఏమో అన్ని ఊర్లల్ల సంగతేమో గాని, మనూర్లనైతే మూకాల్ గాడు సచ్చిండు. ఆడయితే ఇగ బతికి లేసి రాడు. ఇగ ఆని కొడుకు అక్కడెక్కన్నో పట్నంల వున్నడట. ఇగ ఆడు రాబోతడా?

అన్ని సరే గని మరి జనం మునుపటంత ఎడ్డిగ లేరు గద. మరి మునుపటి లెక్క జనం తనతోని వైద్యం జేయించుకుంటరా? తన మంత్ర తంత్రాలను నమ్ముతరా? ఆ సేయించుకోక ఏం జేత్తరు. పార్టీ లేకుంటే ఈ జనంకు వైద్యం జేసేటోళ్లు ఎవ్వరుండరు. జనంల ఎంత మార్పొచ్చినా మంత్ర తంత్రాల మీద నమ్మకాలు అంత జల్ది

పోవులే. మొన్న మొన్నటి దాక దళం ఎంత జెప్పినా సాటు మాటుగా నా దగ్గరికి వచ్చేటోళ్లినాయె.

గీ సల్వాజుడుంను ఆదివాసుల రీతి రివాజును కాపాడుతందుకే నడుపుతుంద్రట. మంత్రాలు, తంత్రాలు గూడ ఆదివాసుల రీతి రివాజేనాయె.

ఏహె. ఎంత రీతి రివాజును కాపాడుతందుకు అయితే మాత్రం, మరీ గింత గోరంగ జేత్తరా? పిల్లనకపోయిరి, తల్లనకపోయిరి ఎవర్ని బడితే వాళ్లను అన్యాయంగ జంపబట్టిరి. ఆడోళ్లను ఆగమాగం జెయ్యబట్టిరి. ఇండ్లు కాలబెట్టబట్టిరి. పంటల్ని కాలబెట్టబట్టిరి. ఆదివాసుల రీతి రివాజును కాపాడుతందుకని ఈళ్లు సంపుతున్నది ఎవర్ని? ఆదివాసుల్నేనాయె. ఈళ్లు ఆగం జేస్తున్నదెవర్ని ఆదివాసుల్నేనాయె. గిదయితే మంచిగ లేదు.

ఇట్ల పరి పరి విధాలుగా తర్కించుకోబట్టిండు కోసాల్.

* * *

"ఏం జేత్తున్నవ్ కోస బావా" అనుకుంట పందిట్లకొచ్చేదానుక, ఆ వచ్చిన మనిషిని కోసాల్ గమనించనే లేదు.

మెలుకువతోనే వున్నా ఆయన కండ్లు మూసుకొని ఏదో ఆలోచన్ల మునిగిపోయినట్టున్నడు. ఆ కొత్త మనిషిని ఎవరబ్బా ఈయన అన్నట్టు సూసుకుంట పండుకున్నవాడల్లా, లేసి మంచంల కూసుండు.

"ఏంది బావా గుర్తు పడ్తలేవా ఏంది?" ఎదురుంగ వున్న మంచంల కూసున్నడు కన్నాల్.

"ఓ నువ్వు నిమ్మలగూడెం కన్నాల్‌వు గద. శానొద్దులైంది గద నిన్ను జూసి. ఏందో ఇట్లొచ్చినవ్" తలాపుకున్న చిన్న చుట్టల సంచిని చేతులకు తీసుకుండు కోసాల్.

"నీ దగ్గరికి ఇంకెందుకొస్త బావా. నాల్గు నెల్లసంది కాల్జేతులు ఒక్కటే గుంజుతున్నయి. ఆల్లీల్లిచ్చిన మందులు వాడిన గని తక్కువగాలే. నువ్వయితనే బాగు జేత్తవనే నమ్మకంతోటి ఒచ్చిన" అనుకుంట కోసాల్ ఇచ్చిన చుట్ట, అగ్గిపెట్టెనందుకుండు కన్నాల్.

కోసాల్ ఉబ్బితబ్బిబ్బయిండు. సంబురంతోటి నోట మాట రాలేదు. సన్నగ వణికే చేతుల్తోటి చుట్టల పొవ్వాకు నింపుకుంట "గిసువంటి రోగాల్నెన్నిటినో బాగు జేసిన. గని ఇప్పుడు వొయిద్దం మొత్తం బంద్‌వెడ్తి. ఇప్పుడు నేను మందులు గూడ తయారు జేత్తలేను." అన్నడు.

"నువ్వట్లనొద్దు బావా నా కోసమన్న నువ్విప్పుడు మందు తయారు జేయాలె. అయినా గని బావా నువ్వు మళ్లా మునుపటోలిగె వొయిద్దం జేసే రోజులొచ్చినట్టె గద. మా వూళ్లె పోలీసులు కేంపేసిరి. ఇప్పుడాడ మునుపటి లెక్క సంగాలు గింగాలు నడుస్తలేవు. అందుకని ఆ సంగాలోల్లు మందులు గూడ ఇస్తలేరు. మా వూరికి మీ వూరికి ఎంత దూరం. పక్కపక్కన్నేనాయె. ఇగ రేపు మీ వూరి సంగతి గూడ గంతే."

"ఏం కేంపులేసుడో గని బావా. నెరీ జనాన్ని అరిగోస పెడుతుంద్రు గద."

"అయ్యో అందర్ని ఎందుకు అరిగోస బెడ్తుంద్రు? ఎవరినో కొంతమందినే. మరి సంగాలు, గింగాలు ఒద్దని ఎంత మంచిగ మీటింగులు చేసి, బుదుగరిచ్చి సెప్తున్రు. మీకన్ని మేం జూసుకుంటం అని సెప్పబట్టిరి. వింటే అయితది గదా. విననోళ్లనే అట్ల జేస్తుంద్రు."

"అయినా గని ఇన్నొద్దులు సర్కారు జనం తిప్పలు పట్టిచ్చుకుంటే అసలు జనం గా పార్టీ జోలికెందుకు పోదురు. సంగాల జోలికెందుకు పోదురు. ఇన్నొద్దులు మన ఆదివాసులను దోసుకున్నోడు తప్ప, పట్టిచ్చుకున్నోడు లేకపాయె. గందుకనే గద పార్టీ దిక్కు జనం మొగ్గింది."

"ఇన్నొద్దులు పట్టిచ్చుకోనిది నిజమే బావా. సర్కారు గూడ ఒప్పుకుంటాంది ఆ మాటను. మనల్ని పట్టిచ్చుకోవాల్నంటే మాటలా బావా. మనం గీ మారుమూల అడవిలుంటిమి. ఇక్కడికి ఏ సర్కారు నౌకరోన్ని తోలినా వచ్చుడు కష్టమేనాయె. సర్కారు బళ్లు గట్టె. అండ్ల సదువు సెప్తందుకు నౌకర్లిచ్చి, జీతాలిచ్చి పంతుళ్లను బెట్టె. కని గా పంతుళ్లు నెల నెలా జీతాలు తీస్కోబట్టిరి గని బల్లెకు రాకపోయిరి. అంగన్‌వాడీలను బెట్టె, నర్సమ్మలను బెట్టె. గని ఆళ్లు రాకపోయిరి. దానికి సర్కారు ఏం జేత్తది బావా. గందుకనే ఇప్పుడు రోడ్లేస్తమంటున్రు. మనకు అన్ని సౌలత్‌లు అందేటట్లు చేస్తమంటున్రు. మనసువంటోళ్లకు నెల నెలా ఫించన్లు ఇస్తమంటున్రు. ఒక్క రూపాయికే కిలో బియ్యం ఇస్తమంటున్రు. అడవి మీద గూడ మనకే అధికారం ఇస్తమంటున్రు. కని పార్టీవోళ్లు రోడ్లెయ్యొద్దనే. రోడ్లెయ్యకపోతే సర్కారోళ్లు మన వూర్లల్లకు ఎట్లొస్తరు. గంతేకాదు నక్సలైట్లు వుంటరని భయపడి గూడ మన వూర్లల్లకు సర్కారోళ్లు వస్తలేరట. కాబట్టి మనం గీ పార్టీలు, గిర్టీలు, సంగాలు, గింగాలు వొద్దనుకుంటే సర్కారు మనకు అన్ని జేత్తమంటుంది. మనం పార్టీ దిక్కుకు పోయింది గూడ ఏదో మన బతుకులు బాగుపడుతయనే కద. మరి ఇగ సర్కారే మన బతుకులు బాగ జేత్తమంటుంటే మనకు పార్టీ ఎందుకు?" కోసాల్ ముఖంలకు పరీక్షగ చూసుకుంట ఆగిండు కన్నాల్.

కోసాల్ ఏమీ మాట్లాడ లేదు. కాని తాను కోరుకున్నది కోసాల్ ముఖంల కనిపించింది కన్నాల్‌కు. దాంతోటి మరింత హుషారొచ్చింది.

"మా వూర్లె క్యాంపు పడ్డంక సంగాలు గింగాలు అన్ని పోయినయి. ఇప్పుడెంత నిమ్మళంగ వుందనుకున్నవు. ఇప్పుడు మాకు నెల నెలా ఫించన్లు వస్తున్నయి. బియ్యం ఇస్తుంద్రు. డాక్టర్లు వచ్చిపోతున్రు. బల్లెకు పంతుల్లు గూడ మంచిగ ఒస్తున్రు. ఇండ్లు గూడ కట్టిస్తమంటుంది సర్కారు..."

"మీ వూర్లె క్యాంపు పడంగనే మా వూరి పనిగూడ అయిపోయిందనుకున్న. కని పక్కనే కేంపున్నా, మా వూళ్లె సంగాలన్ని నడుత్తనే వున్నయి. ఇప్పుడు కన్ని కనబడ్తలేదు. కని కనబడకుంటనే ఊరిని నడుపుతనే వుంది." పక్కనే తుపుక్కున వుంచిండు కోసాల్.

"ఆ గట్ల ఎన్నొద్దులు నడిపిత్తరుతీయ్ బావా. ఇంక కొన్నొద్దులే గట్ల సాగుతదితీయ్. అయినా గా కన్ని జెప్తే ఇక్కడెవలో నడిపిస్తున్నట్టున్రు. సరె గని, ఎవరు నడిపిస్తున్రనంటవ్" కోసాల్ వైపు చూడకుంటనే చుట్టకున్న బూడిదను రాల్చుకుంట అన్నడు.

"ఎవలు నడిపిస్తున్రో నాకెట్ల తెలుస్తది. ఎవలో గని నడిపించనైతే నడిపిస్తున్రు."

"నీ కోడలు గా ఆడోళ్ల సంగంల పని జేత్తదట గద. గాయింత నీకు తెల్వకపోతదా?"

"నా కోడలుకు, నాకు నడుమ, ఉప్పుల నిప్పేసినట్టే. అది నన్ను జెరంత గూడ సైసదు"

"ఆ నీల్గుడంత గా సంగాలను జూస్కునేతీయ్. ఇంకేముంది సంగాల పని అయిపోయినట్టే అనుకో. ఇగ నీ కోడలు నువ్వెట్ల జెప్తే గట్ల ఇనకుంటే నన్నడుగు."

%కోసాల్ చూపులు చమక్‌న మెరుసుడు జూసి, కన్నాల్ తృప్తిగ మంచంలకెల్లి లేసిండు.

"నేను మళ్లొస్త బావా నువ్వయితే నాకు ఎట్లనన్న మందియ్యాలె." అనుకుంట పందిట్ల నుంచి వాకిట్లకు నడిచి, దడి దాటి వచ్చిన తొవ్వబట్టిండు కన్నాల్.

సాగనంపుతందుకు దడి దాక కోసాల్ తోడొచ్చిండు.

* * *

"ఇయ్యాల పగటీలి ఆ కన్నాల్ గాడొచ్చి పోయిండట నీ దగ్గరికి" రాత్రి అన్నం తిని, ఇంటి ముంగటికి పోయి, నోరు పుక్కిలించి, తువ్వాలతోటి మూతి తుడుచుకుంటున్న మామను అడిగింది సన్నీ.

చాలా సేపటి నుండి తోసుకు వస్తున్న ప్రశ్నను "ముసలోడన్నం తిననీ" అని గొంతుల్నే అదిమిపట్టింది ఇంతసేపు.

"ఆ ఒచ్చిండు. రావద్దా?" నిర్లక్ష్యంగా తువ్వాలను విదిలించి భుజం మీద వేసుకుండు.

"అదే ఎందుకొచ్చిండూ అని"

"ఇచ్చులు కచ్చకాయలన్నీ నీకు జెప్పాల్నా" ఆమెను లెక్కజెయ్యకుంట అక్కడ్నుంచి కదిలి వాకిట్ల వేసున్న తన మంచంల కూలబడి, చుట్ట కోసం పొగాకు సంచిని చేతులకు తీసుకుండు.

"ఆనిల్లు పోలీసు కేంపు పక్కన్నే వుంది. వాడు పొద్దున లేస్తే కుక్కలెక్క తోకూపుకుంట ఆ కేంపుల్నే తిరుగుతడు. అన్ని మనూర్లకే రానీయొద్దనుకుంటే మనింటికే ఒచ్చిపోయిండు. అందుకనే ఎందుకొచ్చిండని అడుగుతున్న."

కోడలు మాటలల్ల పెరుగుతున్న వేడి కోసాల్‌ను భయపెట్టింది. పగటీలి కన్నాల్ మాటలతోటి ఎక్కిన ధైర్యం జారిపోయింది.

"ఆనికి పెయిల బాగలేదట. వొయిద్గం కోసమొచ్చిండు." తల నేలకేసుకుంట సెప్పిండు.

"నువ్వు బంద్ పెట్టినవ్ కదా."

"ఆడు సాన దిక్కుల తిరిగిండట. ఎక్కడ తక్కువ గాలేదట. గందుకని నా దగ్గరకొచ్చిండు." కొంచెం తల పైకెత్తిండు. కాని కోడలు దిక్కు జూసే ధైర్యం మాత్రం జేయలేదు.

సన్నీ కొంచెం మెత్తబడ్డది. ఇండ్ల మామ తప్పేం లేదని నమ్మింది.

"సూడు మావా. నేను జెప్పేది జెర మంచిగ సెవుల బెట్టు. ఆ కన్నాల్ గాడిని ఇంకెప్పుడు దగ్గరకు రానీయకు. ఆని మీద అందరికీ అనుమానం వుంది." నెమ్మదిగనే అయినా, కరాకండిగా చెప్పి ఇంట్లకు పోయి, మామ తిన్న ఎంగిలి పళ్లాన్ని తీసి ఒక మూలకు పెట్టింది. ఇంకో పళ్లాన్ని చేతిలకు తీసుకొని కడుక్కొని, అన్నం పెట్టుకుని కింద కూలబడి తినుడు షురూ జేసింది. పిల్లలు అన్నం తిని వెన్నెల్ల ఆడుకుంటున్రు. భర్త రాత్రికి రానని చెప్పి పక్కూరికి మీటింగ్‌కు పోయిండు.

* * *

"ఎట్లెట్లా... మన రెండూర్ల నడుమ కంపినీ పెడ్తరా?" తమ సేన్లున్న గుడిసెల, తన ఎదురుంగ ఇంకో మంచంల కూసున్న కన్నాల్ దిక్కు సూస్కుంట అడిగిండు కోసాల్.

కన్నాల్‌ను రానియ్యొద్దని కోడలు జెప్పిన మాటలను కోసాల్ ఈ చెవితోని విని ఆ చెవితోని వదిలేసిండు. అయితే ఇంటికి మాత్రం రావొద్దని జెప్పిండు. సేన్లనో, కల్లు సెట్లు దగ్గర్నో, సంతల్నో కలుస్తనే వుండు. కన్నాల్ సెప్పే మాటలు కోసాల్‌ను గాలిల తేలేటట్లు జేస్తయి. అందుకనే సాటుంగ, మాటుంగ కలుస్తనే వున్నడు.

కోసాల్ కన్నాల్‌కు ఇప్పటి దానుక పెద్దగ ఉపయోగపడ్డదేం లేదు. అయినా ముందుచూపు తోటి ఆ సంబంధాన్ని కొనసాగిస్తుండు.

"అవును బావా కంపెనీ వస్తే మన బతుకులు జూడు ఎట్ల మారిపోతయో."

"ఎట్ల మారుతయేంది?"

"మన పిల్లగాండ్లకు నౌకర్లొస్తయి. ఇగ మన పిల్లగాండ్లు మిలీషియా, సంగాలు, దళాలు అనుకుంట తిరుగరు. రాయ్‌పూర్ నుండి డైరెట్టు పెద్ద రొడ్డేస్తరు. ఇగ మనం నడిసేదే లేదు. ఎటు పోయినా బస్సుల్నే. కంపినీ పక్కన్నే పెద్ద బడి పెడుతరట. పెద్ద దావఖాన కడుతరట. మన చుట్టుపట్ల వూర్లన్నిటికి కరెంటొస్తదట. మనకు ఇంటింటికి కరెంటు ఇస్తరట. రంగు రంగుల టీవీలు గూడ ఇస్తరట" నోరెళ్లబెట్టి వినబట్టిండు కోసాల్.

"ఇంతకూ ఏం కంపినీ అంటవు అదీ?"

"ఇనుము తయారు జేసే కంపినీ బావా."

"ఇనుమెట్ల తయారు జేస్తరూ?"

"ఇక్కడ మన బూముల నిండ ఇనుముందట బావా. దాన్నంత తొవ్వి తీసి, ఆ కంపిన్ల దాన్నంత మంచిగ సాఫ్ జేసి, ఆ ఇనుమును పెద్ద పెద్ద దేశాలకు పంపుతరట."

"ఎట్లా మన బూముల నిండ ఇనుముందా? దాన్నంత తొవ్వి తీస్తరా? మరి గట్ల తొవ్వుతే మన బూములు ఎగుసంకు పనికొత్తయా?"

"ఇంక ఎగుసంకెట్ల పనికొత్తయి బావా?"

"ఏందీ ఎగుసంకు పనికి రావా? మరట్లయితే మనం మన్ను బుక్కి బత్కుతమా" కోపంగ అన్నడు కోసాల్.

"నువ్వెంత తెలివి తక్కువోడివి బావా" అన్నట్టుగ పెద్దగ నవ్వి "ఇంక ఎగుసం ఎందుకు బావా నీకు. నీ కొడుకు, కోడలు కంపిన్ల నౌకర్లు జేత్తరు. అల్లకు పైలి పైలికి వెయ్యిలకు వెయ్యిలొచ్చి సేతిల బడ్తయి. ఆ పైసలు తీస్కపోతవు. కంపినీ పక్కనే పెద్ద పెద్ద దుకాన్లుంటయి. నీకేం గావాల్నో గవి కొనుక్కుంటవు. ఒండుకుంటవు. తింటవు. నువ్విగ ఆయిగ పంఖ కింద, మంచంల పండుకొని టీవీ సూస్కుంట వుంటవు. అంతేకాదు బావా, మన బూములల్ల ఇనుము తవ్వుకుంటందుకు, మన బూముల్ని కంపినీ కొంటది. అట్ల కొన్నందుకు మనకు లచ్చలు లచ్చల పైసలిత్తది. ఆ పైసలను బేంకులేసుకున్నవనుకో నెల నెల బొచ్చెడంత మిత్తొస్తది. నువ్విగ కాలు మీద కాలేసుకొని బత్కొచ్చు.

"ఏందీ మన బూముల్ని కంపినీ కొంటదా? మరి మనం అమ్మకుంటే?"

"అమ్మకుంటే గుంజుకుంటది" అనబోయి మనసుల్నే నాలిక్కరుచుకుండు కన్నాల్. "అమ్మకుంట ఎవరుంటరు బావా?

మెడకాయ మీద తలకాయున్న ఎవ్వడైనా అమ్మకుంట వుండడు. మా బూమిని ముందుగాల కొనమంటే, మా బూమిని ముందుగాల కొనమని పోటీకొస్తరు జూడు. లచ్చలెవరికి సేదూ…"

"లచ్చలిత్తరే అనుకో. మనం బత్కుతం గని మన పోరగాళ్లెట్ల బత్కుతరు? ఆళ్ల పోరగాండ్లెట్ల బత్కుతరు?"

"సెప్తలేను బావా. నీ కొడుక్కు, కోడలుకు నౌకర్లొత్తయి. ఇగ నీ మనమలు, మనుమరాండ్లంటవా? ఆళ్లు పెద్ద పెద్ద సదువులు సదువుతరు. పెద్ద పెద్ద నౌకర్లు జేత్తరు. ఆళ్లను గూడ మట్టి పిసుక్కొని బతుకమంటవా ఏందీ? నువ్వు వడ్డెగ పని జేసినవ్. నీ మనుమడు పెద్ద ఇంగిలీసు డాక్టేరయితడేమో ఎవలకు తెలుసు? గట్టిగ నవ్విండు కన్నాల్.

కోసాల్‌కు మాత్రం నవ్వు రాలేదు.

* * *

"తాతా కాల్లు, జేతులు కడుక్కొని రా. అమ్మ లేదు గాని నేనన్నం పెడ్త" సేను కానుంచి వస్తున్న కోసాల్ వాకిట్ల అడుగు పెట్టిండో లేదో చైతె కేకేసింది.

మళ్లే పెత్తనాలకు పోయిందోనని మనసుల్నే గులుక్కుంట కాళ్లూ, జేతులు కడుక్కొని ఇంట్లకు పోయి మనవరాలు వేసిన పీట మీద కూసుండు. కంచం కడిగిపెట్టి, అన్నమూ, కూరా వడ్డించింది చైతె.

అన్నం కలుపుకుంట "మీరన్నం తిన్నరా? తమ్ముల్లేరీ?" అడిగిండు.

"తిన్నం తాతా. చింత చెట్ల కింద ఆటలకు పొయిన్రు. ఇయ్యాలాదివారం గదా. బడి లేదు. పిలగాళ్లందరు అక్కడ్నే ఆటలాడుతుండ్రు" అని కొద్దిసేపు ఆగి, మళ్ల గుర్తుకొచ్చినట్టు "పొజ్జాల్ మామతోని సేనుకాడికి నాయినకు అన్నం పంపిన నువ్వాడుండంగనే అందిందా" అడిగింది.

"ఆ… ఆ… అందింది గని… మీ అమ్మెటు పోయినట్టు"

"ఇయ్యాల వాళ్లది మీటింగుందట"

"మొన్ననే మీటింగని పోయింది గద. మళ్లేం మీటింగట."

%ఆయన గొంతుల నిరసన చైతెకు అర్థమయినా, ఎప్పటి లెక్కనే తాత తీరును పట్టిచ్చుకోకుంట "మళ్లొచ్చే సోమారం బీజాపూర్‌లో ర్యాలీ వుంది గద తాతా, దాని గురించి మాట్లాడుకుంటందుకు మీటింగట."

"రేలీనా అంటే ఏంది?"

"ర్యాలీ అంటే తెల్వదా తాతా. మనూర్లె మీటింగులు పెట్టినప్పుడు జెండాలు పట్టుకొని, పాటలు పాడుకుంట, నినాదాలిచ్చుకుంట, ఇద్దరిద్దరు లైన్‌గ పోతరు జూడు. దాన్నే ర్యాలీ అంటరు." తాతకు తెల్వని విషయం తనకు తెల్సినందుకు ఆ అమ్మాయి కండ్లు మెరిసిపోతున్నయి.

"మరి మనూర్లె గాకుంట గక్కడెందుకు రేలీ జేత్తుండ్రు."

"మనూరునానుకొని ఉక్కు ఫ్యాక్టరీ పెట్టాల్నని, గనులు తొవ్వాల్నని సూస్తుందట సర్కారు నీకెరికేనా?"

"ఆ… ఆ… ఎరికే."

"ఆ దాన్ని పెట్టనియ్యొద్దని ర్యాలీ జేత్తున్రు."

"కంపినీ పెడ్తె ఏమయితది?"

అయ్యొ తాతా ఆ మాత్రం తెల్వదా అన్నట్టు జూసుకుంట "ఆ కంపినీ మనందరి బూముల గుంజుకుంటదట."

"గుంజుకోదట బుజ్జీ. లచ్చలు లచ్చలు ఇచ్చి మన బూముల్ని కొంటదట. మీ అమ్మ, నాయిన అసంటోల్లకు నౌకర్లిస్తట. నీ అసుమంటి పొలగాండ్లకు పెద్ద పెద్ద బడులు పెడ్తదట."

"అయ్యో తాతా నీకెవరు జెప్పిండ్రో గని అన్నీ అబద్ధాలే. ముందుగాల అట్లనే జెప్తదట. "ఉద్యోగాలిస్తం, పైసలిస్తం" అని. మనం నమ్మి బూములిస్తే, తర్వాత మనల్ని ఊళ్లకెళ్లే ఎల్లగొడుతదట."

కండ్లు పెద్దగ జేసి, మెడ దగ్గర నరాలు తేలేటట్టు చెప్తున్న మనవరాల్ని జూస్తే సంబురంగ అనిపిచ్చింది కోసాల్‌కు. అందుకే వుట్టిట్టి వాదన కోసం "నీకే అవద్దాలు జెప్పిన్రు గావొచ్చు తీయ్. కంపినీ బొచ్చెడన్ని పైసలిచ్చే మన బూముల్ని కొంటదట. ఉద్యోగాలిత్తదట. సదువులు జెప్పిత్తదట" అన్నడు చిన్నగ నవ్వుకుంట.

"మరి అన్ని లాబాలుంటే జనమంత ఇసువంటి ఫ్యాక్టరీలు, గనులొద్దని ఎందుకు లడాయి జేస్తున్రు. మన దగ్గర్నే గాదు. దేశంల ఎన్నో దిక్కుల ఇసువంటి ఫ్యాక్టరీలు వొద్దని జనం కొట్లాడుతుండ్రట."

వాదనకు కూడా కోసాల్ దగ్గర ఇగ పాయింట్ లేదు.

"నీగ్గివ్వన్ని ఎవలు జెప్పిన్రు బుజ్జీ."

"మా గురూజీ చెప్పింది తాతా."

"బల్లె గిట్లాంటియి గూడ జెప్తరా?"

"సెప్తరు తాత. కంపినీ పెట్టొద్దని జెప్పి, మాతోని మా గురూజీ నాటికలు గూడా వేయించింది. వచ్చే సోమవారం జరిగే ర్యాలీల మా బడి పిల్లలమందరం పాల్గొనాలని కూడా జెప్పింది."

"రేలీ జేత్తే కంపినీ కట్టుడు ఆపుతరా?"

"ఒక్కసారి ర్యాలీ తీస్తే ఆపుతరా ఏంది. మనం అట్లనే కొట్లాడుతనే వుండాల్నట. మన వూర్లున్న ముసలోల్లు, వయసోల్లు, పిల్లగాండ్లు అందరు కల్సి కొట్లాడాల్నట. మనూరోళ్లమే కాదు. ఈ చుట్టుపక్కల అన్ని వూర్లోళ్లు కూడా కొట్లాడుతం అంటున్రట. గంతేకాదు పెద్ద పెద్ద పట్నాలల్ల వుండేటోళ్లు, బాగా సదువుకున్నోళ్లు, ఇంకా శానా సంగాలోల్లు గూడ ఈ ఫ్యాక్టరీని ఎట్లనన్న ఆపాలని అనుకుంటున్రట. అందుకనే అన్ని సంగాలు కల్సి బీజాపూర్ల ర్యాలీ తీస్తుండ్రట."

కంచంల్నే చేయి కడిగి పీటమీంచి లేసిండు కోసాల్. ఆవేశంగ చేతుల్ని వూపుకుంట మాట్లాడుతున్న మనవరాల్ని దగ్గరికి తీసుకొని, "బడికి పోయి ఎన్ని సంగతులు తెల్సుకున్నవురా." అని తల నిమిరి పండుకునే పందిట్లకు పోయిండు.

* * *

"కంపెనీ కట్టుడు షురూ జేత్తాండ్రు బావా" సేన్లున్న గుడిసెల కోసాల్‌కు ఎదురుగున్న మంచంల కూసుంట అన్నడు కన్నాల్.

ఇష్టం లేనట్టు అతని దిక్కు జూసుకుంట "కంపినీ పెట్టొద్దని జెప్పి రేపు రేలీ తీస్తుండ్రట గద…" అన్నడు కోసాల్.

"ఆ, గా రేలీలు ఏం ఆపుతయి కంపినీని. ఎన్నో దిక్కుల జనం ఒద్దంటనే వున్నా కంపిన్లు పెడ్తనే వున్నరు."

"అయితే ఈ కంపినీ కట్టుడు ఆగదంటవా?"

"ఇంకెక్కడ ఆగుడు బావా. రేపు బూమి పూజ జేత్తాండ్రు.

గందుకనే నేన్నీకాడికొచ్చిన. "బయట్నుంచి బాపనోళ్లను మేం తెచ్చుకుంటం గని, ఇది ఆదివాసీ ఇలాక గద. ఆదివాసులతోనే పూజ చేయిస్తే బాగుంటది ఎవర్నన్న జూడు" అని నిన్న నాతోటి కంపినీ మేనేజర్ అన్నడు. దాందేముంది సార్ మా కోస బావ వున్నడని జెప్పి నేనిటు వచ్చిన." పెద్ద ఘనకార్యం చేసినట్టు నవ్విండు కన్నాల్.

"నేనా... నేను రాను." పెడసరంగ అన్నడు కోసాల్.

కోసాల్ రానంటడని ఊహించలేదు కన్నాల్. "ఏం బావా జనాలకు బయపడ్తున్నవా?"

"నేనెవ్వలకు బయపడుతలేను గని నేను రాను."

నిజానికి కంపినీ వాళ్లు ఆదివాసీ ప్రాంతం కాబట్టి, ఆదివాసీ చేత పూజ చేయించాలని అనుకోలేదు. స్థానిక ఆదివాసుల మద్దతు కంపెనీకి వుందని ప్రచారం జేసుకుంటందుకు, ఆదివాసీ చేత పూజ చేయించాలనుకున్నరు. అందుకనే ఎట్లయినా కోసాల్‌ను ఒప్పించాల్నని కన్నాల్ పట్టుదలగ వున్నడు.

"ఏం బావా నీ చేత ఉత్త పుణ్యానికి పూజ చేయించుకుంటరను కుంటున్నవా? ఇగో వెయ్యి రూపాయలు." కోసాల్ చేయిని తన చేతుల్లకు తీసుకొని దాంట్ల వెయ్యి రూపాయలు పెట్టిండు కన్నాల్.

"ఛత్, ఎవరికి గావాలె నీ వెయ్యి రూపాయలు" విసిరి కొట్టిండు కోసాల్.

"వెయ్యి రూపాయలే ఇచ్చిన్నని కోపమా, ఏంది? ముందుగాల నువ్వు రా బావా. తర్వాత ఎన్ని పైసలు గావాల్నో అడుగు."

"అరేయ్, ఈన్నుంచి పోతవా పోవా? ఏమనుకుంటున్నవురా నన్ను? నా బూముల్ని, నా వూరిని మింగే కంపినీకి నేను బూమి పూజ జేత్తననుకుంటున్నవా? పైసలకాశపడి కన్న తల్లిని అమ్ముకుంటననుకుంటున్నవా? గంత సోయి తప్పి వున్ననను కుంటున్నవా? నువ్వు జెప్పే తియ్య తియ్యటి మాటలిని, నాకు మళ్లా వడ్డెగ మంచిరోజులొస్తయని అనుకున్న. కని నా బూమే పోయినంక, నా వూరే పోయినంక ఇంక నేను వడ్డెగ చేసేటిదేం వుంది. దొంగా పో! మల్లెప్పుడన్న మావూరి పొలిమర్ల అడుగుబెట్టినవంటే సూడు..." మంచంలకెళ్లి లేసి సర సరా ఇంటి తొవ్వబట్టిండు కోసాల్.

ఇంటికొచ్చి పందిట్లకు పోయి మంచంల కూలబడ్డడు. చలి కాలం చీకట్లు ముసురుకుంటున్నయి. రోజులెక్కనే ఆయన మంచం దగ్గర నెగడు రాజుకుంటున్నది. గుడ్డు ఊదుకుంట దాన్ని మరింత రాజేస్తుండు. చిన్న పిల్లగాడు నెగడు పక్కన్నే కూసోని కుక్కపిల్లతో ఆడుకుంటుండు.

కాని ఆలోచనలు సుళ్లు తిరుగుతున్న కోసాల్ మనసుకు ఇవేవీ ఎక్కుతలేవు.

ఇంతలో సన్నీ, చైతె బయటి నుంచి దడి దాటి వాకిట్లకడుగు పెట్టిన్రు.

"అమ్మొచ్చింది" బిగ్గరగా అనుకుంట పిల్లలిద్దరూ పందిట్లకెళ్లి వాకిట్లకురికిండ్రు. పిల్లల లొల్లి విని రామాల్ ఇంట్ల నుంచి బయటకొచ్చిండు. అప్పటిదానుక కోడలు, మనవరాలు ఇంట్ల లేరన్న సంగతిని కోసాల్ పట్టిచ్చుకోనేలేదు.

వాకిట్ల నుంచి సన్నీ ఇంట్లకు పోతే, చైతె పందిట్ల కొచ్చింది. తల్లితోని చిన్న కొడుకు పోతే, "ఏంటియక్కా నీ చేతులయి" అనుకుంట అక్కతోని గుడ్డ పందిట్లకొచ్చిండు.

"ఉండురా చూపిస్త గని నా చేయి పట్టి గుంజకు" అనుకుంట తన చేతులున్న వాటిని మంచంల పెట్టింది చైతె.

"ఇగో ఇది జెండా. దీన్ని రేపు ర్యాలీల అమ్మ పట్టుకుంటది. దీన్ని బ్యానర్ అంటరు. దీన్ని నాయిన పట్టుకుంటడు. వీటిని ప్లకార్డ్స్ అంటరు. ఇదేమో నువ్వు పట్టుకోవాలె. ఇదేమో నేను పట్టుకుంట. మనిద్దరం పట్టుకుంటే తమ్ముడు ఏడుస్తడు కదా. అందుకని ఇగో చిన్నది వాని కోసం నేనే తయారు జేసిన..." ఒక్కొక్కటి తమ్ముడికి చూపించుకుంట చెప్తున్నది చైతె.

"మరి బుజ్జీ రేలీల నేనేం పట్టుకోవాలె?" కోసాల్ ఎంత మెల్లగా అడిగినా ఇంట్లో వున్న కొడుకూ, కోడలు చెవిల పడనే పడ్డది. దీపం వెలుగుల ఇద్దరి చూపులు ఆశ్చర్యంతోటి కలుసుకున్నయి.

తాత మాటలకు చైతె నోరు తెరుచుకునే వుండిపోయింది కాసేపు. తర్వాత వెలిగిపోతున్న మొకంతోటి "నువ్వు కూడా వస్తవా తాతా ర్యాలీకి? నువ్వెప్పుడు రావు కదా" అంది.

"మరి నువ్వే జెప్పినవ్ కదరా, కంపినీ పెట్టొద్దని జెప్పి ముసలోల్లు, వయసోల్లు, పిల్లగాళ్లుఅందరూ కొట్లాడాల్నని" ముసి ముసిగ నవ్వుకుంట అన్నడు కోసాల్.

సన్నీ, రామాల్‌ల పెదవులపై చిరునవ్వు విచ్చుకుంది.

రాజుకొని రాజుకొని మండుతున్న నెగడు వెలుగులు ప్రతిఫలిస్తున్న చూపులతో తాతనే చూస్తున్నది చైతె.

(ఉత్తర బస్తర్-కాంకేర్ జిల్లా, చార్‌గావ్ ఏరియాలో నెకో కంపెనీ గనులు ప్రారంభించడానికి భూమి పూజ చేయడానికి ఆ వూరి గాయితను - భూమి పూజ చేసే పెద్ద మనిషిని - పిలిస్తే, "ఈ భూమే లేకపోతే నా పూజారితనం ఎక్కడిది? వాడు కొట్టినా, జైల్లో పెట్టినా నేను పూజ చేయను" అని అతను ఎదిరించిన తీరు గురించి విని...) ☆

మీ రచనలను అరుణతారకు ఈ-మెయిల్ కూడా చేయవచ్చు!

పేజ్‌మేకర్ ఓపెన్ ఫైల్, పి.డి.ఎఫ్. పద్ధతులలో (అను 6.0లో అయితే మేలు),

మైక్రోసాఫ్ట్ వర్డ్, ఎం.ఎస్. భాషాలో కూడా అరుణతారకు మెయిల్ చేయగలరు

ఈ-మెయిల్ : arunatara1977@gmail.com

http://www.facebook.com/arunatara.viplava rachyitala sangham; www.virasam.in

కథ

లైవ్ విత్ లైవ్

- బమ్మిడి జగదీశ్వరరావు

గూబ గుయ్‌మనిపించేలా వచ్చిందో శబ్దం!ఆకాశంలోంచి బంతిలా దొర్లుకుంటూ వచ్చి ఆగింది భూమి!గ్రాఫిక్స్ గదాఘాతంతో తెరలు చిరిగిపోయినాక చిర్నవ్వు నవ్వింది యాంకర్.

యాంకర్ : నమస్తే!

వెల్‌కమ్ టు 'జంబల్ హార్ట్'!

మీరు చూస్తున్నారు 24×7 లైవ్ ఛానెల్.

లైఫ్ ఈజ్ లైవ్!

హార్ట్ ఫుల్‌గా 'జంబల్ హార్ట్' కు స్వాగతం పలుకుతున్నాను.

ప్రతి మనిషికీ ఓ హార్ట్ ఉంటుంది. ఆ హార్ట్ బ్రేకయితే - హార్ట్ ఎటాక్ రావడం కన్నా ప్రమాదం.

అందుకే ప్రతి హార్ట్‌బీట్‌ని కౌంట్ చేస్తూ - కౌంట్ డౌన్ - త్రీ-టూ-వన్

పిల్లల దొంగ బాబూరావుతో మెగాలైవ్.

పూల చొక్కా ఎంచక్కా వేసుకున్న పూలరంగడిలా ఫోజిస్తూ నవ్వుతూ నమస్కారం చేసాడు బాబూరావు.

యాంకర్ : నమస్తే! పిల్లల దొంగ బాబూరావు గారూ...

పి.దొంగ : నమస్తే!

యాంకర్ : మీరు 'పిల్లల దొంగ బాబూరావు' గా ఫేమస్ కదా?! మరి 'పిల్లల దొంగ' మీ ఇంటి పేరా?

పి.దొంగ : కాదండీ....నా వృత్తి పేరే నా యింటి పేరయింది.ఇదంతా నా పూర్వ జన్మ సుకృతం...

యాంకర్ : అవున్లెండి...ఎంతో కృషి చేస్తే గానీ ఆ కృషి చేసిన రంగం పేరే యింటి పేరు కావడం అరుదు.

పి.దొంగ : థాంక్యూ...థాంక్యూ.

యాంకర్ : మీరు 'దొంగ' ని ఎలా నిర్వచిస్తారు? ఐ...మీన్ డిఫైన్ చేస్తారు?

పి.దొంగ : (నవ్వి) మనమందరమూ దొంగలమే! ఒకరు మరొకరి మనసును దొంగలిస్తారు. వాళ్ళని ప్రేమికులంటారు. ఇంకొకరు ఇంకొకరి ఆలోచనల్ని...థాట్స్‌ని దొంగలిస్తారు. వాటినే ఇంటలెక్చువల్ ప్రాపర్టీస్ అంటారు. ఎడ్యుకేషన్నుంచి...మైనింగ్ దాక దొంగలించడానికి లేనిదేదో చెప్పండి. సో ఆల్ ఆర్ థీవ్స్. దొంగ కాని వాడు మనిషి కాదు, కాలేదు...

యాంకర్ :. ఓఁ....యాఁ...అవును చిన్నప్పుడు తోటలో జాంకాయలూ...అక్కయ్య కాంపస్సు బాక్సులో చాక్లెట్లూ....

పి.దొంగ : ఇప్పుడు అభిమాన యాంకర్‌గా చాలా మంది హృదయాలిన దొంగలించేసారు...అవునా?

యాంకర్ : థాంక్యూ....ఎడ్యుకేషన్ని ఎలా దొంగలిస్తారు?

పి.దొంగ : ఎడ్యుకేషన్ అనేది మన ఫండమెంటల్ రైట్. రైట్? కార్పొరేట్ వాళ్ళు డబ్బులు కట్టి చదువును కొనుక్కోమంటారు. మన హక్కునే వాళ్ళు దొంగలించేసారు. దొంగతనానికి గురికానిది ఈ భూమ్మీద ఏదీ లేదు.మహాకవి శ్రీశ్రీ గారికి నచ్చిన కార్టూన్ ఏదో తెలుసా? ఓ పసిపిల్లాడు పక్కింటావిడ పాలు దొంగతనంగా తాగేస్తూ ఉంటాడు.

యాంకర్ : థాంక్యూ...మీ ఫిలాసఫీ బాగుంది, కానీ మీరు పిల్లల్ని మాత్రమే ఎందుకు దొంగలించారు?

పి.దొంగ : నాకు పిల్లలన్నా..పువ్వులన్నా మహా ఇష్టం. ప్రాణం!

యాంకర్ : నాకూ పువ్వులంటే ఇష్టం.

పి.దొంగ : మీకు ఇష్టమైన పువ్వులు కొనుక్కుందామన్నా దొరకడం లేదు. ఏం చేస్తారు? ఏ తోట్లోనో దొడ్లోనో కళ్ళకు కనిపిస్తే మురిపిస్తే ఏం చేస్తారు?

యాంకర్ : (నవ్వుతూ) కోసుకుపోతా...

పి.దొంగ : కోసుకుపోతే ఊరుకుంటారా? ఊరుకోరు. ఏం చెయ్యాలి? దొంగతనంగా కోసుకుపోవాలి. నేను చేసేదీ అదే. ఉన్న వాళ్ళ దగ్గర దొంగతనం చేసి ఎత్తుకుపోయి, లేనివాళ్ళకిస్తుంటా...

యాంకర్ : 'రాబిన్ హుడ్' అన్నమాట.

పి.దొంగ : ఉన్నమాటే, కాకపోతే ట్రాన్సుపోర్టు ఖర్చులుంటాయి కదండీ....

యాంకర్ : పిల్లలకూ పువ్వులకూ ఒక పోలిక చెప్పండి....?

పి.దొంగ : పూలకు ముళ్ళూ - పిల్లలకు పళ్ళూ....(నవ్వి) తమని తాము రక్షించుకోవడానికే!

యాంకర్ : బాగా ఎక్సుపీరియన్సు అయినట్టున్నారే, మా ప్రేక్షకుల కోసం ఒక ఎక్సుపీరియన్సు...ప్లీజ్...

పి.దొంగ : చాలా ఉన్నాయి. పిల్లలు కుక్కపిల్లలు కరిచినట్టు కరిచేస్తారు....

యాంకర్ : పాయిజన్ కాదా? బొడ్డు చుట్టూ ఇంజక్షన్లు....?

పి.దొంగ : మనిషి కుక్క కంటే విషమంటారు. కాని కరిచింది మనిషే, కరిపించుకున్నదీ మనిషే. సో 'ఉష్ణం ఉష్ణేన శీతలహా' అన్నట్టు విషం విషంతో కలిసి విరిగిపోతుంది.

యాంకర్ : మీరు ఏది మాట్లాడుతున్నా అందులో ఫిలాసఫీ ఉంటోంది. సరే, పిల్లల్నే ఎందుకు టార్గెట్ చేస్తున్నారు? పెద్దవాళ్ళు, ముసలివాళ్ళు ఎంతోమంది ఉండగ....

పి.దొంగ : ఎందుకు దండగ? ముసలివాళ్ళను తీసుకెళ్తే...మా ఇంట్లో ఉన్నారు తీసుకెళ్ళండి అని డిమాండ్ వస్తుంది. అప్పుడు నేను నా వృత్తికి ద్రోహం చేసి ఓల్డేజ్ హోం నడుపుకోవాలి!

యాంకర్ : పోనీ వయసులో ఉన్నవాళ్ళు!

పి.దొంగ : చూడండీ...వయసులో ఉన్నవాళ్ళకు వలవేయడం కష్టం. నేను ఓ అమ్మాయికి వల వేసి దానికి ప్రేమని పేరు పెట్టి మరీ వర్కవుట్ చెయ్యడానికి నాలుగేళ్ళు పట్టింది.

యాంకర్ : అందుకని?

పి.దొంగ : పిల్లల్ని అయితే నమ్మించవచ్చు. వాళ్ళు మనకి

కోపరేట్ చేసి మనతో పాటు పరిగెడతారు, దాక్కుంటారు. దొంగా పోలీసు ఆటలన్నీ ఆడుతారు. పెద్దవాళ్ళు, ముసలివాళ్ళు అసలు కోపరేట్ చేయరు. వాళ్ళని మోస్తూ పారిపోవడం సాధ్యం కాదు.

యాంకర్ : డబ్బూ...బంగారం లాంటివి దొంగతనం చెయ్యొచ్చు కదా?

పి.దొంగ : సారీ. చెయ్యను, చెయ్యలేను.

యాంకర్ : ఎందుకని?

పి.దొంగ : జీవం లేని – చలనం లేని – కదలిక లేని సంపదను దొంగలించే పని ఏ ఎదవైనా చేస్తాడు. అందులో పెప్పు లేదు, మజా లేదు, థ్రిల్లు అసలే లేదు.

యాంకర్ : వేరే వాటిల్లో 'కిక్' లేదంటారు?

పి.దొంగ : హండ్రెడ్ పర్సెంట్...

యాంకర్ : ఇవికాక వేరే కారణాలేమయినా ఉన్నాయా పిల్లల్ని 'కిడ్నాప్' చేయడంలో?

పి.దొంగ : బేసిక్‌గా నాకు రక్తపాతాలు నచ్చవు. గన్నూ, వేటకత్తులూ వాడను. జబ్బపీకు. మోత దండగ. గ్యాంగులూ కొట్టుకు చావడాలూ ఈ జెంజాటాలు మన వల్ల కాదు.మనదంతా శాంతి మార్గం!

యాంకర్ : అయితే పిల్లల్ని దొంగలించడంలో రిస్క్ లేదా?

పి.దొంగ : ఎందుకు లేదు?! రిస్క్ ఉంది. ఉండాలి. రిస్క్ ఉంటేనే గ్రోత్.

యాంకర్ : అవునా?

పి.దొంగ : ఔను...మీ సేలరీ ఎంత? వద్దులెండి, ఆడవాళ్ళ వయసే కాదు, సేలరీ కూడా అడక్కూడదు. నెలనెలా మీకు సేలరీ వస్తుంది. కూల్. రిస్క్ లేదు. బట్ గ్రోతేదీ? ఏడాదికో రెండేళ్ళకో ఇంక్రిమెంట్స్. అదీ ఛానెల్ లాభాల్లో ఉంటే....రిస్క్ అలా కాదు....

యాంకర్ : సరే, మీరు 'కిడ్నాప్' ని ఎలా సమర్థిస్తారు?

పి.దొంగ : ఈ కిడ్నాప్ అనేది ఈ నాటిది కాదు, సీతని రావణుడు కిడ్నాప్ చేసాడు. రాముడి రాజ్యాన్ని స్వయానా తండ్రి దశరథుడితోనే కైకేయి కిడ్నాప్ చేయించింది. అంతెందుకు? మహాభారతంలో పాండవుల పన్నెండేళ్ళ అరణ్యవాసం, ఒక ఏడాది అజ్ఞాతవాసం...అంతా స్వచ్ఛంద కిడ్నాపే...

యాంకర్ : పిల్లల్ని కిడ్నాప్ చేసేటప్పుడు మీరు తీసుకొనే జాగ్రత్తలేమిటి?

పి.దొంగ : బోసి నవ్వుల పాపలు...పాలపళ్ళు ఊడిన వాళ్ళు బెటర్....

యాంకర్ : కరవకుండా ఉంటారనా?

పి.దొంగ : ఎగ్జాట్లీ.

యాంకర్ : ఇంకా?

పి.దొంగ : పిల్లలతో ఎస్కేపవుతున్నప్పుడు ఎవరితోనూ అనవసరంగా మాట్లాడకూడదు. మాట్లాడిస్తే కూడా తెలుగులో అడిగితే ఉర్దూలో – హిందీలో అడిగితే తెలుగులో ఆన్సర్ ఇవ్వాలి. కాన్వర్సేషన్ ఎంత తగ్గిస్తే అంత సేఫ్. స్టేఫ్‌కు అదే చెప్తుంటాను.

యాంకర్ : స్టేఫ్ అంటే?

పి.దొంగ : మనమూ కొంతమందిని రిక్రూట్ చేసుకొని వారికి ఉపాధి ఉద్యోగావకాశాలను కల్పిస్తున్నాము.

యాంకర్ : సెల్ఫ్ ఎంప్లాయిమెంటుగా కూడా భావించవచ్చా?

పి.దొంగ : వైనాట్? రోజు రోజుకీ గవర్నమెంటు దానికదే సర్వైవల్ కాలేక...బతకలేకపోతోంది. సో బర్డెన్ కాకూడదుగా....

యంకర్ : గుడ్...మీ రిక్రూట్‌మెంట్ ఎలా ఉంటుంది...క్వాలిఫికేషన్లు ఏమిటి?

పి.దొంగ : చదవడం, రాయడం రాకపోయినా కనీసం మూడు నాలుగు భాషలు మాట్లాడగలిగి ఉండాలి. చురుగ్గా ఉండాలి. పీలగా బలంగా ఉండడం కాదు, తంతే కాసే శక్తి ఉండాలి.

యాంకర్ : లేడీస్ కోటా లేదా? సేలరీస్ ఎలా ఉంటాయి?

పి.దొంగ : రిజర్వేషన్స్ విషయంలో పార్లమెంటు పనికిరాదనుకోండి. మేం థర్టీత్రీ పర్సెంటు కాదు, ఫిఫ్టీ పర్సెంటుకు పైగా రిక్రూట్ చేస్తున్నాం. అమ్మగా, భార్యగా, చెల్లిగా అనుమానం రాకుండా ఫామిలీ మెంబర్లా డ్యూటీ చేస్తారు. సేలరీ కాదు, పర్సంటేజ్ లెక్క

యాంకర్ : మీ భవిష్యత్తు ప్రణాళికేమిటి?

పి.దొంగ : భవిష్యత్తు అంటే...ఫ్యూచర్ బ్రైట్‌గా ఉండాలని అందరం కోరుకుంటాం కదండీ...ఇంకో ముఖ్య విషయం అరవై నాలుగు కళల్లో చోరకళ కూడా ఉందని మర్చిపోకండి... దెవలప్పుడు కంట్రీసులో మన వృత్తికి సంబంధించిన ఇనిస్టిస్ట్యూట్‌లు ఉన్నాయని విన్నాను. మన దేశం ఎప్పుడు ఆ స్థాయిని అందుకుంటుందో...?!

యాంకర్ : మీకు అలాంటి చోర శిక్షణా సంస్థనొకటి నెలకొల్పాలని ఉందా?

పి.దొంగ : అది కాదండీ...భక్తికో ఛానెల్, హెల్త్‌కో ఛానెల్, వంటలకో ఛానెల్, టూర్స్‌కూ ట్రావెలింగుకో ఛానెల్, న్యూ మార్కెట్ ఎరైవల్స్‌కో ఛానెల్... ఇలా ఎన్నో ఛానెల్స్ ఉన్నట్టే.. పిల్లల దొంగతనాల మీద 'కిడ్నాప్' అని ఓ ఛానెల్ పెట్టాలని ఉందండీ...అందులో పేరెంట్స్‌కు కేర్ అండ్ కౌన్సిలింగ్ కూడా ఉంటుంది.ప్రజా ప్రయోజనంగా కూడా ఉంటుంది.

యాంకర్ : మీ కోరిక నెరవేరాలని మా ఛానెల్ తరఫున, చూస్తున్న మా వీక్షక ప్రేక్షకుల తరఫున కోరుకుంటున్నా – చివరిగా మీరేం కోరుకుంటున్నారు?

పి.దొంగ : దొంగల్ని చిన్న చూపు చూసి ఆత్మ న్యూనతకు గురి చేయకండి. ఆ మాటకొస్తే దేశాధినేతలు... రాజకీయ నాయకులు... పారిశ్రామికవేత్తలు... ఎందరెందరో దేశాన్ని లూటీ చేస్తున్నారు. విద్యావంతులు, మేధావులు, అధికారులు అంతా అందుకు సహకరిస్తూ ఉన్నారు. స్థాయీ భేదం తప్పితే దేశం నిండా దొంగలే. మేం మాత్రమే దొంగలం అంటే నాకు నవ్వొస్తుంది. చోరకళ అరవై నాలుగు కళల్లో ఒకటి. అవార్డులూ, రివార్డులూ దొంగల్ని పట్టుకున్న వాళ్ళకే కాదు, దొంగలకూ ఇవ్వాలి!

యాంకర్ : మరి మీరిచ్చే సందేశం?

పి.దొంగ : పనిలో దైవాన్ని చూడండి. పనియే దైవం! పిల్లలు దేవుళ్ళతో సమానమంటారు. ఆ పసివాళ్ళు మీకు సహకరిస్తారు. పిల్లల్ని వారి తలిదండ్రుల్లా, టీచర్లలా కొట్టకండి. సునం దొంగలం...హుందాగా ఉందాం!

యంకర్ : థాంక్సండీ...మీ అమూల్యమైన సమయాన్ని వెచ్చించి మాతో మా ప్రేక్షకులతో పంచుకున్నందుకు ధన్యవాదాలు. మరో అతిథితో మళ్ళీ ఇలాగే కలుసుకుందాం...

పి.దొంగ : నమస్కారం!

(మిత్రులు మురళీధర్ కేసరికి కృతజ్ఞతలతో)

చారిత్రక కథ

ప్రవాసం నుంచి

- ఎన్.వి.ఎస్. నాగభూషణ్

అది 1917వ సంవత్సరం, మార్చి నెల, చివరి వారం.......

సామ్రాజ్యవాద ప్రపంచయుద్ధం, అదే మొదటి ప్రపంచయుద్ధం తీవ్రంగా జరుగుతున్న రోజులు...

యూరప్ ఖండంలో ఒక ముఖ్య ప్రాంతం... అనునిత్యం దజన్ల కొద్దీ ఓడల రాకపోకలతో రద్దీగా ఉండే బాల్టిక్ సముద్రం... మందు పాతర్లతో నిండిపోయిన కల్లోలిత సముద్ర ప్రాంతం...

మంచు కురవడం ఆగిపోయి, మబ్బులు తొలిగిన ఆకాశం... సూర్యకిరణాలు సూటిగా పడటంతో తళతళలాడుతున్న సముద్ర జలాలు.

ఆహ్లాదకరమైన ఆ వాతావరణంలో ఒంటరిగా అయినా, ధీమాగా, మందగమనంతో వెడుతోంది ఒక సరుకుల నౌక... సాధారణంగా ఆ యుద్ధ కాలంలో ఒంటరిగా వెళ్ళడానికి ఏ నౌకలయినా భయపడుతూంటాయి... గుంపులు గుంపులుగా, రక్షక నౌకల పహారాతో మాత్రమే అవి ప్రయాణం చేస్తుంటాయి. ఆ ప్రాంతంలో పక్కపక్కనే పరస్పర శత్రుదేశాలుండటమే అందుకు కారణం. కానీ ఆ సరుకుల నౌక ఎలాంటి భయం లేకుండా అలా ఒంటరిగా వెళ్ళడానికి కారణం అది స్వీడన్ దేశానికి చెందింది కావడమే. అది యుద్ధమగ్న దేశమైన జర్మనీ నుంచే అయినప్పటికీ, వెడుతోంది స్వీడన్ రాజధాని 'స్టాక్‌హోం' రేవు పట్టణానికి. స్వీడన్‌తో పాటు, ఇతర స్కాండినేవియా దేశాలూ యుద్ధంలో ఏ పక్షం వహించకుండా తటస్థంగా ఉన్నాయి. అంచేత తమ నౌకకు ఎలాంటి ఆటంకాలూ ఎదురు కావన్న ధీమాయే ఆ నౌక ఎలాంటి తొట్రుపాటుకూ గురికాక, ధైర్యంగా వెడుతూండడానికి కారణం. కానీ మందుపాతరలు ఆ మార్గంలో అడుగడుగునా ఉండటం చేత నెమ్మదిగా వెడుతోంది.

అది సరుకుల రవాణా నౌకే అయినప్పటికీ, ప్రయాణీకుల్ని కూడా ఎక్కించుకుని వెడుతోంది. వాతావరణం ప్రశాంతంగా, ఆహ్లాదకరంగా, కొంచెం చలిగా, వెచ్చగా, అమిత సౌఖ్యవంతంగా ఉన్నప్పటికీ, యుద్ధకాలం కావడం వల్ల ఎలాంటి ఇక్కట్లు వస్తాయోనన్న భయంతో ప్రయాణీకులు భోజనాలు ముగించుకున్నప్పటికీ, నౌక లోపలే బిక్కుబిక్కు మంటూ కూర్చున్నారు. తమ నౌక తటస్థ దేశానికి చెందినా, మధ్యమధ్య ఏదో ఒక యుద్ధనౌక బెదిరింపులకు లోనుగావచ్చునన్న భయమే వారిని పీడిస్తోంది. అయితే అలాంటి భయాలకు అతీతంగా, పనిపాటలతో రాటుదేలినట్లు కనిపిస్తున్న ధృడకాయుల గుంపు ఒకటి సముద్ర ప్రకృతిని ఆస్వాదించడం కోసమన్నట్లు బిలబిలా నాలుగంతస్తుల మేడలా ఎత్తుగా ఉన్న నౌక డెక్కు మీదికి చేరింది.

డెక్కంతా బురద బురదగా ఉంది. పైన పేరుకుపోయిన మంచును నౌకా సిబ్బంది పొడుగాటి పిడి గల పారలతో చాలావరకు దోకి తీసేసినప్పటికీ, అక్కడక్కడా ఇంకా మిగిలిపోయిన మంచుముద్దలు కరిగిపోయి ఆ బురదను మరింత పలచన చేస్తున్నాయి.

గుంపులోని వారంతా చెప్పలేనంత ఆనందంతో, ఏవో ఊహాలోకాల్లో తేలిపోతున్నట్లు ఉద్విగ్నంగా ఉన్నారు. చాలా సంవత్సరాల తర్వాత తిరిగి తమ పితృదేశానికి వెడతూండటమే వారి ఆ ఉద్విగ్నతకు కారణం. ఆ ఆనందం వారి మాటల్లోనూ, కళ్ళల్లోనూ, వారి ప్రతి కదలికలోనూ వ్యక్తమవుతోంది. ఆ గుంపులోని వారి వేషభాషలన్నీ, ఒక్కరివి తప్ప, దాదాపు ఒకేలా ఉన్నాయి. ఓడపైదాకా ఒకే గుంపుగా ఉన్న వారంతా, పై కెక్కాక రెండుగా చీలిపోయింది. అరడజనుమంది ఉన్న గుంపు ఒక పక్కకు, మరో పక్కకు మిగిలిన గుంపు...గుంపుగానే అయినప్పటికీ, రెయిలింగ్ దగ్గరకెళ్ళి ఎవరికివారు తమ పక్కవారితో మాటల్లో మునిగిపోయారు. సముద్రపు అలల హోరులో కూడా వారి మాటలు తమ పక్క వ్యక్తికి కూడా వినీ వినిపించనట్లు లోగొంతుతో సాగుతున్నాయి.

యవ్వనంలో ఉన్న ఓ వ్యక్తి...నడికారులో ఉన్న తన పక్క వ్యక్తిని పలకరించాడు "కామ్రేడ్ రెమిజోవ్, నువ్వు జూరిచ్ వచ్చి ఎంత కాలమవుతోంది...నా కన్నా ముందే వచ్చావు కదూ?"

"నేను మొదటి విప్లవం మొదటి దశలోనే, అంటే 1905 లోనే వచ్చా... అంటే దాదాపు పదకొండేళ్ళు...సైబీరియా ప్రవాసం నుంచి తప్పించుకు వచ్చా... మరి నువ్వు.. నీది 'ఒదేస్స' ప్రాంతం కదూ?"

"అవునవును. నువ్వొచ్చిన రెండేళ్ళకు నేనొచ్చాను. అంటే మొదటి విప్లవం చివరి రోజుల్లో జైలు గోడలు బద్దలుగొట్టి, నల్ల నూర్ల దండు పై పగ దీర్చుకుని పారిపోయొచ్చా. అన్నట్టు నీకు భార్యాపిల్లలూ ఉండాలి కదూ... వారి నుంచి ఈ మధ్య సమాచారం ఏమన్నా తెలిసిందా? ఇద్దరు పిల్లల్ని యుద్ధం మింగేసిందన్నావ్...మరి మిగిలిన వారైనా బాగున్నారా?"

"ఏం బాగు...నా అల్లుణ్ణి కూడా అదే మింగింది. ఆకలికి తట్టుకోలేక ఇద్దరు మనవలు పోయారు...ఇంకా ఇద్దరు చిన్న పిల్లలతో తల్లీకూతుళ్ళు మిగిలున్నారు. మరి నీ సంగతి...నీ తల్లితండ్రీ, చెల్లీ?"

"వాళ్ళంతా ఏమైపోయారో తెలీదు. వెళ్ళాక వెతకాలి... బతికున్నారో... చనిపోయారో.."

"అలా అనకు... అంతా మంచిగా ఉండాలని కోరుకుందాం..."

"మన చేతుల్లో ఏముంది... ఆ నల్లనూర్ల దండు వారి జోలికి రాకుండా ఉండాలి కదా..."

గుంపులోని జనమంతా తమ విషాద కథల్ని, తాము తమ దేశం నుంచి పారిపోయొచ్చిన నాటి సంగతుల్ని తలచుకుంటూ, పక్క వారితో పంచుకుంటూ మాటల్లో పడిపోయారు. తామంతా స్వదేశం వెళ్ళే ఉత్సాహంతో ఉన్నా, అక్కడి పరిస్థితి పూలపానుపులా

ఏమీ లేదు. ఇంత ప్రయత్నమూ చేసి, తెగించి తమ దేశం వెళ్ళినా, అక్కడ తమకు స్వాగతం ఇచ్చే వారెవరూ లేరు. పైగా ముళ్ళే గుచ్చుకుంటాయో, బండరాళ్ళే అడ్డొస్తాయో తెలీదు. కానీ ఒక పెద్ద ఉపశమనం... గుండెల పైనుంచి ఒక పెద్ద బండరాయి తొలగిన సాంత్వన మాత్రం అందరికీ లభించింది. కానీ కష్టం ఒకరిదైతే, మరొకరు సుఖాన్ననుభవిస్తున్నారు. తిరిగి దాన్ని తాము అందుకోవాలి. అయితే అందుకు తాము ఏం చెయ్యాలి? ఏదారిన ప్రయాణించాలి? అందరి మెదళ్ళనూ తొలుస్తున్న ప్రశ్న అదే.

తమ పార్టీది ఒక విచిత్రమైన పరిస్థితి. దీన్ని అధిగమించడానికి తగిన సిద్ధాంత ప్రాతిపదికను ఇంతవరకూ ఏ మేధావీ తయారు చెయ్యలేదు. అయినా తమకు ఎలాంటి తటపటాయింపులూ లేవు. ఎందుకంటే దారే లేని గహనభూమిలో సైతం రాచబాటను నిర్మించగల మేధావి తమకున్నాడు. అతడు తమ గురువు, తమ మార్గదర్శి కాదు కాదు... ప్రపంచంలోని సమస్త శ్రామిక జన శ్రేయోభిలాషి! నిశ్చింతగా అతణ్ణి అనుసరించడమే తాము చెయ్యాల్సినపని. అయితే కుతూహలం అనేది మానవ నైజం. అడగడమే ఆలశ్యం, ఆయన దగ్గర జవాబులు సిద్ధంగా ఉంటాయి. అసలు ఇతరులకు ఎలాంటి సందేహాలు వస్తాయో, వచ్చేందుకుఅవకాశం ఉందో, వాటిని ముందుగానే ఊహించి, సమాధానాలు సిద్ధంగా ఉంచుకుంటాడా అన్నట్లుంటాడాయన. అడగకపోవడం తమ లోపమే. ఈ లోచనలతో, ఎవరికి వారు, అంతా కూడబలుక్కున్నట్లు, అసంకల్పితంగా, తమ తమ వ్యక్తిగత సంభాషణల్ని విరమించుకుని, ఒక్కొక్కరుగా, ఒక పక్కగా ఉన్న ఆయన్ని సమీపించారు.

అంతమంది వ్యక్తులచేత అంత ఉన్నతంగా భావించబడే ఆ వ్యక్తి నిజానికి అంత ప్రత్యేకంగా ఏం లేదు. అతి సామాన్యంగా, పొట్టిగా, లావుగా, కుదిమట్టసంగా, ఒక పల్లెటూరి రైతులా ఉన్నాడు. కాకుంటే కొంచెం పెద్ద తల, తక్కువ వయసులోనే సగం మేర ఊడిపోయిన బట్టతల. కానీ కొంచెం పరిశీలనగా తిరిగి అతన్ని చూశారా, ఏదో తెలీని విశేషం అతనిలో ఉన్నట్లనిపిస్తుంది. ఆ కళ్ళలోకి లోతుగా చూశారా, జాగ్రత్త! మీ ఆత్మల్ని చదివెయ్యగలదు. అతని విశాలమైన ఫాలభాగాన్ని చూసే కావచ్చు, ప్రసిద్ధ ఫ్రెంచి శిల్పి ఒకడు, అతడెవరో తెలీకుండానే వెంటబడి, అతడి నుదుటిలో తాను దర్శించిన ఒక ప్రత్యేక ఆధ్యాత్మిక సౌందర్యం వల్ల, అతని శిరస్సును మలిచేందుకు ఆరాటపడ్డాడు! పురాతన కాలపు మహనీయ చింతకుడు సోక్రటీస్ విగ్రహాల్లో కనిపించే ఫాలభాగానికీ, ఈ వ్యక్తి ఫాలభాగానికీ ఒక గొప్ప పోలికను అతడు పసిగట్టడం వల్లనే ఇతణ్ణి ఆ శిల్పి అక్షరాలా వెంటాడాడు.

ఇంతకీ ఇప్పుడా పొట్టి వ్యక్తి చేస్తున్న పని దూరంగా మబ్బుల చాటునుంచి మధ్య మధ్య తొంగి చూస్తున్న సూర్యుణ్ణి అదేపనిగా గమనించడం! అలల ధాటికి ఉయ్యాలలా ఊగుతున్న నౌక కదలికలకు పడిపోకుండా ఉండేందుకు గాను రెయిలింగ్‌ను గట్టిగా పట్టుకుని అతడలా చూస్తున్నాడన్న మాటేగానీ, అతని ఆలోచనలు ఎక్కడో ఉన్నాయి. వంద ముడులు పడ్డ ఒక పీటముడిని విప్పేందుకు అతడు శతథా ప్రయత్నిస్తున్న సంగతి తెలియని ఆ బృందం, కాలం విలువ ఈ ప్రపంచంలో ఏ ఒక్కరి కన్నా తనకే ఎక్కువ తెలిసినట్లు ఒక్క నిమిషం కూడా ఆయన అనవసరంగా వృథా చెయ్యడని తెలిసినప్పటికీ, ఈ సంక్లిష్ట ప్రయాణ కాలంలోనూ ఎప్పటిలానే పాటిస్తాడా అన్నట్లు, ఆయన దగ్గరకు చేరి, తమ రాక సూచనల్ని వేరు వేరు విధాలుగా ఆయనకు తెలియజేసారు.

వంద ముడుల్లో తొంభై తొమ్మిదిని విప్పి, ఇక ఆఖరి దాని వద్దకు వచ్చి ఆగినట్టు ఆ వ్యక్తి తేటపడ్డ ముఖంతో చిరునవ్వు నవ్వి, వారి వంక పలకరింపుగా చూసి నవ్వి "చెప్పండి కామ్రేడ్...ఏమిటి మీ సందేహం?" అన్నాడు.

ఆయన అలా తమ కళ్ళల్లోకి సూటిగా చూడగానే ఎవరికి వారు తాము అడగాలనుకున్నదాన్ని మర్చిపోయినట్లు కొట్టారు. చివరికి బవిరి గడ్డం పెంచుకున్న వస్కోవ్ ధైర్యం చేసి "కామ్రేడ్, ఈనగాచి నక్కలపాలయినట్లుంది మన రష్యా పరిస్థితీ, పార్టీ పరిస్థితీ. కష్టం పార్టీది, ఫలితం బూర్జువాలదీ అయ్యింది. ప్రజలు కూడా వారినే నమ్ముతున్నట్లు వార్తలొస్తున్నాయి. మరి ఇప్పుడు మనం చెప్పేదాన్ని జనం వినిపించుకుంటారా అని సందేహంగా ఉంది." అన్నాడు.

పొట్టి వ్యక్తి క్షణం ఊరుకుని "కామ్రేడ్ వస్కోవ్, ఫిబ్రవరి 27న ఏం జరిగింది?" అడిగాడు.

"ఏం జరిగింది... జార్ దిగిపోయాడు. అందుకేగా మనం వెడుతోంది మన దేశానికి" అన్నాడు వస్కోవ్ తేలిగ్గా.

"బాగా చెప్పావ్, కానీ కొంచెం కాదు, చాలా పక్కకిపోయావ్" అన్నాడు పొట్టి వ్యక్తి వస్కోవ్ కేసి తేరిపార చూస్తూ.

"జార్ దిగిపోలేదు. దింపేశారు. రెంటికీ తేడా ఉంది కదూ, కామ్రేడ్ వస్కోవ్?" అని తిరిగి అనేసరికి, వస్కోవ్ తలూపాడు గబగబా తను చేసిన తప్పుకి పశ్చాత్తాపపడినట్టు. "అందుకే వెడుతున్నాం. ఆ దింపేసిన వారికి అలా దింపెయ్యాలన్న భావజాలాన్ని అందించిందీ, వారికి నాయకత్వం వహించిందీ కూడా మన పార్టీయే. అయితే ఆ సమయంలో రంగంలో లేని మన దాయాదులైన మెన్షివిక్కులూ, సోషలిస్టు రివల్యూషనరీలూ సోవియట్లలో అధికారం చేజిక్కించుకుని, ప్రభుత్వాన్ని బూర్జువాల కప్పజెప్పారు. ఇప్పుడు మన పార్టీ తగిన చొరవ తీసుకుని ఆ రాజీ బేరగాళ్ళ అసలు ఉద్దేశాల్ని బయటపెట్టాలి. అలాగే ప్రజలు ఈ బూర్జువా ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కొద్దికాలం ఓపికపడితే తమ సమస్యలన్నింటినీ అది తీర్చేస్తుందనుకుంటున్నారు. కానీ స్వార్థపరులైన బూర్జువాలకు వాటిని తీర్చే ఉద్దేశం లేదని తెలీదు. మనం ఓపికతో పని చేసి ఇదంతా బయటపెట్టాలి. అప్పుడే ప్రజలు మన మాట వింటారు. సోవియట్లలో మెజారిటీ మనకొస్తుంది. తద్వారానే మన లక్ష్యమైన సోషలిజాన్ని సాధించగలం" ఆ పొట్టి వ్యక్తి తిరిగి అందుకుని అందరికీ వినిపించేట్లు కొంచెం గొంతు వెచ్చించి చెప్పాడు.

వారి సంభాషణంతా రష్యన్లో సాగుతోంది. ఆ సంభాషణను వారికి కొంచెం ఎడంగా నిలబడి వింటున్నాడో వ్యక్తి. ఆ వ్యక్తి రూపురేఖలు, వేషం రష్యన్ల కన్నా భిన్నంగా ఉన్నాయి. పొట్టి వ్యక్తి ఉపన్యాసంలాంటి మాటల్ని విన్న ఆ వ్యక్తి, గబగబా గుంపులోకి ప్రవేశించి, ఆ పొట్టి వ్యక్తిని సమీపించి, వచ్చీరాని రష్యన్ భాషలో "కామ్రేడ్ పెత్రోవ్, మీ బృంద సంభాషణ మధ్యలో కల్పించుకున్నందుకు ఏమీ అనుకోరుగా...?"అంటూ ఆగిపోయాడు, తన మాటలు తన భావాన్ని పూర్తిగా వ్యక్తం చేశాయో లేదో నన్న

అనుమానంతో:

"అలా సంకోచించాల్సిన అవసరం లేదు కామ్రేడ్ ప్లాట్టెన్" ఆ పొట్టి వ్యక్తి బదులిచ్చాడు. "అందునా మీరు మా ముఖ్య స్నేహితులు. ఇక్కడున్న మా రష్యన్ బృందానికంతటికీ మీరెంతో మహోపకారం చేశారు! విదేశాల్లో ఉన్న మా ప్రవాసులకు స్వదేశానికి వెళ్ళే అవకాశాన్ని కల్పించారు! స్నేహితుల సందేహాల్ని సంతోషంగా తీరుస్తాం. అదీగాక, మీరు మీ స్వంత జర్మన్‌లోనే అడగొచ్చు, ఆ భాష మాకందరికీ అర్థమవుతుందని మీకు తెలుసుగా" అన్నాడు ఆ పొట్టి వ్యక్తి.

"తెలుసు,తెలుసు.." సిగ్గు పడుతూ అన్నాడు ప్లాట్టెన్ "మీ భాషలో మాట్లాడాలన్న చాపల్యం...అంతే" అంటూ ఆపై జర్మన్ భాషలో తన సందేహాన్ని వ్యక్తం చేశాడు. అతని సందేహం ఏమంటే ఫిబ్రవరి విప్లవంలో జార్‌ని దింపేశారు కదా, ఆ ఉద్యమంలో బోల్షివిక్కులు ముందున్నారు. అయితే అధికారం బోల్షవిక్కుల కెందుకు దక్కలేదు? బూర్జువాలకెలా అధికారం దక్కింది? అదీగాక సోవియట్లలో రాజీవాదులయిన మెన్షివిక్కులకు, సోషలిస్టు రివల్యూషనరీలకూ ఎలా దక్కింది? ఇవీ అతని సందేహాలు.

"మంచి ప్రశ్నలు వేశారు కామ్రేడ్ ప్లాట్టెన్"అన్నాడు పెత్రోవ్‌గా పిలవబడుతున్న ఆ పొట్టి వ్యక్తి. "మీరు కేవలం స్విస్ పార్టీ కార్యదర్శి మాత్రమే గాకుండా, సామ్రాజ్యవాద యుద్ధాన్ని వ్యతిరేకించే స్థావరం కూడా తీసుకున్నందున, మా బోల్షవిక్కులకు స్నేహితులు. అందువల్ల, మా రష్యన్ విప్లవపు లోతుపాతులు మీకు వివరించడం మా ధర్మం"అంటూ అతడు ఒకసారి చుట్టూరా పరికించి చూశాడు.

ఇంతలో అకస్మాత్తుగా గాలి వేగం పెరగడంతో అలల ఉధృతి అధికమయింది. అవి ఉవ్వెత్తున ఎగిసిపడుతూండటంతో వాన పడకపోయినా, నీటి తుంపరలు వానలా డెక్కు మీదికి చిందుతున్నాయి. దాంతో నావికులు డెక్కు మీది వారిని లోపలికి పదమని తొందరపెట్టారు. అయినా అక్కడి జనం ఇదంతా మా కలవాటే నన్నట్లు. అక్కడే నిలబడేసరికి, ఓడ సిబ్బంది గొణుక్కుంటూ, తెరచాపలు సరిచేసుకోవడంలో నిమగ్నమయ్యారు.

ఈ హడావిడి కాస్త తగ్గాక, పెత్రోవ్ చెప్పడం మొదలెట్టాడు "ఈ ప్రశ్నే నన్ను చాలా మంది అడిగారు కామ్రేడ్ ప్లాట్టెన్. వారికి చెప్పిన జవాబే మీకూ చెబుతాను. మా బోల్షివిక్కుల కార్యమగ్నత మీకు తెలుసుకదా! మా వాళ్ళు ఉద్యమంలో మమేకమై వీధుల్లో ప్రజాపోరాటాలు నిర్వహిస్తూంటే, మీరు చెప్పిన ఆ రాజీబేరగాళ్ళు ఇదే సందు అనుకుంటూ సోవియట్లలో మెజారిటీ కోసం, పదవుల కోసం ప్రయత్నించారు. ఇల్లు కాలి ఒకరేడుస్తుంటే, చుట్ట కాల్చుకోవాలని ఒకరు చూసినట్లు వారు ఆరాటపడ్డారు. దీంతో 'దూమ' (పార్లమెంటు), సోవియట్లూ కలిసి ద్వంద్వాధికారం స్థాపించి దేశపాలన సాగిస్తున్నారు. గమనించాల్సిన ముఖ్య విషయం ఏమంటే జరుగుతున్న ఈ కుట్రను ఛేదించడానికి, ప్రజల్ని అప్రమత్తం చెయ్యడానికి మా పార్టీ ముఖ్యనేతలంతా ఆ సమయంలో జైళ్ళలోనో, సైబీరియా దూర ప్రవాసంలోనో ఉన్నారు. మా పార్టీ సంగతి తెలిసిన పాతతరం కార్మికులు కూడా ఎక్కువమంది యుద్ధరంగానికి తరలింపబడ్డారు. ఆ కార్మికుల స్థానం భర్తీ చేసేందుకూ, యుద్ధరంగానికి తరలింపకుండా తప్పించుకునేందుకూ, పలువురు వృత్తిపనివాళ్ళూ, రైతాంగ యువకులూ కార్మికులుగా మారారు. వీరంతా చిన్నపాటి ఆస్తిపరులు. అందువల్ల మధ్యతరగతి పెటీ బూర్జువా మనస్తత్వంతో మునిగిపోయారు. జార్‌ని దింపెయ్యడంతోటే వీరంతా చెయ్యాల్సింది అయిపోయిందని, కొద్దికాలంలోనే పరిస్థితులు చక్కబడతాయని అనుకున్నారు. రాజీ బేరగాళ్ళ ప్రభావానికి లోనైన వీరు అలా నమ్మారు. అయితే వీరికి బూర్జువాల అసలు ఉద్దేశం తెలీదు. బూర్జువాల్ని వ్యతిరేకించే ఉద్దేశం రాజీ బేరగాళ్ళకు లేదు. ఇలాంటి సమయంలోనైనా మా బోల్షివిక్కులు మాట్లాడకుండా ఊరుకుంటే, తమ ఆశలు వమ్మయినప్పటికీ శ్రామికవర్గం మా ఖర్మ ఇంతేనని నైరాశ్యంలో కూరుకుపోయి, నిస్తబ్ధతకు లోనవుతారు. అందువల్ల మేం పనిచెయ్యాల్సింది సరిగ్గా ఈ విషయంలోనే. బూర్జువాల, రాజీ బేరగాళ్ళ నిజుద్దేశాల్ని వివరించి, ప్రజల్ని పోరాటోన్ముఖుల్ని చెయ్యాలి. ఇప్పటి బూర్జువా ప్రజాస్వామ్యాన్ని సోషలిజం సాధన దిశగా నడిపించాలి.."

పెత్రోవ్ చెప్పిన అంశాల్ని ఒక్క ప్లాటెన్ మాత్రమే గాక, మిగతా అంతా విన్నారు.దూరంగా ఉన్న మరో బృందం కూడా వారిలో కలిసిపోయింది. రష్యాకు దూరంగా ఉన్నప్పటికీ, అక్కడి వాస్తవిక స్థితిని కళ్ళతో చూసినట్లు పెత్రోవ్ వర్ణించడం ఆ బృందాన్ని అబ్బురపరచింది. అయితే తనకు వచ్చిన జవాబుపట్ల ప్లాట్టెన్ మాత్రం సంతృప్తి చెందలేకపోయాడు. పార్లమెంటు, సోవియట్లతో ద్వంద్వాధికారం నెలకొల్పడమేమిటి? అసలు ఈ సోవియట్లంటే ఏమిటి? వీటి అధికార పరిధి ఏమిటి? వాటి నిర్మాణం ఏ ప్రాతిపదిక మీద? ఇలాంటి ప్రశ్నలు వేస్తే, పెత్రోవ్ సంగతేమోగానీ, మిగిలిన వాళ్ళు నవ్వుకుంటారేమోనని ప్లాట్టెన్ అనుమానించాడు. అయినా ఇప్పుడడగకపోతే, ఇలాంటి అవకాశం మళ్ళీ రాదేమోననుకున్నాడు. ఎందుకంటే పెత్రోవ్‌లాగా సూటిగా, సరళంగా వివరించే వారేరీ?

ప్లాట్టెన్ తటపటాయింపుల్ని చూసి, "ఇంకా ఏమిటి సందేహం...అడగండి" అని ప్రోత్సహించాడు పెత్రోవ్. వెంటనే ప్లాట్టెన్ తన ప్రశ్నల్ని బయటపెట్టేసరికి, పెత్రోవ్ గంభీరంగా తల పంకించాడు. అతనికి ప్లాట్టెన్ పరిస్థితి అర్థమయ్యింది.ఏమంటే అవన్నీ ప్రాథమిక ప్రశ్నలు. వాటి గురించి ఎన్నోసార్లు తన ఉపన్యాసాల్లోనూ, వ్యాసాల్లోనూ వివరించి ఉన్నాడు. ఎంత కుశాగ్రబుద్ధి అయినా, ప్రతి మనిషికీ కొన్ని బలహీనతలుంటాయి. ఎన్నిసార్లు విన్నా, చదివినా, ఒక్కో మనిషికి కొన్ని కొన్ని విషయాలు ఎంతకీ కొరుకుడు పడవు. అతనికి అర్థం అయ్యేట్లు వివరించాల్సిన బాధ్యత తనమీదుంది అనుకున్నాడు పెత్రోవ్.

"మీరు విసుగు అనుకోకపోతే, వివరించి చెబుతాను కామ్రేడ్ ప్లాట్టెన్" పెత్రోవ్ గొంతు సవరించుకుని మొదలెట్టాడు. "సోవియట్లంటే అదేదో బ్రహ్మపదార్థం కాదు కామ్రేడ్ ప్లాట్టెన్! కార్మికులు ఎన్నుకొన్న ప్రతినిధుల సభే సోవియట్లు. దీన్ని రాజకీయ పరిభాషలో చెప్పాలంటే "కార్మిక ప్రతినిధుల కౌన్సిల్" అన్నమాట! ప్రపంచంలో ఇంతవరకూ ఏ దేశంలోనూ ఎరగని కార్మికవర్గం కొత్త ఆయుధం ఇది!ఇవి ఏ పార్టీ ప్రోత్సాహంతోటీ ఏర్పడ్డవి కావు. జార్ ప్రభుత్వ ఆజ్ఞల్నీ, చట్టాల్నీ ధిక్కరించి, విప్లవ ప్రజానీకమే మొదటి రష్యన్ విప్లవ కాల ప్రారంభంలోనే, అంటే 1905లోనే వీటిని ఏర్పాటు చేసింది. 1905, అక్టోబరు 13న (కొత్త కేలెండర్ ప్రకారం అక్టోబరు 26న) రష్యా

రాజధాని సెంట్‌పీటర్స్‌బర్గ్ లోని అన్ని మిల్లుల్లోనూ, ఫ్యాక్టరీలలోనూ, కార్మిక ప్రతినిధులకై ఎన్నికలు జరిగాయి. ఆరోజు రాత్రే ఆ సోవియట్ల ప్రథమ సమావేశం జరిగింది. ఆ తర్వాత మాస్కోలో, అటుపై ఇతర ముఖ్యపట్టణాల్లో కార్మిక ప్రతినిధుల సోవియట్లు ఏర్పడ్డాయి. అటు తర్వాత సైనికుల, కర్షకుల సోవియట్లు పలుచోట్ల ఏర్పడ్డాయి. మొదట ఇవి సమ్మె కమిటీలుగా, ఆపై సాయుధ తిరుగుబాటు నడిపించే మిలటరీ కేంద్రాలుగా పనిచేశాయి"

పెత్రోవ్ మాటలకు అడ్డొచ్చిన ప్లాట్టెన్, "అవి ప్రభుత్వం ఏర్పాటు చేసినవి కాకపోతే, ఇక వాటివల్ల ఒరిగేది ఏమిటి? వాటికి చట్టబద్ధత ఉండదు కదా! అంచేత అవి కేవలం ఆయా పార్టీ శాఖలుగానో, స్వచ్ఛంద సంస్థలుగానో పని చెయ్యాల్సిందే కదా?" అంటూ తన సందేహాన్ని వెలిబుచ్చాడు.

"అలాకాదు కామ్రేడ్" ప్లాట్టెన్‌ను సరిదిద్దుతూ అన్నాడు పెత్రోవ్.."మెజారిటీ సభ్యుల అభిప్రాయాల్ని బట్టి సోవియట్లు నిర్ణయాలు తీసుకుంటాయి. స్వచ్ఛందంగా జరిగే వాటి ఎన్నికల్లో పార్టీలు కూడా సిద్ధాంత పరంగా పాల్గొంటాయి. ఒక సోవియట్‌కు వివిధ పార్టీల అభ్యర్థులు ఎన్నికకావచ్చు. ఉదాహరణకు ఒక జిల్లా (పేట) ఫాక్టరీల సోవియట్‌కు ఒక్కో ఫ్యాక్టరీ నుండి ఒక్కో అభయర్థి చొప్పున, వేరు వేరు పార్టీల అభ్యర్థులు ఎన్నిక కావచ్చు. వీరంతా కలిసి మెజారిటీ నిర్ణయాన్ని అమలు జరుపుతారు. అయితే ఈ సోవియట్లు చట్టపరంగా ఏర్పాటు చేసినవి కానందువల్ల, వీటి నిర్ణయాల్ని ఆయా సోవియట్ల పరిధిలోని కార్మికులు తమ చొరవ ద్వారానే అమలు జరుపుతారు. ఉదాహరణకు పెత్రోగ్రాడ్ పట్టణంలోని 'నెవ్‌స్కయా జస్తావా' జిల్లాలో ఏర్పడ్డ సోవియట్ 8 గంటల పనిదినాన్ని నిర్ణయించదనుకుందాం. ఆ నిర్ణయాన్ని అక్కడి కార్మికులంతా స్వచ్ఛందంగా అమలు జరుపుతారు, ఆయా ఫ్యాక్టరీల యాజమాన్యాల అభీష్టంతో సంబంధం లేకుండా. నిజానికి 1905 నాటి సోవియట్లన్నీ ఈ విధంగానే, ఎటాంటి చట్టబద్ధ అధికరం లేకుండానే, కేవలం తమ చొరవతోటే, పత్రిక స్వాతంత్ర్యాన్నీ, 8 గంటల పనిదినాన్నీ ప్రవేశపెట్టాయి. ప్రభుత్వానికి పన్నులు చెల్లించ వద్దని చెప్పడమే గాక, కొన్నిచోట్ల ప్రభుత్వ ఖజానాను కూడా వశపరచుకొని, స్థానిక అవసరాలకు ఖర్చుపెట్టాయి. ప్రస్తుతం జార్‌ని దించేశాక, దూమ (పార్లమెంటు), సోవియట్లూ ద్వంద్వాధికారంతో పనిచేస్తున్నాయి కదా! నిజానికి ద్వంద్వాధికరం అన్న మాటే గానీ, దూమ అధికరమే, అంటే బూర్జువాల అధికరమే ప్రస్తుతం నడుస్తోంది. రాబోయే కొద్ది రోజుల్లోనే ఈ నామ మాత్రపు ద్వంద్వాధికారం కూడా రద్దయి, కేవలం బూర్జువాల అధికారమే కొనసాగడం ఖాయం. సోవియట్లు చేసే సిఫార్సులు చెల్లని కాగితాలయి పోతాయి. సైన్యం మీద నియంత్రణ కలిగిన బూర్జువా వర్గమే తన ఆజ్ఞల్ని అమలు చేసే స్థితిలో ఉంటుంది..."

"మరి అంతా సాధించేశాం అంటున్నారు మెన్షివిక్కులు?" తిరిగి తన సందేహాన్ని వ్యక్తం చేశాడు ప్లాట్టెన్.

"వాళ్ళు ఇంతమాత్రమే చాలనుకుంటున్నారు. బూర్జువాలు అధికారం చెలాయిస్తోంటే, వారితో చేరిన మెన్షివిక్కులూ, సోషలిస్టు రివల్యూషనరీలు ప్రజల్ని జో కొడుతూ, ఇదే గొప్ప విప్లవమని చెబుతున్నారు. ప్రస్తుతం సోవియట్లలో వీరిదే మెజారిటీ అని తెలుసు కదా! మేం దీన్ని కొనసాగనివ్వబోం. ప్రజలకు త్వరలోనే వాస్తవాలు అనుభవంలోకి వస్తాయి. ప్రజల తక్షణ కోరికలైన శాంతి, రైతులకు భూమి, అన్నార్తులకు రొట్టె – వీటిని ఈ బూర్జువా ప్రభుత్వం ఇచ్చే ఉద్దేశంలో లేదు. ప్రజల్ని జాగరూకుల్ని చేసి ఈ రాజీబేరగాళ్ళ, బూర్జువాల నిజ స్వరూపాల్ని బయటపెడతాం. బూర్జువా ప్రజాస్వామ్యాన్ని సోషలిజంలోకి పరివర్తన చెందించేందుకు కృషి చేస్తాం. ఆ కృషిలో ఎప్పుడు పాలుపంచుకుంటామా అని మా రష్యన్ ప్రవాసులమంతా తహతహలాడుతున్నాం. మీకు తెలుసుగా మా మనసులు ఇక్కడ లేవనీ, రష్యాలోనే ఉన్నాయనీ. సరే, ఇంతకీ మీ సందేహాలన్నీ తీరినట్లేనా?" ప్లాట్టెన్ వంక ప్రశ్నార్థకంగా చూశాడు పెత్రోవ్.

"మీరు ఇంత వివరంగా చెప్పినా ఇంకా తీరకుండా ఉంటాయా?" పెత్రోవ్ వంక ప్రశంసాపూర్వకంగా చూశాడు ప్లాట్టెన్. అయితే అంతలోనే ప్లాట్టెన్ మొహంలో రంగులు మారిపోవడం గమనించాడు పెత్రోవ్. 'ఏం జరిగింది' అంటూ పెత్రోవ్ ప్లాట్టెన్ చూస్తున్న దిక్కుగా దృష్టి సారించాడు. దూరంగా మంచుతెరలో ఏదో నల్లని ఆకారం చిన్నగా కనబడింది. కొద్ది సెకండ్లలోనే ఆ ఆకారం పెద్దదై, ఒక చిన్న నౌకా రూపాన్ని పొందడమే గాక, భీకరమైన గర్జన చేసింది. అది విన్న రష్యన్ బృందం మొహాలు పాలిపోయాయి. వచ్చే నౌక ఆకారం చిన్నదిగానే ఉంది గానీ, అమిత వేగంతో వీరున్న నౌక చుట్టూ రౌండ్ కొట్టింది.అయితే ఇంతలోనే వీరున్న సరుకు రవాణా నౌక కూడా ఏవేవో శబ్దాలు చేసింది.రెండు నౌకలూ కాసేపు రంగు రంగుల సిగ్నళ్ళు పంపుకున్నాయి. అనంతరం ఆ చిన్న నౌక ఎటో వెళ్ళిపోయింది.దాంతోరష్యన్‌బృందం ఊపిరి పీల్చుకుంది.

"ఆ వచ్చిన నౌక ఏ దేశానికి చెందింది? మన నౌక చుట్టూ ఎందుకు తిరిగింది? ఏమైంది?"అంటూ ప్లాట్టెన్ తమకు ఎడంగా విధులు నిర్వహిస్తున్న నౌకా సిబ్బందికి చెందిన మనిషిని అడిగాడు.

"ఆ వచ్చింది రష్యన్ నౌకాదళానికి చెందిన సబ్‌ఛేజర్ నౌక. వారి రక్షక దళానికి చెందిందది. మన నౌకను తనిఖీ చేసేందుకు వచ్చింది" అన్నాడా వ్యక్తి.

"మరి తనిఖీ చెయ్యకుండానే వెళ్ళింది?" ప్రశ్నించాడు ప్లాట్టెన్.

"ఎందుకు చేస్తుంది? మాకు యుద్ధంతో సంబంధం లేదు. మా నౌకలోకి రావడాని అంగీకరించమని చెప్పాం. అదీగాక మా నౌకలో ఆయుధ సామగ్రి గాని, మరే యుద్ధసంబంధ వస్తువులు గానీ లేవని చెప్పాం. ఏమనుకుందో ఏమో, లోపలికి రాకుండానే నౌక వెళ్ళిపోయింది"చెప్పాడా వ్యక్తి.

"ఒక్కోసారి వచ్చి తనిఖీ చేస్తారా?" ప్లాట్టెన్ తిరిగి ప్రశ్నించాడు.

"వారికి అనుమానం వస్తే మా అభ్యంతరాలను పట్టించుకోకుండా తనిఖీ చేస్తారు. అలాంటి సంఘటనలూ జరిగాయి"

"ఏమైనా మన అదృష్టం బాగుంది. ఎలాంటి గండం లేకుండాగడిచిపోయింది"అనుకున్నారు ప్లాట్టెన్‌తో పాటు రష్యన్లూ.

స్టాక్‌హోం రేవు పట్టణం వచ్చేదాకా అంతా మౌనంగా ఉన్నారు. ఒడ్డుకు చేరిం తర్వాత రష్యన్ బృందాన్ని విడిదికి చేరుకొమ్మని, తన తిరుగు ప్రయాణం విషయం కనుక్కొని వస్తానని చెప్పాడు ప్లాట్టెన్. పెత్రోవ్‌కు స్టాక్‌హోం లోగల సోషల్ డెమోక్రాట్ల ఆఫీసు కొత్త కాదు. అక్కడి కామ్రేడ్లతో అతనికి లోగడే పరిచయం ఉంది. అతన్ని

చూసి ఆఫీసులోనే ఉన్న పార్టీ కార్యదర్శి ఎంతైనా సంతోషించాడు. ఆయన రాకకోసమే ఎదురు చూస్తున్నట్లు చెప్పి, ఆఘమేఘాల మీద స్థానిక కార్యకర్తలకు కబురు చేసి, ఆ సాయంకాలం వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశాడు.

"మీకు సంతోషకర వార్త. రేపుదయమే మీ ప్రయాణం. ఇక్కణ్ణుంచి ప్రయాణ ఏర్పాట్లు చూసే కామ్రేడ్ గ్రిమెండ్. నాకు దారిలో కనిపించాడు. ఈ రాత్రి పొద్దుపోయాక మిమ్మల్ని కలుస్తానని చెప్పాడు. నా ప్రయాణం కూడా రేపుదయమే. జంతు చర్మాల్ని లోడింగ్ చేస్తున్న ఒక రవాణా నౌకలో నాకు సీటు దొరికింది" అంటూ అప్పుడే వచ్చిన ప్లాట్టెన్ పెత్రోవ్‌కు తీపి కబురు చెప్పాడు.

ఇది ఎంతైనా పెత్రోవ్‌ను సంతోషపరిచింది. స్టాక్‌హోంలో తాను కొన్ని రోజులు ఉండిపోవలసి వస్తుందేమో ననుకున్నాడు. అలాంటి ఇబ్బంది లేకుండా మరునాడే వెళ్ళగలగడం ఎంతైనా బాగుంది. సుదీర్ఘమైన ఈ క్లిష్ట ప్రయాణం ఇంతవరకూ సాఫీగానే సాగింది. ఇక ముందు కూడా అలాగే జరిగితే అదెంతైనా విప్లవానికి శుభసూచకమవుతుంది అనుకున్నాడతడు. దాంతో తమ ప్రయాణం విషయంలో బాధ్యత తీసుకుని నిర్వహిస్తున్న ప్లాట్టెన్‌కు మరొక్కమారు ధన్యవాదాలు తెలియజేశాడు పెత్రోవ్.

"మీరు నన్ను ఇరకాటంలో పెడుతున్నారు కామ్రేడ్ పెత్రోవ్..." ఎర్రబడ్డ మొహంతో మెలికలు తిరిగిపోయాడు ప్లాట్టెన్. "...మీరు నన్ను మరీ పొగుడుతున్నారు. మేం మా దేశంలో శ్రామిక రాజ్యాన్ని ఎప్పటికి సాధిస్తామో తెలియదు. మీరు మాత్రం అందుకుచేరువలో ఉన్నారు. మీరు కేవలం మీ దేశానికే కాదు, ప్రపంచ శ్రామిక వర్గానికే గొప్ప ఆశాకిరణం. మీకు తోడ్పడడం ప్రతి సోషలిస్టు కర్తవ్యం.."

వారి మాటల మధ్యలో రెమిజోవ్ కల్పించుకుని, "ఇంతకీ కామ్రేడ్ ప్లాట్టెన్ స్వీడన్ సరిహద్దులు దాటేదాకానైనా వస్తారనుకున్నాను. స్టాక్‌హోం నుంచే తిరిగి వెళ్ళిపోతారా!" అన్నాడు నిరాశను వ్యక్తం చేస్తూ.

"అలా అనకు కామ్రేడ్ రెమిజోవ్! కామ్రేడ్ ప్లాట్టెన్ మనకి ఎంతో చేశారు. రష్యన్ విప్లవం వీరికి ఎంతైనా రుణపడి ఉంటుందని చెప్పగలను. ఇక్కణ్ణుంచి వేరే కామ్రేడ్‌కు మన ప్రయాణం బాధ్యతను అప్పజెప్పారు. అంతేగాక ఆయన ఫిన్లండ్ సరిహద్దుల దాకా వస్తే ఎన్నో సమస్యలు ఆయనకు ఎదురు కావచ్చు కూడా. మన కెలాగూ తప్పదు...ఆయనక్కూడా అది ఎందుకు? ఈ సరికి 'మిలుకోవ్' టోర్నియోలో కాకపోయినా, కనీసం పెత్రోగ్రాడ్‌లో నయినా మనకోసం కొత్త జైలుగదిని సిద్ధం చేసి ఉంటాడని నా అనుమానం!" అంటూ పెత్రోవ్ రెమిజోవ్‌ని నివారించాడు.

పెత్రోవ్ మాటలతో ప్లాట్టెన్ మొహం వెలవెలబోయింది. "అయితే ఇంత శ్రమపడీ మీరు మీ దేశానికి వెళ్ళడం వృథాయేనంటారా కామ్రేడ్ పెత్రోవ్? ఇంత శ్రమపడి వెళ్ళీ తీరా బోనులో చిక్కుకుంటే ఉపయోగం ఏమిటి?"గాలితీసిన బుడగలా నీరసపడిపోయాడతడు.

"మీ శ్రమ వృథా అవుతుందని దిగులు పడకండి కామ్రేడ్ ప్లాట్టెన్. మాకు మా పార్టీ శక్తిసామర్థ్యాల మీద విశ్వాసం ఉంది. అదీగాక, స్వదేశం తీవ్రమయిన ఒక సంధి అవస్థలో ఉండగా, ఒక విప్లవకారుడు దూర దేశంలో బలవంతంగా గోళ్ళుగిల్లుకుంటూ కూర్చోవలసిరావడం ఎంత దుర్భరమో ఊహించండి! మీరు మాకు ఆ బాధని తప్పించారు. ఇది చాలా గొప్ప విషయం! అయినా మిలుకోవ్, మిత్రరాజ్యాలకు మా వంటి అంతర్జాతీయ యుద్ధ వ్యతిరేకుల లిస్టుల్ని పంపించి, ఆ దేశాల గుండా సులభ ప్రయాణం చెయ్యకుండా మమ్మల్ని అడ్డుకోగలిగాడు గానీ, తమ శత్రుదేశమైన జర్మనీ గుండా రాకుండా అడ్డుకోలేకపోతున్నాడు గదా!" ఆత్మవిశ్వాసంతో కూడిన ధృఢ స్వరంతో ప్లాట్టెన్‌ను ఓదార్చాడు పెత్రోవ్.

స్టాక్‌హోం లోని సోషల్ డెమోక్రాటిక్ పార్టీ ఆఫీసులో ఆ సాయంకాలం రష్యన్ విప్లవకారులకు జరిగిన వీడ్కోలు సమావేశం ఆలస్యంగా ప్రారంభమైనా, ఉత్సాహభరితంగా సాగింది. తక్కువ వ్యవధిలోనే సమావేశానికి పిలిచినా, ఆ ప్రభావం సమావేశం మీద కనబడలేదు. స్వీడిష్ పార్టీకి పెత్రోవ్ పూర్వ పరిచితుడే. సామ్రాజ్యవాద యుద్ధాన్ని వ్యతిరేకించడంలో స్వీడిష్ పార్టీలోని ఒక గ్రూపు బోల్షివిక్కులకు సన్నిహితంగా వచ్చింది. ఈ యుద్ధం పట్ల అవకాశవాద వైఖరి తీసుకున్న రెండో ఇంటర్నేషనల్‌కి వ్యతిరేకంగా, అంతర్జాతీయవాదుల్ని కూడగట్టేందుకు పెత్రోవ్ చొరవతోనే స్విట్జర్లాండ్‌లోని 'జిమ్మర్‌వాల్డ్' లోను, 'కీంథాల్' లోను దాదాపు రెండేళ్ళ కిందట జరిగిన రెండు సమావేశాలకు స్వీడిష్ పార్టీలోని ఒక పెద్ద గ్రూపు హాజరైంది. అది మొదట 'సెంట్రిస్ట్' వైఖరి తీసుకుంది. కానీ రెండో సమావేశం నాటికే వైఖరి మార్చుకుని పెత్రోవ్ ప్రభావానికి లోనై వామపక్ష వైఖరి తీసుకున్నారు ఆ గ్రూపులో కొంతమంది. అప్పట్నుంచీ వారితో అతడు నిత్య సంబంధాల్లోనే ఉన్నాడు. వారికి అతని మీద గొప్ప గురి ఉంది. మిగిలిన వారికి అతనితో అంత సాన్నిహిత్యం లేకపోయినా, అతను చెప్పేదాని మీద ఆసక్తి ఉంది. దాంతో హాలుహాలంతా జనంతో కిక్కిరిసిపోయింది.

పెత్రోవ్ అలుపెరగని యోధుడు. ఈ పొట్టి మనిషి అసాధారణమైన ప్రతిభావంతుడు మాత్రమే కాదు, అమితమైన శారీరక దారుఢ్యత కలిగినవాడు. రోజులో ఆఖరి నిమిషాన్ని కూడా నిర్ణీత ప్రణాళిక మేరకే ఉపయోగించుకునే అతడు, పదిమంది కార్మికులు గుమికూడితే చాలు, వెళ్ళి ఉపన్యసించి వారిలో ఉద్యమ చైతన్యాన్ని రగిలించడానికి విదేశాల్లో కూడా ఎప్పుడూ సిద్ధంగా ఉంటాడు. అలాంటి అతడు అతిథుల్ని ఉత్సాహపరచడానికి ఉద్దేశించిన వీడ్కోలు సభని కూడా సభ్యుల చైతన్యదీప్తికే ఉపయోగించు కున్నాడంటే అందులో ఆశ్చర్యం ఏముంది?

కార్యక్రమ నిర్వాహకుడైన స్థానిక పార్టీ శాఖ కార్యదర్శి రష్యన్లని ఎంతో ఆదరంతో ఆహ్వానించాడు. అందులో అతడు, రాచరిక రష్యా నేడు ఇతర పశ్చిమ యూరపియన్ బూర్జువా ప్రజాస్వామిక దేశాల సరసన నిలబడినందుకు సంతోషంగా ఉందని, ఈ పరిణామంలో రష్యన్ కార్మిక వర్గాన్ని యావత్తూ అభినందించవలసి ఉందని, ఈ కృషిలో బోల్షివిక్కుల పాత్ర ఎంతో ఉందని చెప్పాడు. అయితే బోల్షివిక్కులు ఇంతటితో సరిపెట్టకుండా యావత్తు ప్రపంచ చరిత్రలోనే ఒక నూతన అధ్యాయాన్ని సృష్టించడానికి పూనుకున్నారని, అదే సోషలిస్టు విప్లవమని అన్నాడు. అయితే ఈ సోషలిస్టు విప్లవ సాధనలో ఒక సరికొత్త నిర్ధారణను వారు ప్రతిపాదిస్తున్నారని, అదేమిటంటే కొన్ని దేశాల్లో గానీ, లేదా విడిగా ఒక్క దేశంలో గాని సోషలిజం విజయం సాధించవచ్చునన్నదే ఆ నిర్ధారణ అని ఆయన అన్నాడు.

అయితే ఇప్పటిదాకా ప్రపంచంలో "అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలన్నింటిలోనూ, లేదా మెజారిటీ దేశాల్లో ఒకేసారి సాధించబడితేనే సోషలిస్టు విప్లవం విజయవంతమవుతుంది"అనే మార్క్సిస్టుల అవగాహనకు ఇది భిన్నమని ఆయన వివరించాడు. బోల్షివిక్కులు ఈ విప్లవ కృషిలో విజయం సాధించగలరన్న ఆశాభావాన్ని వ్యక్తం చేస్తూ, వారికి శుభాకాంక్షలు తెలియజేశాడు. అంతవరకూ ఆయన ఆహ్వాన ప్రసంగం బాగానే సాగింది.

అయితే అంతటితో ఊరుకోకుండా, బోల్షివిక్కులు ప్రయాణానికి ఎంచుకున్న మార్గంపై కొన్ని సందేహాలు వ్యక్తం చేస్తూ, వేసిన ప్రశ్నలు పెత్రోవ్‌ను ఎంతైనా బాధించాయి. అతని ప్రశ్న ఏమంటే, జర్మనీ రష్యాకు శత్రుదేశం. రష్యాకు మిత్ర దేశాలైన ఫ్రాన్స్, బ్రిటన్‌ల గుండా, ఆపై సముద్ర మార్గం గుండా ప్రయాణం చేసి రష్యాకు చేరుకోవచ్చును. బోల్షివిక్ బృందం ప్రయాణానికి ముందు, ప్లెహనోవ్ ప్రభృతులు అదే స్విట్జర్లాండ్ నుంచి ఈ మార్గం గుండానే ప్రయాణం చేశారు! బోల్షివిక్కులు ఆ మార్గం ఎంచుకోకుండా, శత్రుదేశమైన జర్మనీని ఎంచుకోవడం ఎందుకు? అలా చేస్తే, స్వదేశంలోని ప్రత్యర్థులకు అవకాశం ఇచ్చినట్లు కాదా? శత్రుదేశంతో చేతులు కలపడం వల్లనే వారు తమ దేశం గుండా వెళ్ళనిచ్చారని వారు ఆరోపించరా? పోనీ, జర్మనీని ఎంచుకున్నప్పటికీ, దగ్గరదారి అయిన జర్మనీ, ఆస్ట్రియా-హంగరీ దేశాల ద్వారా రైల్లో వెళ్ళవచ్చుగదా! అలాగాకుండా క్లిష్టతరమైన మార్గాన్ని- జర్మనీ దాకా రైల్లో, ఆపై ప్రమాదకర బాల్టిక్ సముద్రం గుండా మొదట స్టాక్‌హోంకు, అక్కణ్ణుంచి సుదీర్ఘమైన రైలు ప్రయాణం చేస్తూ, ఫిన్‌లాండ్‌కు, అక్కణ్ణుంచి రష్యాకూ, ఇలా ఎంచుకోవడానికి కారణం ఏమిటి? ఇందులో ఏమన్నా అంతరార్థం ఉందా?

ఆ స్వీడిష్ పార్టీ కామ్రేడ్ స్వాగత ప్రసంగంలోని ప్రశ్నలు విని చిరునవ్వు నవ్వాడు పెత్రోవ్. అతనికి ముందే తెలుసు ఇలాంటి ప్రశ్నలు ముందు ముందు పదేపదే ఎదురవుతాయని. వాటిలో కొన్ని కేవలం సందేహంతోనే వచ్చినవయితే, మరికొన్ని కావాలని! బోల్షివిక్ కార్యకర్తల జీవితాలు విప్లవానికి అంకితమైనవే తప్ప కుట్రలకు, కుహకాలకూ కాదు. తాము ఎవర్నయినా అభిమానిస్తే నిండు హృదయంతో అభిమానిస్తారు, అలాగే ద్వేషిస్తే ముఖం మీదనే దాన్ని ప్రకటిస్తారు. అంతే తప్ప లోపల ఒకటి, బయట మరొకటీ తమ పని విధానానికే విరుద్ధం!

పెత్రోవ్ కళ్ళముందు నెల రోజుల నుంచి జరిగిన సంఘటనలు అప్పుడే జరిగినట్లు కళ్ళ ముందు కదలాడాయి. ఫిబ్రవరి 27 నాటి సంఘటన(జార్ పతనం) ను స్విస్ పత్రికలు వెంటనే ప్రకటించాయి. అప్పుడు తను కుటుంబ సమేతంగా జూరిచ్ గ్రంథాలయాల్లో పరిశోధనలు సాగిస్తున్నాడు. ప్రసిద్ధికెక్కిన తన 'సామ్రాజ్యవాదం' పైని గ్రంథాన్ని అప్పటికే పూర్తి చేసి ఉన్నాడు. అయినా తను ఇంకా జూరిచ్‌లోనే ఉండటానికి కారణం, అక్కడి అద్భుతమైన గ్రంథాలయాల పనితీరు నచ్చడం వల్ల తన కృషిని వాటిలో కొనసాగించాలను కోవడమే.

ప్రపంచ సామ్రాజ్యవాద దేశాల ప్రభుత్వాలు, వాటికి అండగా ఉన్న పెట్టుబడిదారులు కేవలం తమ స్వార్థం కోసం, అధిక లాభాల కోసం, వలసల్ని, పలుకుబడి గల ప్రాంతాల్ని విస్తరించుకోవడం కోసం, అప్పటికే విభజించుకున్న ప్రపంచాన్ని పునర్విభజించుకోవడం కోసం, రెండు ముఠాలుగా విడిపోయి యుద్ధం చేస్తున్నారు. తాము సాగిస్తున్న ఈ దురాక్రమణ యుద్ధాలకు తమ తమ దేశాల ప్రజల మద్దతు పొందేందుకు వారు యుద్ధానికి పూర్వం కొంత కాలం పాటు సాగించిన యుద్ధ ప్రయత్నాల్ని కూడా దాచిపెట్టి, తాము కేవలం శత్రువుల దాడులను తిప్పికొట్టేందుకే, ఆత్మరక్షణ కోసమే యుద్ధం చేస్తున్నట్లు ప్రజల్ని వంచిస్తున్నారు.

ఈ యుద్ధంలో రెండు వైపులా ప్రాణాలు కోల్పోతున్న కోట్లాది మంది ప్రజలు శ్రామిక వర్గానికి చెందినవారే. అందువల్ల ఆయా దేశాల పెట్టుబడిదారులూ, ప్రభుత్వాలూ చేస్తున్న మోసాన్ని బయటపెట్టి, వాస్తవాలు తెలియజెప్పి,తద్వారా కార్మిక వర్గ అంతర్జాతీయతను కాపాడాల్సిన కర్తవ్యం ఆయా దేశాల్లోని సోషల్ డెమోక్రాట్లపై ఉంది.కానీ వీరిలో అధిక సంఖ్యాకులు కార్మిక వర్గానికి ద్రోహం చేస్తూ, ఆయా ప్రభుత్వాలకూ, పెట్టుబడిదారులకూ సహకరిస్తున్నారు.యుద్ధాన్ని వ్యతిరేకించడానికి బదులు, మాతృదేశ రక్షణ పేరుతో యుద్ధాన్ని రెచ్చగొడుతూ, సోషల్ జాతీయ దురహంకారులుగా మారారు. కొందరైతే విప్లవోద్యమాన్ని గాలికొదిలేసి, విప్లవ ద్రోహులై ప్రభుత్వాల్లో కూడా చేరి మంత్రులయ్యారు.

కనుక ఇతర సోషల్ డెమోక్రాటిక్ పార్టీలు స్వీకరించకుండా వదిలేసిన ఈ కర్తవ్య భారం యావత్తూ తమ బోల్షివిక్ పార్టీ స్వీకరించింది.అందులో భాగంగా ప్రపంచ కార్మిక వర్గానికి "ఆయుధాలు తిప్పాల్సింది ఇతర దేశాల్లోని కూలి బానిసలైన మన సోదరుల మీదికి కాదు, మీ మీ దేశాల్లోని ప్రగతి వ్యతిరేక బూర్జువా ప్రభుత్వాల మీదికి!" అనీ, "యుద్ధం మీద యుద్ధాన్ని ప్రకటించండి!" అనీ తను ఇచ్చిన పిలుపులు ప్రపంచమంతా ప్రతిధ్వనించాయి. అలాగే బూర్జువాలూ, సోషల్ జాతీయ దురహంకారులు ఇచ్చిన "మాతృదేశ రక్షణ" అనే అవకాశవాద విజ్ఞప్తిని తిరస్కరిస్తూ, "సామ్రాజ్యవాద యుద్ధాన్ని అంతర్యుద్ధంగా మార్చండి!" అంటూ తను ఇచ్చిన నినాదం, తిరిగి వారికే వణుకు పుట్టించింది.

ఇలా తనూ, తన పార్టీ సామ్రాజ్యవాద యుద్ధానికి వ్యతిరేకంగా తీవ్ర కృషి చేస్తున్నందువల్ల, తమని దెబ్బతీసేందుకు బూర్జువాలూ, వారి తాబేదారులూ, తమపై పలు నిందా ప్రచారాలకు పూనుకున్నారు. బోల్షివిక్కులు దేశ ప్రయోజనాలు పట్టించుకోరనీ, వారికి ఏ మాత్రం దేశభక్తి లేదనీ విషం చిమ్మారు. అందుకు ప్రతిగా, నిజమైన దేశభక్తి అంటే ఏమిటో వివరిస్తూ తను "మహా రష్యన్ల జాతీయ గర్వం" అనే వ్యాసాన్ని రాసి, వారి నిందా ప్రచారాన్ని తిప్పికొట్టాడు.

పర్యవసానం తన స్వదేశ ప్రయాణం పెద్ద సమస్యగా మారడం!

సోషల్ జాతీయ దురహంకారులకు ఇదో సమస్య కాదు. మిత్ర రాజ్యాలు వారిని పువ్వుల్లో పెట్టి తీసుకెడతాయి. ఎందుకంటే వారి కార్యకలాపాల వల్ల సామ్రాజ్యవాదులు ఎంతో లాభం పొందుతున్నారు. అందువల్లనే ప్లెహనోవ్ ప్రభుత్వాలు ఇదే స్విట్జర్‌లాండ్ నుంచి డిస్ట్రాయర్ నౌకల రక్షణలో, ప్రత్యేక క్రూయిజర్‌లో రష్యాకు వెళ్ళారు! తనలాంటి బోల్షివిక్కులు మాత్రమే కాదు, నిషిద్ధ జాబితాలోకి ఎక్కిన ఇతర గ్రూపులకు చెందిన అంతర్జాతీయవాదులకూ రష్యా ప్రయాణం గగనకుసుమం అయింది. ఒకవేళ సాహసించి గనక ప్రయాణం

చేస్తే, ఆ మిత్ర రాజ్యాలే ప్రయాణాన్ని నిలిపెయ్యడమో, లేదా జైళ్ళలో పెట్టడమో, అదీ కాదంటే వారు ప్రయాణించే నౌకల్ని ముంచెయ్యడమో చేస్తాయి. అలాంటి అనుభవాల్ని కొందరు పొందారు కూడా!

ఒకప్పుడు 'కాడెట్లు' ఉదారవాదులు. వారి ముందు తరాలవారైన డిసెంబరిస్టులు జారిజాన్ని వ్యతిరేకించారు. కానీ ఇప్పుడు వారే అతిపెద్ద విప్లవ ద్రోహులు, సామ్రాజ్యవాదానికి నమ్మినబంట్లు. ఇక 'మిలుకోవ్' అయితే బోల్షివిక్కుల బద్ధ శత్రువు. తనలాంటి వారిని రష్యాకు తిరిగిరాకుండా చెయ్యడానికి ఎంతటి నీచానికైనా సిద్ధపడతాడు.

అక్కడికి విదేశీ ప్రవాసానికి వెళ్ళిన రష్యన్ రాజకీయ వ్యక్తులు తిరిగి రష్యాకు వచ్చేందుకై ఒక పెద్దమనుషుల కమిటీ తీవ్ర ప్రయత్నమే చేసింది. అయితే ఆ కమిటీ ప్రయత్నాల మీద ఆశలు పెట్టుకోవడం వ్యర్ధమని తను ముందే ఊహించాడు. తన ఊహే తర్వాత నిజమైంది కూడా. జర్మన్ యుద్ధ ఖైదీలకు బదులు విదేశీ ప్రవాసిత రష్యన్లను మార్పిడి చేసే పథకం గురించి కార్మిక ప్రతినిధుల సోవియట్ల ద్వారా ఆ పెద్దమనుషుల కమిటీ మిలుకోవ్‌తో చర్చించింది. కానీ అందుకు మిలుకోవ్ ఏ మాత్రం అనుకూలంగా స్పందించాడు కాదు.

అలాంటి పరిస్థితుల్లో, రష్యాకు వెళ్ళలేకపోతున్నానే అన్న విచారం అధికమై, తను నిద్రలేని రాత్రులెన్నింటినో గడిపాడు! ఆచరణ సాధ్యంగాని పలు విచిత్ర పథకాల్ని గురించి ఆలోచించాడు. అప్పుడే స్వీడిష్ కామ్రేడ్, వామపక్ష సోషల్ డెమోక్రాట్ అయిన 'గానెత్‌స్కి' కి తన బాధను తెలియపరిచి, తను ఆలోచించిన ఒక పథకంతో సాయపడమని కోరాడు. తను వేషం మార్చుకుని, తనలాగా కనిపించే ఒక స్వీడిష్ పాస్‌పోర్టుతో స్వీడన్ తిరిగి వెడుతున్న ఒక మూగ చెవిటి వానివలె నటించాలని నిశ్చయించుకుని, స్వీడిష్ మనిషిని వెతకమని కోరుతూ, తన ఫోటో గానెత్‌స్కీకి పంపించాడు. అయితే గానెత్‌స్కి తన బాధనైతే అర్థం చేసుకున్నాడు గానీ, తనలాంటి మనిషిని మాత్రం వెతకలేకపోయాడు. అందుకు బదులుగా తన మిత్రుడు 'హొరేవ్‌స్కి' తో 'పొలిటికన్' అనే పేరుగల తమ వామపక్ష సోషల్ డెమోక్రాటిక్ పత్రికలో 'రష్యన్ విప్లవ నాయకుడు' అనే పెద్ద వ్యాసాన్ని రాయించి, ఫోటో ప్రచురించాడు.

ఇలా అన్ని దారులూ మూసుకుపోయిన స్థితిలో, ఇక తనముందున్న ఒకే ఒక్క మార్గం జర్మనీ గుండా వెళ్ళేందుకు ఆ దేశ ప్రభుత్వ అనుమతిని పొందడం! ఈ మార్గాన్ని ఆశ్చర్యకరంగా స్విస్ సోషలిస్టులు ఏర్పాటు చెయ్యగలిగారు!

నిజానికి ఈ ఏర్పాటు జర్మన్ల దృష్టిలో శత్రువు యొక్క శత్రువు మిత్రుడన్న సూత్రం వల్లనే. కాని అది తన విషయంలో నిలవదు. ఎందుకంటే శత్రువు యొక్క శత్రువు తనకూ శత్రువే. జర్మనీ- తనకు శత్రువైన రష్యన్ బూర్జువాలకు శత్రువైన బోల్షివిక్కుల్ని రష్యాకు పంపించడం ద్వారా, రష్యన్ బూర్జువాలను దెబ్బకొట్టొచ్చనుకుంటోంది. అయితే జర్మనీలోని శ్రామిక వర్గాన్ని, అలాగే అక్కడి సోషల్ డెమోక్రాట్లను చైతన్య పరచడం ద్వారా జర్మనీకి తను నష్టం కలిగిస్తున్న సంగతిని అది బహుశా విస్మరించింది. లేదా, ఆ దేశానికి తను కలిగించే నష్టం కన్నా, రష్యన్ బూర్జువాలకు కలిగించే నష్టమే ఎక్కువని అది భావించి ఉండవచ్చును. అది ఎందుకు, ఎలా భావించినా, తనకు మాత్రం ఈ విధంగా జర్మనీ ఉపయోగపడింది. (ఈ చర్యవల్ల బోల్షివిక్ విప్లవం బలపడి, తద్వారా తూర్పు రంగంలో యుద్ధం ముగిసిపోతుందని, అప్పుడు పశ్చిమ రంగానికి బలగాలను తరలించి విజయం సాధించవచ్చునని జర్మనీ ఆలోచన-రచయిత)

బోల్షివిక్కులు జర్మనీ గుండా ప్రయాణించారనే విషయాన్ని రష్యన్ బూర్జువాలూ, సోషల్ జాతీయ దురహంకారులూ అవకాశంగా తీసుకొని, బోల్షివిక్కులు జర్మన్లతో చేతులు కలుపుతున్నారని అభాండాలు వేసి నిందా ప్రచారానికి పూనుకోవడం ఖాయం. అయితే ఇది కేవలం శత్రువుల మధ్య గల విభేదాన్ని ఉపయోగించుకోవడమే తప్ప, శత్రువులకు శత్రువులతో చేతులు కలపడం కాదు! మనమంటే గిట్టని వారు ప్రతి చిన్న విషయానికీ మనపై బురద చల్లేందుకు ప్రయత్నిస్తూంటారు. అందువల్ల వారికి అలాంటి అవకాశం ఇవ్వకుండా ఉండేందుకు తగిన చర్యలు తీసుకోవాలనుకున్నాడు. అందుకోసం జర్మన్ అధికారులతో కావలసిన షరతులు మాట్లాడేందుకు గాను స్విస్ వామపక్ష సోషల్ డెమోక్రాట్ పార్టీ కార్యదర్శి అయిన (ఫింజ్ ప్లాట్టెన్ కు అధికారమిచ్చాడు. అతను కుదుర్చుకున్న ఒప్పందాన్ని బట్టి తనూ, తనతో పాటు తన బృందమూ ప్రయాణిస్తున్న రైలుపెట్టెను రాజ్యేతర విస్తృత కంపార్టుమెంటుగా (సీలు వేసిన కంపార్టుమెంటుగా) పరిగణించి, అందులో ప్రయాణించే వారి పాస్‌పోర్టుల్ని జర్మన్ అధికారులు తనిఖీ చెయ్యలేదు. అలాగే తామెవ్వరూ కంపార్టుమెంటు వదిలి బయటకు రాలేదు. తమ తరఫున ఏం మాట్లాడాల్సి వచ్చినా ప్లాట్టెనే జర్మన్ అధికారులతో మాట్లాడాడు. ఒప్పందం ప్రకారమే తమ బృందంతో పాటు స్టాక్‌హోం వరకూ ప్లాట్టెన్ వచ్చాడు.

ఒప్పందం సంగతి తెలియగానే తనూ, తనతో పాటు జూరిచ్‌లో గల తక్కిన బోల్షివిక్కుల బృందమూ కొద్ది గంటల్లో పెట్టే బేడా సర్దుకుని బెర్న్‌కు చేరుకోవాల్సి వచ్చింది. ఏ మాత్రం ఆలశ్యం జరిగినా బెర్న్‌లో రైలు తప్పిపోతుంది.

ఒక పక్కన తను వివిధ లైబ్రరీల పుస్తకాలు ఇచ్చెయ్యడం, ఇంటి యజమానులతో అద్దె సర్దుబాటు చేసుకోవడం, ఇంటి సామాను, ముఖ్యంగా వందలాది పుస్తకాలు మూటకట్టడం, వీటితో పాటు స్థానిక బోల్షివిక్కుల్ని ప్రయాణానికి సన్నద్ధం చెయ్యడం.... ఇలా అంతులేని హడావిడితో సతమతమవుతుంటే, మరోపక్క ఇతర గ్రూపులకు చెందిన కొంతమంది తామూ వస్తామని విసిగించడం, ఇలాంటి వారి సంఖ్య తక్కువే అయినప్పటికీ, ప్రయాణం ప్రశాంతంగా సాగడానికి విరోధి గ్రూపుల వారు కాకపోయినా, ఇతర గ్రూపుల వారితో ప్రయాణించడం మంచిది కానందున, ఈ విషయంలో కొంత ఆలోచించాల్సి వచ్చింది. వీరిలో ఇద్దరు 'తీవ్రవాద' సోషలిస్టు రివల్యూషనరీలు కాగా, నలుగురు 'ఇంటర్నేషనల్' మెన్షివిక్కులు. రైతాంగం కేంద్ర సిద్ధాంతం గల సోషలిస్టు రివల్యూషనరీలు పెట్టుబడిదారులతో రాజీ పడటం ఇష్టం లేక, కొంతమంది అసమ్మతి వర్గంగా ఏర్పడి, తమని తాము 'తీవ్రవాద సోషలిస్టు రివల్యూషనరీలు' అని పిలుచుకోవడం మొదలెట్టారు. అలాగే మెన్షివిక్కులు సామ్రాజ్యవాద యుద్ధాన్ని సమర్ధిస్తూ, జాతీయ దురహంకార స్థావరాన్ని తీసుకోవడాన్ని వ్యతిరేకించిన కొంతమంది 'ఇంటర్నేషనల్ మెన్షివిక్కులు' గా ఏర్పడ్డారు. ఇలాంటి వారు క్రమంగా విప్లవోద్యమంలో సహ ప్రయాణీకులవుతారన్న ఉద్దేశంతో, వారిని

తమతో పాటు రావడానికి అంగీకరించాడు తను.

ఇలా ఎంతో ప్రయాసపడి ఏర్పాట్లు చేసుకుని, చివరికి అతి కష్టం మీద స్వదేశం వెడుతున్నా మన్న సంబరంతో రైలు స్టేషనుకు చేరుకున్న తమకు - స్థానికంగా మిగిలి ఉన్న విదేశీ ప్రవాసులు నిరసన ప్రదర్శనతో వీడ్కోలు చెప్పడంతో, తమ సంతోషమంతా ఆవిరవ్వడమే గాక, చిరాకు కలిగింది.వారు అలా చెయ్యడానికి కారణం - 'బోల్షివిక్కులు జర్మనీ గుండా వెళ్ళడం తీవ్రమైన రాజకీయ పొరపాటు' అని భావించడమే! అయితే గుడ్డి కన్ను కన్నా, మెల్ల కన్ను నయం అన్న సంగతి వారు గ్రహించలేకపోవడం వారి దూరదృష్టి లోపం తప్ప వేరు కాదు. (ఆ తర్వాత వాళ్ళు కూడా మరో మార్గం కానరాక, ఆశలు కోల్పోయి, చివరికి అదే మార్గంలో రష్యాకు తిరిగి వెళ్ళారు - రచయిత

ఇన్ని సంఘటనలు, ఇంత సుదీర్ఘ తతంగం తమ ప్రయాణం వెనుక దాగున్నప్పటికీ, తమ రష్యన్ ప్రత్యర్థుల్లా, కామ్రేడ్లు కూడా ప్రశ్నించడం గంభీర స్వభావం గల పెత్రోవ్ నెంతయినా బాధించింది. అయినప్పటికీ దాన్ని మనసులోనే దాచుకుని, తన స్వభావానికి అనుగుణంగా ఆ విశేషాల్ని వివరించాడు పెత్రోవ్. ఇదంతా శ్రోతల్ని ఎంతయినా ప్రభావితం చేసింది. సభకు హాజరయిన ప్రతి ఒక్కరూ కార్యక్రమం చివర్లో పెత్రోవ్‌నీ, అతని బృందం సభ్యులు ప్రతి ఒక్కర్నీ కలుసుకుని అభినందించారు. వారు స్వదేశ గమనానంతరం విప్లవ కృషిలో విజయం సాధించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.

కార్యక్రమం అనంతరం కార్యదర్శి ఒంటరిగా పెత్రోవ్‌ని కలిసి, సంజాయిషీలాగా, తను కోరిన వివరణ గురించి వివరణ ఇచ్చాడు. తాను పెత్రోవ్ నిజాయితీని శంకించలేదని, జరిగిన సంగతుల్లో కొన్నింటిని గానెత్స్కి తనకు చెప్పాడనీ, అయితే సభ్యులకు పెత్రోవ్ స్వయంగా వివరిస్తే ఉపయోగం ఉంటుందనే ఉద్దేశంతోనే వివరణ కోరానని, తనని అపార్థం చేసుకోవద్దని అంటూ, క్షమాపణ కోరాడు. తాను ఆ విషయాన్ని తేలిగ్గా తీసుకున్నానని పెత్రోవ్ కార్యదర్శిని సముదాయించాడు. "క్షమాపణ అనేది పెద్దమాట. ఎవరికైనా అపార్థాలు, ఏర్పడడానికి కారణాలుంటాయి. అవి తొలగిపోతే మనసులు వికసిస్తాయి" అంటూ, వారి ఆతిథ్యానికి మరోసారి ధన్యవాదాలు చెప్పాడు పెత్రోవ్.

వారు అలా మాట్లాడుకుంటూండగానే, స్వీడిష్ వామపక్ష డెమోక్రాట్ కామ్రేడ్ గ్రిమ్‌లాండ్ అక్కడికి వచ్చాడు. అతని ఓవర్ కోటంతా వర్షంలో తడిసిపోయి బురదకొట్టుకుపోయింది. దాంతో అతడు దాన్ని గుమ్మంలోనే తీసేసి, లోపలికి వచ్చీ రావడం తోటే పెత్రోవ్‌ని కౌగిలించుకున్నాడు. ఆపై అతన్ని పక్క గదిలోకి తీసుకెళ్ళి, "అభినందనలు కామ్రేడ్ పెత్రోవ్! మీ ప్రయాణానికి సంబంధించిన ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. కామ్రేడ్ ప్లాట్టెన్ ఆ వివరాలు చెప్తే ఉంటాడు. సగం దూరం దాకా నేను మిమ్మల్ని అనుసరిస్తాను. ఆపై కామ్రేడ్ 'తురె-నెర్మాన్' మిమ్మల్ని రైలెక్కిస్తాడు" అంటూ ప్రయాణానికి సంబంధించిన పత్రాలు పెత్రోవ్‌కి అందించాడు.

"వేనవేల ధన్యవాదాలు, కామ్రేడ్ ఒట్టోగ్రిమ్‌లాండ్! మధ్యలో ఆలస్యం కాకుండా కాపాడారు. మా రష్యన్ విప్లవం మిమ్మల్నీ, తురె-నెర్మన్ నీ అలాగే స్విస్ పార్టీ కార్యదర్శి ఫ్రింజ్ ప్లాట్టెన్ నీ ఎంతైనా గుర్తు పెట్టుకుంటుంది" గ్రిమ్‌లాండ్‌తో కరచాలనం చేస్తూ, అన్నాడు పెత్రోవ్.

"ఈ విధంగానైనా చరిత్రలో ఓమూల మా పేర్లు చోటు చేసుకోవడం మా అదృష్టం కామ్రేడ్ పెత్రోవ్" చెయ్యి వదలకుండానే అన్నాడు గ్రిమ్‌లాండ్. "ఇందులో ప్రధాన పాత్ర కామ్రేడ్ ప్లాట్టెన్‌దే. నేనూ, కామ్రేడ్ నెర్మానూ ఆయనకు సహాయకులం మాత్రమే" అన్నాడు.

* * *

ఎక్స్‌ప్రెస్ రైలే అయినప్పటికీ, మంచు ముద్దలుగా పడటం వల్ల పూర్తి వేగం అందుకోకుండా నడుస్తోంది. అన్ని పెట్టెల్లోనూ చలిగాలికీ, మంచు దెబ్బకూ జడిసి కిటాకీ అద్దాలు మూసేసి ఉన్నాయి, ఒక్క పెట్టెలో తప్ప. తన సీటు పక్కనే ఉన్న కిటికీ సగం తెరిచి ఉండగా, అందులోంచి నిశితంగా ప్రకృతిలోకి చూస్తున్నాడతడు. అసలే చిన్నవైన తన కళ్ళను మరింత చిన్నవిగా చేసి, ప్రకృతి అవతలి అంచుల కోసం వెతుకుతున్నాడతడు. కానీ వాటిని చూడటం ఎవరికైనా సాధ్యమయ్యే పనేనా? అయితే అసాధ్యాలెన్నింటినో అవలీలగా సాధ్యం చెయ్యగలగడం అతనికి వెన్నతో పెట్టిన విద్యే. లేకుంటే ఇరవై ఏళ్ళకే మార్క్సిజాన్ని జీర్ణించుకుని గహనమయిన రష్యన్ ఆర్థిక వ్యవస్థ సారాన్ని గ్రహించగలిగేవాడా? హేమాహేమీ నరోద్నిక్ సిద్ధాంతవేత్తలు 'వొరోన్‌త్సోవ్', 'మిహాయ్‌లోవ్‌స్కీ' లను వాద ప్రతివాదాల్లో, సిద్ధాంత చర్చల్లో మట్టికరిపించ గలిగేవాడా? విశ్వవిద్యాలయంలో చదవకుండానే 22 సంవత్సరాలకే విశ్వవిద్యాలయ 'న్యాయ' విద్యా పరీక్షకుల్నీ ఆశ్చర్యాంబుధిలో ముంచెత్తించగలిగే వాడా? మొట్టమొదటి రష్యన్ మార్క్సిస్టుగా, సిద్ధాంతవేత్తగా అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన ప్లెహానోవ్ నే ఆత్మరక్షణలో పడేట్లు చేసి, విప్లవోద్యమంలో అనామకుణ్ణి చేయగలిగేవాడా? యూరప్‌లోనే అత్యంత క్రూరులుగా పేరుగాంచిన రష్యన్ పోలీసులకే చెమటలు పట్టించి, జార్‌ని ముప్పుతిప్పలు పెట్టగలిగేవాడా? కౌటిల్యంలో కొమ్ములు తిరిగిన, ప్రపంచ ప్రసిద్ధ మార్క్సిస్టు, జర్మన్ సెంట్రిస్టు అయిన కౌట్స్కీనే సిద్ధాంత చర్చల్లో కకావికలు చెయ్యగలిగే వాడా?మహా మేధావి, శ్రామికవర్గ సిద్ధాంతకారుడు మార్క్స్‌కే భాష్యకారుడై, మార్క్సిజానికి చేర్పులు చెయ్యగలిగేవాడా?ప్రపంచంలోనే అత్యంత మహోన్నతుడైన క్రియాశీల విప్లవ సిద్ధాంతకారుడు కాగలిగేవాడా? ఇవన్నీ కాగలిగిన అతడు, ఇంకెన్నెన్నో అయిన అతడు, ఇంత నిర్విచారంగా, ఇంత ప్రశాంతంగా గంటల తరబడి దిక్కుల్లోంచి చూసేదేమిటి? దిగంతాలకు వ్యాపించిన పైన్ చెట్ల గుంపుల్నా? ఫర్ వృక్ష అడవుల్నా?మంచుతో కప్పుకు పోయిన మైళ్ళ కొద్దీ వ్యాపించిన పొదరిళ్ళనా? ఆకాశం నుంచి రాలిపడే మంచు పూల చెండుల్నా?

దాదాపు పదేళ్ళ కిందట ఇలాగే...కానీ ఒంటరిగా...సరిగ్గా ఇలాంటి మంచుపూల పవళింపుల మధ్య... రైల్లోనే... ఇటుకాదు.. అటువైపు ప్రయాణించడం గుర్తొచ్చింది పెత్రోవ్‌కి.

'స్టోలీపిన్' అభివృద్ధి నిరోధక కాలం అది. రష్యన్ ప్రథమ విప్లవం ఓటమికి గురయింది. దాంతో జారిజం భయంకర కరాళ నృత్యం చేసింది. వేలాది విప్లవకారులైన కార్మికులు, కర్షకులు, శ్రామికులు ఉరికొయ్యలకు, చిత్రహింసలకు, చెరసాలలకు గురయ్యారు. విప్లవనాయకుల్ని వెతికి వెతికి హతమారుస్తున్నారు. అప్పుడు తను రష్యన్ సామ్రాజ్యంలో భాగంగా ఉన్న ఫిన్లండ్‌లో ఉంటూ, పార్టీ

పత్రిక 'ప్రొలితారియ్' ని వెలువరిస్తూ, పార్టీ సంబంధాల్ని సజీవంగా ఉంచుతున్నాడు. అయితే తన రక్షణ విషయంలో ఆందోళన చెందిన పార్టీ సెంట్రల్ కమిటీ, రష్యాలో రక్షణ కష్టమని, తక్షణం విదేశాలకు వెళ్ళాలనీ ఆదేశించింది. కార్మిక వర్గానికి, విప్లవానికి దూరంగా వెళ్ళడం తన కిష్టం లేకపోయినా, అత్యున్నతమైన పార్టీ ఆదేశాన్ని పాటించాల్సి వచ్చింది. అందుకోసం తను ఫిన్లండ్ రాజధాని 'హెల్సింగ్‌ఫర్స్' నుంచి రూవు పట్టణమైన 'అబో'కు రైల్లో ప్రయాణించాల్సి వచ్చింది. అయితే తనను వెంటాడుతున్న గూఢచారులు రైల్లోనే ఉండడాన్ని గుర్తించి తను నడిచే నడిచే రైల్లోంచి దూకెయ్యాల్సి వచ్చింది.

అప్రయత్నంగా అతని చెయ్యి నడుం పైకి వెళ్ళింది. అప్పుడు తగిలిన గాయం చిన్నదే. దూది మంచు గుట్టపై పడటం వల్ల ఆ మాత్రంతో సరిపోయింది. కానీ అప్పుడప్పుడూ అది సలుపుతూనే ఉంటుంది. తిరిగి మళ్ళీ ఆ సంఘటన గుర్తొచ్చిందతనికి. తీరా రైల్లోంచి దూకి, మంచులో పడి రైలు కట్ట వెంట మైళ్ళ కొద్దీ నడిచి వెడితే, స్టీమర్ తప్పిపోయింది. ఆపళంగా కొరియర్ సాయంతో దగ్గర్లోని బెస్త పల్లెకు వెళ్ళి, అక్కడ నుంచి గడ్డ కట్టిన సముద్ర శాఖల్ని దాటుకుంటూ, సమీపంలోని ఒక దీవికి బెస్తవారితో కలిసి వెళ్ళాడు తను. దారిలో భయంకరమైన సంఘటన...ఒక మంచు పెళ్ళపై కాలెయ్యగానే, అది పగిలిపోయి, ఆపై సముద్రంలోకి జారిపోయి నందున, ఆ పెళ్ళతో పాటు తనూ సముద్రంలోకి జారిపోయి సమాధి కావాల్సిన స్థితి.. కానీ తనకే తెలీకుండా ఆవలి పెళ్ళ పైకి గడపట్టుకు గెంతడంతో, ఇంకా బతికి, తిరిగి ఇలా రైల్లో ప్రయాణిస్తున్నాడు.

అప్పుడే పదేళ్ళయింది... అంతకు క్రితం అయిదేళ్ళు... మొత్తం పదిహేనేళ్ళు... తన జీవితంలో ముఖ్యమైన యవ్వనవంతమైన కాలమంతా బలవంతానా... తన కిష్టమైన కార్మిక లోకానికి దూరంగా... విదేశాల్లో.. అతి కఠినమైన పేదరికంలో... ఇంకా చెప్పాలంటే దుర్భర దారిద్ర్యంలో.. ఇటీవలి కాలంలో మరీ... రేపెలా అనే పరిస్థితుల్లో... కడుపు కట్టుకు మరీ... కేవలం లైబ్రరీకో, ఇంటికో అంటిపెట్టకని ఒఠ్ఠి పుస్తకాల పురుగుల్లా.... కాకుంటే పత్రికలు నడుపుతూనో, వ్యాసాలు రాస్తూనో, అనువాదాలు చేస్తూనో (అదే తన సంపాదన), విమర్శలు చేస్తూనో, విమర్శలకు సమాధానాలిస్తూనో, మధ్య మధ్య పార్టీ సమావేశాలు నిర్వహిస్తూనో, శ్రామికపేటలకు వెళ్ళి వింటూ, ఉపన్యాసాలు ఇస్తూ... ఈ దేశం నుంచి ఆ దేశానికి, ఆ దేశం నుంచి మరో దేశానికి తిరుగుతూ... తనూ, తన భార్య... అలా తిరుగుతూనే రష్యాలోని పార్టీని నడపడం... ఇదంతా ఒక్క. ఒకే ఒక్క ఆశయం కోసం... రష్యాలో విప్లవం కోసం...సోషలిజం స్థాపన కోసం... అదే తన కల. ఆ కల నిజం అయ్యే రోజు సమీపించింది. అయితే దాన్ని అందుకోవాలంటే ఇప్పటికిప్పుడు చెయ్యాల్సింది ఎంతో ఉంది. దాన్ని గురించే ప్రయాణం పొడుగునా ఆలోచిస్తూ, దానికో రూపాన్నిస్తూ వచ్చాడు. ఆ రూపొందిన అంశాల్ని మధ్య మధ్య తన నోట్ పుస్తకంలో పొందుపరచడం సాగించాడు పెత్రోవ్.

రాయడం ముగించి, రాసిందంతా చదువుకున్నాక సంతృప్తిగా నిట్టూర్చాడు అతడు. అప్పటి దాకా అతన్నే గమనిస్తూ కూర్చున్న మహిళ, అప్పుడు అతన్ని పలకరించింది "అయిందా?"

"ఏమిటి?"

"నువ్వు రాస్తున్నది"

"ఓ ఎప్పుడో అయింది. నువు గమనించావా ఏమిటి నేను దేన్ని గురించి రాస్తోంది?"

"నువ్వు రైల్లో పడుకోవడం కూడా మానేసి నిన్నట్నుంచీ రాస్తున్నావు కదా... గమనించకుండా ఎలా ఉంటాను? నువ్వు టాయిలెట్‌కి వెళ్ళినపుడు నీ నోట్ పుస్తకంపై మంచు పడుతుంటే తీసినప్పుడు చూసాను... ఊరికే పైపైనే నాలుగు పంక్తులు అంతే. ఇంతకీ నీ ప్రణాళిక ఏమిటి... ఏదైనా ప్రణాళికాబద్ధంగానే చెయ్యాలంటావు కదా... కాస్త మనవాళ్ళకి వివరిస్తే బాగుంటుందని నా ఉద్దేశం... తర్వాత ఎలాగూ చెబుతావనుకో.."

"అవునవును కామ్రేడ్ పెత్రోవ్. కామ్రేడ్ ఇవనొవ్నా చెప్పింది నూటికి నూరుపాళ్ళూ నిజం. ఎంతైనా ఉత్కంఠదాయకమైన విషయం కదా! మీ ప్రణాళికలోని ముఖ్యాంశాలైనా తెలుసుకుంటే బాగుంటుందని నా అభిప్రాయం. అదీగాక ఇంకా గమ్యం చేరుకోవడానికి సమయం ఉంది గదా" ఆమెను బలపరిచాడు 'వలేరియ్'.

"తప్పకుండా.." అంగీకరించాడు పెత్రోవ్. బోగీలో అన్యులెవరూ లేరు. రైలు ఫిన్‌లాండ్‌లోకి ప్రవేశించినప్పటి నుండీ ఇంతవరకూ గూఢచారుల జాడ కూడా కనబడలేదు. వారి స్వాగత సత్కారాలను అందుకోవడానికి జంకకూడదని ముందుగానే నిర్ణయించు కున్నప్పటికీ, తగిన జాగ్రత్తలు తీసుకోవడం మంచిదనుకని ద్వారం వద్ద తగిన వ్యక్తి నియమించారు. ఆ స్లీపింగ్ కార్‌లో ఉన్న వారంతా కింది సీట్లోకి మారిపోయారు, టీచరు చుట్టూ మూగే విద్యార్థుల్లాగా.

పెత్రోవ్ తన ఉపాధ్యాయ పాత్రలోకి ఒదిగిపోయాడు గానీ, స్వరం తగ్గించాడు.

"కామ్రేడ్స్, ముందుగా మనం చెయ్యాల్సిందేమంటే, మన పార్టీ పేరుని మార్చేయ్యడం..."

ఉపాధ్యాయుడి పాఠం పూర్తి కాకుండానే, విద్యార్థులు ప్రశ్నలు కురిపించారు..."ఎందుకాపని చెయ్యడం?", "పేరు మార్చడం వల్ల ఉపయోగం ఏమిటి?", "మన పార్టీ పేరు ఆకర్షణీయంగా లేదా?", "పేరేనా, సిద్ధాంతం కూడానా?"

విద్యార్థుల అల్లరిని ఆస్వాదించే ఉపాధ్యాయునిలా పెత్రోవ్ చిరునవ్వు నవ్వి, వస్కావ్ వంక తిరిగాడు. "కామ్రేడ్ వస్కోవ్.. నీ చొక్కా మాసిపోయి, చినిగిపోయిందనుకో అప్పుడేం చేస్తావ్?" అని ప్రశ్నించాడు.

"ఎవరైనా ఏం చేస్తారు కామ్రేడ్...దాన్ని తీసిపారేసి, ఇంకోటి వేసుకుంటారు" అన్నాడు వస్కోవ్ తేలిగ్గా.

"అంతే కదా. మరి పార్టీ విషయంలోనూ అంతే. అవకాశవాదులు, జాతీయ దురహంకారులు, సోషలిజం ప్రాథమిక సూత్రాలకే ద్రోహం చేసిన వారు, సోషల్ డెమోక్రాట్లమని పిలుచుకుంటున్నారు. శ్రామిక వర్గం గందరగోళ పడకుండా (వీరిలో చాలా మంది నేడు రైతాంగం నుంచి వచ్చారు) ఉండేందుకు, బోల్షివిక్కులమైన మనకూ, వారికీ తేడా స్పష్టంగా తెలిసేందుకు, ఇక నుంచి మనల్ని 'కమ్యూనిస్టుల'మని పిలుచుకుందాం. ఇదే సరైనది, శాస్త్రీయమైనది. ఎందుకంటే మన లక్ష్యం కమ్యూనిజమే. మార్క్స్,

ఎంగెల్స్‌లు తమ పార్టీకి ఇదే పేరు పెట్టారు. సరే, ఇప్పుడు మీకొక చిన్న ప్రశ్న. సోషలిజానికి, కమ్యూనిజానికీ గల భేదాన్ని ఒకే ఒక్క వాక్యంలో చెప్పాలి. ఎవరు చెబుతారు?" పెత్రోవ్ అందరి వంకా చూశాడు.

ఒకరిద్దరు తప్ప దాదాపు అంతా చేతులెత్తారు.

"మంచిది. మీలో అందరికన్నా యువకుడు కామ్రేడ్ 'కొరొస్తెల్యోవ్' చెబుతాడు" అన్నాడు పెత్రోవ్.

"ఓ చెబుతాను.." ఉత్సాహంగా అన్నాడు కొరొస్తెల్యోవ్. "సోషలిజంలో ప్రతి వ్యక్తికీ అతడు చేసిన పనిని బట్టి ప్రతిఫలం దక్కుతుంది. కమ్యూనిజంలో ప్రతివాడూ తన సామర్థ్యాన్ని బట్టి పని చెయ్యాలి. అతని అవసరాన్ని బట్టి ప్రతిఫలం పొందుతాడు."

"అదీ, బాగా చెప్పావ్..." కొరొస్తెల్యోవ్ భుజం తట్టాడు పెత్రోవ్. దీంతో ఆ యువకుడు సిగ్గుతో మెలికలు తిరిగిపోయాడు.

"సరే, అయితే ఒక ముఖ్య విషయం ఏమంటే మనిషికి పేరు అనేది ఎలా సంకేతమో, పార్టీకి కూడా పేరు ఒక సంకేతమే. కానీ రెంటికీ తేడా ఏమంటే మనుషులు తమ పేర్లు తాము పెట్టుకోరు. పెద్దలు పెడతారు. అందువల్ల ఆ మనిషికి గల పేరు అతని వ్యక్తిత్వానికి సూచకంగా చెప్పలేం. కానీ పార్టీ పేరు అలా కాదు. దాని లక్ష్యాలు, సిద్ధాంతాలకు అది సూచకం. కమ్యూనిజం సాధించడం మన లక్ష్యం కదా, అయితే దాన్ని ఎలా సాధించాలి? అది తెలుసుకోబోయే ముందు, మనం ఎక్కణ్ణుంచి మొదలెట్టాలో తెలుసుకోవాలి..." ఒక్కసారి ఆగి, అందరి వంకా పరిశీలించాడు పెత్రోవ్.

కథ వింటున్న విద్యార్థుల్లా సహచరులంతా ఆసక్తితో తన వంకే రెప్ప వెయ్యకుండా చూడ్డం గమనించాడతడు. సంతృప్తికరంగా తలూపి,"ఇప్పుడు ప్రజల తక్షణ అవసరాలు మూడు: ఒకటి, ప్రజలకు శాంతి, రెండు రైతులకు భూమి, మూడు అన్నార్తులకు రొట్టి. వీటిలో మొదటిదైన 'శాంతి' విషయానికి వస్తే, ఇప్పుడున్న తాత్కాలిక ప్రభుత్వం బూర్జువాల చేతుల్లో ఉన్నందున, ఈ యుద్ధానికి సంబంధించిన పలు కాంట్రాక్టుల ద్వారా పెట్టుబడిదారులు అపార లాభాలు మూటకట్టుకుంటున్నందున, అంతేగాక, ఇంగ్లండ్, ఫ్రాన్స్‌లకు చెందిన పెట్టుబడిదారులతో వీరికి పలు లంకెలు ఉన్నందున, తాత్కాలిక ప్రభుత్వం యుద్ధాన్ని కొనసాగిస్తుందే తప్ప, అంతమొందించదు. అంచేత ఈ పెట్టుబడిదారీ వర్గాన్ని కూలదోస్తే తప్ప యుద్ధాన్ని అంతమొందించలేం..."

"అయితే కామ్రేడ్... ఈ తాత్కాలిక ప్రభుత్వాన్ని కూలదొయ్యమని పిలుపిస్తే ఎలా ఉంటుంది?" మధ్యలోనే అందుకున్నాడు వస్కోవ్.

"ఆ తొందర పాటే తగదు. ఎందుకంటే సోవియట్లు తాత్కాలిక ప్రభుత్వాన్ని బలపరుస్తున్నారు. అందువల్ల మనం చెయ్యాల్సిందల్లా ప్రజలకు ఈ ప్రభుత్వ స్వభావాన్ని ఓపిగ్గా వివరించడం, అదీ ప్రజల దైనందిన అవసరాలకు అనుగుణంగా ఉండాలి. అదే సమయంలో రాజ్యాధికారాన్ని సోవియట్లకు, ముఖ్యంగా కార్మిక ప్రతినిధుల సోవియట్లకు అప్పగించాలని చెప్పాలి. అందువల్ల మనం ఈ ప్రభుత్వాన్ని కూలదొయ్యాలని గాక, ఈ ప్రభుత్వాన్ని ఎవరూ బలపరచకూడదని నినదించాలి" వివరించాడు పెత్రోవ్.

"ఈ రెంటికీ తేడా ఏమిటి?" వస్కోవ్ బుర్ర గోక్కున్నాడు.

"కొంచెం బుర్ర పెట్టి ఆలోచిస్తే నీకే అర్థమవుతుంది కామ్రేడ్" పెత్రోవ్ అతని భుజం తట్టాడు. "ప్రజలు ఈ ప్రభుత్వంపై ఎంతో నమ్మకం పెట్టుకున్నారు కదా, ఇది తమనెంతో ఉద్ధరిస్తుందని, త్వరలోనే తమ కష్టాలన్నిటినీ తీరుస్తుందనీ! కానీ ఆ కష్టాలు ఎప్పటికీ తీరకపోవడం చూస్తున్నారు. వారు అసంతృప్తి చెందకుండా రాజీవాదులు బుజ్జగిస్తున్నారు. మనం ఈ రాజీవాదుల్ని బట్టబయలు చేస్తామన్నమాట. వాళ్ళ మాటలు అబద్ధాలని, ఈ తాత్కాలిక ప్రభుత్వ అసలు ఉద్దేశాలు వేరే ఉన్నాయని, ఆ ఉద్దేశాల కనుగుణంగానే పాలన సాగుతోందని, అందువల్ల ఈ ప్రభుత్వ పాలనలో ఎన్నటికీ ప్రజల కష్టాలు తీరవనీ విశదీకరిస్తాం. అందువల్లనే సామ్రాజ్యవాద యుద్ధం కొనసాగినంతకాలం ఈ తాత్కాలిక ప్రభుత్వం కూడా యుద్ధాన్ని సాగిస్తూనే ఉంటుంది తప్ప, శాంతి నెలకొనదని తెలియజేస్తాం" విశదీకరించాడు పెత్రోవ్.

"మరి మిగతా రెండూ భూమి, రొట్టి - వాటి గురించి?" రెమిజోవ్ ప్రశ్నించాడు.

"బాగా గుర్తు చేశావ్..." పెత్రోవ్ రెమిజోవ్ వంక ప్రశంసా పూర్వకంగా చూసి, అన్నాడు "రైతులకు తెలిసిన పని వ్యవసాయం చెయ్యడమే. అది ఎస్టేటుదారుల దగ్గర కావలిసినంత ఉంది. ఈ ఎస్టేటుదారులే నేడు పెట్టుబడిదారుల అవతారం ఎత్తారు. నల్లనూర్ల దండులు (బ్లాక్‌హండ్రెడ్స్) వీరి నుంచే వచ్చారు. అందువల్ల ఈ తాత్కాలిక ప్రభుత్వం ఈ ఎస్టేటుదారుల భూమిని అంటుకోదు. అందువల్ల మనం భూమినంతటినీ, ఎస్టేటుదారుల భూములతో సహా జాతీయం చెయ్యమని పిలుపునివ్వాలి. సోషలిజంలో మనం చేసేది అదే. ఇక రొట్టి అంటివి, పండిన పంటను వ్యాపారులు కొని నిల్వ చేసి బ్లాక్ మార్కెట్టుకు తరలిస్తున్నారు. అదంతా స్వాధీనం చేసుకొని అన్నార్తులందరికీ రొట్టెనందించాలని కోరాలి.."

"అయితే మనం కోరినంత మాత్రాన ప్రభుత్వం అదంతా చేస్తుందంటావా కామ్రేడ్ పెత్రోవ్?" సందేహం వెలిబుచ్చాడు వలేరియ్.

"చెయ్యదు" ధృఢ స్వరంతో బదులిచ్చాడు పెత్రోవ్. "ప్రజలు కోరే వాటిని అన్నింటినీ ఏ బూర్జువా ప్రజాస్వామిక ప్రభుత్వమూ చెయ్యదు. అందుకే మనం ఉద్యమిస్తాం. ప్రజల్ని కదిలిస్తాం. ఆ క్రమంలో రాజీవాదుల, బూర్జువాల నిజస్వరూపం ప్రజలకు అవగతమవుతుంది. దాంతో ప్రజలు తమకు నిజంగా మేలు చేసేదెవరో గ్రహిస్తారు..."వివరించాడు పెత్రోవ్.

"ఈ మూడు డిమాండ్ల తోనే సోషలిజం వచ్చేస్తుందా?" అమాయకంగా మొహం పెట్టి అడిగాడు వలేరియ్.

"కామ్రేడ్ వలేరియ్‌కి తొందరెక్కువ" పెత్రోవ్ చివాట్లు పెట్టాడు. "కొంచెం ఓపిక పట్టు మరి.." తిరిగి సముదాయించాడు "...పై మూడు నినాదాలూ ప్రజల తక్షణ కోర్కెలకు సంబంధించినవని ముందే చెప్పుకున్నాం కదా! ఇక బూర్జువా విప్లవం నుండి సోషలిస్టు పరివర్తనకు ప్రాథమిక దశకు సంబంధించిన నిర్దిష్ట కార్యక్రమం ఆర్థిక రంగానికి సంబంధించి ఏమిటంటే - బాంకులన్నింటినీ ఒకే బాంకుగా కలిపేసి, దాన్ని కార్మిక ప్రతినిధుల సోవియట్ అజమాయిషీలో ఉంచడం, అలాగే సమాజం చేసే మొత్తం ఉత్పత్తినీ, దాని పంపకాన్నీ కూడా అదే సోవియట్ పెత్తనం కింద ఉంచడం. ముందే చెప్పుకున్న మొత్తం భూమినంతటినీ జాతీయం చెయ్యడం

కూడా ఈ ఆర్థిక రంగానికి సంబంధించిన కార్యక్రమమే. ఈ మూడూ అతి కీలకమైనవి. వీటిని చూసి బూర్జువాల సంగతి అట్లా ఉంచడం, రాజీవాదులూ అవకాశవాదులూ బెంబేలెత్తిపోవడం ఖాయం!" అగాడు పెత్రోవ్.

"మరి రాజకీయ రంగం మాటేమిటి?" ఈసారి ఇవనోవ్నా ప్రశ్నించింది.

"ఈ విషయంలో మనం మార్క్సిస్టు సిద్ధాంతపరంగానూ, ఆచరణ పరంగానూ ఒక గొప్ప ముందడుగు వెయ్యబోతున్నాం. అదేమిటంటే పార్లమెంటు రిపబ్లిక్కు నుండి సోవియట్ల రిపబ్లిక్కుకు పరివర్తన చెందడం! ఇప్పటిదాకా సోషలిజం సాధించడానికి పార్లమెంటరీ రిపబ్లిక్ చక్కని రాజకీయ సాధనంగా మార్క్సిస్టు సిద్ధాంతకర్తలు భావిస్తూ వచ్చారు. కానీ అంతకన్నా కూడా, సోవియట్ల రిపబ్లిక్ మరింత ఉత్తమ సాధనమని నా భావన. ఎందుకంటే అసలు సోవియట్లు ఏర్పడటం అన్నదే చరిత్రలో మొదటి సారిగా రష్యాలో ఇటీవలి కాలంలో జరిగింది. వాటి ద్వారా కొన్ని అనుకోని మంచి ఫలితాలు సాధించడం చూశాం. కనుక వీటిని పూర్తి స్థాయిలో ఉపయోగించుకోగలిగితే, అనూహ్యంగా మన లక్ష్యాన్ని సునాయాసంగా చేరతామని నేను నమ్ముతున్నాను. అందువల్ల విప్లవ ప్రభుత్వం సోవియట్ల ద్వారానే ఏర్పడుతుంది. దీన్ని ఇంకా సరిగ్గా చెప్పాలంటే సోవియట్లే, ముఖ్యంగా కార్మిక ప్రతినిధుల సోవియట్లే విప్లవ ప్రభుత్వ స్వరూపం. ఈ విషయాన్ని మనం ప్రజా సామాన్యంలోకి విస్తృతంగా తీసుకెళ్ళాలి. అందువల్ల "అధికారమంతా సోవియట్లకే!" అనే నినాదాన్ని బలంగా వినిపించాలి" అంటూ పెత్రోవ్ తన సహజసిద్ధమైన వాక్చాతుర్యంతో, పదాల సంక్షిప్తతతో, అద్యతన భవిష్యత్తులో ఏప్రిల్ థీసెస్‌గా ప్రసిద్ధికెక్కబోతున్న సిద్ధాంతాన్ని బోగీలోని తన సహచరులకు వివరించాడు.

పెత్రోవ్ తన మాటల్ని అలా ముగించాడో లేదో, తన ప్రణాళిక వారికెంత వరకూ అర్థమయ్యిందో తెలుసుకునే లోపే, వారు గేటు దగ్గర కాపలా పెట్టిన కామ్రేడ్ గబగబా తన స్థానం నుండి వారి దగ్గరకు పరుగెత్తుకు వచ్చాడు. వచ్చీ రావడంతోనే, "కామ్రేడ్ పెత్రోవ్... జాగ్రత్తగా ఉండండి... కొద్దిసేపట్లోనే స్టేషన్ సమీపించబోతోంది... అదిగో... వచ్చేసింది... ఏదో గందరగోళంగా ఉన్నట్లు కనిపిస్తోంది. ఎవరో జనం కూడా ఉన్నట్లున్నారు..." అంటూ హడావిడి చేశాడు.

అతని మాటలు పూర్తికాక మునుపే, రష్యన్ భూభాగంలోని మొదటి రైల్వేస్టేషన్ 'బెలొఓస్ట్రోవ్' రానే వచ్చింది. కనుచీకటి పడిన ఆ సమయంలో స్టేషన్ అంతా విద్యుద్దీపాలతో ధగధగలాడుతోంది. జనం హడావిడిగా అటూ ఇటూ తిరగడం పెట్టెలోని కామ్రేడ్లంతా దూరం నుంచే గమనించారు. సరే కానిమ్మనుకున్నారు. పడబోయే సంకెళ్ళకు ఆత్రుత ఎందుకు? అవి పడాల్సిన చేతులకు ఎలాగూ పడతాయి. అంతమాత్రం చేత వాటి కోసం ముందుగానే చేతులు చాచుకు కూర్చోనవసరం లేదుగా అనుకున్నారు అంతా.

చివరికి స్టేషన్‌లో రైలు ఆగనే ఆగింది. అయితే వారూహించినట్లు డజన్ల కొద్దీ పోలీసులు రైలును చుట్టుముట్టి, బోల్షివిక్కులున్న కంపార్టుమెంటులోకి కూడా జొరబడి, వారి చేతులకు సంకెళ్ళు వెయ్యలేదు. అందుకు బదులు, అనూహ్యంగా, అంతకు మించి ఆశ్చర్యకరంగా వందలాది శ్రామికజనానికి చెందిన స్త్రీ పురుషులు ఎర్రజెండాలతో వచ్చి రైలును చుట్టుముట్టడమే గాక, పెత్రోవ్‌ను కంపార్టుమెంటునుంచి బయటకు తోడ్కొని వచ్చి, ఆపై తమ భుజాల మీదికెత్తుకొని ప్లాట్‌ఫారం పైకి తీసుకొచ్చారు. ఈ హఠాత్సంఘటనకు ఉక్కిరిబిక్కిరైన పెత్రోవ్, ఆ వచ్చిన జనంలో తన స్వంత కుటుంబ సభ్యుల్ని కూడా గుర్తించలేకపోయాడు.

'బెలొఓస్ట్రోవ్' స్టేషన్‌లో రైలు కొద్ది నిమిషాలు మాత్రమే ఆగుతుంది. అంచేత పెత్రోవ్ ఆ ప్లాట్‌ఫాం మీదనే నిలబడి, ఫిబ్రవరి విప్లవం సోషలిస్టు విప్లవానికి నాందీ ప్రస్తావన అని, దానికోసం బోల్షివిక్కులకి మద్దతు పలకమని కోరి, తిరిగి రైలెక్కాడు. ఇదంతా పోలీసుల ట్రిక్కై ఉంటుందని భావించాడతడు. తనకు వారినుంచి 'అసలైన' సత్కారం పెత్రోగ్రాడ్‌లో జరగనుందని, అక్కడి 'ఫిన్లండ్' రైలుస్టేషన్‌లో పకడ్బందీ ఏర్పాట్లు జరిగి ఉంటాయని ఊహించాడు.

చీకట్లు అంతకంతకూ దట్టమైనాయి. అర్ధరాత్రి సమయం. రాజధాని పెత్రోగ్రాడ్‌లో విద్యుత్తుదీపాలు దూరంగా మినుకు మినుకుమంటూ వెలుగుతున్నాయి. నెమ్మదిగా రైలు ఫిన్లండు స్టేషన్‌లో ఆగింది. రైలు దిగకుండా పోలీసుల కరకు పదఘట్టనల కోసం ఎదురు చూశాడు పెత్రోవ్. ధన్...ధన్...ధన్... వరసబెట్టి తుపాకీ కాల్పులు...ఆదరాబాదరా బయటకు పరుగెత్తుకెళ్ళారు పెట్టెలోని జనం.

ప్లాట్‌ఫారంపై రెండు వరుసలుగా నిలబడ్డ వందలాది నావికులు, సైనికులూ, మెషీన్‌గన్నర్లు...సైనిక వందనం... బాండ్‌మేళం వారి 'మర్సియిలేయ్స్' వాదనం... గార్డ్ ఆఫ్ ఆనర్ ఆఫీసర్ క్లుప్త నివేదిక...వీటన్నిటికీ సమాధానంగా "సోషలిస్టు విప్లవం వర్ధిల్లాలి" అన్న నినాదం ఇచ్చాడు పెత్రోవ్.

వెయిటింగ్ రూంలో కార్మిక, సైనిక, రైతుల సోవియట్ల ఎగ్జిక్యూటివ్ కమిటీ ప్రతినిధిగా వచ్చిన తాత్కాలిక ప్రభుత్వంలో సభ్యుడు, మెన్షివిక్ అయిన 'ఛెయిద్‌జె' యొక్క పనికిమాలిన స్వాగతం అంటే ఈ ప్రభుత్వం బోల్షివిక్కులతో తలపడకుండా మంచిమాటలతో లొంగదీసుకోవాలని చూస్తోందన్నమాట. నవ్వుకున్నాడు పెత్రోవ్. సమాధానంగా తిరిగి "సోషలిస్టు విప్లవం వర్ధిల్లాలి" అన్న నినాదం!!! స్టేషన్ బయట వేలాది కాదు లక్షలాది జనం.. చౌకు అంతా ఇసక వేస్తే రాలనంతగా... బెల్ఓస్ట్రోవ్‌కి ఎన్నో రెట్లు ... కార్మిక ప్రతినిధుల కోర్కెపై ఉపన్యసించేందుకు జనం మధ్య నుంచి కవచ శకటం పైకి నడిచాడు శ్రామికజన బాంధవుడు కామ్రేడ్ పెత్రోవ్, ఉరఫ్ వ్లాదీమిర్ ఇల్యీచ్ ఉల్యానొవ్, ఉరఫ్ లెనిన్!

వివరణలు

1. మొదటి సామ్రాజ్యవాద ప్రపంచ యుద్ధం :- మొదటి ప్రపంచయుద్ధం(1914-1918). బ్రిటన్, ఫ్రాన్స్, రష్యాలు కలిసి మొదటి త్రైరాజ్య కూటమిని ఏర్పాటు చేసాయి. జర్మనీ, ఆస్ట్రియా-హంగరీ, ఇటలీ - ఇవి మూడూ మరో సామ్రాజ్యవాద ముఠాగా ఏర్పడ్డాయి. కానీ 1914లో యుద్ధం ప్రారంభమయ్యాక ఇటలీ ఈ ముఠాను విడిచి మొదటి కూటమిలో చేరింది. రెండో కూటమిని బల్గేరియా, టర్కీలు బలపరిచాయి.

2. రష్యాలో మొదటి విప్లవం :- 1905-07 ల మధ్య జార్‌కి

వ్యతిరేకంగా రష్యాలో మొదటి విప్లవం జరిగింది. 1917 ఫిబ్రవరిలో జరిగింది రెండవ విప్లవం. కాగా 1917 అక్టోబరులో జరిగింది మూడో విప్లవం.

3. (బ్లాక్‌హండ్రెడ్స్) నల్లనూర్లదండు :- కార్మికులకు, రైతులకు ఘోర శత్రువులైన వీరు ఫ్యూడల్ భూస్వాముల ప్రతినిధులు. వీరిచే నియమించబడ్డ రౌడీ ముఠాలు విప్లవకారులైన కార్మికుల్ని, రైతుల్ని కొరడాలకు, తుపాకులకు గురిచేశారు. మీటింగులు జరిగిన ప్రాంతంపై దాడులకు పాల్పడ్డారు. యూదులపై వేట సాగించారు. ప్రదర్శనలపై కాల్పులు సాగించేవారు. ప్రగతిశీల మేధావులపై దాడులు చేసేవారు.

4. బోల్షివిక్కులు, మెన్షివిక్కులు :- రష్యన్ సోషల్ డెమోక్రాటిక్ ఉద్యమంలో రెండు ధోరణులు. 1903లో జరిగిన పార్టీ మహాసభలో జరిగిన ఎన్నికల్లో మెజారిటీ వచ్చిన వారిని బోల్షివిక్కులనీ, మైనారిటీ వచ్చిన వారిని మెన్షివిక్కులనీ అన్నారు. బోల్షివిక్కుల నాయకుడు లెనిన్. కాగా మెన్షివిక్కులు లెనిన్ విప్లవవాదానికి వ్యతిరేకంగా, అవకాశవాదాన్ని చేపట్టారు. విప్లవంలో కార్మిక వర్గ నాయకత్వాన్ని, రైతాంగంతో పొత్తును వీరు వ్యతిరేకించారు. అంతేగాక ఉదారవాద బూర్జువాలతో ఒప్పందాన్ని కోరారు. 1917 ఫిబ్రవరి విప్లవంలో తాత్కాలిక ప్రభుత్వంలో మంత్రిపదవులు స్వీకరించారు.

5. కాడెట్లు :- కాన్‌స్టిట్యూషనల్ డెమోక్రాటిక్ పార్టీ సంక్షిప్త నామం. రష్యాలో ఉదారవాద రాజరికవాద బూర్జువాల ప్రధాన పార్టీ ఇది. దీని సభ్యులు ప్రధానంగా బూర్జువా భూస్వాముల ప్రతినిధులు. కాడెట్లు ప్రధానంగా రాజ్యాంగబద్ధ రాజరికాన్ని కోరారు. మొదటి ప్రపంచ యుద్ధంలో జార్ విదేశాంగ విధానాన్ని బలపరిచారు. 1917 ఫిబ్రవరిలో బూర్జువా ప్రజాతంత్ర విప్లవం ప్రారంభమైనప్పుడు రాజరికాన్ని రక్షించడానికి ప్రయత్నించారు. బూర్జువా తాత్కాలిక ప్రభుత్వంలో ప్రముఖంగా ఉండి, ప్రజా వ్యతిరేక, విప్లవ ప్రతీఘాతుక విధానాల్ని అవలంబించారు.

6. సోషల్ డెమోక్రటిక్ పార్టీ :- రష్యాతో పాటు యూరప్‌లోని మార్క్సిస్టులు ఈ పేరుతోనే వ్యవహరించారు.

7. సోషలిస్టు రివల్యూషనరీలు :- వివిధ నరోద్నిక్ బృందాల విలీనంతో ఏర్పడ్డారు. వీరు కార్మిక వర్గానికీ, రైతాంగానికీ మధ్య వర్గ విభేదం చూడకుండా, రైతాంగంలో వివిధ పొరలను చూడకుండా, విప్లవంలో కార్మిక వర్గ నాయకత్వ పాత్రను తిరస్కరించారు. మొదటి సామ్రాజ్యవాద ప్రపంచ యుద్ధంలో వీరిలో అధికభాగం సోషల్ జాతీయ దురహంకారవైఖరి తీసుకున్నారు. 1917 ఫిబ్రవరి బూర్జువా విప్లవంలో మెన్షివిక్కులతో కలిసి బూర్జువా ప్రభుత్వానికి అండగా, మంత్రివర్గంలో చేరారు. భూఎస్టేట్లను వశపరచుకున్న రైతాంగం మీద శిక్షణాత్మక దాడులకు పూనుకున్నారు.

8. స్విట్జర్లాండ్‌లోని జిమ్మెర్‌వాల్ట్, కాంథాల్‌లలో జరిగిన అంతర్జాతీయ కాన్ఫరెన్సులు :- మొదటి కాన్ఫరెన్సు 1915 సెప్టెంబరు 5-8 మధ్య జిమ్మర్‌వాల్ట్ లోను, రెండోది 1916, ఏప్రిల్ 24-30 మధ్య కాంథాల్‌లో జరిగాయి. లెనిన్ చొరవతో జరిగిన ఈ కాన్ఫరెన్సులు యూరప్‌లోని సోషల్ డెమోక్రటిక్ ఉద్యమంలోని వామపక్ష అంశాలు మార్క్సిజం, లెనినిజం పునాదిగా జరిగాయి. సామ్రాజ్యవాద యుద్ధానికి వ్యతిరేకంగా, కార్మికవర్గ అంతర్జాతీయత ధ్యేయంగా ఇవి జరిగాయి.

9. సెంట్రిస్ట్ వైఖరి :- అంటే మధ్యే మార్గం. సామ్రాజ్యవాద యుద్ధాన్ని బలపరిచే జాతీయ దురహంకారానికీ, వ్యతిరేకించే వామపక్ష (విప్లవ) సోషల్ డెమోక్రాట్లకు లేదా బోల్షివిక్కులకు మధ్యస్థ వైఖరి. ఇలాంటి వైఖరి కలిగి ఉన్నామని చెప్పే సెంట్రిస్టులు, నిజానికి ఆచరణలో సోషల్ జాతీయ దురహంకారుల్ని సమర్థించారు. (సోషల్ డెమోక్రసీ పేరుతో జాతి దురహంకారాన్ని వెలిబుచ్చేవారిని సోషల్ జాతీయ దురహంకారులంటారు) ఈ సెంట్రిస్టులు యుద్ధాన్ని ఎదిరించే 'అతివాద' పదజాలాన్ని ఉపయోగిస్తూనే, పరోక్షంగా యుద్ధాన్ని బలపరిచారు (యుద్ధ రుణాలకు వ్యతిరేకంగా ఓటు చెయ్యకుండా, గైరుహాజరు కావాలన్నారు) అంతేగాక యుద్ధకాలంలో వర్గపోరాటాన్ని వరిత్యజించాలని పిలుపునిచ్చారు. కౌట్స్కీ, ట్రాట్స్కీ, మార్టోవ్ తదితరులు ప్రముఖ సెంటిస్టులు.

10. మిలుకోవ్ :- కాడెట్ నాయకుడు. ఫిబ్రవరి తాత్కాలిక ప్రభుత్వంలో విదేశాంగ మంత్రి.

11. ప్లెహానొవ్ :- రష్యాలో మొదటి మార్క్సిస్టు. అంతర్జాతీయ కార్మికోద్యమంలో ప్రముఖుడు. అయితే ఇతడు అవకాశవాదాన్ని అవలంబించి మెన్షివిక్కులతో చేరిపోయాడు. సామ్రాజ్యవాద యుద్ధ కాలంలో సోషల్ జాతీయ దురహంకార స్థావరాన్ని కూడా తీసుకుని దిగజారిపోయాడు.

12. కౌట్స్కీ :- జర్మన్ సోషల్ డెమోక్రాట్ల నాయకుడు. మొదట మార్క్సిస్టు. ఆ తర్వాత దాన్ని వదిలేసి అవకాశవాద మధ్యస్థర కాలంలో హానికరమైన 'సెంట్రిజం' కు సిద్ధాంతకర్త అయ్యాడు. లెనిన్ ఇతన్ని 'సామ్రాజ్యవాదం...' గ్రంథంలో, ఇతర చోట్ల తీవ్రంగా విమర్శించాడు.

13. స్టోలీపిన్ :- 1906-11 మధ్య జార్ ప్రభుత్వంలో ప్రధాని, ఆంతరంగిక శాఖా మంత్రిగా ఉండి విప్లవోద్యమంపై పాశవిక దాడులు సాగించాడు. వేలాది విప్లవకారుల్ని ఉరికంబా లకెక్కించి, చిత్రహింసల పాలు చేశాడు. దేశమంతటా ఉరికంబాలను నెలకొల్పాడు. ఆ రోజుల్లో వాటిని 'స్టోలీపిన్ నెక్‌టై' అని పిలిచేవారు. ఇతని కాలాన్ని 'స్టోలీపిన్ అభివృద్ధి నిరోధక అంధకారయుగం' అంటారు.

14. డిసెంబరిస్టులు :- జార్ నిరంకుశత్వానికి, భూ బానిసత్వానికి వ్యతిరేకంగా 1825 డిసెంబరులో జరిగిన తిరుగుబాటును దారుణంగా అణచివేశారు. ఈ తిరుగుబాటులో పాల్గొన్నది అధికంగా ప్రభువర్గానికి చెందిన సైనికాధికారులు. ఉన్నత వంశీకులూ, విప్లవకారులు, దేశభక్తులే.

మట్టివాసనలు : కళాకారులతో కాసేపు.....

- సాధన

వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. చిన్న-చిన్న ఒర్రెలు కూడా ప్రయాణానికి ఆటంకం కలిగిస్తున్నాయి.రైతులు మాత్రం చాలా ఆనందంగా దుక్కులు దున్నుతున్నారు. కొద్దిమంది రైతులు ఊరి కమ్మరి కొలిమి వద్ద తమ కర్రులు పట్టుకొని కమ్మరి లాలుతో కాలం గురించి కబుర్లు చేస్తున్నారు. లాలు భర్య రాజవ్వ పంఖా తింపుతుంటే కణ కణ మండుతున్ననిప్పు కణికలు వేడి సెగలు చిమ్ముతున్నాయి. ఎరుపెక్కిన కర్రును తీసి లాలు బండపై పెట్టగా తన కొడుకు ఐతాలు సుత్తితో దెబ్బ మీద దెబ్బ వేస్తున్నాడు. "ఈ యేడు కాలం కరుణించి ముందే వర్షాలు మొదలైనాయి గానీ ఆఖరుకు ఏం చేస్తాయో!" అంటూ సద్మెక్ రాజయ్య పంటల భవిష్యత్ గురించి తన సహజ ఆందోళన వ్యక్తం చేశాడు. ఆయన ఆశలన్నీ ఈ యేడు జనతన సర్కార్ ప్రజల సమష్టి శ్రమతో చదును చేసిచ్చిన పొలం పైనే!

"అవును మరి! ఏం చేస్తయో! కాలం పోకడ చూస్తే ఎనుకసిరి వానలు పోయెటట్టే ఉన్నాయి" అంటూ కమ్మరి లాలు పని చేస్తూనే రాజయ్యకు బదులు ఇచ్చాడు. ఈలోగా రాజయ్య చిన్న కూతురు ఇడిమె చేతిలో చిన్న సంచి పట్టుకొని ఇంట్లో నుంచి బయలుదేరడం చూసిన లాలు, "పిచ్చి పోరీ! పాట అంటే మహా సంబరం" అంటూ మమకారంతో ఇడిమె వంక చూశాడు.

ఇడిమె పేరుకు తగ్గట్టు విచ్చుకున్న ఇప్ప పూవులా ఉంటుంది. ఆమె చేతనా నాట్య మంచ్ (సి.ఎన్.ఎం.) సభ్యురాలు. 16 ఏళ్ళు దాటని ఇడిమె చేతిలో ఉన్న జోరలో కాలిగజ్జెలు, ఆలీవ్‌గ్రీన్ లాంగా, ఓనీ, జాకెట్టు, ఎర్రని జండా గుడ్డ ఉన్నాయి. అందరాడపిల్లల్లాగే ఇడిమెకూ ఆట-పాటలంటే ఎంతో మక్కువ. ఆట-పాటలంటే ఆదివాసీలందరికీ వాళ్ళ జీవితంలో విడదీయరాని ఒక భాగమే అయినప్పటికీ ఊళ్ళలో పెరుగుతున్న యువతరానికి గత దశాబ్దకాలంగా సిఎన్ఎం ఒక సమీకృత కేంద్రమైంది.

పరుగులాంటి నడకతో పోతున్న ఇడిమె తన వెనుక ఉన్న దళాన్ని గమనించలేదు. తన జట్టువాళ్ళంతా జమై ఉంటే తానే వెనుకబడిపోతానన్న గాబరాతో వెళ్తున్న ఇడిమెకు డప్పుల చప్పుడు వినబడడంతో నడక పరుగై జట్టులో కలిసిపోయింది. ఆ వెనుకే దళం అక్కడికి చేరుకుంది.

మునిమాపు వేళ. వర్షం ఆగింది. వారం రోజులుగా కనుమరుగైన ఎండ కాసేపు తొంగి చూడడంతో ఆకాశంలో ఏర్పడ్డ సప్తవర్ణాల ఇంద్రధనుస్సు చూడముచ్చటగా ఉంది. జూలై 28 కోసం ఆట-పాటలు ప్రాక్టీసు చేస్తున్న సి.ఎన్.ఎం. కళాకారులను దళం ముచ్చటగా చూస్తుంది. ఆకాశంలోని సప్తవర్ణానికి ప్రతీకలుగా ఆ జట్టు సభ్యులున్నారు. నెగడు మంట కోసం కొద్దిమంది కర్రలు జమ చేస్తున్నారు. నిప్పు రాజేసే వాళ్ళు తమ పని తాము చేస్తున్నారు.

చీకటి పడడంతో నెగడు వెలుతుర్లలో వాళ్ళ ఆటా-పాటా సాగుతోంది. చుట్టూ దట్టమైన పచ్చని అడవి ఉండడంతో మంటల వెలుతురు ఎక్కువ దూరం పోవడం లేదు. ఆ జట్టు నుండే గంటకు ఒకరు చొప్పున సెంట్రీ డ్యూటీ చేస్తున్నారు. వర్షాకాలం కావడంతో ఆ చీకట్లో మిణుగుర్ల వెలుతుర్లు ప్రకృతి అందాలకు మరింత వన్నె తెస్తున్నాయి.

ఒకవైపు గెరిల్లాలనూ మరోవైపు కళాకారులను తదేకంగా చూస్తున్న నాలో సాయుధ సైన్యం, సాంస్కృతిక సైన్యాల గురించి, వాటి-వాటి ప్రాధాన్యతల గురించి కామ్రేడ్ మావో చెప్పిన విషయం తళుక్కుమంది. సంస్కృతి యొక్క ఆవశ్యకతను అర్థం చేసుకోవడానికి ఆయన సంస్కృతి గురించి తెలియని సైన్యం నిస్తేజమైనదనీ, అలాంటి సైన్యం విప్లవోద్యమాన్ని జయించలేదని కూడా స్పష్టం చేసిన తీరు కూడా స్ఫురించి ఇక్కడ ఆ రెండూ కూడా జమిలిగా సాగిపోతూండడం విప్లవ విజయానికి హామీగా ఉందనిపించింది. ఈలోగా భోజనాల సమయం కావడంతో అందరూ కిచన్ వైపు దారి తీశారు. నేనూ వారి వెనుకే నడిచాను.

భోజనాలు ముగించుకున్నాక నేను సి.ఎన్.ఎం. కళాకారులతో కూచున్నాను.ప్రజాకళలను విప్లవీకరించడంలో వాళ్ళకు ఎదురవుతున్న నూతన అనుభవాలను తెలపాలనీ కోరడంతో వాళ్ళంతా ఎంతో సంబరపడిపోయారు. ఎవరు దేని గురించి చెప్పాలో అనుకొని ముందు తమ జట్టు బాధ్యురాలైన గల్లేను చెప్పమన్నారు. గల్లే కాసేపు మౌనం వహించింది. ఆ మౌనంలో ఆమె తన అనుభవాల్లోకి వెళ్ళినట్టుంది. ఆ సమయాన ఆమె వాలకం చూస్తే పేరుకు తగ్గట్టే ఉందనిపించింది. నేల తల్లి ఒడిలో నుంచి తవ్వి తీసే ఒక కందమూలం పేరు గల్లే. సి.ఎన్.ఎం. కళాకారిని గల్లే కూడా కాసేపట్లో తన జ్ఞాపకాల పొరల్లోంచి కళా అనుభవాలను తీయడం మొదలెట్టింది. ఆమె, "నేను 'గొరు మూర' పీటో(కథ) అనుభవం చెప్తాతా" నంది.

"మా జట్టు వెళ్ళిన ఊర్లో ముందు ఆ ఊరి ప్రజలందరినీ సమావేశపరిచాం. ఆడా-మగా; పిల్లా-పెద్దా అందరూ వచ్చారు. ఆ ఊళ్ళో మా ఆదివాసీ రైతు-కూలీ సంఘం నాయకుడే పీటో చెప్తుతాడు. నిజానికి ఈ కళారూపం చాలా ప్రాచీన సంప్రదాయబద్ధమైనది. కానీ క్రమంగా అడుగంటిపోతోంది. ఎక్కడో గానీ పీటో చెప్పెవాళ్ళు తారసపడరిప్పుడు. పాతతరం ప్రజలు పీటోలన్నీ చాలా శ్రద్ధగా, గతం గురించి తెలుసుకోవాలన్న కుతూహలంతో మళ్ళీ-మళ్ళీ వింటుంటారు. సంఘ నాయకుడు బూదు దాదాపు ఆ రాత్రంతా పీటో చెప్పాడు" అంటూ గల్లే ఊపిరి పీల్చుకుంది.

"సారాంశంలో పీటో ఏంటంటే" అంటూ గల్లే మళ్ళీ పీటోలోకి

వెళ్ళింది. గౌరు అనే అబ్బాయి అనాథ. కోయలో అనాథలను మూర అంటారు. అనాథ గౌరు కతే గౌరు మూర పీటో. అనాథ గౌరును ఊళ్ళో ఎవరూ పట్టించుకోరు. ఆయనకు ఎవరూ సహకరించరు. ఆకలితో ఉన్నా పచ్చి మంచినీళ్ళు కూడా పుట్టని పరిస్థితులలో అనాథ పిల్లాడు గౌరును తన అత్త తీసుకెళ్ళి పెంచి పెద్ద చేస్తుంది. ఎదిగిన గౌరు ఓ రోజు తన పాత ఊరుకు వచ్చి పగతో ఊరివాళ్ళందరినీ నరికి చంపి కసి తీర్చుకుంటాడు. ఇదీ సారాంశం. ఈ కథ పండుగలప్పుడు వరుసగా 3-4 రాత్రులు కూడా చెప్తుతారు" అంటూ గల్లే తన జట్టు వంక చూసింది.

జట్టు వాళ్ళ చూపులు గల్లే టూకీగా చక్కగా చెప్తుందంటూ తనను ప్రోత్సహిస్తున్నవిగానే ఉండడంతో గల్లే కూడా ముసిముసిగా నవ్వుతూ తన రెండు చేతుల వేళ్ళు నొక్కుకుంది."ఆ పై జరిగిన మన జట్టు చర్చలు కూడా నీవే చెప్పితే బాగుంటుంది" అంటూ జట్టులో నుంచి వినబడడంతో గల్లే 'ఇంగో'(సరే!) అంటూ ఆలస్యం చేయకుండా తన సహజ నవ్వుతో మళ్ళీ మొదలెట్టింది.

"ఉదయాన్నే మా జట్టంతా సమావేశమయ్యాం. మాతోపాటు సంఘ నాయకుడు బూదు కూడా కూచున్నాడు. గౌరు మూర పీటో పై విస్తృతంగా సమీక్షించాం. గౌరు తన వ్యక్తిగత కక్ష తీర్చుకోవడానికి గ్రామస్తులను నరికి చంపాడు. అయితే వాస్తవంగా ఆదివాసీ తెగలో తమ గోత్రం వారికి మరో గోత్రం వారు అపకారం తలపెట్టినా, నష్టం చేసినా, తమ వారిని ఎవరినైనా హత్య చేసినా బదులు తీర్చుకోవడం సాధారణ విషయం. 'తలకు తల మల్తనా', 'తలకు 12 తలా'(హత్యకు -హత్యా; హత్యకు బదులు 12 పశువుల దండుగ చెల్లించడం) కూడా ఉంది. కానీ ఈ పద్ధతీ, ఈ సంప్రదాయం వర్గ రాజకీయాలకు పొసగనిది. గత 30 సంవత్సరాలకు పైగా ఇక్కడి ప్రజలు వర్గ రాజకీయాలతో సంఘటితమవుతున్నారు. గౌరు కాలం వేరు. గౌరు తనకు సహకరించని వారిపై పగ తీర్చుకున్నాడు. ఈ రోజు గౌరు పీటో విన్న ప్రజలు ఎవరిపై పగ తీర్చుకోవాలి? వారికి సహకరించకుండా పోతోంది ఎవరు? వారిని తమ ఇండ్ల నుంచీ, భూముల నుంచీ తల్లిని మించిన ప్రాణం లాంటి అతి విలువైన తమ అడవుల నుంచీ తరమడానికి సిద్ధపడి ఒక రకంగా తమని అనాథలను చేయ పూనుకుంటున్నదెవరు? ఈ ప్రశ్నలు మా జట్టుకు కేంద్రమయ్యాయి. సంఘం బూదు చర్చల్లో చాలా చురుగ్గా పాల్గొన్నాడు. వాళ్ళ ఊరి భూములు, అడవీ, సమస్త వనరులు, సంపదలన్నీ గనుల తవ్వకం కింద పోతున్నాయి. ఈ మధ్యే 'జన్ సున్వాయి'(ప్రజాభిప్రాయ సేకరణ) పేరుతో ప్రభుత్వాధికారులు ప్రజల ప్రమేయం లేకుండానే, గ్రామసభ సమావేశం కాకుండానే అంతా జరిగినట్టు తమ తంతు తాము అధికరికంగా కొనసాగించారు. ఇదంతా అనుభవిస్తున్న బూదు చాలా స్పష్టంగా చెప్పాడు. 'నా కథలోని గౌరు తనకు సహకరించని గ్రామస్తులను కసితో నరికి చంపాడు. ఈ రోజు మేమంతా మాకు సహకరించని లూటీ(దోపిడీ) సర్కార్‌ను గౌరులాగే మట్టుబెట్టాలి' అన్నాడు. మాకూ నిజమే అన్పించింది. పేద ప్రజల మౌలిక సమస్యలకు మూల కారణం దోపిడీ ప్రభుత్వమే. కాబట్టి ప్రజలంతా కలిసి గౌరులా ప్రభుత్వంపై పగ తీర్చుకోవాలనే విధంగా ఆ పీటో సందేశాన్ని ప్రజలలోకి తీసుకెళ్ళాలనుకున్నాం. బూదు చాలా సంతోషంగా తలూపుతూ ఇకపై పీటో ఎప్పుడు చెప్పినా ఈ విధంగానే చెప్తుతానన్నాడు. బూదుతో పాటు మా సి.ఎస్.ఎం. కూడా గౌరు మూర పీటో అడుగంటిపోకుండా కొత్త సందేశంతో ప్రజల్లోకి తీసుకెళ్తుందన్నాం. బూదు 'చాలా బాగుంది' అంటూ తన సంతోషాన్ని వ్యక్తం చేశాడు. కానీ చివరన ఆసక్తికరమైన అసలు విషయాన్ని మా సంఘ అధ్యక్షులు చేర్చారు. మూడు తలల నాగుపాము మన లక్ష్యం కావాలన్నాడు. భూస్వామ్యాన్నీ, దళారీ పెట్టుబడిదారీ విధానాన్నీ, సామ్రాజ్యవాదం లను అంతం చేయాలన్నాడు. నిజమే! మేం అసలు దొంగనే చేర్చలేకపోయామన్న మా లోపాన్ని సరిదిద్దుకున్నాం. అలాగే గౌరు 'మూరల్' (అనాథ) కానీ నేడు పోరాడుతున్న విప్లవ ప్రజానీకం అనాథలు కారు. వారికి అన్ని వేళలా దిశానిర్దేశనం చేసే విప్లవోద్యమం అగ్రభాగాన నిల్చిందన్నాడు. ఇది అతి ముఖ్యమైన విషయం అనుకున్నాం. ఇకపై గౌరు మూర పీటోను మా కళారూపాల్లో చేర్చుకోవలసిందే" అంటూ గల్లే గట్టిగా ఊపిరి పీల్చుకుంది. ఆమె దేహభాష తన వంతు అయిపోయింది. మరొకరు మీ అనుభవం చెప్పమంటూ వ్యక్తం చేసింది.

గల్లే వెనకే కూచున్న సుందరి (ఈ పేరుతో అడవిలో కూర దొరుకుతుంది) ఇక తన వంతే అన్నట్టు సర్దుకుంది. నేను పర్రాంగ్ గురించి చెప్తుతానంది.

"పర్రాంగ్‌లో రెండు రకాలున్నాయి. గుట్ట పర్రాంగ్, నార్ పర్రాంగ్. నేను నార్ పర్రాంగ్ గురించి వివరిస్తా. గుట్ట పర్రాంగ్ లో పెద్ద వాయిద్యాలుంటాయి. పర్రాంగ్ అనే కళారూపం వాడుతుంటరు. ఇది చాలా పాతది. దీన్ని ప్రధానంగా వేటకు వెళ్ళే సందర్భాలలోనే వాడుతుంటరు. దీన్ని గమనిస్తే యుద్ధాలకు వెళ్ళే ముందు కూడా ఈ నృత్యం యుద్ధ పిలుపుగా కూడా వాడి ఉంటారేమో! అన్పిస్తోంది. వాయిద్యాలతో (డప్పు,డోలు, కుండుడు) ఆదివాసీలు నృత్యం చేస్తున్నప్పుడు సాధారణంగా పాట ఉండదు కదా! పర్రాంగ్ నృత్యంలోనూ పాట లేదు. పర్రాంగ్ నృత్యంలో దరువులో ఆద్యంతం గాంభీర్యత ఉట్టి పడుతుంది. జంతువును ఎలా వేటాడడమన్నది చాలా భావస్ఫోరకంగా గాంభీర్యంగా ప్రదర్శించారు. నిజంగా అలా లేకపోతే కూడా జంతువే మనిషిని వేటాడుతుంది. మొదటి రోజు మేం వాళ్ళ నృత్యాన్ని చూసి తన్మయత్వం చెందాం. మా ప్రాంతంలో ఇప్పుడు అలాంటి నృత్యం లేకపోవడంతో పర్రాంగ్ అద్భుతం అనిపించింది" అంటూ సుందరి ముగించింది. ఆమె పర్రాంగ్ గురించి చెప్తుతున్నంత సేపూ ఆమెలో కూడా అదే గాంభీర్యత వ్యక్తమైంది. ఆమె హావభావాలు ప్రాచీన సమాజపు అనుకరణ నృత్యాన్ని స్ఫురణకు తెచ్చాయి. ఈ లోగా గల్లే సుందరి వైపు చూస్తూ కనుబొమ్మలు ఎగురవేస్తూ, "ఇక మన అనుభవం చెప్పు కామ్రేడ్" అంది.

"ఏముంది! ఉదయాన్నే యథావిధిగా మా జట్టంతా సమావేశమయ్యాం. పర్రాంగ్ కు పాట జోడిస్తే ఎలా ఉంటుంది? ఇది మా ఎజెండా. అయితే ఒక విచిత్రం ఏమంటే ఆ ఊళ్ళో కుండుడు (వాయిద్యం) పై పాట ఉనికిలోకి వచ్చింది. ఇది తెగ సంప్రదాయంలో ఒక మార్పే. ఈ మార్పును తేవడం ఎప్పటి నుంచో మన సి.ఎస్.ఎం. కర్తవ్యాలలో కూడా ఉంది. మొత్తంగా మాకు ఆ ఊరి పరిస్థితులు కలిసి రావడంతో పర్రాంగ్ పై పాట పాడగలిగాం. అయితే మేం కూడా ఆ దరువు గాంభీర్యతకు సరిపడే పిఎల్‌జిఎ పాటలనే ఎంచుకున్నాం. దరువు వాళ్ళదే, డాకా (నృత్యం) వాళ్ళదే, రాగం

వాళ్ళదే కాకపోతే భావం విప్లవ రాజకీయాలది. ఇప్పుడు ప్రజలు కూడా విప్లవ రాజకీయాలు నేర్చుకుంటుండడంతో సులువుగానే పర్రాంగ్ పై విప్లవ పాటను పాడుకోగలరనిపించింది. ఆ ఊళ్ళో ఉన్న సి.ఎన్.ఎం. వాళ్ళే చొరవ చేయడంతో మరుసటి రోజు రాత్రి పర్రాంగ్ పై విప్లవ పాట, ప్రజలతో కలిసి ప్రజాయుద్ధ గీతాలు ఆలపించ బడినాయి. బ్రిటిష్ వాళ్ళ పై యుద్ధం చేసిన ప్రజావీరుడు గుండాదూర్ పాటలు, చరిత్రను మా జట్టు పర్రాంగ్ పై ప్రాక్టీసు చేస్తోంది" అంటూ సుందరి జట్టు వంక చూసింది. అప్పటికే జట్టులోంచి రాసో (కందగడ్డను కోయలో 'రాస' అంటారు) లేచి నిలబడింది. మనిషి బక్కగా, పొడుగ్గా ఉంది. ఆమెను చూడగానే నాలో మల్లపాడ్ ఊయిక సుక్లీ మెదిలింది. 2006 ఏప్రిల్‌లో కార్డు బియ్యం కోసం తోటి మహిళలతో వెళ్తున్న సుక్లీని జుడుం గూండాలు, పోలీసులు అదను చూసి అత్యాచారం జరిపి క్రూరంగా హత్య చేశారు. రాసోకూ సుక్లీకీ చాలా దగ్గరి పోలికలున్నాయనిపించింది. నాలో మిగిలిపోయిన చెరగని సుక్లీ జ్ఞాపకాల నుంచీ నేను బయటపడక ముందే రాసో "నేను లేజా గురించి చెపుతానంది". అనడం ఆలస్యం మొదలుపెట్టేసింది.

"లేజా ఇది హల్బా ఆదివాసుల కళారూపం. దండకారణ్యంలో దక్షిణంవైపు కోయతో పాటు తెలుగు ప్రభావం ఎలా ఎక్కువగా ఉంటుందో ఉత్తరం వైపు మరాఠీ, ఛత్తీస్‌గఢీ, హల్బ ప్రభావం అధికంగా ఉంటోంది. చాలా చోట్ల కోయ వాడుక భాషగా కూడా లేకుండా పోయింది. మేం వెళ్ళిన అళ్ళో 'లేజా' నృత్యం చేశారు. ప్రధానంగా ఇది శుభ కార్యక్రమాలలోనే ఊళ్ళల్లో ఆడుతుంటారు. స్త్రీలు-పురుషులు కలిసే నృత్యం చేస్తారు. వాయిద్యాలు నిషాన్, నగారా తో పాటు ఈ మధ్య తబలా కూడా వాడుతున్నారు. లేజా పాటలు -నృత్యం చూశాక ఈ కళారూపం కూడా సి.ఎన్.ఎం. వాడుకోవచ్చ నిపించింది. ముందు మేం జనంతోనే చర్చించాం. ఆ ఊళ్ళోనే కొద్ది రోజుల ముందు కొన్ని అరెస్టులు జరిగాయి. నారాయణ్‌పూర్ జిల్లా నుంచీ పోలీసులు మోటారు సైకిళ్ళ పై వచ్చి ఊరిపై దాడి చేసి కొంతమంది యువతీ యువకులను తీసుకెళ్ళారు. ఈ విషయ వస్తువును తీసుకొని లేజా పాట ఎందుకు పాడలేరు! అని ముందు ఊళ్ళోని మా సి.ఎన్.ఎం. కార్యకర్తలతో చర్చించాం. వాళ్ళు కొంత ఆలోచనలో పడ్డారు. నిజమే. ఎందుకు పాడలేం! అన్నారు. ఆ రోజు రాత్రి లేజా పాట ఇలా పాడారు.

"లే....లేజా....లేజారే
లే...లేజా...లేజారే చరణంతో మొదలుపెట్టారు.
నారాయణపూర్‌లో పులీస్ మన్‌లా -ఫట్‌ఫటీసే ఆ ఇసే
(నారాయణపూర్ పోలీసులు - మోటార్ పై వచ్చారు)
లేకా, లేకీ మన్‌చో గిరాఫ్తార్....
(యువతీ, యువకులను అరెస్టు చేశారు)
ఉరిమి చూస్తూ, చిరుతలా వస్తారు
పసువును నోట కరిచినట్టు పట్టుకుంటారు"

అంటూ అరెస్టు ఘట్టం ముగింపు వరకు విరామం లేకుండా లేజాలో పాడి పూర్తి చేశారు. మా సి.ఎన్.ఎం. కార్యకర్తలతో పాటు ప్రజలంతా రచయితలే ఇందులో. వాళ్ళ జీవితానుభవం నుంచి అన్వయిస్తూ చక్కగా పాడుకున్నారు. క్రూర జంతువులు తమ పసువులను ఎలా నోట కరచుకొంటాయో వాళ్ళ జీవితాలను ఎలా అస్తవ్యస్తం చేస్తాయో వాళ్ళకు అనుభవంలో ఉన్నదే. ఆ జంతువులకన్నా ప్రమాదకరమైన వాళ్ళు ఈ వ్యవస్థ రక్షకులు - పోలీసులు అంటూ పాడారు. ఆయుధాలతో జంతువులను ఎదుర్కొన్నట్టు ఆత్మరక్షణ కోసం పోలీసులను కూడా సాయుధంగానే ఎదుర్కోవాలని సహజ ముగింపు చెప్పారు. తమ సంప్రదాయ పాటలే కాకుండా జీవిత సమస్యలను కూడా ఇలా జోడించడం అర్థమయ్యాక వాళ్ళే ధరల పెరుగుదలపై సంత సమస్యలను జోడిస్తూ మరో పాట చాలా బాగా పాడారు. సమస్యలను పాట రూపంలో ఆశువుగా చెప్పగల సమర్థత ప్రజలలో ఉంది. దానికి సరైన దిశానిర్దేశం చేయడమే రాజకీయంగా మా సి.ఎన్.ఎం. చేసింది" అంటూ రాసో వాస్తవాలను చెప్పేసింది.

చివరకు డోలు సర్దుకోవడంతో ఇకపై ఆయనే చెప్పుతాడని అందరికీ అర్థమైంది. ఆ జట్టులో కొంత ఎక్కువ వయసున్నవాడు డోలే. మూడు పదులు దాటని డోలు బుద్ధి ఎరిగినప్పటి నుంచీ విప్లవ ఆట-పాటలతోనే పెరిగాడు. సి.ఎన్.ఎం. ఏర్పాటుకు ముందే (1998) డోలు విప్లవ కళాకారుడు. ఆయనది వినసొంపైన స్వరం. డోలుకు డోలు వాయిద్యంపై మంచి పట్టుంది. ఆయనకు ఆ పేరు కూడా స్వభావసిద్ధంగా వచ్చిందేనేమో! మనుషుల స్వభావాలను పట్టి పేర్లు పెట్టడం ప్రజల్లో ఉన్నదే. డోలు పేరు కూడా అలా వచ్చిందేమో!

"మేం ఈ నెల రోజుల క్యాంపెయిన్ లో చాలా విషయాలు అర్థం చేసుకున్నాం. తరతరాలుగా ప్రజల్లో సంప్రదాయబద్ధంగా ఉన్న పలు కళా రూపాలను తెలుసుకోగలిగాం. పీటో, పర్రాంగ్, డిట్టోంగ్ ఏందనా లాంటి ఆదివాసీ ప్రజా కళారూపాలే కాకుండా ఆదివాసేతర ప్రజల కళారూపాలు లేజా, ఒడియానట్ (నాటకం), కీర్తనా లాంటివి కూడా చూశాం. 2010 లో మా సి.ఎన్.ఎం. మహాసభలో పాటను సామూహికం చేయాలనే నినాదం తీసుకున్నాం. కానీ ఎలా? అన్నది సరిగా బోధపడలేదు. ఆదివాసీ సంప్రదాయం ప్రకారం నృత్యంలో ప్రజలంతా పాల్గొనడం జరుగుతోంది. అందులోని సమష్టితత్వం చూస్తున్నాం. కానీ పాటను ఎలా చేయడం అన్నది మాత్రం నిజంగానే ఈ కెంపెయిన్ ద్వారా నేర్చుకోగలిగాం. ప్రజల్లో ఉన్న విషయాన్నే మేం ఆలస్యంగా పట్టుకోగలిగాం. శ్రమ నుంచీ పుట్టిన పాట అన్నపుడు శ్రమ దోపిడీ పై పాటలు ప్రజలు ఎందుకు పాడుకోలేరు! శ్రమ ఆయాసాన్ని వ్యక్తం చేసిన పాటకు సరైన రాజకీయాలు తోడవుతే శ్రమ దోపిడీని అంతం చేసే శక్తి కూడా వస్తుందని తెలుసుకున్నాం. ఆ శక్తిమంతులు ప్రజలే!

మా జట్టు ఏ ఊరు వెళ్ళినా దజన్ ల సంఖ్యలో యువతీ-యువకులు రెక్కలు కట్టుకొని వచ్చి వాలేవారు. మా తిండి ఏర్పాట్లు స్థానిక జనతన సర్కారే భరించింది. మా రక్షణ బాధ్యత ప్రజా మిలీషియా చూసుకుంది. కార్పెట్ సెక్యూరిటీ మధ్య (పోలీసు క్యాంపుల మధ్య) కాలి గజ్జెల మోతలు, డోలు-డప్పుల చప్పుళ్ళు సాధ్యం కావేమో! అనుకున్నాం. కానీ, ప్రజలు అన్నీ సాధ్యం చేశారు.

"ప్రజల వాయిద్యాలలో మేం ఒక మార్పును స్పష్టంగా చూడగలిగాం. ఇప్పటికీ ఆదివాసీ ప్రాంతంలో చాలా వరకు కఱ్ఱతో చెక్కిన డోలు, కుండుడు, డప్పులకు జంతువు తోళ్ళను ముడుచు కోవడం ఉంది. కానీ రేకు పీపాలకు, డ్రమ్ములకు తోళ్ళు ముడవడం, మార్కెట్‌లో తయారవుతున్న వాయిద్యాలు స్టీలు- సింథటిక్ అవే

(మిగతా... 58 పేజీలో)

బొందల గడ్డలు ఆ బొగ్గుట్టలు

- డాక్టర్ నళిని

సెప్టెంబర్ 25న రాష్ట్ర విభజనపై చర్చా కార్యక్రమాన్ని ముగించుకుని పన్నెండు మంది ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక సభ్యులం 26 తెల్లవారుజామున మంచిర్యాల బయలుదేరాం. అక్కడ ఓపెన్‌కాస్ట్ గనుల పేరుతో ఉపరితలంపై జరుగుతున్న విధ్వంసాన్ని కళ్ళారా చూసి, ఆ బాధితులకి సంఘీభావం తెలపడం మా ఉద్దేశం.

అది నాకు ఒక ఉద్వేగభరితమైన ప్రయాణం. మేము మూడు జిల్లాలలోంచి వెళ్ళాము. మెదక్ జిల్లా ప్రజ్ఞాపూర్ దాటుతూ బి. నర్సింగరావుని, జననాట్యమండలి ఆవిర్భావాన్ని గుర్తు చేసుకున్నాను. తర్వాత పోరాటాల గడ్డ కరీంనగర్ జిల్లాకి చేరుకున్నాం. సుల్తానాబాద్, పెద్దపల్లి దాటుతుంటే ఒకనాటి విద్యార్థి యువజనోద్యమం, అక్కడి రైతాంగ పోరాటాలు, తెలంగాణలో దోపిడీ పీడనల రూపుమార్చిన మహత్తర విప్లవ జ్ఞాపకాలు ముంచెత్తాయి. అంతలో మానేరు డ్యాం దాటాము. "మాట మానేరు, మనసు కోనేరు" అంటూ, స్థానికులు మానేరు నీరు ఎంత స్వచ్ఛమో అంత ఉధృతం కూడా అని చెప్తుంటే, ఇప్పటి స్తబ్దత మరో విప్లవ వెల్లువకి సన్నాహం మాత్రమే అనిపించింది. తర్వాత ఆదిలాబాద్ జిల్లా రామగుండం, గోదావరిఖని సమీపిస్తుంటే వేనవేల కార్మిక కంఠాలు గర్జించినట్టయింది. కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి సింగరేణికి ఉపాధి కోసం తరలివచ్చిన భూమిపుత్రులు, నిరుపేద కార్మికులు, దళితులు, వారు రాజేసిన నిప్పురవ్వలు గుర్తొచ్చాయి. ఆ వీరుల చరిత్రని గుర్తు చేసుకుంటూ మంచిర్యాల చేరుకున్నాం. అల్లం రాజయ్య, తుమ్మేటి రఘోత్తమరెడ్డి, ఇతర కార్మికులు రాసిన కథలు గుర్తు చేసుకుంటూ, భూగర్భ గనులకి, ఉపరితల గనులకి మధ్య తేడాని అర్థం చేసుకోవడానికి సంసిద్ధులమయాం.

సింగరేణి ప్రభుత్వ రంగ సంస్థ. రాష్ట్రానికి, కేంద్రానికి దానిలో వాటాలు ఉన్నాయి. కానీ దొడ్డిదారిన ప్రేవేటు రంగం అందులో రాజ్యమేలుతోంది. ఉత్పత్తిలో 51 శాతం మన రాష్ట్రం వంతు. ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లోని గోదావరి లోయలో 612.21 కిలో మీటర్ల మేర బొగ్గు నిక్షేపాలు విస్తరించాయి. 9877.68 మీటర్ల బొగ్గు నిల్వలు ఉన్న ఈ ప్రాంతం నుంచి వెలికి తీసిన బొగ్గు ఆంధ్రప్రదేశ్ జెన్‌కోకి, ఎన్.టి.పి.సి కి చేరుతుంది. మిగిలింది సిమెంటు, ఉక్కు, మందులు, మిశ్రధాతువు తదితర పరిశ్రమలకి చేరుతుంది. ఇక్కడ వెలికితీసిన బొగ్గుని 17 గ్రేడుల్లో విభజిస్తారు. అలా దీని ధర ఆయా గ్రేడుని బట్టి టన్నుకి 420 నుంచీ 3,896 రూపాయల వరకూ ఉంటుంది. బొగ్గు వెలికితీత ఖర్చు టన్నుకి 1850 రూపాయలు. అంటే, ఇది కోల్ ఇండియా లిమిటెడ్ ఖర్చు చేస్తున్నదానికంటే 70 శాతం హెచ్చు. అందుకే, ఇప్పటికి 22 శాతంగా ఉన్న భూగర్భ గనులని ఉపరితల గనులుగా మార్చి ఖర్చు తగ్గించుకుని లాభాలు చేసుకోవడం సింగరేణి యాజమాన్యం ధ్యేయం.

చిన్నప్పుడు చదివిన ఏ.జె.క్రానిన్ నవలల్లో, తేరేమేరే సప్నే, కాలాపత్తర్ లాంటి సినిమాల్లో, తర్వాత సింగరేణి ప్రాంతం నించి వెలువడిన 'బొగ్గుపొరల్లో' , 'నల్లకలువ' ల్లో కనపడిన బొగ్గుగని కార్మికుల కష్టం, అభద్రత గుర్తు చేసుకుంటే, ఎక్కడో భూగర్భంలో వారి జీవితాలని బలివ్వడం కంటే ఉపరితలం మీద బొగ్గు తవ్వే అవకాశం ఉంటే అదే మెరుగు కదా అనే ఆలోచన రావచ్చు. కానీ సింగాపూర్ దగ్గర ఆవులించిన పెద్ద గోతిని చూసాక ఆ ఆలోచన తప్పనిపిస్తుంది. ఒక పక్క గొయ్యి, మరో పక్క కొండంత మట్టి దిబ్బ. ఆ గోతిలో మనుషులు లేరు. రొద చేస్తూ చీమల బారులా కదులుతున్న ట్రక్కులున్నాయి. ముందు రోజు మధ్యాహ్నం మూడింటికి ఊళ్ళన్నిటినీ అదరగొట్టి, ప్రకంపనలు సృష్టించిన బ్లాస్టింగు తాలూకు కదిలిన మట్టిపెళ్ళలున్నాయి. ఇంతకు ముందు 150 మీటర్ల లోతు తవ్వగలిగితే, ఇప్పుడు పెరిగిన సాంకేతిక పరిజ్ఞానం వల్ల పెద్ద మెషీన్లతో 400 మీటర్లు తవ్వుతున్నారు. అక్కడ దుమ్ము, ధూళి, మండించే వేడి తప్ప కనుచూపు మేరలో పచ్చదనం లేదు. ఆ చుట్టుపక్కల రామవరపు పేట, గుత్తావారిపల్లె, సింగాపూర్ గ్రామాల్లో గోడలు బీటలువారాయి. ఎప్పుడు ఏ కప్పు కూలుతుందో, ఏ గోడ విరిగి మీద పడుతుందో తెలీదు. దాదాపు ఐదువేల మంది నిర్వాసితులయారు. బ్లాస్టింగ్ జరిగితే తోవంతా భరించరాని వాసన. భూకంపంలాంటి అదురు. ఆ శబ్దం భయాన్ని కలిగిస్తుంది. పంట భూములు పోయాయి, నీళ్ళు కలుషితమైపోయాయి. చర్మవ్యాధులు, ఊపిరితిత్తుల వ్యాధులు వేధిస్తున్నాయి. ఇప్పటికి ఏడేళ్ళుగా తవ్వుతున్న ఆ గని ఇంకా దాదాపు పద్దెనిమిదేళ్ళు పని చేస్తుంది. అంటే, ఒక తరం తన జీవితాన్ని కోల్పోతోంది. పచ్చపచ్చని భూమికి బదులు నల్లని మట్టి దిబ్బల దృశ్యాన్ని చూస్తుంది. ఆ తర్వాత గుట్టలు వేసిన మట్టితో గనిని పూడ్చి వెళ్ళాల్సి ఉన్నా, అలా ఎక్కడా జరగడం లేదు. ఒక వేళ పూడ్చినా ఆ భూమి పంట యోగ్యం కావడం సందేహమే. ఇప్పటికి పద్నాలుగు ఓపెన్‌కాస్టు గనుల పుణ్యాన మూడు జిల్లాల్లో 70 గ్రామాలు మాయమయ్యాయి. ఒక్కొక్క గని చుట్టూ పది కిలోమీటర్ల మేర దుమ్ము పేరుకుపోయి, పొలాలు, రిజర్వు ఫారెస్టు కలుషితమైపోతున్నాయి.

గని కార్మికుడనగానే తట్టా చెమ్మాసు మెదులుతాయి. జార్ఖండ్‌లో మొట్టమొదటి గని ఝరియా బొగ్గుగని. దాని పక్కనే ధన్‌బాద్‌లో ఒక కూడలిలో తట్టాచెమ్మాస్‌తో ఉన్న గని కార్మికుడి విగ్రహాన్ని ప్రతిష్టించారు. కానీ ఉపరితల గనుల్లో కార్మికులు తక్కువ, మెషీన్లు ఎక్కువ. అధిక ఉత్పత్తి, లాభాల సాధన పేరుతో కార్మికుల్ని తొలిగించి అక్కడ అంతటా మెషీన్లు నింపుతున్నారు. భూగర్భంలోకి దిగిన కార్మికుల భద్రత మాత్రమే ప్రశ్నార్థకమైతే, ఇప్పుడు ఓపెన్ కాస్ట్‌తో వారి కుటుంబాలు, చుట్టుపక్కల గ్రామాల్లోని కుటుంబాల మనుగడ కూడా ప్రశ్నార్థకమవుతోంది. ఎందుకంటే, ఉపరితల గని తవ్వకాల్లో దుమ్ము లేస్తుంది. దానితో పాటు ప్రమాదకరమైన సల్ఫర్ డై ఆక్సైడ్,

కార్బన్ మోనాక్సైడ్, మెర్క్యూరీ వంటి పదార్థాలు వెలువడతాయి. గనిలో తేమ వల్ల, వాన వల్ల ఇలాంటి పదార్థాలు, ఖనిజాలు కరిగి కిందకి ఇంకి, భూగర్భజలాలు కలుషితమవుతాయి. బ్లాస్టింగ్ వల్ల చుట్టుపక్కల వారి చెవులు దెబ్బతిని, నిద్ర కరవై, దుర్వాసన వేధిస్తుంది. ఇళ్ళు బీటలువారుతాయి. పంట భూములు నాశనమవుతాయి. ఊళ్ళు మాయమవుతాయి. ప్రాణాలు పోతాయి. పచ్చని దృశ్యాలు మారిపోతాయి. వేడి పెరుగుతుంది. వాతావరణం కలుషితమై పోతుంది. సింగరేణి యాజమాన్యం ఆర్థిక లావాదేవీల్లో అక్కడి ప్రజల జీవితం కొట్టుకుపోతుంది, ముంపుకి గురవుతుంది.

ఒకవేళ బొగ్గుని పెకిలించిన తర్వాత ఆ గని పూడ్చినా, అప్పటికే భూమిలో మార్పు జరుగుతుంది. దానిలో ఆమ్లాలు, లవణాలు పేరుకుపోతాయి. పోషకాలు కరువవుతాయి. తేమ తగ్గిపోయి, భూమి గిడసబారుతుంది. అలానే, భూగర్భ జలాల్లో ప్రమాదకరమైన సల్ఫేట్లు, సల్ఫైట్లు, లవణాలు, లెడ్, కాపర్, మెర్క్యూరీ, సెలీనియం, జింక్, యురేనియం, నికెల్, క్రోమియం, సల్ఫ్యూరిక్ యాసిడ్ ఇంకిపోతాయి. గాలి కూడా కలుషితమవుతుంది. ఆమ్లం వర్షిస్తుంది. పశుపక్ష్యాదులు, మనుషులు అనారోగ్యం పాలవుతారు.

ఇప్పటికీ సింగరేణిలో 75 భూగర్భ గనులు, 16 ఉపరితల గనులు ఉన్నాయి. సంవత్సరానికి 50 మిలియన్ టన్నుల బొగ్గుని ఉత్పత్తి చేసే లక్ష్యంతో నిర్మిస్తున్న ఉపరితల గనుల కోసం ఆరువేల హెక్టార్ల అటవీ భూమి, ఏడువేల హెక్టార్ల వ్యవసాయ భూములు అవసరమవుతాయి. సమతా తీర్పు ప్రకారం ఇలాంటి ఉత్పత్తిని ప్రభుత్వమే చేపట్టాలి. ప్రజలకి ప్రయోజనం ఉండాలి. ప్రైవేటు సంస్థల జోక్యం ఉండకూడదు. లాభాల్లోంచి ఇరవై శాతాన్ని స్థానికుల అభివృద్ధి కోసం ఉపయోగించాలి. కానీ సింగరేణి యాజమాన్యం నిబంధనలన్నిటినీ తుంగలో తొక్కి, ప్రైవేటు సంస్థలకి గనులని అప్పగించి, రాజ్యాంగ హక్కుల్ని కాలరాస్తూ, గిరిజన చట్టాలని, పర్యావరణ చట్టాలని భూస్థాపితం చేస్తోంది. భూగర్భ గనుల్లో ఇంకా 50-60 శాతం బొగ్గు నిలవ ఉండగానే వాటిని మూసేసి, వాటిని ఉపరితల గనులుగా మారుస్తోంది.

అలా కల్యాణఖని 2(కె.కె. 2) ని మూసేసి, మెగా ఓపెన్‌కాస్టు కోసం సర్వే మొదలుపెట్టగానే, ఇప్పటికే జరిగిన విధ్వంసాన్ని చూసిన ప్రజలు ప్రతిఘటిస్తున్నారు. ముంపుకి గురయ్యే మామిడిపల్లి, కాసిపేట, ఎర్రగుంటపల్లె, దుబ్బగూడ వంటి ఊళ్ళ ప్రజల వద్ద కాక కె.కె. 2 గని వద్ద ప్రజాభిప్రాయ సేకరణని నిర్వహించి, ప్రజాస్వామ్యాన్ని వెక్కిరించింది సింగరేణి యాజమాన్యం. "ఓసీలు మాకు వద్దు వొరిసేలే మాకు ముద్దు! మా సెట్టు సేమ, సేను సెలక, పక్షులే పదివేలు" అని పాడుకునే ప్రజలని వదిలిపెట్టి, వేరే వాళ్ళని జమచేసి, తూతూ మంత్రంగా ముగిసిన ప్రజాభిప్రాయ సేకరణ అక్కడి ప్రజలని కలవరపరిచింది. అటవీ ప్రాంతంలో హెక్టారుకి 7-10 లక్షల రూపాయలు నష్టపరిహారం చెల్లించాలి. అదే గిరిజన ప్రాంతమైతే దానికి బదులు భూమి చూపించాలి. ఆ భూమి తీసుకోవడం తేలిక. అందుకని దీన్ని షెడ్యూల్డు ప్రాంతం కాదని చెప్పకుండా అభిప్రాయ సేకరణ ముగించారు. జీవో 3 ప్రకారం గిరిజనులకి ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వాలి. కానీ వారికి నాలుగో తరగతి ఉద్యోగాలు కూడా లేవు. అలా విపరీతమైన నష్టం వాటిల్లిన ప్రజల నిర్వాసితత్వానికి కొలమానమే లేదు. అక్కడ రకరకాల పార్టీలు ప్రజలకి వెన్న రాసి వాతలు పెడుతున్నారని కొందరు మేధావుల ఉవాచ. 5 వ షెడ్యూలు ప్రకారం ఏజెన్సీ ప్రాంతంగా పునరావాసం కల్పించకుండా, దీన్ని మైదాన ప్రాంతంగా చూపిస్తున్నారు. ప్రజాభిప్రాయ సేకరణలో గ్రామ సభ, శాసనమండలి, గిరిజన సలహా మండలి, స్థానిక సంస్థల తీర్మానాలను పరిగణించి, ఐ.టి.డి.ఏ. అనుమతి తీసుకోవాలి. కానీ మందమర్రిలో 'ప్రజావ్యతిరేక' అభిప్రాయ సేకరణే జరిగింది.

మందమర్రి దగ్గర ఎర్రగుంటపల్లెలో 300 గడప ఉంది. దాదాపు 1200 జనాభా. అందరూ యాదవులు. పాల అమ్మకంతో పాటు వ్యవసాయం వారి ప్రధాన వృత్తి. వారికి నాలుగు మూలవాగులు ఉన్నాయి. అన్నీ కలుపుకుని ప్రవహించే రాళ్ళవాగు వారికి జీవధార. దానికి మోటార్లు పెట్టి భూమిని తడుపుతూ వరి పండిస్తున్నారు. ఏపుగా పెరిగిన పైరు ఒక పక్క, గలగల పారే వాగు మరో పక్క కనువిందు చేసాయి. కానీ సింగరేణి సర్వే ప్రకారం అక్కడ మెగా ఓపెన్‌కాస్టు వస్తే, ఆ వాగూ ఉండదు, ఆ పొలాలూ ఉండవు. "మీ ఊరు మాకు వద్దు, ఇంక మీకు ఏమిటి అభ్యంతరం?" అంటారు వాళ్ళు. జీవ వాగుపోయి, తాగునీరు పోయి, పంటపోయి, పశువుల మేతపోయి. బీటలువారుతున్న ఇళ్ళతో, మట్టి దిబ్బల మధ్య ఎలా ఉండాలనేది ప్రజల ప్రశ్న. "ఎన్ని లక్షలిచ్చినా తీసుకోవద్దు. బతుకుపోతుంది, భూమి పోతుంది" అంటారు అక్కడి చైతన్యవంతులు.

ఈ మెగా కె.కె. గని వల్ల సుమారు 70 వేల మంది జీవనం దెబ్బతింటుంది. దాదాపు పదిహేను గ్రామాలు ధ్వంసమవుతాయి. మంచిర్యాలకి 13-16 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ గ్రామాల ప్రజలు తమ నష్టాన్ని ఎలాంటి నష్ట పరిహారం తీర్చలేదంటూ గట్టిగా నిలబడి, కోర్టులో కేసు వేసారు. అయినా గాని, మధ్యాహ్నం ఎవరూ లేని సమయంలో సర్వేలు జరిపి తెల్ల జెండాలు పాతుతుంటే, ప్రజలు వాటిని పీకేస్తూ, పారాహుషార్ అంటూ నిఘు పెడుతున్నారు. ఎకరానికి రెండు మూడు లక్షలిస్తామన్నా గాని లొంగకుండా ప్రజలు ధృడంగా నిలబడి ఓపెన్‌కాస్టు వ్యతిరేక కమిటీని ఏర్పరచుకున్నారు. "ఉన్న వాగు పూడ్చి నల్లాలు ఇస్తారట! వాగు పోతే మాకు బతుకే లేదు!" అంటూ స్త్రీలు తమ నిరసన తెలిపారు. ధర్నా చేస్తే, ఆందోళన చేస్తే, పోలీసులు రంగంలోకి దిగారు. అరెస్టులు, కేసులు మామూలే. ప్రజల భూములు పోతే, తాగు నీరుపోతే, ఊరేపోతే రాని పోలీసులు, ఇదేమిటని అడిగితే మాత్రం వెంటనే ప్రత్యక్షమవుతారు. జాతిని అభివృద్ధి చేయడానికి పెట్టామంటున్న ఒక ప్రభుత్వ రంగ సంస్థ ఆకృత్యాలకి వత్తాసుగా రాజ్యం, దాని కాపలాదారులు చేపట్టిన ప్రజావ్యతిరేక కార్యకలాపాలకి ఇది మంచి ఉదాహరణ. "ఎవరైనా చచ్చినంక బొందపెట్టి మన్నుబోస్తరు. కానీ బతికుండగానే మమ్మల్ని, మా ఊరిని బొంద పెడుతుండ్రు. ఇదెక్కడి న్యాయం? మా ఊరి మీద బొగ్గు మట్టి కప్పి ఊరిని తీసేస్తరంట. ఊరు పోయినంక బతికుండి మేమేం జేసేది? అందుకే మా ఊళ్ళకు ఓపెన్‌కాస్టుని రానియ్యం. పానం బోయినా ఊరిడిసి ఎక్కడికీ పోం" అంటూ అక్కడి వృద్ధులు సైతం గట్టిగా నిలబడుతున్నారు.

కొమురం భీం పోరాడిన జోడేఘాట్ వంటి ప్రాంతాల్లో సైతం ఓపెన్‌కాస్టుని పెట్టాలని చూస్తోంది ప్రభుత్వం. ఇంకా మంచిర్యాల, జన్నారంల మధ్య 'టైగర్ జోన్' పేరుతో నాలుగు వందల గ్రామాల ప్రజలు నిర్వాసితులయారు. మాంగనీస్ ఖనిజం కోసం ఆడిన నాటకం అది. విలువైన వనరులున్న దేశంగా పేరుపడటం వల్ల వలసవాదులు మన మీద పడి సాగించిన దోపిడీకి తీసిపోకుండా ఇప్పటికీ ఆ వనరుల కోసమే బడా పెట్టుబడిదారులు పన్నుతున్న కుట్రలో సామాన్య

ప్రజానీకం మాడి మసైపోతోంది. "అగ్గిపెట్టె దొరకని నాటి నుంచి ఇక్కడే ఉంటున్నా. ఈడికెల్లి ఇప్పుడు ఏడికి పోతం? మా బతుకేం కావాలె?" అనే ప్రశ్నకి వారి సమాధానం ఏమిటి?

కాసిపేట మండలం దుబ్బగూడది మరో కథ. ఇక్కడ తలపెట్టిన ఓపెన్‌కాస్ట్ గని వల్ల 500 జనాభా ఆగమవుతారు. ఇళ్ళుపోతాయి, ఊరేపోతుంది. మండల ముఖ ద్వారంగా ఉన్న ఊరు, విద్యాలయాలు తుడిచిపెట్టుకుపోతాయి. నలభై ఏళ్ళనాటి ఇంటి ముందు కూరగాయల తోట మధ్య నిలబడిన రామయ్య తన కొడుకులు, మనుమల భవిష్యత్తు గురించి విచారిస్తూ, శూన్యంలోకి చూస్తూ నిలబడి ఉన్నాడు. గతంలో కాసిపేట ఓపెన్‌కాస్ట్‌కి వ్యతిరేకంగా ఈ ఊరు పోరాడింది.ఇప్పుడు కె.కె. మెగా ఓపెన్‌కాస్ట్ పేరుతో మళ్ళీ సర్వే మొదలు కావడంతో ప్రజలు కలవరపడుతున్నారు. ఈ గని కోసం ఇరవై నాలుగు వందల ఎకరాలు అవసరం. ప్రభుత్వానికి ఇప్పటికి 349 ఎకరాలు మాత్రమే ఉన్నాయి. అందుకని 25 పల్లెల్ని రూపుమాపడానికి పథకం వేసింది. 'తెలంగాణ నిర్వాసిత వ్యతిరేక ఫోరం'. 'తెలంగాణ పర్యావరణ పరిరక్షణ సమితి' పేరుతో ప్రజలు ప్రతిఘటిస్తున్నారు. కానీ పోలీసు పహరాతో, భయభీతావహ వాతావరణంలో ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. అందులో ఆయా గ్రామాల ప్రజలు తక్కువ, మస్టర్లు వేసి బయటినించి తెప్పించిన సింగరేణి కార్మికులు ఎక్కువగా ఉన్నారు. దీని వెనుక మతలబు ఆ నాడు ఎవరికీ అర్థం కాలేదు.

ఇప్పటికే అక్కడ ఉన్న గనుల వల్ల కాసిపేట వాగు ఎండి పోయింది. ఆ ప్రాంతంలో 170 అడుగుల లోతు తవ్వినా గాని నీరు పడక పోవడం వల్ల అక్కడ బోరు బావుల్లేవు. "ఈ ఊళ్ళో నీళ్ళు లేవని పిల్లనివ్వడం లేదు" అన్నారు దుబ్బగూడ వాసులు. కెకె2 ఇంక్లయిన్ మూసివేత వల్ల ఇప్పటికే మూడు వేల మంది కార్మికులు ఉపాధి కోల్పోయారు. 1962లో తవ్విన బొగ్గు బావి కోసం అప్పట్లో 94 ఎకరాల భూమిని సేకరించారు. 2006- ఆ బావిని బందు చేశారు. అయినా ఇంత వరకు ప్రజలకి నష్ట పరిహారం అందలేదు. అందుకే సింగరేణి ఇచ్చే హామీలని ఎవరూ నమ్మడం లేదు. కోల్ ఫిట్టరుగా 32 సంవత్సరాలు ఎముకలు విరగ్గొట్టుకున్న కార్మికుడు ఇప్పుడు నడవలేక నడుస్తూ పొందుతున్న పెన్షను 700 రూపాయలు. భర్తపోయి, కొడుకు పోయి, మిగిలిన ఇద్దరు కొడుకులతో బతుకు ఈడుస్తున్న ఒక ముసలమ్మ ఓపెన్‌కాస్ట్ వల్ల పోయే ఇంటి కోసం, ఉపాధి కోసం మరోసారి కంటనీరు నింపుకుంది. తన బాధ వెళ్ళబోసుకుంది. పదేళ్ళ వయసులో చంద్రపూర్ నించి పెళ్ళి కూతురుగా ఈ ఊళ్ళోకి అడుగుపెట్టిన మల్లు, "మా ఊరు మాకు కావాలె, మా జాగ మాకే కావాలె" అని గట్టిగా చెప్పింది. "అప్పటికి బావి పడలే, రోడ్డూ లేదు. కచ్చడం బాట ఉండె. అప్పుడచ్చిన. అపువంటి ఊరిని వదులుతనా? పోలీసులొద్దు ఏమద్దు. మేము ఐకమత్యంగ ఉంటం" అంటూ స్త్రీ శక్తిని నిరూపించింది. అక్కడ ధర్నాలో, ఆందోళనలో స్త్రీలు ముందు భాగాన నిలిచి, అరెస్టయిన కార్యకర్తలని విడిపించుకున్నారు.

అభివృద్ధి పేరుతో జరుగుతున్న విధ్వంసం వల్ల "అభివృద్ధి ఎవరికి?" అనే ప్రశ్న తలెత్తుతోంది. 125 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన సింగరేణిలో మొదట్లో కాంట్రాక్టు పద్ధతిలో పని జరిగేది.తర్వాతి కాలంలో ఉపాధి పెరగడంతో అది ఒక కల్పతరువుగా ఎందరినో ఆకర్షించింది. కానీ అక్కడ జరుగుతున్న అవకతవకలని, కార్మిక వ్యతిరేక విధానాలని ప్రశ్నిస్తూ కార్మిక సంఘాలు గళం విప్పాయి. ఎమర్జెన్సీ కాలం నుంచీ దాదాపు 1995 వరకు సాగిన ప్రతి ఘటనలో మస్టర్ల కోత చట్టానికి, నల్ల చట్టాలకి వ్యతిరేకంగా, వేజు బోర్డు సాధన కోసం, కార్మికుల రోజువారీ సమస్యల మీద ఎన్నో పోరాటాలు జరిగాయి. అందుకే కార్మికులు తీవ్ర నిర్బంధాన్ని ఎదుర్కొన్నారు. అయితే, 1997 నాటికి నూతన ఆర్థిక విధానాలు, సంస్కరణల పేరుతో 70 శాతం వాటాని ప్రైవేటు సంస్థలకి, కాంట్రాక్టర్లకి అప్పగించింది సింగరేణి యాజమాన్యం. ఫలితంగా కార్మికులు సమ్మె చేస్తే ఉత్పత్తులు ఆగవు. కాంట్రాక్టర్లు సమ్మె చేస్తే బొగ్గు ఉత్పత్తులు నిలిచిపోతాయి! అలా కార్మికులు తాము కండలు కరిగించి చెమటోడ్చిన ప్రాంతంలో, ఊపిరిలో బొగ్గు నింపుకున్న ప్రాంతంలో పరదేశులైపోయారు. ఔట్‌సోర్సింగ్ వల్ల నిరుద్యోగులై పోయారు.తట్టా చెమ్మాస్‌తో పనిపై కార్మికుల నియంత్రణ ఉండేది. ఇప్పుడు మెషీన్‌తో కార్మికుడు తన అస్తిత్వాన్ని కోల్పోయాడు. అధికారుల ఆధిపత్యంతో, జులుంతో కార్మికోద్యమం దెబ్బతింది. నోటీసులు, బదిలీలతో ఐకమత్యం నీరుకారింది.

మరో వైపు భూమి సమస్య చూస్తే, 1970 నుంచీ సింగరేణి బొగ్గు గనుల విస్తరణ వేగంగా కొనసాగినా, భూములకి పెద్దగా విలువలేదు. 1990 తర్వాత ఆ ప్రాంతంలో గోదావరి నుంచి మోటార్లతో నీళ్ళు తోడుకుని సంవత్సరానికి రెండు పంటల వరి పండించడం జరిగింది. మామిడి తోటలు వెలిసాయి. భూమి విలువ పెరిగింది. అందుకే సింగరేణి ఇచ్చే నామమాత్రపు నష్ట పరిహారానికి ఎవరూ భూములు ఇవ్వడానికి సిద్ధపడలేదు. 1992 తర్వాత ఓపెన్‌కాస్ట్ గనుల ప్రభావంతో ప్రభావిత గ్రామాల్లో పర్యావరణ సమస్య పెరిగింది. నిర్వాసితుల నష్ట పరిహారానికి, పర్యావరణ కాలుష్యానికి పరిష్కారం అనేవి పెద్ద ప్రశ్నలుగా ముందు నిలిచాయి. ఒకప్పుడు కల్పతరువుగా ఉన్న సింగరేణి ఇప్పుడు ప్రజల పాలిట రాచపుండులా తయారయింది. ఒకప్పుడు తెలంగాణ జిల్లా పేద రైతులకు ఉపాధి చూపించి, ఇప్పుడు వారి పాలిట శాపంగా మారింది. ఇంకా పదేళ్ళ వరకు తవ్వగల బొగ్గు నిల్వలున్న భూగర్భ గనులను సైతం పూడ్చేసి, ఆ ప్రాంతంలో మొత్తం 70 ఓపెన్‌కాస్ట్ గనులని తవ్వాలని లక్ష్యంగా పెట్టుకుంది సింగరేణి యాజమాన్యం. ఒక్క గని చూస్తేనే గుండె చెరువైపోతుంది. అలాంటి 70 బొందలగడ్డలని ఊహించుకుంటే కడుపు రగిలిపోతుంది.

ఎలా అయితే దేశమంతటా ఖనిజాల వెలికితీతలో భాగంగా అడవులని నరికి, కొండలని తవ్వి ప్రజలని స్థానభ్రంశం చేస్తున్నారో, సింగరేణి ప్రాంతంలో కూడా ఊళ్ళని మాయం చేసి పొలాలని కబ్జా చేసి ప్రజలని నిర్వాసితుల్ని చేస్తున్నారు. తమ ప్రాంతంలోనే వారు తమ పునాదులని కోల్పోయి, ఉనికిని కోల్పోయి, అపరిచితులుగా, పరదేశులుగా మిగిలిపోయే ప్రమాదం ఏర్పడింది. ప్రజలు ఎక్కడికక్కడ ప్రతిఘటించినా సింగరేణి యాజమాన్యం తన పని తాను దొడ్డిదారిన చేసుకుపోతోంది. ఈ ప్రమాదాన్ని గ్రహించి గొంతెత్తుతున్న ప్రజలకి అండగా అందరం నిలబడాల్సిన తరుణమిది. ఆ ప్రాంతంలో ఉపరితలం మట్టిదిబ్బగా, రసాయన విష మడుగుగా, రోగాల పుట్టగా, ధూళి దుమ్ముగా, వేడి గాడ్పుగా పూర్తిగా మారకముందే దాన్ని నివారించవలసిన తక్షణ అవసరాన్ని అందరూ గుర్తించి, అక్కడి ప్రజలకి మన మద్దతు తెలపాలి. అక్కడి పోరాట సాంప్రదాయానికి మరో మారు ఊపిర్లు పోయాలి. ప్రజల ఆకాంక్షలని పరిరక్షించాలి.

వ్యాసం

ఆర్ ఎస్ రావు స్మారక సదస్సు 10 నవంబర్ 2013 లో సమర్పించిన పత్రం

సాహిత్యం : సామాజిక చలనం

- డా. ముదునూరి భారతి

పశ్చిమ ఒడిశా రాష్ట్రంలో హీరాకుడ్ డ్యాం పక్కన ఉండే బుర్లా అనే ఒక కుగ్రామంలో సంబల్‌పూర్ విశ్వవిద్యాలయం స్థాపించారు. అభివృద్ధి పరంగా వెనుకబడిన ఈ ప్రాంతంలో ప్రభుత్వ పథకాలలో భాగంగా ఉన్నత విద్యని అందజేసే ఉద్దేశంతో సంబల్‌పూర్ విశ్వవిద్యాలయం ఏర్పడింది. ఇక్కడ వైరుధ్యమేమిటంటే ఈ ప్రాంతంలో అత్యధిక ప్రజలు ఓరాములు, సంతాలులు లాంటి ఆదివాసి తెగలకు చెందినవారే. తమకు తోచిన విధంగా కొండ ప్రాంతాన్ని, అడవి ప్రాంతాన్ని చదునుచేసి ఆ భూముల్లో పోడు వ్యవసాయం చేసుకునే అలవాటు ఉన్నవాళ్లు. సంబల్‌పూర్ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయడం కోసం ఈ ప్రాంతంలోని ఓరామ్‌పాడాలోని వాళ్ల స్థలాలు సేకరించి వారిని నిర్వాసితుల్ని చేశారు. ఈ స్థలాలన్నీ ఒకానొకప్పుడు వారికి చెందిన స్థలాలు అని ఇప్పటికీ గుర్తు చేస్తున్నట్లుగా, రెండుచోట్ల రెండు కుటుంబాలకు చెందిన వారిని, వారి గుడిసెలను అక్కడే అలాగే ఉంచేశారు. ఈ రెండు కుటుంబాలు గత ముప్పై ఏండ్లలో పది కుటుంబాలుగా పెరిగినా కూడా అదే గుడిసెలలో కాలం గడుపుకుంటున్నారు. ఇంతకాలం గడిచినా కూడా, తమ ఆచార వ్యవహారాలనే కొనసాగిస్తూ మనకంటె భిన్నంగా ఉండే వీరికి అక్కడ ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉండేది. పశ్చిమ ఒడిశాని అభివృద్ధి చేసే క్రమంలో వచ్చిన సంబల్‌పూర్ విశ్వవిద్యాలయం ఇక్కడ నివసిస్తూ వచ్చిన ఆదివాసి ప్రజలను నిర్వాసితులను చేసి ఒక కొత్త నిర్మాణంలేని విధ్వంసానికి గురిచేసింది. ఉన్నత విద్యలో వారికి భాగం లభించకపోగా, ఈ విధ్వంసానికి తలవంచి, విశ్వవిద్యాలయపు అంచులలో మిగులు మనుషులుగా, నిస్సహాయులుగా ఉండిపోయారు. వారిని నిర్వాసితులను చేసిన ఆ స్థలాలలోనే మేము ఉండే పెద్ద పెద్ద భవంతులు, వాటి చుట్టూ అవసరాలకు మించి ఉండే ఖాళీ స్థలాలు ఒక వైపు, వాటిని ఆనుకుని ఉండి విధ్వంసానికి గురైన ఓరాములు గుడిసెలు మరొకవైపు, పక్కపక్కనే ఉండడంతో, అభివృద్ధిలో అంతర్గతంగా ఉండే వైరుధ్యాన్ని మన కళ్ల ముందే ఉంచి అనుక్షణం గుర్తుచేస్తూ ఉండేవి.

ఒడిశాలో కరువు పీడిత ప్రాంతాలుగా ప్రసిద్ధి చెందిన కోరాపుట్, కలహండి జిల్లాలలో కరువు పరిష్కార సాధనంగా ప్రభుత్వం ఇంద్రావతి నది మీద డ్యాం కట్టడంతో జరిగిన నిర్వాసిత గ్రామాల అధ్యయనానికి 1980లో మాకు అవకాశం రావడం, అక్కడ జోడియాపరజ అనే ఆదివాసి తెగకి చెందిన ప్రజలను ప్రత్యేకంగా చూడడం, మాట్లాడడం జరిగింది. అక్కడ నిర్వాసిత సమస్య తీవ్రత, పునర్నిర్మాణక్రమం విఫలమవడం కళ్లముందు కన్పించాయి. ఎవరి మీదా ఆధారపడకుండా, స్వతంత్రంగా తమ కష్టసుఖాలకు తామే బాధ్యులుగా బతికే ఈ ఆదివాసి ప్రజలు నిరాధారులవడమే కాకుండా, ప్రభుత్వం ఇచ్చే పథకాల మీద ఆధారపడే వ్యక్తులుగా, స్తబ్దులుగా మారిపోయారు. డ్యాం ద్వారా వారి జీవితాలు మెరుగుపడలేదు.

ఆ సమయంలోనే సాధన రాసిన 'రాగో' నవల గురించి వినడం, చర్చించడం, చదవడం కూడా జరిగింది. 'రాగో' నవల కూడా మహారాష్ట్ర ప్రాంతంలో గోండు తెగ గురించిన నవల. ఆదివాసి జీవితాలలో వారికి అవసరమైన మార్పుని తీసుకుని రాగలిగిన ఒక చిన్న వెలుగులా ఆ నవల కన్పించింది. మొదటిసారి చదివిన వెంటనే నవల చాలా నచ్చింది. 20 సంవత్సరాల తరువాత తిరిగి ఇప్పుడు చదువుతున్నప్పుడు కొన్ని ప్రశ్నలు వచ్చాయి. ఇది నాలో వచ్చిన మార్పు అవవచ్చును. 'రాగో' నవలలోని సంక్లిష్టత అవవచ్చును. అదేకాలంలో ఆదివాసిలలో పరజ అనే తెగ జీవన విధానాన్ని వివరంగా చిత్రీకరించిన గోపినాథ మహంతి రచన 'పరజ' చదివాను. పరజ తెగ గురించిన వివరాలను ప్రామాణికంగా రచించిన అతికొద్ది నవలలో ఈ నవల ఒకటి అవడం, దానికి జ్ఞానపీఠ బహుమతి (గోపినాథ మహంతికి జ్ఞానపీఠ అవార్డుతో పాటు సాహిత్య అకాడమీ బహుమతి, పద్మభూషణ్ కూడా వచ్చాయి) రావడంతో ఒడియా సాహిత్యంలో ఈ నవలకి ప్రాధాన్యత పెరిగింది. ప్రస్తుతం వివిధ కారణాల వలన ప్రాచుర్యం పొందుతున్న 'దండకారణ్య యుద్ధకథలు' కూడా అదే ఆదివాసి ప్రాంతంలో జరుగుతున్న మార్పులు వివరించే కథలు. ఇవి ఒకే రచయిత రచించిన కథలు కావు. ఆదివాసి సమాజంలో ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనా తయారు చేసుకుని దాని ఆధారంగా తమ సమాజంలో మార్పులు తేవడానికి ఉద్యమిస్తున్న ప్రజలే రచయితలుగా మారి, తమ అనుభవాలను అక్షరీకరించే ప్రయత్నంలో రూపొందిన ఉద్యమ ప్రజల అనుభవాల సమాహారంగా ఈ 'దండకారణ్య యుద్ధ కథల' సంపుటిని చూడవచ్చును. ఒకే దండకారణ్య ప్రాంతంలోని వేరు వేరు తెగల జీవితాలను ప్రతిఫలించే, పైన ఉదహరించిన సాహిత్యం సహాయంతో ఈ ఆదివాసి సమాజంలో ఎటువంటి మార్పులు వచ్చాయి, ఈ మార్పులకు కారణమైన వ్యక్తికి, ఆ వ్యక్తి భాగమైన సమష్టికి ఉండే సంబంధం ఎటువంటిది అని పరిశీలించే క్రమంలో

1. 'రాగో' నవల ద్వారా గోండు సమాజంలోని వ్యక్తి 'రాగో' చలనాన్ని గుర్తించగలమా?
2. దెబ్బై ఏళ్ల వ్యవధిలో వచ్చిన మూడు సాహిత్య రూపాల ద్వారా గోండు సమాజంలో సమష్టి చలనం అంచనా వేయగలమా?
3. వీటికి అవసరమైన సమష్టికి - వ్యక్తికి సంబంధించిన ఒక అవగాహనా చట్రం తయారు చేసుకోగలమా? అనే మూడు ప్రశ్నలకు సమాధానం అన్వేషించడమే ఈ వ్యాస లక్ష్యం.

1

1.1 ఉపోద్ఘాతం :

సాహిత్యం సామాజిక జీవనాన్ని ప్రతిఫలించడమే కాకుండా, తిరిగి సామాజిక జీవితాన్ని ప్రభావితం చేస్తుంది అనే ప్రతిపాదన ఆధారంగా, సాహిత్యానికి సమాజానికి ఉండే అన్యోన్య సంబంధం స్పష్టమవుతుంది. ఇంతవరకు సాహిత్యంలో సామాజిక జీవితం సరిగా ప్రతిఫలించిందా లేదా అని పరిశీలించే ప్రయోగాలు చాలా జరిగాయి, జరుగుతున్నాయి కూడా. ఇలా చూసినపుడు సమాజ అధ్యయనానికి ఉపయోగపడే ఎన్నో ఆధారాలలో సాహిత్యం కూడా ఒకటి అవుతుంది. ఇక్కడ మన పరిశోధనా వస్తువు సమాజం. అలా కాకుండా, సాహిత్యాన్ని పరిశోధనా వస్తువుగా చేసుకొని, దీని విశ్లేషణ ద్వారా సమాజ గమనాన్ని గ్రహించగలమా అనే ప్రశ్న వస్తుంది. సాహిత్యంలో చిత్రీకరింపబడిన సమాజానికి కూడా వాస్తవ సమాజ చలన సూత్రాలు వర్తిస్తాయనుకుంటే, వివిధ తాత్విక దృక్పథాలు ఈ చలనానికి వేరువేరు కారణాలను గుర్తిస్తాయి. అప్పుడు సాహిత్య సృష్టికర్త అయిన రచయిత దృక్పథాన్ని (ఇక్కడ ప్రాపంచిక దృక్పథం, సమాజ చలన సూత్రాల అవగాహన, జీవితానుభవం కలిపి దృక్పథం అని ఒకే మాటగా వాడడం జరిగింది) బట్టి కథాగమనం, పాఠకుడి దృక్పథాన్ని బట్టి సాహిత్య విశ్లేషణ ఉంటాయి. ఒక దృక్పథం ఆధారంగా సాహిత్యంలో సమాజ ప్రతి రూపాన్ని విశ్లేషించి, తద్వారా వాస్తవ సమాజ చలనానికి ఉండే అడ్డంకులు, వాటి పరిష్కారమార్గాలు సూచన ప్రాయంగానైనా అవగాహన చేసుకునే అవకాశం దొరకవచ్చును. అలాగే సమాజంలోని వ్యక్తి చలనాన్ని అంచనా వెయ్యడం, వ్యక్తిలో మార్పులకు ఆ వ్యక్తి భాగమైన సమష్టి చలనానికి ఉండే సంబంధం కూడా స్పష్టమయ్యే అవకాశం కలుగుతుంది. మొదట చెప్పినట్లుగా సమాజాన్ని కేంద్రంగా పెట్టుకొని సాహిత్యంలో ప్రతిఫలించిన సమాజ ప్రతిరూపం సరియైన ప్రతిరూపమా కాదా అని విశ్లేషించే పద్ధతి ఒకటైతే, సాహిత్యాన్ని కేంద్రంగా పెట్టుకొని సమాజ చలనాన్ని అంచనా వేయడం మరొక పద్ధతి. ప్రస్తుత వ్యాసం రెండవ పద్ధతిని అనుసరించే ప్రయోగం. సాహిత్యంలో ప్రతిఫలించే సమాజ చలన సూత్రాలను మార్క్సియన్ దృక్పథంలో పరిశీలించే ప్రయత్నం కూడా ఇది. ఇంకా వ్యవస్థ నిర్మాణానికి కారణభూతమైన సమష్టికి, ఈ సమష్టిలో భాగమైన వ్యక్తికి ఉండే సంబంధం ద్వారా చలనాన్ని పరిశీలించే ప్రయత్నం కూడా.

1.2 కథ అంటే

నిరంతరం చలనంలో ఉండే సమాజాన్ని మూడు తలాలలోని వివిధ అంశాలలో ఉండే వైరుధ్యాల సముదాయంగా చూడవచ్చును. సమాజం తన అవసరాన్ని బట్టి, తాను సంపాదించుకున్న జ్ఞానం, దానితో పాటే వచ్చే సాంకేతిక నైపుణ్యత ఆధారంగా వైరుధ్యాలలో కొన్నింటిని సమాధానం కోరే సమస్యలుగా ఎంచుకొని వాటిని పరిష్కరించుకోవడం ద్వారా సమాజంలో చలనం సాధ్యమవుతుంది.

ఒక కథా రచయిత వర్తమాన కాలంలో తన చుట్టూ ఉన్న సమాజంలోని ప్రజల జీవితాలలో ఎదురయ్యే వైరుధ్య రూపానికి ప్రభావితమై దానిని తన కథా వస్తువుగా ఎంచుకుని కథలో ఆ వైరుధ్యాన్ని ఎదుర్కొనే రెండు పాత్రల మధ్య సంబంధాలలో లొకేట్ చేయడంలో, వైరుధ్యం ఒక సమస్యగా మారి దానికి ఒక రూపం వస్తుంది. రచయిత ఈ సమస్యని గుర్తించి, అవగాహన చేసుకుని సాహిత్యం ద్వారా సమాజ పరిధిలో పరిష్కారాన్ని సూచించినట్లయితే, కథ సృజనాత్మక సాధనం అవడమే కాక, సాహిత్యానికి ఒక ప్రయోజనం ఉంటుంది. రచయితలు ఎటువంటి సమాధానం సూచిస్తారు అనేది వారి దృక్పథం మీద ఆధారపడుతుంది. ఒక కథలో సమస్యకి సమాధానం వెతకడం మూడు రకాలుగా ఉంటుందని అనుకోవచ్చును. మొదటిది, ఈ సమస్యకి పరిష్కారం ఇప్పటికే సమాజంలో అందుబాటులో ఉన్నదనీ, ఆ సమాధానాన్నే, అంటే ఆ పరిష్కార వివరాలే జ్ఞానంగా, వర్తమానానికి తీసుకుని వచ్చి ప్రస్తుత సమస్యకి సాహిత్యం ద్వారా పరిష్కారం చూపించడంతో సమస్యకి ఒక కొత్త రూపం ఇచ్చే పద్ధతి. ఈ రూపం – రూపం, క్రమంలో సమస్యకి ఉండే స్థలకాల నిర్దిష్టత తీసివేయబడుతుంది. అందుచేత ఈ కథను చదివిన పాఠకుడికి అశాస్త్రీయ దృక్పథం ఏర్పడడమే కాక సమస్య వ్యక్తి పరంగా ఉండిపోతుంది. సమస్యకి తాత్కాలికంగా పరిష్కారం దొరికినప్పటికీ అదే సమస్య మరో రూపంలో పునరావృతం అయ్యే అవకాశం ఉంది. ఇలా వైరుధ్యాలు రూపంలోనే జీవించడంతో, వాటి పరిష్కారానికీ సమాజ గమనానికీ ప్రత్యక్ష సంబంధం కనిపించదు. రెండవది, సమస్యకి మూలం వ్యవస్థలోనే ఉందని, సమాజం సమూలంగా మారితేనేకాని – అంటే సారం మారితేనేకాని – సమస్యకి సమాధానం దొరకదని భావించే మరొక పద్ధతి. సమస్య ఉత్పన్నమవడానికి మూలకారణాలు వ్యవస్థలోనే వెతికే క్రమంలో సమస్య రూపం నుండి దాని సారానికి వెళ్లి, ఈ అవగాహనతో ఆచరణ యోగ్యమైన ఒక కొత్త సమాధానం సూచించే పద్ధతి ఈ రూ-సా-రూ' క్రమం. వ్యవస్థ మార్పు ద్వారానే సమస్యకి ఆచరణ యోగ్యమైన పరిష్కారం దొరికి సమాజంలో చలనం సాధ్యమని భావించే పద్ధతి ఇది. ఈ రూ-సా-రూ' క్రమంలో సమస్యకి ఒక చారిత్రకత, సమస్య తాత్కాలికమేనని దానిని ఆచరణ ద్వారా తొలగించుకోవచ్చుననే శాస్త్రీయ దృక్పథం పాఠకునికి కలుగుతుంది. ఇంక మూడవది ప్రస్తుత సమాజంలో ఈ సమస్యకి సమాధానం దొరకదనీ, కాల్పనిక ప్రపంచంలోనే దొరుకుతుందనీ సూచించే పద్ధతి. ఈ పద్ధతిలో వాస్తవ సమాజంలోనూ, వ్యక్తి జీవితంలోనూ ఎదురయ్యే సమస్యని కథా వస్తువుగా స్వీకరించినప్పటికీ, దాని సమాధానం వాస్తవ ప్రపంచంలో దొరకకపోవడంతో ఒక కాల్పనిక జగత్తుని సాహిత్యంలో సృష్టించి, దీనిలో పరిష్కారం చూపించడం జరుగుతుంది. మొదటి పద్ధతి రూ-రూ' క్రమంలోనూ, మూడవ పద్ధతి కాల్పనిక సాహిత్యం ద్వారా సమాధానం చూపించడంలోనూ కథ, ఆ కథలోని వ్యక్తుల ఆలోచన కేంద్రంగా నడిస్తే, రెండవ పద్ధతి రూ-సా-రూ' క్రమంలో కథ వ్యక్తుల ఆచరణ కేంద్రంగా నడుస్తుంది.

క్లుప్తంగా, రచయిత సమాజంలో ఒక వైరుధ్య రూపానికి ప్రభావితుడై దానినే కథా వస్తువుగా ఎంచుకోవడం, దానిని ఇద్దరు వ్యక్తుల మధ్య సమస్యగా చూపించి, దానికి ఒక సమాధానం అన్వేషించే క్రమంలో కథ పుట్టి వికసిస్తుంది. సమాజంలో ఏ వైరుధ్యాలు పరిష్కారం కోరి సమాజం ముందుకు వస్తాయి అనేది సమాజ దశ మీద, సమాజ చలన గతి మీద ఆధారపడుతుంది.

1.3 వ్యక్తి - సమష్టి : మార్పు

సమాజం అంటే బహుముఖంగా ఉండే ఎన్నో సమష్టుల సముదాయంగా పరిగణిస్తే, ఒక నిర్దిష్ట నేపథ్యంలో సమష్టికీ, దానిలో భాగమైన వ్యక్తికీ ఏర్పడే సంబంధాలు కూడా ఒక వైరుధ్య పరిష్కారాన్ని ప్రభావితం చేసే అవకాశం ఉంటుంది. ఈ వైరుధ్య పరిష్కారం ద్వారానే వ్యక్తిలోనూ, సమష్టిలోనూ చలనం సాధ్యమవుతుంది. అందుకే వైరుధ్యాన్ని వ్యక్తి - సమిష్టుల సంబంధాల నేపథ్యంలో లొకేట్ చేసి చూడడం కూడా ఒక పద్ధతి. ఇక్కడ వ్యక్తులు తమకు తామే స్వతంత్రంగా మనుగడ సాగించకుండా ఒక సమష్టిని ఎందుకు తయారు చేసుకుంటారు? వ్యక్తికి సమష్టి అవసరం ఏమిటి? ఇలా తయారు చేసుకున్న సమష్టికి ప్రత్యేక గుణాలు ఏమన్నా ఉంటాయా? వ్యక్తికీ తాను భాగమైన సమష్టికీ ఎటువంటి సంబంధాలు ఉంటాయి అనే ప్రశ్నలు ముందుకు వస్తాయి.

వాస్తవ ప్రపంచంలో (దీనినే ఆబ్జెక్టివ్ రియాలిటీ అనవచ్చును) ఉండే కొన్ని వందల జీవరాశులలో ఒకటైన మనిషికి ఉండే సృజనాత్మకత (ఉత్కంఠ, జిజ్ఞాస అని కొందరి భావన) ఈ మనిషిని మిగతా జీవరాశుల నుండి వేరు చేసి ఒక ప్రత్యేకతని ఆపాదిస్తుంది. తాత్వికంగా చూస్తే, మనిషి తన చుట్టూ ఉండే విశాల వస్తు ప్రపంచం (ఆబ్జెక్ట్ వరల్డ్ - దీనిలో ప్రకృతి, మరొక మనిషి, సమాజం ఉంటాయి) లోని చలనం ద్వారా ప్రభావితమై, ఆ చలనాన్ని విశ్లేషించుకుని, దాని గురించిన జ్ఞానం సంపాదించుకుని, ఆ జ్ఞానాన్ని వస్తు ప్రపంచంలో ఆచరించడం ద్వారా వస్తు ప్రపంచంలో కూడా చలనం సాధ్యమవుతుంది. ఈ క్రమంలో మనిషి అంటే ఆలోచన - ఆచరణతో కూడిన నమూనాగా గుర్తించవచ్చును. ఇటువంటి మనిషిని స్థలకాల నిర్దిష్టత ఉన్న ఒక నేపథ్యంలో లొకేట్ చేస్తే, స్థలకాల పరిధులు లేని చలనశీలమైన ఈ అనంత విశ్వంలో, స్థలకాల పరిధులు గల ఒక నేపథ్యంలో (పుట్టుక) స్థానీకరించబడిన మనిషి జీవితంలో ఉండే క్షణికత్వం తెలుస్తుంది. అందుకే మానవ జీవితాన్ని క్షణ భంగురమనీ, బుద్బుద ప్రాయమనీ, నదీ ప్రవాహంలో చిన్న నలుసుగాను గుర్తిస్తారు.

ఈ వైరుధ్యం (ఫైనిట్ ఎక్సిస్టెన్స్ ఆఫ్ ఎ హ్యూమన్ ఇన్ బియింగ్ యాన్ అన్ ఇన్ఫైనిట్ ఎవాల్యూనింగ్ ఎక్స్‌పాన్ ఆఫ్ ద అబ్జెక్టివ్ రియాలిటీ) ఉత్సుకత ఉన్న మనిషికి ఒక సవాలుగా నిలుస్తుంది. ఈ సవాలుని ఎదుర్కొనే క్రమంలోనే మనిషికి మానవ సమాజ పరిణామ క్రమ చరిత్రలో ఒక పాత్ర దొరుకుతుంది. బుద్బుద ప్రాయమైన మనిషి, కొన్ని వేల సంవత్సరాలకు పూర్వం గుహలలో నివసిస్తూ ప్రకృతి మీద ఆధారపడ్డ మనిషి ఆధునిక మానవుడుగా హోదా గడించుకోవడానికి చేసిన సుదీర్ఘ ప్రయాణానికి మూలం మనిషిలో ఆలోచన- ఆచరణలుగా అనుకోవచ్చు. ఈ పరిణామ క్రమంలో, మనిషి తనకున్న అతి తక్కువ సమయంలోనే, మానవ స్వభావమైన సృజనాత్మకత ద్వారా చలనశీలమైన వాస్తవ ప్రపంచం గురించి గతంలో మానవాళి ఆర్జించిన జ్ఞానాన్ని సంపాదించుకొని, ఈ జ్ఞానానికి తన వంతు జ్ఞానాన్ని జోడించి తన తోటి వారితో పంచుకుంటారు. అంటే మనిషి ఇప్పటికే వాస్తవ ప్రపంచం మీద ఉన్న జ్ఞానంకోసం గతంలోనే మనుషుల మీద (ఇది టైం కంపోనెంట్), దానిని ఆచరణలో పెట్టే క్రమంలో తన తోటి మనుషుల మీద (ఇది స్పేస్ కంపోనెంట్) ఆధారపడతాడు. మనిషి ఇలా ఆధారపడే క్రమంలో ఒక సమష్టి తయారవుతుంది. ఈ సమష్టిలో తాను, ఇతరులు అంటే (సెల్ఫ్ అండ్ అదర్స్) ఉంటారు. ఈ ఇతరులు అనే భాగంలో గతంలోని తాను, ప్రస్తుతం తన చుట్టూ ఉండే తోటి మనుషులు కాక ప్రకృతి, సమాజం కూడా ఉంటాయి. ఈ సమష్టి పరస్పర సంబంధాలు లేని వ్యక్తుల సమూహంలా కాకుండా, తాను సంపాదించిన జ్ఞానం ఆధారంగా ఉత్పత్తి, పునరుత్పత్తి కార్యక్రమాలు భవిష్యత్తులో కూడా కొనసాగడానికి తోటి వ్యక్తులతో పరస్పర సంబంధాలు (ఎక్స్ఛేంజెస్) కలిగి ఉండడంతో సమష్టికి ఒక నిర్మాణం, దానిలో భాగాలు ఏర్పడతాయి. ఈ చట్రంలో చూస్తే, వ్యక్తి ఒక సమష్టిలో భాగం అయినపుడే ఆ వ్యక్తికి ఒక అస్తిత్వం ఏర్పడుతుంది. అలాగే పరస్పర సంబంధాలున్న వ్యక్తుల కలయిక ఉన్నపుడే సమష్టికి ఒక గుర్తింపు వస్తుంది. అంటే వ్యక్తి లేకపోతే సమష్టికి వ్యక్తీకరణ లేదు. సమష్టి లేకుండా వ్యక్తికి అస్తిత్వం లేదు.

ప్రకృతి మీద మనిషికి ఉన్న జ్ఞానం స్థిరంగా, యథాతథంగా ఉంటుంది (గివెన్ నాలెడ్జ్) అని అనుకున్నపుడే సమష్టి పునరుత్పత్తి కొనసాగుతుంది. కాని సమష్టిలో భాగమైన వ్యక్తి ఎల్లపుడూ జ్ఞానాన్ని వృద్ధి చేసే ప్రయత్నంలోనే ఉండడం జరుగుతుంది. ఈ సమష్టి ఆచరణకి కావలసిన స్థిరంగా ఉండే జ్ఞానానికి, వ్యక్తి ఆలోచన ద్వారా వృద్ధి పొందే జ్ఞానానికి ఉండే వైరుధ్యమే వ్యక్తిలోనూ, సమష్టిలోనూ చలనాన్ని కలుగజేస్తుంది.

1.4 సమష్టి ప్రత్యేక గుణాలు

సమష్టికి ఉండే ప్రత్యేక గుణాలు గమనిస్తే, అది సంచిలో కూరిన కూరగాయల మాదిరిగా ఒకచోట పోగుచేసిన వ్యక్తుల సమూహం కాదు. గతకాలం నుండి అమలులో ఉన్న నియమ నిబంధనలను, సంప్రదాయాలను, రీతిరివాజులను పాటిస్తూ, పరస్పర సంబంధాలు కలిగిన వ్యక్తుల సముదాయం. ఇవన్నీ కూడా సమష్టిలో భాగమైన వ్యక్తుల ఆలోచనలోనే నమోదు అయిపోతాయి. ఈ కారణంగా సమష్టి అంటే

1. ఒక అమూర్త భావన (అబ్‌స్ట్రాక్ట్ కాన్‌సెప్ట్) గా మారి వ్యక్తుల ఆలోచనా పరిధిలోనే ఉంటుంది.

2. సమష్టి అనేది ఒక అమూర్త భావన కాబట్టి తనకు తాను స్వతంత్రంగా ఆలోచించగల శక్తి దానికి ఉండదు. ఈ కారణంగా సమష్టి తరుపున ఆలోచించగలిగే ఒక లీడరు ఆవశ్యకత ఉంటుంది.

3. వ్యక్తికి మాత్రమే ఆలోచనాశక్తి ఉండడంతో లీడరు ఆలోచిస్తే సమష్టి ఆచరిస్తుంది.

4. వ్యక్తికి ఉత్పత్తికి అవసరమైన వనరులు అందుబాటుకి ఉండే తేడాల వలన సమష్టిలోని అంతర్భాగాలు పరస్పర సంబంధాలు కలిగిన వేర్వేరు భాగాలుగా విభజింపబడతాయి.

ప్రస్తుత వ్యాసానికి కేంద్రమయిన ఆదివాసి సమాజంలో ప్రకృతి మీద ఉండే జ్ఞానం చాలా తక్కువగా ఉండడం, పంటలు పండించుకోవడం అలవాటు లేకపోవడం, అందరు వ్యక్తులు ఒకే రకమైన పనులు చేయడం వలన వాళ్ల కుటుంబాల మధ్య తేడాలు రాశిలోనే కాని వాసిలో ఉండకపోవడంతో, వ్యక్తుల మధ్య సంబంధాలు స్పష్టంగా ఉండవు. ఇక్కడ సమష్టి రూపొందడం, స్పష్టమైన సరిహద్దులతో ఒక నిర్మాణం, దానిలో భాగాలు రూపొందడం జరగదు.

అందుచేత ఆదివాసి సమాజాన్ని వర్గరహిత సమాజంగా గుర్తించవచ్చును. సమష్టిలో భాగాలు సమాజ ఉత్పత్తి క్రమం మీదకాక ప్రకృతి మీద కూడా ఆధారపడతాయి. అంటే ఆడ, మగ, పెద్దవాళ్లు, చిన్నవాళ్లు వేరువేరు భాగాలుగా ఉంటారు. అందుకే సామూహిక జీవనం ఇక్కడ పునాది అవుతుంది. కాని ఒక తెగలోని వ్యక్తులందరినీ ఒకటిగా కలిపి ఉంచేశక్తి వారి చరిత్ర, సంప్రదాయాలకి ఉంటుంది. అందుకే తరతరాల నుండి వస్తున్న సంప్రదాయాలను మార్చుకోవడానికి విపరీతమైన వ్యతిరేకత ఉంటుంది.

ఒక ప్రత్యేక నిర్మాణం గల ఒక సమష్టికి దానిలోనే భాగమైన వ్యక్తికి ఉండే సంబంధాలను వివిధ దృక్పథాలలో ఊహించుకోవచ్చును. సమష్టి నిర్మాణంలోనే వ్యక్తిని స్థానీకరించి, సమష్టిలో వచ్చే మార్పులే వ్యక్తిలో మార్పులకు ఆధారంగా చూసే సమష్టి కేంద్ర దృక్పథం. మరొక దానిలో వ్యక్తి తన అవసరాలకు అనుగుణంగా, ఆలోచనల ఆధారంగా సమష్టిని నిర్మించుకుంటాడనీ, వ్యక్తిలో వచ్చే మార్పులే సమష్టిలో మార్పులకు కారణమని ఊహించుకునే వ్యక్తి కేంద్ర దృక్పథం. ఈ రెంటిలో మార్పు ఏక ముఖంగా ఉంటుంది. మరొకటి సమష్టికి వ్యక్తికి ఉన్న పరస్పర సంబంధాలలోనే మార్పులకు మూలం గుర్తించే దృక్పథం. అంటే ఒక దానిలో వచ్చిన మార్పులు రెండవదానిలో మార్పులను ప్రభావితం చేస్తాయనీ, అలాగే రెండవదానిలో వచ్చిన మార్పులు మొదటి దానిలో మార్పులను ప్రభావితం చేస్తాయనీ, మార్పు ద్విముఖంగా ఉంటుందనీ అనుకోవచ్చును. ఈ మూడవ దృక్పథంలో, వ్యక్తి ఒక నిర్దిష్ట నేపథ్యంలో ఒక సమష్టిలో జన్మించిన కారణంగా, ఆ నిర్దిష్ట సామాజిక సంబంధాలలో వ్యక్తి ఆలోచన, ఆచరణ విషయంలో కొన్ని హద్దులు, నియమాలు ఏర్పడతాయి. వ్యక్తి వీటికి అంగీకరించి, అనుసరిస్తేనే సమష్టిలో భాగంగా ఉండడం జరుగుతుంది. కొన్నిసార్లు వ్యక్తికి ఈ సంబంధాలు బంధనాలుగా, సమస్యగా, అడ్డంకిగా మారినపుడు తన తోటివారితో కలిసి సంఘర్షించడం జరుగుతుంది. ఇవే ప్రజా ఉద్యమాలుగా గుర్తింపబడతాయి. ఇవి కొన్నిసార్లు సంప్రదాయపరంగా ఉన్న నిర్మాణం లోపలే మార్పులు డిమాండ్ చేయవచ్చును. మరికొన్నిసార్లు ఈ సంప్రదాయ సమష్టినే ఎదిరించి, సమష్టి బయటికి వెళ్లిపోయి మరొక కొత్త సమష్టి నిర్మాణానికి ప్రయత్నించవచ్చును. అప్పుడు ఈ ఉద్యమాలు ప్రత్యామ్నాయ రాజకీయ ఉద్యమాలుగా గుర్తింపబడతాయి. కొత్త సమష్టి నిర్మాణం జరగాలి అంటే ఒక కొత్త నేతృత్వం ఆవిర్భవించాలి. ఈ నేతృత్వానికి భవిష్యత్తులో తాము కోరుకునే కొత్త సమాజపు రూపురేఖలు (గమ్యం గురించిన అవగాహన), కొత్త సమాజ అవసరాల గురించిన ముందుచూపు, ఈ కొత్త సమాజం ఏర్పడడానికి కావలసిన మార్పులు, దానికోసం ఎంచుకునే మార్గం అంటే, గమ్యం, గమనం గురించిన అవగాహన ఉండాలి. ఇటువంటి కొత్త నేతృత్వంలో ఏర్పడే కొత్త సమష్టి ఊహించే గమ్యానికి, ఆ సమష్టిలోని వ్యక్తికి కావలసిన గమనానికి సంతులనం ఉంటే ఒక దానిలో మార్పులు రెండవదానిలో మార్పులకు దారితీస్తాయి.

ప్రస్తుత వ్యాసంలో మూడవ దృక్పథాన్ని వాడుకోవడం జరిగింది. ఈ చట్రంలో, వ్యక్తిలో చలనం అంటే వ్యక్తి సమాజాన్ని చూసే దృక్పథంలో మార్పు. ఇది వ్యక్తి ఆచరణ ఆలోచనలో మార్పుల ద్వారా గుర్తించవచ్చును. సమష్టిలో చలనం ఒక కొత్త నేతృత్వ ఆవిర్భావం, వారి ఆధ్వర్యంలో ఒక కొత్త సమాజ నిర్మాణానికి చేసే ప్రయత్నాలలో కన్పిస్తుంది. ఈ క్రమంలోనే సమాజ చలన దిశ కూడా కన్పిస్తుంది.

వైరుధ్యాన్ని తిరిగి పరిశీలించితే

1. నిరంతరం చలనంలో ఉండే అనంతమైన విశ్వంలో నిమిత్తమాత్రుడైన సృజనాత్మక మనిషి.

2. స్థిరత్వం కోసం యథాతథ స్థితిని ప్రోత్సహించే సమష్టిలో భాగంగా, మార్పుని కోరి ప్రయత్నించే మనిషి అనే ఈ రెండు వైరుధ్యాలు సమాజ పరిణామ క్రమానికి బాధ్యత వహిస్తాయి.

ఒక నవలలో వ్యక్తి చలనం గుర్తించడానికి నవల ప్రారంభంలో సమష్టిలో ఆ వ్యక్తి ఆచరణ, నవల చివరికి వచ్చేటప్పటికి వ్యక్తి ఆలోచనలో, ఆచరణలో వచ్చిన మార్పుల ద్వారా గుర్తించవచ్చును. ఈ మార్పులు ఆ వ్యక్తి చుట్టూ ఉండే వస్తుప్రపంచాన్ని చూసే దృక్పథంలో మార్పులకి సంకేతంగానూ, వ్యక్తిలో చలనానికి సూచనగానూ గుర్తించవచ్చును. ఈ వ్యక్తి చలనం తను భాగమైన సమష్టిలో కూడా మార్పులను ప్రభావితం చేయగలిగితే చలన క్రమం పూర్తి అయినట్లు భావించవచ్చును. అలా కాకుండా వ్యక్తిలో చలనం సమష్టిలో చలనాన్ని ప్రభావితం చేయలేకపోతే వ్యక్తి తెచ్చిన మార్పులు పాక్షికంగానే ఉండిపోతాయి.

సమష్టి ఒక అమూర్తభావన కావడంతో ఒక కొత్త నేతృత్వ ఆవిర్భావం, ఒక కొత్త పద్ధతిలో సమాజాన్ని పునర్ నిర్మించుకునే ప్రయత్నాలు (న్యూ ఫామ్స్ ఆఫ్ ఆర్గనైజేషన్), సమష్టిలోని వ్యక్తులు దీనిని ఎంతవరకు సొంతం చేసుకోగలరు అనే వివరాల సహాయంతో సమష్టి చలనాన్ని అవగాహన చేసుకునే అవకాశం ఉంటుంది.

పైన ప్రతిపాదించిన వ్యక్తి - సమష్టి చట్రం ఆధారంగా సాహిత్యంలో

1. వ్యక్తి చలనం రాగో నవల ద్వారా.

2. సమష్టిలో చలనం పరజ - రాగో- దండకారణ్య యుద్ధ కథలు ద్వారానూ పరిశీలించే ప్రయత్నమే ఇది.

2. సాహిత్యంలో వ్యక్తి చలనం

రాగో నవల

మిగతా దేశాల కంటే వెనుకబడి ఉన్న మన సంప్రదాయ సమాజాన్ని, ఆధునిక సమాజంగా మార్చివేయాలనే సంకల్పంతో ఎంచుకున్న భారత ప్రభుత్వం అభివృద్ధి మార్గం, దీనిలో భాగంగా ఎంచుకున్న పథకాలు ఆదివాసి సమాజంలో వాళ్లు కోరుతున్న నిర్మాణాత్మకమైన మార్పులు తీసుకొని రాకపోగా, అనేక రకాలుగా విధ్వంసాన్ని సృష్టించాయి. ఈ కారణంగా సమాజం సమూలంగా సారాంతరం చెందవలసిన అవసరాన్ని గుర్తిస్తూ, దండకారణ్య ప్రాంతంలో ఎం.ఎల్. పార్టీ ప్రత్యామ్నాయంగా అభివృద్ధి మార్గాన్ని అన్వేషిస్తూ అనేక కార్యక్రమాలు చేపట్టింది. పార్టీకి చెందిన ఒక దళం నేతృత్వంలో ఈ కార్యక్రమాలు అమలుచేస్తూ ప్రజలను సమీకరించి చైతన్యవంతుల్ని చేసే పని మొదలుపెట్టింది. ఈ కొత్త ఆచరణ క్రమంలో దళానికి ఎదురైన అనుభవాలను ఒక నవల రూపంలో 'రాగో' మన ముందుకు తెస్తుంది. నవల రచయిత

సాధన ఒక దళ సభ్యుడు అవడంతో తమకు ఎదురైన అనుభవాలను బేరీజు వేసుకోవడమే కాకుండా, తమ ప్రత్యామ్నాయ మార్గాన్ని అందరికి తెలియజేసే ప్రచార కార్యక్రమంలో రూపుదిద్దుకున్న నవల 'రాగో' అవడంతో దీనిలోని వివిధ అంశాలకు విశ్వసనీయత ఉంది.

ఆదివాసి సమాజంలో మాడియా గోండు తెగకి చెందిన యుక్త వయస్కురాలైన యువతి రాగో. ఆదివాసి సమాజంలో వివాహ వ్యవస్థకి చెందిన కట్టుబాట్లు, సంప్రదాయాలలో (ఖాయిదాలు) భాగంగా తండ్రి నిర్ణయించిన మేనరికపు పెండ్లి చేసుకోవడం ఇష్టం లేకపోవడంతో, వారిని ఎదిరించి ఇంటి నుండి పారిపోయింది. అక్కడే అడవిలో జిల్లా బంద్ చేసే దళంలో యాదృచ్ఛికంగా కలిసిపోయి దానిలో భాగమైపోయింది. క్రమంగా ఆ భావజాలపు ప్రభావంతో చైతన్యవంతురాలై వివాహ వ్యవస్థ దానంతట అదే పోదనీ, అది మారడానికి సమాజ సారం మారవలసిన అవసరం ఉందనీ గ్రహించి, దళ కార్యక్రమంలో భాగం అవుతుంది. జైనిగా మారిపోయిన రాగో డిప్యూటీ కమాండర్‌గా పార్టీలో కొత్త బాధ్యతలు చేపట్టడంతో నవల ముగుస్తుంది.

2.1 'రాగో' నవలలో రాగో అనే యువతి తను జన్మించిన ఆదివాసి సమాజంలో స్త్రీల శ్రమకి విలువ ఉన్న కారణంగా, వివాహ వ్యవస్థ దానితోనే ముడిపడి ఉన్న జీవసారె (డబ్బు లేక శ్రమ రూపంలో వరుడు ఇచ్చే కన్యాశుల్కం), దానితో పాటే ఖాయిదాల రూపంలో స్త్రీ మీద ఉండే సమాజపు నిర్బంధాలను ఎదిరించింది. తండ్రి నిర్ణయించిన వరుణ్ని సమాజం ఆమోదించినా కూడా, తనకు ఇష్టంలేని పెండ్లిని తప్పించుకోవడానికి వేరే దారిలేక ఇంట్లో నుండి పారిపోయింది. ఇక్కడ రాగో అనే వ్యక్తి గోండు సమాజంలో స్థిరత్వాన్ని కోరుకునే కుటుంబం అనే సంప్రదాయ సమష్టి నుండి పారిపోవడంతో ఈ సమష్టితో తనకు ఉండే తన సామాజిక సంబంధాలను తెంచివేసుకుంది. ఈ చర్య వలన కుటుంబంలో ఒక ఆబ్జెక్ట్‌గా ఉండే వ్యక్తి, సబ్జెక్ట్‌గా మారి ఇంటిలో నుండి పారిపోయింది. రెండు సార్లు పట్టుబడి కూడా తిరిగి మళ్లీ పారిపోయింది. దిక్కు తోచని స్థితిలో పరుగుపెడుతూ, అడవిలో బంద్ నిర్వహిస్తున్న దళంలో రాగో యాదృచ్ఛికంగా కలిసి పోయింది. ప్రస్తుతం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ఆదివాసి సమాజంలో మరో కొత్త నిర్మాణం చేయకపోగా విధ్వంసాన్నే కలుగచేస్తున్నాయనీ, ఆదివాసి సమాజం మారవలసిన అవసరాన్ని గుర్తించి, ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించే, మార్పుని కోరుకునే పార్టీలో భాగమైన కొత్త సమష్టి ఈ దళం. ఈ కొత్త సమష్టిలో భాగమవడంతో రాగో ఒక ఆబ్జెక్ట్‌గా మారిపోయింది. దళంలో సభ్యులతో కలిసిపోయి దళ శిక్షణతో చైతన్యవంతురాలైంది. దళ కార్యక్రమంలో భాగంగా తన సొంత గ్రామానికి వెళ్లి వారి సమస్యల పరిష్కారానికి ప్రజాకోర్టు నిర్వహించింది. ఇక్కడ తను ఏ వివాహ వ్యవస్థలోని రీతి, రివాజులను ఎదిరించి ఇంటి నుండి పారిపోయిందో, లామ్ పద్ధతి సంప్రదాయంగా ఉండే ఆ వివాహ వ్యవస్థకు వ్యతిరేకంగా తీర్పునిచ్చింది. ఈ 'లామ్' పద్ధతిలో స్త్రీకి కొన్నిసార్లు అన్యాయం జరిగిపోతుందనీ, ఈ పద్ధతి మంచిది కాదనీ, అందుచేత దానిని రద్దు చేయాలనీ, చాకిరీ (శ్రమ) చేసిన వానికి కూలీగా పైసలో, గింజలో ఇవ్వాలి తప్ప తమ కూతుళ్లను ఆశచూపే పద్ధతి రద్దు కావాలని తీర్పునిచ్చి, లామ్‌కి బదులుగా మరొక పద్ధతిని సూచించింది. ప్రజాకోర్టుకి వచ్చిన సమాజ పెద్దలను ఒప్పించింది. ఈ చర్యతో రాగో తిరిగి సబ్జెక్ట్‌గా మారింది. క్లుప్తంగా, రాగో పరిణామాన్ని గమనిస్తే, ఒక కుటుంబం అనే యథాతథ స్థితిని ప్రోత్సహించే సమష్టిలో ఆబ్జెక్ట్‌గా ఉన్న రాగో, ఇంటి నుండి పారిపోయే నిర్ణయం తీసుకోవడంతో సబ్జెక్ట్‌గా మారింది. దళం అనే మార్పుకోరే మరో సమష్టిలో భాగమై కావలసిన శిక్షణ పొందే క్రమంలో ఆబ్జెక్ట్‌గా మారింది. తన గ్రామంలోనే ప్రజాకోర్టు సమర్థవంతంగా నిర్వహించి పార్టీ సభ్యత్వం పొంది క్రమంగా డిప్యూటీ దళ కమాండర్‌గా, సమష్టికి ఒక లీడరుగా ఎదగడంతో తిరిగి కొత్త దృక్పథం కల సబ్జెక్ట్‌గా మారింది. సబ్జెక్ట్ అంటే సృజనాత్మక ఆలోచనా కేంద్రంగానూ, ఆబ్జెక్ట్ అంటే సృజనాత్మకతకి వాస్తవంలో రూపునిచ్చే ఆచరణ కేంద్రంగానూ మోడల్ తయారు చేస్తే, ఒకే వ్యక్తి సమాజ గమనంలో ఈ రెండు పాత్రలు ఒకే సమయంలో కాకుండా విడివిడి సమయాలలో పోషించగల సామర్థ్యం ఉంటుంది.

ఈ క్రమం

సి1-----ఐ1-----సి2-----ఐ2

ఆబ్జెక్ట్---సబ్జెక్ట్----ఆబ్జెక్ట్----సబ్జెక్ట్

రాగో చలనాన్ని, అంటే సమష్టిలో ఉండే వ్యక్తి చలనాన్ని సూచిస్తుంది. ఇక్కడ ముఖ్యమైన షరతు, సబ్జెక్ట్‌గా మారిన వ్యక్తి ఆబ్జెక్ట్‌లో అంటే సమష్టిలో అంతర్భాగమై, దానిలో నుండి పాస్ అయినపుడే ఒక కొత్త సబ్జెక్ట్‌గా సామాజిక సంబంధాలను మార్పుచేయగల కొత్త శక్తిగా ఆవిర్భంచే అవకాశం ఉంది.

సాంప్రదాయ సమాజ కట్టడిలో బందీగా ఉన్న రాగో చైతన్యవంతమైన జైనిగా మారిన క్రమం ఈ కథలో ఉండే గొప్ప ఆకర్షణ.

2.2 నవల పరిమితులు

ఆదివాసి సమాజం స్త్రీ కేంద్రంగా నడుస్తున్నా కూడా, వివాహ వ్యవస్థలోని లామ్ వంటి సంప్రదాయాల మూలాన స్త్రీని డబ్బు / శ్రమతో మార్పిడి చేసే రివాజు కారణంగా, స్త్రీ తనకు నచ్చినవానిని జీవిత భాగస్వామిగా ఎంచుకునే స్వేచ్ఛ లేకపోగా, స్త్రీని శ్రమతో మార్పిడి చేసే ఖాయిదా కారణంగా స్త్రీ ఒక వస్తువుగానే చూడబడుతోంది. ఈ జీవసారె అనే సంప్రదాయానికి వ్యతిరేకంగా రాగో ప్రతిపాదించిన సమాధానం సమస్యని ఉత్పత్తి సంబంధాల నేపథ్యంలోకి మార్చివేసింది. రాగో చెప్పిన పరిష్కారం స్త్రీకి కొంత స్వేచ్ఛని, పురుషునికి తన శ్రమకి ప్రతిఫలంగా తగినంత కూలీని ఇవ్వడం, స్త్రీ మనస్సుకి నచ్చని వివాహానికి బలవంతపెట్టకూడదనే ప్రతిపాదన చేసి ప్రజాకోర్టుకి వచ్చిన అందరినీ ఒప్పించింది. శ్రమకి తగిన కూలీ / గింజలు ఇచ్చే ఈ కొత్త పద్ధతిలో జరుగవలసిన మారకాలు (ఎక్స్చేంజెస్) పూర్తి అయిపోతాయి. అవి అవిచ్ఛిన్నంగా కొనసాగవు. రాగో ప్రతిపాదించిన ఈ సమాధానం ప్రజాకోర్టుకి వచ్చిన ప్రజలు దళం మీద ప్రేమతో, నమ్మకంతో అంగీకరించారా లేక దళం మీద భయంతో అంగీకరించారా, మిగతా గోండు సమాజ స్థిరత్వం సమష్టి చరిత్ర, సంప్రదాయాలే అనుకుంటే దానిని ఎదిరించి మార్చివేసే ప్రయత్నాలను ఈ సమాజం సహిస్తుందా? గోండు సమాజం దీన్ని వ్యతిరేకించకుండా అంగీకరిస్తుందా, దీని

పర్యవసానాలు ఎలా ఉంటాయి అనేవి తెలియవు. వివాహ వ్యవస్థలో సంప్రదాయాల రూపంలో వస్తున్న జీవసారె అనే ఖాయిదా పోతుంది. కాని దీనికి బదులు మరొక కొత్త ఖాయిదా రాలేదు. అటువంటి పరిస్థితులలో వివాహ వ్యవస్థలో అస్థిరత, దానితో పాటే ఉత్పత్తి సంబంధాలలో సందిగ్ధత చోటు చేసుకుంటాయి. సంప్రదాయబద్ధంగా లామ్ పద్ధతిలో తండ్రి ఒప్పుకున్న వివాహాన్ని ఎదిరించి పారిపోయిన రాగోని తన్ని, కొట్టి హింసించి, తిరిగి బలవంతంగా తీసుకుని వచ్చి అదే వివాహాన్ని చేయడానికి తయారైన పెద్దలు, రాగో ప్రజాకోర్టులో తీర్పునిచ్చినంత మాత్రాన ఈ మార్పుకి అంగీకరిస్తారనేది సందేహమే. ప్రత్యామ్నాయ అభివృద్ధి మార్గం బలం పుంజుకుని ప్రజల నమ్మకం సంపాదించుకున్న సందర్భంలోనే ఇది సాధ్యమయ్యే అవకాశం ఉంది.

రచయిత పరిమితులు

నవలలో రాగో యాదృచ్ఛికంగా, ప్రణాళికలు ఏమీ లేకుండా అడవిలో బంద్ నిర్వహించే కార్యక్రమంలో భాగంగా ఆ దారిన పోయే దళంలో కలిసింది. దళం శిక్షణతో చైతన్యవంతురాలైంది. ఇక్కడ వచ్చే ప్రశ్నలు..

రాగో మార్పును వ్యతిరేకించే ఒక సమష్టిని వదిలి దానికి విరుద్ధ లక్ష్యం గల మరొక సమష్టిలో భాగమై దానిలో ఎలా ఇమిడిపోయింది? అడ్డంకులను అధిగమించి, చైతన్యవంతురాలైన క్రమం చాలా సాఫీగా, ఒడిదుడుకులు లేకుండా సాగిపోయినట్లు చిత్రీకరింపబడింది.

రాగో చైతన్యవంతురాలవడం, దళంలో సభ్యుల సంఖ్య పెరిగి బలం పుంజుకోవడం, ఆదివాసి సమాజంలోని వివాహ వ్యవస్థలో భాగమైన జీవసారె అనే సంప్రదాయం ఒక స్త్రీ సమస్యగా ముందుకు వచ్చి, దానికి సమాధానం దొరకడం, సమాజ చలనానికి ఒక ప్రత్యామ్నాయం అన్నీ కూడా యాదృచ్ఛికంగా అనుకోకుండా జరిగినట్లు అయిపోతాయి. ఈ మార్పులన్నీ కూడా ఒక పథకం ప్రకారం కాకుండా అనుకోకుండా జరిగే మలుపులుగానే కన్పిస్తాయి. ఇంకో సందర్భం ఊహించుకుంటే, రాగోకి దళం కాకుండా మరొక సమష్టి ఎదురైతే, రాగో చలనం వేరే దిశలో ఉండేది అనే భావన వస్తుంది. విదేశీ స్వచ్ఛంధ సంస్థలు ఎదురుపడితే అమెరికా వెళ్లిపోయి పెద్ద శాస్త్రవేత్తగానో, మిషనరీలు ఎదురుపడితే మత ప్రవక్తగానో, రాజకీయ పార్టీలు ఎదురుపడితే నేతగానో మార్పు చెందే అవకాశం ఉండేది.

రాగో అనే వ్యక్తిలో మార్పులు చూస్తే స్థిరత్వం కోరుకునే కుటుంబం అనే సమష్టి నుండి దూరమైపోయి, చలనం కోరుకునే మరొక సమష్టిలో భాగమై చైతన్యవంతమైన రాగోలో చలనం ప్రస్ఫుటంగానే కనబడుతుంది. రాగో దృక్పథం మారిపోయింది.

రాగో అనే వ్యక్తిలో వచ్చిన చలనం ద్వారా గోండు సమాజం అనే సమష్టిలో మార్పు వస్తుందా లేదా అనేది నిశ్చయంగా చెప్పలేం.

3

సాహిత్యంలో సమష్టి చలనం

గత ఏడు దశాబ్దాలలో మన దేశంలో ఆదివాసి సమాజం, ముఖ్యంగా మధ్య భారత దేశంలో దండకారణ్యమని పిలువబడే ప్రాంతంలోని (ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర రాష్ట్రాలకు చెందిన అటవీ ప్రాంతం) వివిధ తెగల గురించి వచ్చిన సాహిత్యం ఆధారంగా, ఈ ప్రాంత ప్రజల సమష్టి జీవనంలో వచ్చిన మార్పులను అంచనా వేసే ప్రయత్నమే ఈ కింది ప్రయత్నం.

సాహిత్యం	రచయిత	ప్రచురణ కాలం
1. పరజ నవల	గోపినాథ మహంతి	1945
2. రాగో నవల	సాధన	1990
3, దండకారణ్య యుద్ధ కథలు	ఉద్యమకారులు	2013

3.1 పరజ కథ

ఆదివాసి సమాజంలో ప్రజల జీవితాలలో విభిన్న పార్శ్వాలలో వస్తున్న మార్పులను వివరంగా చిత్రీకరించిన నవల పరజ. ప్రభుత్వ ఉద్యోగి అయిన గోపినాథ మహంతి స్వయంగా కోరాపుట్ జిల్లా (ఒరిస్సా రాష్ట్రంలోని) పరజ అనే తెగ ప్రజలతో కలిసి జీవించి, వారి కష్ట సుఖాలలో భాగం పంచుకొని ఆ అనుభవ సారాన్ని సమాజం ముందుకు తెచ్చిన సాహిత్యరూపం ఈ 'పరజ' నవల. పరజ తెగ గురించిన , వారి జీవన విధానానికి సంబంధించిన వివరాలు ప్రామాణికంగా రచించబడిన అతికొద్ది నవలలో పరజ నవల ఒకటి. దీని రచనా కాలం 1945.

ప్రకృతితో సజీవ సంబంధాల నేపథ్యంలో జీవించే ఆదివాసి జీవితాలలో, ప్రభుత్వ విధానాలైన ఎక్సైజ్, రెవెన్యూ, ఫారెస్టు చట్టాలు, కోర్టుల ద్వారా పోలీసులు జోక్యం చేసుకోవడం, వారి చట్టాలు అమలు చేయడంతో పాటు అభివృద్ధి పథకాలలో భాగంగా తయారయ్యే రోడ్ల నిర్మాణానికి వచ్చే కాంట్రాక్టర్లు, అధిక వడ్డీకి అప్పులు ఇచ్చే వడ్డీ వ్యాపారులు అంతా కలిసి తమ ప్రభావం చూపించడంతో, ఈ అభివృద్ధి క్రమం నిర్మాణం లేని విధ్వంసానికి ఎలా దారి తీస్తుందో ఈ నవల మనకు అవగాహన కలిగిస్తుంది.

ఒరిస్సా రాష్ట్రంలో కోరాపుట్ జిల్లాలో ఉన్న సరసుపదర్ అనే పరజ తెగకి చెందిన తండాలో నివసించే సుక్రుజాని కుటుంబం, ప్రభుత్వ యంత్రాంగం ప్రవేశపెట్టిన చట్టాల ప్రభావంతో క్రమంగా ఊబిలోకి దిగినట్లయి ఎలా బలి అయిపోయిందో విపులంగా వివరిస్తుంది. నవలకి పరజ అని పేరు పెట్టడం వలన పరజ అనే తెగ (సమష్టి) కేంద్రంగా నవలని చూడమని రచయిత ఉద్దేశ్యం. ఈ నవలనే సుక్రుజాని కూతురు జిల్లి కేంద్రంగా చూస్తే, పరజ స్త్రీల స్థితి పూర్తిగా దిగజారిపోయి, తమ స్వేచ్ఛని పోగొట్టుకొని, మరొకరి మీద ఆధారపడి జీవించే హీనస్థితికి ఎలా చేరుకుందో మనకు అవగతమవుతుంది. ప్రభుత్వం చేపట్టిన ప్రతి కార్యక్రమం కూడా వీరి జీవితాలలో కొత్త నిర్మాణం లేని విధ్వంసాన్ని సృష్టించింది. దీనికి తోడు వస్తు మార్పిడి (బార్టర్ ఎక్స్ఛేంజెస్) ఆనవాయితీగా ఉన్న ఈ సమాజంలో మార్కెట్లు, వడ్డీవ్యాపారులు ప్రవేశించడంతో, సొంత ఆస్తిలేని సమాజంలో భూయజమానులను, దానితో పాటే సాంప్రదాయాల రూపంలో ఉండే పురుషాధిక్యతకి ఆర్థిక పునాదినిచ్చి ఒక భావజాల రూపంలో పురుషాధిక్య భావజాలాన్ని ప్రవేశపెట్టి వాటి శక్తిని పెంచింది.

నవలలో ఆరంభంలో జిల్లి, తన తండ్రి, అన్నదమ్ములు,

చెల్లెలుతో కలిసిమెలిసి, చీకూ చింతా లేకుండా ఉండే కుటుంబంలో భాగం. మొగవాళ్లు ముఖ్యంగా భూమికి సంబంధించిన పనులు, స్త్రీలు కుటుంబ పోషణ, ఇంటి పనులు, వారానికి ఒకసారి సంతకు వెళ్లి తమ ఉపయోగానికి మించి ఉన్న తమ సరుకులను మార్పిడి చేసి తమకు కావలసిన సరుకులను తెచ్చుకోవడం, పొలం పనులు, గృహ నిర్మాణ పనులలో సహాయం చేయడంతో కాలం గడిపేవారు. ఈ కుటుంబానికి తినడానికి తిండి (రాగి జావ, ఆకులు, దుంపలు), ఉండడానికి తమ శ్రమతో తాము కట్టుకున్న ఇల్లు, శ్రమ చేసి తమకు కావాలసిన పంటలు పండించడానికి తమదైన పొలం ఉండడంతో ఒళ్లు వంచి కష్టపడి పనిచేసి దొరికిన దానితో తృప్తిగా జీవించడం, ఆనందంగా కబుర్లు చెప్పుకోవడం, ఆటపాటలతో కాలం గడిపే వీరి జీవితం హాయిగా గడిచిపోయేది. తమ దైనందిన అవసరాలకు కావలసిన వాటిని తామే శ్రమించి తయారు చేసుకోగలిగే వారి మీద క్రమంగా ప్రభుత్వ యంత్రాంగం తమ చట్టాల ద్వారా ప్రభావం చూపడం ప్రారంభించింది. ఈ చట్టాల కారణంగా ఆదివాసి ప్రజల జీవితాలలో భాగంగా ఎన్నో ఏండ్లుగా అలవాటుగా చేసుకునే ఎన్నో పనులు ఇప్పుడు చట్ట విరోధ చర్యలైపోయాయి. అడవిలో చెట్లు నరికి నేలను చదును చేసుకుని పంటలు పండించుకోవడం, ఆ నరికిన చెట్లను ఇంటి అవసరాలకు వాడుకోవడం లాంటి పనులు అటవీ చట్టాల ప్రకారం నేరం అయ్యాయి. తమకు కావలసిన సారాను తమకు దొరికే ఇప్పపూలతో తామే తయారు చేసుకోవడం ఎక్సైజ్ చట్టం ప్రకారం నేరమయింది. ఈ నేరాల వలన వీరిని అరెస్టు చేయడం, కోర్టులలో విచారణ, అక్కడి మోసాలు, లంచాలు, జరిమానాలు పడడం, అదీ రూపాయలలో కట్టవలసి రావడం తప్పనిసరి అయింది. తమ దగ్గర లేని రూపాయల కోసం వడ్డీ వ్యాపారులకు దాసోహం అవడం తప్పని సరి అయింది. ఈ కారణంగా వెట్టిచాకిరి చేయడానికి పాలెకాపులుగా మారడం, తప్పుడు వడ్డీలు కట్టలేక మోసాల కారణంగా క్రమంగా భూములు పోగొట్టుకోవడం కూడా మొదలైంది. అభివృద్ధి పథకాలలో భాగంగా రోడ్లు వేయడంతో కాంట్రాక్టర్లు ప్రవేశించడంతో అక్కడ పనికివెళ్లే స్త్రీలు సెక్స్ వస్తువులుగా మార్చబడ్డారు. వీటన్నిటికి తోడు వివాహ వ్యవస (కన్యాశుల్కం, లామ్ పద్ధతి కూడా) స్త్రీని మారకపు సరుకులాగానే చూసింది. ఆదివాసి స్త్రీలకి ఉండే స్వేచ్ఛ అపార్థాలకు లోనైంది.

ఈ క్రమంలోనే జిల్లి కుటుంబం తమ భూములను పోగొట్టుకోవడంతో, తండ్రి, సోదరులు దూర ప్రాంతంలో ఉన్న వడ్డీ వ్యాపారి రామచంద్ర బిసోయ్ దగ్గర వెట్టిచాకిరి చేయడానికి వెళ్లిపోయారు. తమ పొలంలో తిండిగింజలు పండించుకోలేక, బయటిపనులు దొరకకపోవడంతో, వేరే జీవనాధారం లేక జిల్లి, ఆమె చెల్లెలు ఆకలికి తాళలేక రోడ్లు వేసే పనులకు వెళ్లి అక్కడి కంట్రాక్టరు చేతిలో పడిపోయారు. కొంతకాలానికి తండ్రి తిరిగి వచ్చి బలవంతం చేయడంతో వెనక్కివచ్చినప్పటికి, బిసోయి చలాకీతనానికి జిల్లి లొంగిపోయి, ఆయన పంచనేచేరి ఉంపుడుకత్తెగా స్థిరపడిపోయింది. తమ భూములు అన్యాయంగా లాగేసుకొని, తమని వెట్టిచాకిరికి నెట్టడం, జిల్లిని పెండ్లి చేసుకుంటానని చెప్పినప్పటికీ కన్యాశుల్కం చెల్లించక పోగా, ఆమెను ఉంపుడుకత్తెగా మార్చడం అనే పరిణామాలతో ఆమె తండ్రి, సోదరులు తమకు జరుగుతున్న అవమానం భరించలేక బిసోయ్ ఇంటికి వచ్చి అక్కడ ఘర్షణ పెరగడంతో ఉద్రిక్తులై బిసోయ్ మెడ నరికివేసి పోలీసు స్టేషనుకి వెళ్లి నేరం ఒప్పేసుకుంటారు. జిల్లి ఈ ఘాతుక చర్యని చూసి భయకంపితురాలై పారిపోవడంతో నవల సమాప్తమైపోతుంది.

3.2 దండకారణ్య యుద్ధ కథలు

కేంద్ర ప్రభుత్వం తన కొత్త వ్యూహంలో భాగంగా అభివృద్ధి, భద్రతలతో ఒకపక్క, సంక్షేమ పథకాలతో మరోపక్క కొత్త అభివృద్ధి కార్యక్రమాలతో పాటు (మైనింగ్ ఇండస్ట్రీస్) కొత్త కొత్త అణిచివేత విధానాలు ఆదివాసి ప్రాంతాలలో ప్రయోగిస్తోంది. ఇక మావోయిస్టుపార్టీ దండకారణ్య ప్రాంతంలో నిలదొక్కుకోవడం, జనతన సర్కారు ఏర్పాటు చేసుకోవడం, ప్రత్యామ్నాయ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం చేస్తూనే, రాజకీయంగా ప్రభుత్వపు వ్యూహాలను ఎదిరిస్తూ తన ఉనికిని చాటుకుంటోంది.

దండకారణ్య ప్రాంతంలో గత ముప్పయి సంవత్సరాలుగా ఇక్కడి ఆదివాసి ప్రజలు తమని విధ్వంసానికి గురిచేస్తున్న కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి పథకాలను వ్యతిరేకిస్తూనే, తమదైన ఒక ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనాని తయారుచేసుకున్నారు. వీరు కూడ భద్రత, అభివృద్ధికి చెందిన కార్యక్రమాలలో, సల్వాజుడుం, గ్రీన్‌హంట్ లాంటి వాటిని గెరిల్లా యుద్ధ పద్ధతులతో ఎదిరించడం ఒకపక్క చేస్తూనే, మరొకపక్క జనతన సర్కార్‌ని ఏర్పరచుకొని, అభివృద్ధి పథకాలలో భాగంగా విద్య, ఆరోగ్యం, వివిధ రకాల పంటలు, పండ్ల ఉత్పత్తి చేయడం, చెరువులలో సమష్టిగా చేపల పెంపకం, క్యాడర్‌కి శిక్షణ ఇవ్వడం, మిత్రులను సమీకరించుకోవడం అనే కొత్త ప్రయోగాలు చేస్తున్నారు. ఆచరణలో వచ్చే తప్పొప్పులను విశ్లేషించుకోవడం, ఇలా బహుముఖ ఆచరణలో ఉంటున్న ప్రజలు తమ ప్రయోగంలోని జయాపజయాలను, తమ సంఘర్షణ దాని వలన వచ్చిన మార్పులు, తమ అనవాయితీగా ఉన్న మౌఖిక సంప్రదాయం నుండి లిఖిత రూపంలోకి మార్చుకొని తాము చేసే కొత్త ప్రయోగాన్ని, తమ జీవితానుభవాన్ని బయటి ప్రజలతో పంచుకొనే ఉద్దేశంతో రచించుకున్న చిన్న కథలు, పాటలు, పద్యాలుగా సాహిత్యీకరించి నమోదుచేస్తున్నారు. ఈ కథలే దండకారణ్య యుద్ధ కథా సాహిత్యంగా మన ముందుకు వస్తోంది.

ఈ సంకలనంలో 2005-2012 సంవత్సరాల మధ్యకాలంలో, దండకారణ్య ఉద్యమ నేపథ్యంలో వచ్చిన కథల నుండి, మిడ్కో తాయమ్మ కరుణ, ఎన్.డి, సాధన, నిత్య మొదలైన ఉద్యమకారులు రచించిన కథలను ఎంపిక చేసి విరసం ఒక సంకలనంగా తీసుకవస్తోంది. ఈ కథలలో దండకారణ్య ఉద్యమ చరిత్ర వివరిస్తూ జుడుం కార్యకలాపాలను తిప్పికొట్టడం, గ్రీన్‌హంట్ బారి నుండి ప్రజలను రక్షించుకోవడం ఒక పక్కన జరుగుతూ ఉంటే, మరోపక్కన తమదైన జనతన సర్కారు స్థాపించుకొని తమ సమాజాన్ని ప్రత్యామ్నాయ పద్ధతుల్లో నిర్మించే కార్యక్రమాలు ఎలా చేపట్టారో చిత్రీకరింపబడ్డాయి. ఈ సంకలనంలో జనతన సర్కార్ తరపున సమష్టి వ్యవసాయం, పండ్లతోటల పెంపకం, ప్రత్యామ్నాయ విధానాలతో పిల్లలకు చదువులు, ఆరోగ్యం, యుద్ధరంగంలో వైద్య

సౌకర్యాలు కల్పించడం, స్త్రీ పురుషుల వివక్షను వ్యతిరేకించే న్యాయ వ్యవస్థ మొదలైన విషయాలను వివరించే కథలు ఉన్నాయి. సమష్టి జీవన విధానం, శ్రమకేంద్రంగా సంప్రదాయ వ్యవస్థకి ప్రత్యామ్నాయంగా ఒక కొత్త సమాజ నిర్మాణం గురించి వివరించే కథలు ఇవి.

3.3 సాహిత్యం - సమాజ చలనం

గత దెబ్బై సంవత్సరాలలో దండకారణ్య ప్రాంతంలో చోటుచేసుకున్న, చేసుకుంటున్న మార్పులను మూడు సాహిత్యరూపాల ద్వారా అవగాహన చేసుకునే అవకాశం ఉంది. ఆ మూడు - పరజ, రాగో నవలలు, దండకారణ్య యుద్ధ కథలు.

పరజ

ఒరిస్సాలో కోరాపుట్ జిల్లాలో 1940ల నాటి ఆదివాసి సమాజానికి చెందిన పరజ అనే తెగ జీవన విధానం, చలనం కన్పించని సమాజ స్తబ్ధతకి పరజ నవల అద్దం పడుతుంది. సమాజంలో ఉత్పత్తి, పునరుత్పత్తికి చెందిన అన్ని పనులు స్త్రీల శ్రమ మీదే ఆధారపడిన స్త్రీ కేంద్రిత సహజ ఆర్థిక వ్యవస్థ ఈ ఆదివాసి సమాజం. సమష్టి జీవనం ఈ సామాజిక లక్షణం. సమాజ ఉత్పత్తికి సంబంధించిన అన్ని విషయాలలో తమ శ్రమ ద్వారా భాగం పంచుకునే స్త్రీకి మిగతా అన్ని విషయాలలో స్వేచ్ఛ ఉన్నా కూడా, పెండ్లి విషయంలో తనకు నచ్చిన వాడిని జీవిత భాగస్వామిగా ఎంచుకునే 'స్వేచ్ఛ' ఉండదు. ప్రకృతి శక్తులకు, అది సృష్టించే బీభత్సానికి తలవంచి, ప్రకృతి శక్తులతో సంఘర్షణ ఏమాత్రం లేక ఐక్యతతోనే ఉండి, ప్రకృతి విధించిన పరిమితులలోనే జీవనం సాగించే సమాజం ఈ ఆదివాసి సమాజం. ప్రకృతి మీద జ్ఞానం తక్కువగా ఉండడం, ఉత్పత్తికి అవసరమైన సాంకేతికత కూడా అంతంత మాత్రంగానే ఉండడం, తమకు అందుబాటులో ఉండే వివిధ వనరులను దైనందిన అవసరాలకు సరిపడా మితంగానే వినియోగించుకోవడం వీరి స్వాభావిక గుణం. ప్రకృతి మీద ఆధారపడి జీవించడం, శ్రమచేసి తమకు కావలసిన తిండి, ఇల్లు సమకూర్చుకోవడం, ఉన్నదాంట్లోనే తృప్తిగా ఆనందంగా ఆటపాటలతో జీవించడం వీరి జీవన విధానం. సమష్టి జీవనమే వీరి ప్రత్యేకత. ఆధిపత్య అణచివేతకి తలవంచడం, లిఖిత రూపంలో ఉండే చట్టాలంటే భయం, ప్రకృతిలో సంభవించే వైపరీత్యాలు - పులి మనుషుల్ని చంపివేయడం, విపరీతమైన వానలు వచ్చి నష్టాన్ని కలుగచేయడం వారికి అనుభవంలో ఉన్న విషయమే. కాని ప్రభుత్వం తమ పథకాలతో, చట్టాలతో (లిఖిత రూపంలో ఉండే చట్టాలు) సృష్టించే విధ్వంసం, వడ్డీ వ్యాపారస్తులు, కంట్రాక్టర్లు లాంటి ప్రైవేటు వ్యక్తులు తమ కార్యకలాపాలతో చేసే మోసాలు వీరి ఊహకు అందవు. అభివృద్ధి పథకాల మీద వీరికి అంచనా లేకపోవడంతో ఏవో తెలియని బాహ్యశక్తుల వలన తమ జీవితాలు ధ్వంసమైపోతున్నాయనుకొని, పర్యవసానాలకు నిశ్శబ్దంగా బలి అయిపోతూ ఉంటారు. విధ్వంసాన్ని సృష్టించే ఈ అభివృద్ధి పథకాలకు ప్రత్యామ్నాయ మార్గం ఏమైనా ఉంటుందా అని వెతకాలనే ఆలోచన కూడా వీరికి రాదు. జిల్లి లాంటి స్త్రీలు ఎదుర్కొనే స్త్రీల సమస్యలకు అసలు సమాధానం లేదు. సమాజంలో ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనా మీద ఆలోచన లేకపోడంతో, నవల చివరలో జిల్లి తండ్రి, అన్న వచ్చి తమ కుటుంబాన్ని సర్వనాశనం చేసి కూడా, తనను చేరదీసిన వడ్డీ వ్యాపారిని తలనరికి చంపివేసినపుడు వేరే దిక్కుతోచక భయంతో పారిపోవడంతో నవల ముగిసిపోతుంది.

ఊహించని ఈ పరిణామంతో దిగ్భ్రాంతి చెంది భయంతో జిల్లి పారిపోయింది. సమాజ అంగీకారంలేని నమష్టిలోకి వెళ్లిపోయినప్పటికీ ఒక ఆబ్జెక్ట్‌గానే మిగిలిపోయింది. ఆదివాసి సమాజాన్ని మార్చగలిగే ప్రత్యామ్నాయం కనిపించలేదు.

రాగో

చరిత్ర పుటల్లో అర్ధశతాబ్ది కాలం గడిచిపోయేసరికి 'రాగో' నవల సమాజ వేదికమీద చోటుచేసుకుంది. 'రాగో' మహారాష్ట్రలోని చంద్రాపూర్‌కి దగ్గరలో ఉండే గోండు సమాజానికి చెందినది. 50 సంవత్సరాల కాలం గడిచేసరికి, ప్రభుత్వ పథకాలు తమ జీవితాలలో నిర్మాణం లేని విధ్వంసానికి దారి తీస్తున్నాయనే అవగాహన వీరికి కలిగింది. తమ సమాజం అభివృద్ధి చెందాలంటే ఒక ప్రత్యామ్నాయ అభివృద్ధి మార్గం అవసరాన్ని గుర్తించడం జరిగింది. ఈ ప్రత్యామ్నాయ మార్గం మావోయిస్టు పార్టీ నేపథ్యంలో బీజరూపంలో రూపు తీసుకుంది. గోండు సమాజంలో కదలిక కోసం చేసే ప్రయత్నాలలో మావోయిస్టు పార్టీ కలుగజేసుకుని దళం ద్వారా చేపట్టిన వివిధ కార్యక్రమాల వివరాలు 'రాగో'లో పొందుపరచబడ్డాయి. ఆదివాసి సమాజానికి అవసరమైన ప్రత్యామ్నాయ అభివృద్ధి మార్గాన్ని ఎం.ఎల్. పార్టీ నేతృత్వంలో, ఉరమరగానైనా, తయారు చేసుకుంటూ ప్రజలను సమీకరించే కార్యక్రమం క్రమంగా బలం పుంజుకుంటున్న సందర్భం 'రాగో' నవలకి నేపథ్యం. ముందు చెప్పినట్లుగా తనకు నచ్చని పెండ్లి తప్పించుకోవడానికి ఇల్లు వదిలి పారిపోయిన రాగో దళ సభ్యత్వం పొంది, చైతన్యవంతురాలైన జైనిగా మారిపోయింది, దళ సభ్యురాలుగా తన గ్రామానికే వచ్చి ప్రజాకోర్టు నిర్వహించి లామ్ పద్ధతిని వ్యతిరేకిస్తూ తీర్పుఇచ్చింది.

ఈ నవలలో

1. వ్యవస్థ మారితే కాని తమ సమస్యలు తీరవని, పార్టీ ప్రతిపాదించే ప్రత్యామ్నాయ అభివృద్ధి మార్గమే దీనికి సరియైన మార్గమనే భావన బలపడింది.

2. వివాహ వ్యవస్థలో స్త్రీ సమస్యకి ఒక పరిష్కార మార్గం దొరికింది. కాని వివాహ వ్యవస్థ స్థిరత్వానికి ఉత్పత్తి కొనసాగడానికి మరో సమాధానం దొరకలేదు.

దండకారణ్య యుద్ధ కథలు

ఈ సంకలనంలో వచ్చిన కథలు ఒక వ్యక్తి స్వీయ చరిత్రకి, అనుభవాలకి సంబంధించిన కథలు కావు. మార్పు కోరుకునే ఒక సమష్టిలోని వ్యక్తులు ప్రత్యామ్నాయ దృక్పథంతో కొత్త సమాజ నిర్మాణానికి చేసే పోరాటాలను వివరించే కథల సమాహారం. భవిష్యత్తులో తాము ఊహించుకునే కొత్త సమాజ నిర్మాణానికి, దానికి తాము చేసే పోరాటానికి రూపకల్పనే ఈ కథలు. సాంప్రదాయ

సమష్టి విధించిన పరిమితులతో బందీగా ఉన్న మనిషి (ఆబ్జెక్ట్‌గా), నిస్సారమైన ఈ గుర్తింపుని త్యజించి, సృజనాత్మకతతో కూడిన ఒక కొత్త మనిషిగా (ఒక సబ్జెక్ట్‌గా) మార్పు చెందిన సందర్భం ఇది. తాను చైతన్యం పొంది సమాజ చలనానికి దోహదపడే ఆచరణలో మార్పులు, దీని వలన తిరిగి ఆలోచన పెంచుకోవడం చేసే మనిషికి తనదైన ఒక కొత్త గుర్తింపు వస్తుంది. పార్టీ అనే సమష్టి నేతృత్వంలో తమ సమాజానికి ఎటువంటి మార్పులు అవసరమో నిర్ణయించుకునే అధికారంతో, దానికి కావలసిన కార్యాచరణలో పాలుపంచుకునే సృజనాత్మక మనిషి ఆవిర్భావం ఇక్కడ మనకి కన్పిస్తుంది. ఈ క్రమంలోనే మనిషికి ఒక కొత్త గుర్తింపు వస్తుంది.

ఆదివాసి సమాజం మీద వచ్చిన సాహిత్యం ద్వారా గత 70 సంవత్సరాలలో సమాజంలో వచ్చిన చలనాన్ని పరిశీలిస్తే

1. విధ్వంసంతో కూడిన ప్రభుత్వ అభివృద్ధి మార్గానికి ఒక ప్రత్యామ్నాయం లేని దశ (పరజ-1940) నుండి, మావోయిస్టు పార్టీ ద్వారా ఆ అభివృద్ధి మార్గాన్ని ఎదిరించడమే కాకుండా వేరొక ప్రత్యామ్నాయ అభివృద్ధి మార్గం బీజరూపంలోనైనా రూపొందింది. (రాగో - 1990) ఈ ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనా ఆచరణలో కొత్త భావజాలంతో, కొత్త నేతృత్వంతో బలం పుంజుకుంటోందని, ప్రజలు, ముఖ్యంగా స్త్రీలు, తమంతట తామే దళ కార్యక్రమాలలో భాగం పంచుకొని, చైతన్యవంతులై కొత్త సామాజిక ప్రయోగంలో భాగస్వాములై, కొత్త సమాజం కోసం యుద్ధరంగంలోనే కాకుండా, సమాజ ఉత్పత్తికి కావలసిన కార్యకలాపాలలో సమష్టిగా భాగం పంచుకునే ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. అంటే, ఆదివాసి సమాజ అభివృద్ధిని సాహిత్యం ద్వారా అంచనా వేస్తే, గత 70 సంవత్సరాలలో ప్రత్యామ్నాయం లేని దశ నుండి ఒక ప్రత్యామ్నాయం రూపు తీసుకొని బలం పుంజుకునే దశకు చేరిన క్రమం స్పష్టమవుతుంది.

2. వివాహ వ్యవస్థలో స్త్రీ సమస్యకి సమాధానం లేని పరిస్థితి (1945) నుండి, ఇష్టం లేని వివాహం తప్పించుకోవడానికి సాంప్రదాయ సమష్టి (కుటుంబం) నుండి పారిపోయి, అనుకోకుండా దళం (మార్పుకోరే కొత్త సమష్టి) లో భాగమై చైతన్యవంతురాలైన స్థితి (1990) నుండి, తమంతట తామే స్వచ్ఛందంగా మార్పుకోరే సమష్టిలో భాగం (2003) అయ్యే క్రమం కన్పిస్తుంది. సాంప్రదాయ సమాజంలో వివాహ వ్యవస్థలో స్త్రీ సమస్యకి సమాధానం దొరకదని, వ్యవస్థ మొత్తం (సారంలో) మారవలసిన అవసరాన్ని గుర్తుచేస్తుంది.

3. సృజనాత్మకతతో కూడిన కొత్త మనిషి ఆవిర్భావం గమనించవచ్చు.

(46 పేజి తరువాయి....)

మనవరకూ వస్తున్నాయి". అంటూ తన భుజానికున్న కంజరను చూశాడు. "కొన్ని నాచ్ పార్టీ(నృత్య బృందాలు) ల వద్ద హార్మోనియం పాతదే అయినా కాషియో వాడకం పెరిగింది. ఈసారి మేం మా కేంపెయిన్‌లో ప్రజాకళలను చిత్రీకరించాం.వీటిని భద్రపర్చాలన్నది మా లక్ష్యం. మా వీడియో ఫిల్ములు చూసిన యువత వాటిని మైక్రో చిప్‌లలో నింపియ్యాలంటూ ఒకటే డిమాండ్ చేశారు. గ్రామ గ్రామాన మొబైల్ ఫోన్స్ ఉన్నాయి. అసహ్యకరమైన శృంగార చిత్రాలు యువత మెదళ్ళను అరాచకంగా తయారు చేస్తున్నాయి. వాటిని ఎదుర్కోకుండా విప్లవ సంస్కృతి బతికి బట్ట కట్టలేదు. పురోగమించలేదు. ఇది ఒక సవాలుగానే మన ముందు నిల్చింది. అయితే వక్రమార్గం పట్టిన ఒక సెక్షన్ లంపెన్ యువత పోనూ మెజార్టీ ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. రాజ్యహింస పెచ్చరిల్లిపోతోంది. బూటకపు ఎన్‌కౌంటర్లు, సామూహిక హత్యలు, అత్యాచారాలు ఖాకీల దినచర్యగా మారాయి. వివిధ రూపాలలో ప్రజల ప్రతిఘటన పెంపొందుతోంది. వీటిని ఆధారం చేసుకొని ఈ కెంపెయిన్ అనుభవాల వెలుగులో కవులు, కళాకారులు, రచయితలు ప్రజల వద్దకు వెళ్ళి పని చేయగలిగితే పరిస్థితులు మాత్రం అత్యంత అనుకూలంగా మారుతున్నాయి" అంటూ తన ధృడ విశ్వాసాన్ని డోలు వ్యక్తం చేశాడు.

వాళ్ళ ఉత్సాహాన్నీ, పట్టుదలనూ చూసిన తర్వాత వాళ్ళతో కొన్ని అభిప్రాయాలు పంచుకోవాలనిపించింది.

"చైనాలో కూడా ప్రాచీన పెకింగ్ ఓపెరా లను విప్లవీకరించారు. ద రెడ్ లాంటెర్న్, సాచియాపంగ్ లాంటివి అనేకం ఆ కోవకు చెందినవే. విప్లవ లక్ష్యాలను నెరవేర్చడానికి విదేశీ సంప్రదాయ కళా రూపాలలోని బ్యాలె లాంటివి కూడా వాళ్ళు మలచుకుని మరింత విశ్వాసాన్ని పెంచుకున్నారు. వాస్తవ జీవితానుభవాలను శక్తివంతంగా సాహితీ, కళా రూపాలలో ప్రతిబింబింప చేయడానికి పెకింగ్ ఓపెరాలోని బేసిక్ స్కిల్స్‌ను ఎంతో అభివృద్ధి చేశారు. వాటిని చాలా సంస్కరించారు. సృజనాత్మకంగా మలచుకున్నారు. సాంస్కృతిక విప్లవంలో విధ్వంసం-నిర్మాణం రెండూ ఉంటాయనీ, అద్భుతమైన నమూనాలను సృష్టించడానికి నాయకత్వం వ్యక్తిగత బాధ్యత పడాలని కూడా చైనా అనుభవం చెపుతోంది. అయితే గుడ్డి అనుకరణ ఎన్నటికీ కళగా రాణించదు. నిజానికి సాహితీ కళలకు ఏకైక వనరు ప్రజల జీవితాలే. ప్రత్యక్షంగా ప్రజల్లోకి వెళ్ళడం ద్వారానే వారి జీవితాలను కళాకారులు, రచయితలు అర్థం చేసుకోగలరు. వెళ్ళలేనపుడు కనీసంగా వారి గురించి తెలుసుకోవడానికి పూర్తిగా శ్రమించాలి. 'ప్రజల నుండి ప్రజల వద్దకు' అనేదే ప్రామాణికంగా ఉండాలి. విప్లవ రాజకీయాల సారాన్ని, మేలైన సాహితీ, కళా రూపాల్లోకి మేళవించగలగాలి. ఇందుకు ఎంతగానో శ్రమించాల్సి ఉంటుంది. మీ గౌరుమూర పీటో ఒక మంచి ప్రయత్నం. మీ కెంపెయిన్ మీకు మంచి అనుభవాన్నిచ్చింది. ఇలాంటి అనుభవాలను ఇంకా ఇంకా సంపాదించాలి" అంటూ వాళ్ళకు నా విప్లవాభినందనాలు తెలియజేస్తూ ఎర్రెర్ర వందనాలు చెప్పాను.

జట్టు వాళ్ళంతా లేచారు. గెరిల్లాలు కూడా లేచి నిల్చున్నారు. ఒకరికొకరు బలంగా చేతులు కలుపుకున్నారు. గెరిల్లాలు భుజాలపై ఆయుధాలు, కళాకారులు బిగించిన పిడికిళ్ళెత్తి 'ప్రజాకళలు వర్ధిల్లాలి, భూస్వామ్య-సామ్రాజ్యవాద సంస్కృతి నశించాలి, ప్రజాస్వామ్య -సామ్యవాద సంస్కృతి వర్ధిల్లాలి' అంటూ గొంతెత్తి నినదించారు. మా నుంచి విడిపోతున్న కళాకారులలో నా చూపులు ఇడిమె పైనే నిలిచాయి. కళాకారిణి ఆహార్యంతో నడుస్తున్న ఇడిమె చేతిలో చిన్న సంచితో పాటు నా ఊహల్లో ఆమె భుజం పై తుపాకి దృశ్యమానమవుతూ ఆమె వర్తమాన సి.ఎన్.ఎం. కు ప్రతీకగా నిల్చిపోయింది. రాసో, గల్లె, సుందరి, డోలు.... వాళ్ళది ఒక అద్భుతమైన సైన్యం....

"నిర్జన వారధి" - ఒక విమర్శ

- మిడ్కో

కొండపల్లి కోటేశ్వరమ్మ ఆత్మకథ "నిర్జన వారధి" చదువుతుంటే ఉత్తేజం, ఉద్వేగం, దుఃఖమూ కలగలిసి పోయాయి. సామాజిక మార్పులో భాగమైన మనిషి కనుక ఆమె జీవితంపై ప్రతిఫలించిన చరిత్రా, చరిత్రపై ప్రతిఫలించిన ఆమె జీవితమూ, వెరసి ఆమె ఆత్మకథ ఒక సామాజిక చరిత్ర వలె సాగుతుంది. సూటిగా, సరళంగా, క్లుప్తంగా ఉండిన ఆమె శైలి ఆద్యంతమూ ఆసక్తిగా చదివిస్తుంది.

నలుగురికి చెప్పుకోవాల్సినంత గొప్ప విషయాలేం ఉన్నాయిలే అని అనుకోకుండా, తన ఆత్మకథ రాసినందుకు కోటేశ్వరమ్మ అభినందనీయురాలు. ఆనాటి సామాజిక స్థితిగతులూ, అందులో ఒక ముఖ్య భాగమైన మహిళల స్థితిగతులూ, వాటిని మార్చడానికి ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ చేసిన విశేష కృషి, ఆ కృషిని విస్తృతం, విశాలం, బహుముఖం చేయడానికి అన్నాళ్లూ నాలుగు గోడలకే పరిమితం చేయబడిన మహిళలను కమ్యూనిస్టు పార్టీ తనలో భాగం చేసుకోవడం, కమ్యూనిస్టు ఉద్యమంలో భాగమైన మహిళలు అన్నాళ్లూ సమాజం తమకు నిర్దేశించిన పాత్రల నుండి బయటపడి, నమూనాలను బద్దలు కొట్టుకొని ఒక చైతన్యవంతమైన సమాజానికి అవసరమైన పాత్రలను నిర్వహించి తమను తాము పునర్నిర్వచించు కోవడం.. ఇదంతా భావి తరాలకు కూడా ఉత్తేజకరంగా ఉంటుంది.

అసామాన్యమైన కోటేశ్వరమ్మ వ్యక్తిత్వం ఈ పుస్తకం ద్వారా లోతుగా అర్థమవుతుంది. వ్యక్తిగత జీవితంలో ఎదురుపడిన దుఃఖమూ, వేదనా, వియోగాలకు కుంగిపోకుండా నిబ్బరంగా నిల్చిన ఆమె తీరు ప్రశంసనీయం. చిన్న చిన్న విషయాలకే నిరాశలోకి కుంగిపోయే ఎందరికో ఆమె జీవితం ఒక పాఠం.

అయితే ఈ పుస్తకంలో ప్రస్తావించిన రెండు అంశాలు వివాదాస్పదంగా ఉన్నాయి. ఒకటోది సీతారామయ్య రెండో భార్య ద్రోణవల్లి అనసూయమ్మ గురించి పైపైనే అయినప్పటికీ చిత్రీకరించిన తీరు. (కోటేశ్వరమ్మ ఎక్కడా అనసూయమ్మ పేరు ప్రస్తావించలేదు. "ఆమె" అనే ప్రస్తావించారు. ఆమె పేరును బహిర్గతం చేయడం వల్ల ఆమె పరువుకు నష్టం కలుగుతుందని భావించారేమో. కానీ సీతారామయ్యతో తన సంబంధాన్ని రహస్య సంబంధంగా అనసూయమ్మ ఎన్నడూ భావించలేదు. కనుక నేను పేరునే ప్రస్తావిస్తున్నా.) రెండోది, సీతారామయ్యను ఆఖరి దశలో సిపిఐ (ఎం.ఎల్) (పీపుల్స్‌వార్) అన్యాయంగా పక్కన పెట్టినట్టుగా చిత్రీకరించిన తీరు. నేను ప్రధానంగా మొదటి అంశానికే పరిమితమవుతున్నా. అయితే రెండో అంశం గురించి ఒక్క విషయం మాత్రం చెప్పగలను. సీతారామయ్యను నాయకుడిగా నిలబెట్టుకోవడానికి సీపీఐ(ఎం.ఎల్) (పీపుల్స్‌వార్) అన్ని రకాలుగానూ ప్రయత్నించిందనేది ఒక చారిత్రక వాస్తవం. ఆయన కొందరు అవకాశవాదులతో చేయి కలిపి తానే స్వయంగా నిర్మించి, నాయకత్వం వహించిన ఉద్యమ పురోగమనానికి అడ్డంకిగా మారిన తర్వాతనే, అనివార్యంగానే ఆ పార్టీ ఆయనను పక్కన పెట్టింది. ఆ సందర్భంగానూ, ఆ తర్వాత కూడ పార్టీ చేసిన విశ్లేషణల్లో, మొత్తంగా విప్లవోద్యమ నిర్మాణంలో, అభివృద్ధిలో సీతారామయ్య పోషించిన పాజిటివ్, నెగెటివ్ పాత్రలనూ పార్టీ వస్తుగతంగా, సమగ్రంగా అంచనా వేసింది. అవన్నీ వివిధ డాక్యుమెంట్లలో వివరంగా రికార్డయి వున్నాయి కనుక దాని గురించి మరోసారి వివరణ అవసరం లేదని భావిస్తున్నా.

ఇక మొదటి అంశం గురించి - ఈ పుస్తకం రెండవ ముందుమాటలో అనురాధ "ఈ రచనకున్న ప్రాముఖ్యతల్లో రెండవది ఆనాటి చరిత్ర. ఆ చరిత్రలో మానికొండ సూర్యావతి, తాపీ రాజమ్మ లాంటి మేలిముత్యాల పరిచయం ఉంటుంది. తన కాలానికంటే ముందు పరిగెట్టిన ఉదయం లాంటి స్త్రీలే గాక, తనతో కలిసి పనిచేసిన ఎందరో (అ)సామాన్యులు, ఎందరో "అన్‌సంగ్ హీరోలు" మనకు ఈ పుస్తకం నిండా కనబడతారు" అని రాశారు. అది నిజమే కావొచ్చు. అయితే అనసూయమ్మ ఈ పుస్తకంలో ఎలా కనబడుతారు?

అనసూయమ్మ గురించి తెలియని వాళ్లకు కోటేశ్వరమ్మ అనుభవించిన ఒంటరితనానికీ, ఆమె జీవితంలో ప్రవహించిన దుఃఖానికీ ప్రధాన కారకురాలు అనసూయమ్మే అనిపిస్తుంది. అనసూయమ్మ గురించి తెలిసినప్పటికీ ఆమెను సమాజం నిర్దేశించిన నమూనాల్లోనే, ప్రమాణాల్లోనే అర్థం చేసుకునే వాళ్లకు, తెరమరుగైన విషయాలను వెలికితీసి మరోసారి ఆమెను వేలెత్తి చూపే అవకాశం కల్పిస్తుంది. వెరసి ఈ ఆత్మకథలో ఆమె ఒక విలన్ అవుతుంది.

నిజానికి అనసూయమ్మ గురించి రాసినపుడు కోటేశ్వరమ్మ చాలా మేరకు సంయమనాన్ని పాటించారు. అయినప్పటికీ కొన్ని మాటలు, ప్రస్తావనలు అభ్యంతరకరంగా ఉన్నాయి. మొత్తంగా ఆమె చరిత్రకు అన్యాయమే జరిగింది.

అనసూయమ్మను నేను ముందే చూసినప్పటికీ, అంతకంటే ఎక్కువగా ఆమె గురించి విన్నప్పటికీ ఆమె జీవితం గురించి వివరంగా తెలుసుకున్నది మాత్రం దాదాపు పదేళ్ల క్రితం. ఒక పత్రిక కోసం ఆమె జీవితానుభవాలను రికార్డు చేసే బాధ్యతను తీసుకొని నేను ఆమె దగ్గరికి వెళ్లాను. మూడు నాలుగు రోజులు ఆమెతో గడిపి ఆమె అనుభవాలను రికార్డ్ చేసాను. ఆమెది ఒక విశిష్ట వ్యక్తిత్వమని నేను అప్పుడే అర్థం చేసుకున్నాను. ఉద్యమ కార్యాచరణ మూలంగానే ఆమె వ్యక్తిత్వం అంత ఉన్నతంగా రూపుదిద్దుకుందని కూడా అనిపించింది.

పదకొండేళ్లకే జాతీయ ఉద్యమం పట్ల ఆకర్షితురాలైంది ఆమె. పద్నాలుగో ఏట కమ్యూనిస్టు పార్టీ వైపు మొగ్గు చూపింది. 1945లో అంటే పదిహేనేళ్ల వయసులో కట్నాలూ, కానుకలూ, మంత్రాలూ,

తాళి, మెట్టెలూ వంటి అన్ని సాంప్రదాయాలను కాదని కమ్యూనిస్టు పార్టీ క్రియాశీల కార్యకర్తను స్టేజీ మ్యారేజ్ చేసుకుంది. ఆ తర్వాత క్రమంగా పార్టీ సభ్యురాలూ, సెల్ సభ్యురాలూ, సెల్ కార్యదర్శి అయ్యి యువజన సంఘాలను నడిపింది. 16 రోజుల పసిపాపను వదిలి జైలుకు, అటు నుండి అటే అజ్ఞాతవాసానికి వెళ్లింది. పార్టీలో మహిళలను డెన్‌కీపర్స్‌గానే ఎక్కువగా వినియోగించుకున్న ఆ కాలంలో, ఆమె డెన్ కీపర్‌గా కాకుండా రహస్య ఆర్గనైజర్‌గా పని చేసింది.

సాయుధ పోరాటాన్ని బలంగా సమర్థించడమే కాక మహిళలు సాయుధ దళాల్లో పనిచేయడం కష్టమనే వాదనలకు తలవొగ్గకుండా ఆంధ్రలో, మొదటి సాయుధ దళ సభ్యురాలయింది. తుపాకీ పట్టి పలు మిలిటెంట్ చర్యల్లో సాహసంగా పాల్గొంది. పలు పోలీసు దాడుల నుంచి త్రుటిలో తప్పుకుంది. తమ దళానికి రాజకీయ కమిస్సార్‌గా ఉండిన ఆమె సహచరుడిని పోలీసులు పట్టుకొని బూటకపు ఎన్‌కౌంటర్లో కాల్చిచంపినప్పటికి ఆమెకు 20 యేళ్లు. ఆ విషాదాన్ని పంటి బిగువున భరించింది. "ఇద్దరిలో ఎవరం ముందు చనిపోయినా, రెండవ వారు భుజం నుండి ఎర్రజెండాను దించకుండా ప్రయాణించాలని" పెళ్లికి ముందే చేసుకున్న ప్రమాణాన్ని గుర్తు తెచ్చుకొని ముందుకు సాగింది. ఆ తర్వాత పార్టీ కాంటాక్ట్ తెగిపోతే కూలీ పని చేసుకుంటూ పార్టీ సంబంధాలను వెతికి పట్టుకుంది. పార్టీ సాయుధ పోరాటాన్ని విరమించినపుడు బహిరంగ జీవితంలోకి వచ్చి పార్టీని సంఘటితం చేయపూనుకుంది. తాలూకా స్థాయి కమిటీ సెక్రటేరియట్‌లోకి ఎన్నికైంది. సైకిల్ తొక్కడం నేర్చుకొని ప్రజల్ని సంఘటితం చేయడంలో చురుకైన పాత్ర వహించింది. ఆ సమయంలో నాటి అఖిల భారత మహిళా నేతలు ఆమెను ఒక ప్రాంతానికి పరిమితం చేయకుండా జిల్లా, రాష్ట్ర స్థాయిలో మహిళా సంఘం బాధ్యతలు ఇవ్వడం మంచిదని, పార్టీ ముందు చేసిన ప్రతిపాదన మేరకు ఆమె మహిళా సంఘం వర్కింగ్ కమిటీ సభ్యురాలైంది. అఖిల భారత స్థాయిలో జరిగిన మహిళా సమావేశానికి ఆంధ్ర నుండి ఎన్నికైన ఏకైక ప్రతినిధిగా ఆమె హాజరైంది. జర్మనీలో జరగాల్సిన అంతర్జాతీయ మహిళా సమావేశానికి భారతదేశం నుండి ఎన్నికైన ముగ్గురు ప్రతినిధుల్లో ఆమె ఒకరు. (అది జరిగిందా లేదా నాకు సమాచారం లేదు.) ఇలా ఆమె రాజకీయ ప్రస్థానం అప్రతిహతంగా సాగుతుండగా ఆమెకు ఫిట్స్ తీవ్రతరమై ఒక అండ కోసం కోటేశ్వరమ్మ, సీతారామయ్యల కుటుంబానికి సన్నిహితమైంది. పార్టీ నిర్ణయం ప్రకారమే ఆమె తమ కుటుంబానికి వచ్చిందని కోటేశ్వరమ్మే రాశారు. అయితే ఆ సమయంలో అనసూయమ్మ, సీతారామయ్యల నడుమ లేని సంబంధాలను అంటగట్టి ఇంటా బయటా అనుమానాలు మొదలయ్యాయి. అనసూయమ్మ నాకు చెప్పిన ప్రకారమయితే కోటేశ్వరమ్మకూ, సీతారామయ్యకూ తన పరిచయానికంటే ముందే గొడవలున్నాయి. వాళ్లు విడిపోతే మంచిదని పార్టీ కూడా సూచించింది. ఒకవేళ అనసూయమ్మ చెప్పింది వాస్తవం కాకపోయినా, అనసూయమ్మ రాకతోనే గొడవలు మొదలైనా, సీతారామయ్య కోటేశ్వరమ్మతో సంబంధాలను తెంచుకున్న తర్వాతే అనసూయమ్మ సీతారామయ్యల సహజీవనం ప్రారంభమయింది. సుదీర్ఘ కాలం పాటు వాళ్లు భార్యాభర్తలుగనే జీవించారు. నాటి ఎం. ఎల్ పార్టీ, ఆ తర్వాత సి.పి.ఐ.(పీపుల్స్‌వార్), ఆ పార్టీ శ్రేణులూ, విప్లవాభిమానులూ వారిని భార్యాభర్తలుగానే గుర్తించారు. అయితే ఇక్కడ ఒక విషయమేమంటే కోటేశ్వరమ్మ సీతారామయ్యకు టెక్నికల్‌గా విడాకులు ఇవ్వలేదు. సీతారామయ్య కోరినా ఆమె విడాకులివ్వలేదు. (ఈ విషయంలో సీతారామయ్యకు కూడా చిత్తశుద్ధి లేదని అనసూయమ్మ నాతో చెప్పింది. కానీ కోటేశ్వరమ్మ రాసిన ప్రకారం ఆయన విడాకుల కోసం ప్రయత్నించారనీ, అయితే చందు కోరిక మేరకు ఆమె విడాకులు ఇవ్వలేదని అర్థమవుతుంది.) సీతారామయ్య తిరిగి రహస్య జీవితంలోకి వెళ్లేంత వరకూ వాళ్లిద్దరి సహచర్యం కొనసాగింది. ఆ తర్వాత కూడ అనసూయమ్మ విప్లవ రాజకీయాలను ఎత్తిపడుతూనే వచ్చారు. చాలా కాలం పాటు ఆమె ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘానికి నాయకురాలిగా కొనసాగారు. ప్రభుత్వ నిర్బంధ చర్యలకు కూడ గురయ్యారు.

అనసూయమ్మ సాహచర్యం తన జీవితంలో చాలా విలువైనదని సీతారామయ్య ఒక దినపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. కాని కోటేశ్వరమ్మ మాత్రం అనసూయమ్మను సీతారామయ్య భార్యగా గుర్తించదలుచుకోలేదు. సీతారామయ్యతో ఉంటున్నామె అని పేర్కొనడం ద్వారా అనసూయమ్మకు కోటేశ్వరమ్మ ఇచ్చిన విలువేంటి? స్థానమేంటి?

ఇక్కడ కోటేశ్వరమ్మే కాదు, ప్రగతి శీలురం, కమ్యూనిస్టులం, విప్లవకారులం అని చెప్పుకునే మరి కొందరు కూడా అనసూయమ్మకు ఇదే స్థానాన్ని, విలువను ఇచ్చారు. ఆమె విశ్వసించిన, ఎంచుకున్న విప్లవకర రాజకీయ పంథా పట్ల ఏకీభావం లేని వాళ్లు, సహించలేని వాళ్లు కూడ ఆమెకు సముచిత స్థానాన్ని కల్పించడానికి విముఖత చూపించారు. సీతారామయ్యతో ఆమె సంబంధాన్ని తెంపుకున్న తర్వాత ఆయన అరెస్టయి, విడుదలై మనవరాలు సుధతో ఉంటున్నప్పుడు అనసూయమ్మ ఆయనను ఎప్పుడూ కలువలేదు. అయితే ఆయన ఆరోగ్యం క్షీణించిందని తెలిసినప్పుడు మాత్రం అతన్ని చూడాలనిపించిందట. ఆమె ఒకరిద్దరు విప్లవ ప్రజా సంఘాల మిత్రులతో ఈ విషయం చెప్పి తనను ఆయన దగ్గరకు తీసుకువెళ్లమని కోరారట. కానీ వాళ్లా "సాహసం" చేయలేదు. ఎందుకంటే వాళ్ల దృష్టిలో అనసూయమ్మ ఆయన భార్య కాదు. కాబట్టి ఆయనను చూడాలనే ఆమె కోరికకు, మనోభావాలకు వాళ్ల దృష్టిలో ఎటువంటి విలువా లేదు. కనీసం ఆమె అతన్ని చూడాలనుకుంటున్న విషయాన్నయినా సీతారామయ్య దృష్టికి తెచ్చారో లేదో తెలియదు.

ముప్పయ్యారేళ్ల పాటు కోటేశ్వరమ్మ ముఖం చూడని సీతారామయ్య అరెస్టయి, విడుదలయిన తర్వాత ఆమెను చూడాలని కోరుకున్నారు. కాని ఆయనను చూడడానికి విముఖంగా వున్న కోటేశ్వరమ్మకు కాట్రగడ్డ నారాయణరావు, మహీధర రామమోహనరావు, కాళోజీ నారాయణరావు వంటి ప్రముఖులు నచ్చజెప్పి ఒప్పించారు.

అంతేకాదు సీతారామయ్య చనిపోయాక జరిగిన సంస్మరణ సభకు అనసూయమ్మ, కోటేశ్వరమ్మ ఇద్దరూ వెళ్లారట. నేను భార్యగా రాలేదు అని అక్కడ కోటేశ్వరమ్మ చెప్పుకున్నారట కూడా. అయినా ఆ సభలో ఆమెను మాట్లాడమని పలువురు కోరారట. కానీ మాట్లాడాలని కోరుకున్నప్పటికీ అనసూయమ్మను మాట్లాడమని

అడిగిన వాళ్లు లేరట. నిజానికి సీపీఐ, సీపీఐ(ఎం)ల రివిజనిజం నుండి బయటకు వచ్చిన తర్వాత నక్సల్బరీ పంథాలో భారత దేశ విప్లవోద్యమానికి సీతారామయ్య చేసిన కృషి పట్ల కోటేశ్వరమ్మకు గౌరవం, విశ్వాసం ఉన్నట్లుగా ఆమె రచనలో ఎక్కడా వ్యక్తం కాలేదు. కాని సీతారామయ్య చేసిన ఈ కృషి పట్ల అనసూయమ్మకు ఇప్పటికీ ఎనలేని గౌరవం, ఆ కృషి వృథా పోదనీ, భవిష్యత్ తరాలు ఆ కృషిని నిరంతరాయంగా కొనసాగిస్తాయని విశ్వాసం ఉన్నాయి. కాబట్టి ఒక విప్లవకారుడిగా ఆయన చేసిన కృషి గురించి మాట్లాడేందుకు కోటేశ్వరమ్మ కంటే అనసూయమ్మ తగినవారు. కాని ఆమెతో మాట్లాడించాలని ఎవరూ అనుకోలేదు. సీతారామయ్యతో ఆమె అనుబంధాన్ని వాళ్లెవరూ పట్టించుకోలేదు. లేదా పక్కన పెట్టేశారు.

సుదీర్ఘకాలం పాటు అర్థవంతమైన సహజీవనం చేసినా అనసూయమ్మ, సీతారామయ్యలు భార్యాభర్తలు కారు. సుదీర్ఘకాలం పాటు కనీసం మొఖాలు చూసుకోకపోయినా, వీళ్ల దృష్టిలో కోటేశ్వరమ్మ, సీతారామయ్య భార్యాభర్తలే. టెక్నికల్‌గా వాళ్లిద్దరూ విడాకులు తీసుకోలేదనే విషయాన్ని తప్ప, మానసికంగా వాళ్లెప్పుడో విడిపోయారనే విషయాన్ని గాని, సీతారామయ్య భార్యగా గుర్తించబడడానికి స్వయంగా కోటేశ్వరమ్మకే అభ్యంతరం ఉందన్న విషయాన్ని గాని, సీతారామయ్య విడాకుల కోసం ప్రయత్నించారనే విషయాన్ని గాని వాళ్లు పట్టించుకోదలుచుకోలేదు. ఆనాడు కోటేశ్వరమ్మ విడాకులకు ఆమోదం తెలుపక పోవడం అనే ఒకే ఒక టెక్నికల్ విషయం ఈనాడు వాళ్లిద్దరినీ సమాజం దృష్టిలో భార్యాభర్తలుగా నిలబెడుతున్నది. ఆనాడు ఆమె ఆమోదం తెలిపి ఉంటే అనసూయమ్మ, సీతారామయ్యలు అందరి దృష్టిలో భార్యాభర్తలయ్యేవారు. చట్టాలెన్ని చేసినప్పటికీ పురుషులు ఒక భార్యకు విడాకులు ఇవ్వకుండానే మరొకరిని చేసుకోవడం అనేది ఇప్పటికీ సమాజంలో అమలులో ఉంది. చట్టాలకతీతంగా దీనికి సామాజిక ఆమోదం ఉంది. ఆ ఇద్దరినీ అతని భార్యలనే అంటుంది సమాజం. మరిక్కడ అనసూయమ్మను అలాగైనా గుర్తించకపోవడానికి కారణం ఏదో ఒక తంతును పాటించి వాళ్లు పెళ్లి చేసుకోకపోవడం వల్లనేనా?

విలువలు ఎంత విచిత్రంగా ఉంటాయంటే సీతారామయ్య, కోటేశ్వరమ్మ విడిపోయినప్పటికీ ఇవ్వాళ కోటేశ్వరమ్మకు ఆయన భార్యగా గుర్తింపు ఉంది. కాని ఎవరి సహచర్యం తన జీవితంలో చాలా విలువైందని సీతారామయ్య ప్రకటించాడో ఆమెకు ఎటువంటి గుర్తింపూ లేదు. సాహచర్యం, లేదా జీవిత భాగస్వామ్యం అనేదాన్ని మనమెట్లా అర్థం చేసుకుంటున్నాం?

సీతారామయ్య జీవితంలో అనసూయమ్మకు సరైన స్థానం ఇవ్వని కోటేశ్వరమ్మ, తన పిల్లలు కరుణ, చందులతో అనసూయమ్మ సంబంధాన్ని ఉన్నదున్నట్లుగా చిత్రీకరించలేదని అనిపిస్తుంది. తన పిల్లలను అనసూయమ్మ ఇబ్బంది పెట్టినట్టు కోటేశ్వరమ్మ నేరుగా ఎక్కడా రాయలేదు. కానీ "సీతారామయ్యతో ఉంటున్నామెకూ, చందుకూ మధ్య తగువులొచ్చినందువల్ల చందు రీజనల్ ఇంజనీరింగ్ కాలేజీలో చదువుతూ హాస్టల్లో ఉంటున్నట్లు మిత్రులు చెప్పారు", "ఈ యింట్లో ఉంటూ కరుణ మెడిసిన్ పూర్తి చేయగలదా?" అని కొందరు శ్రేయోభిలాషులు అనుకునేవారట అనీ, కరుణ ఆ ఇంట్లో నుండి బైటపడితే మంచిది అని చంద్ర రాజేశ్వరరావు అన్నారట అని ఆమె రాయడం ద్వారా ఆమె చందు, కరుణలను సరిగా చూసుకోలేదనే విషయాన్ని కోటేశ్వరమ్మ చెప్పకనే చెప్పారు. "సరిగా చూసుకోవడం" అనే దానికి ప్రామాణిక కొలమానాలు ఏమీ ఉండవు కనుక, పైగా కన్నతల్లికి పిల్లల పట్ల అపారమైన అపేక్ష ఉంటుంది గనుక కోటేశ్వరమ్మ అభిప్రాయాలను తప్పని చెప్పలేం. అయితే చందు సంగతేమో గాని కరుణ మాత్రం అనసూయమ్మతో చివరి వరకూ ఆప్యాయంగానే వుండేదని తెలుస్తున్నది. సుధ, అనురాధలు ప్రస్తుతం అనసూయమ్మతో ఎటువంటి సంబంధాల్లో ఉంటున్నారో తెలియదు గాని, వాళ్లు పెద్దవాళ్లయి వ్యక్తిత్వాలు రూపుదిద్దుకున్నాక కూడా ఆమెను "అమ్మమ్మా" అని పిలుస్తూ ఆమెతో సన్నిహితంగా ఉండేవారని మాత్రం విన్నాను. 2003లో ఒకసారి అనసూయమ్మ, సుధ, అనురాధ ముగ్గురు ఒకచోట కలిసిన సందర్భంలో వాళ్లామెతో కన్సర్న్‌గా, గౌరవంగా ఉండడం నేను స్వయంగా చూసాను. అది సుధ, అనురాధల విశాల మనస్తత్వానికి ఒక ఉదాహరణ మాత్రమే కాదు, కచ్చితంగా ఆమెతో గతంలో వాళ్లకున్న సంబంధాన్ని ప్రతిఫలించేది కూడా.

కూతురు పెళ్లికి కనీసం హాజరు కాలేకపోయినందుకు కోటేశ్వరమ్మ వేదనను ఎవరమైనా అర్థం చేసుకోవచ్చు. అలా హాజరు కాలేకపోవడానికి బాధ్యుడు కచ్చితంగా సీతారామయ్యే అవుతారు. (కరుణ కూడా పెళ్లికి అమ్మ తప్పకుండా రావాలని పట్టుపట్టి ఉండవచ్చు. పెళ్లి చేసుకొని స్వతంత్రంగా కాపురం పెట్టబోతున్న ఆమె ఎవరి ఒత్తిళ్లకూ లొంగవల్సిన అవసరం లేదు. ఆమె అలా పట్టుపట్టిందా లేదా అన్న వివరాలు నాకు తెలియదు.) కాని ఇక్కడ అందరూ అనసూయమ్మనే బాధ్యురాలిగా చేసి తిట్టడం మాత్రం దారుణం. "ఆమెను అందరూ తిట్టినా నేనన్నడూ తిట్టలేదు" అంటూ కోటేశ్వరమ్మ తన ఉదాత్తతను చాటుకున్నారు గాని, అందరూ ఆమెను తిట్టడం పట్ల కోటేశ్వరమ్మకైతే ఎటువంటి అభ్యంతరం లేదు. "ఆమె కాదు, ఆయన కదా ప్రధానం" అని ఆమె వారితో అనలేదు. తాను అనుకోలేదు. కోటేశ్వరమ్మే రాసిన ప్రకారం 36 ఏళ్ల పాటు తన ముఖం చూడకపోయినా, కూతురు పెళ్లికి పిలవకపోయినా కోటేశ్వరమ్మ సీతారామయ్యను భర్తగా కాకున్నా స్నేహితుడిగా స్వీకరించారు. ఆయనకు విడాకులు ఇవ్వలేదు. ఇంటి పేరును వదులుకోలేదు. కాని అనసూయమ్మ పట్ల తన వ్యతిరేకతలో మాత్రం ఎటువంటి సడలింపులూ చేసుకోలేదు.

కోటేశ్వరమ్మ సహా చాలా మంది సీతారామయ్య జీవితాన్ని వ్యక్తిగతం, రాజకీయం అంటూ విడదీశారు. ఆయన వ్యక్తిగత జీవితాన్ని విమర్శించిన వారు కూడా ఆయన రాజకీయ జీవితాన్ని ఎత్తిపట్టగలిగారు. మరి అనసూయమ్మ పట్ల కూడా అదే దృష్టిని ఎందుకు చూపలేకపోయారు? చరిత్రలో ఆమెను తెరమరుగు చేయడానికి ప్రయత్నించడం లేదా ఆమె పాత్రకు అన్యాయం చేయడం ఎలా సరైనది? దీని వెనుక పని చేస్తున్న భావజాలం, దాని రాజకీయాలు ఏమిటి?

విమర్శ

(ఇటీవల పెంగ్విన్ ప్రచురణగా వచ్చిన శుభ్రాంశు చౌధరి ఇంగ్లిష్ పుస్తకం "లెటజ్ కాల్ హిమ్ వాసు" పుస్తకంపై మావోయిస్టుల విమర్శ - సం.)

శుభ్రాంశు చౌధరి పుస్తకంపై మావోయిస్టుల విమర్శ

ఇటీవల మావోయిస్టు ఉద్యమంపై పుస్తకాలు వరుసగా వెలువడుతున్నాయి. విభిన్న దృక్పథాల వాళ్లు వీటిని రాస్తున్నారు. తాజాగా చత్తీస్‌గడ్‌కు చెందిన శుభ్రాంశు చౌధరి అనే విలేకరి ఇటీవల రాసిన పుస్తకం "లెటజ్ కాల్ హిమ్ వాసు" పెంగ్విన్ ప్రచురణగా వెలువడింది. ఇది "ఉస్కా నామ్ వాసు నహీ" అనే పేరుతో హిందీలోకి కూడ అనువాదమైంది. రచయిత చత్తీస్‌గడ్‌కు చెందిన వాడు కావడం, గతంలో సల్వాజుడుంను వ్యతిరేకిస్తూ నిలకడగా రాసిన వాడు కావడంతో చాలా మంది ఈ పుస్తకం వస్తుగతంగా ఉండవచ్చని ఆశించారు. కాని ఈ పుస్తకంలో పలు వివాదాస్పద విషయాలు ఉండడంతో, దేశంలో, ముఖ్యంగా చత్తీస్‌గడ్‌లో చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా డాక్టర్ బినాయక్ సేన్‌కు మావోయిస్టులతో సంబంధాలున్నట్టుగా, అతనికి మావోయిస్టులు డబ్బులు కూడ అందజేశారని రాయడం ద్వారా రచయిత వివాదానికి తెరతీశాడు. మావోయిస్టులతో సంబంధాలున్నాయనే ఆరోపణపై 2007లో చత్తీస్‌గడ్ ప్రభుత్వం డాక్టర్ బినాయక్ సేన్‌ను అరెస్టు చేయగా, అతని విడుదల కోసం దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా ప్రజలు, ప్రజాస్వామికవాదులు గొంతెత్తిన విషయం విదితమే. 2010 డిసెంబర్‌లో రాజద్రోహం కేసులో అతనికి రాయ్‌పూర్ కోర్టు యావజ్జీవ శిక్ష విధించింది. దేశవ్యాప్తంగా దీనిపై నిరసనలు వెల్లువెత్తడం, చివరకు సుప్రీంకోర్టు "మావోయిస్టు సాహిత్యం కలిగి ఉన్నంత మాత్రాన మావోయిస్టు కానవసరం లేదు" అని వ్యాఖ్యానిస్తూ అతనికి బెయిల్ మంజూరు చేసిన సంగతి కూడ తెలిసిందే.

ఈ నేపథ్యంలో బినాయక్ సేన్‌కు, మావోయిస్టు పార్టీకి మధ్య డబ్బు లావాదేవీలు కూడ నడిచినట్టు శుభ్రాంశు రాయడం అనివార్యంగానే చర్చనీయాంశమైంది. మావోయిస్టు పార్టీతో తాను ఏడేళ్లుగా సంబంధాలు నెరపుతూ వచ్చినట్టు శుభ్రాంశు చెప్పుకోవడం గమనార్హం. మావోయిస్టు పార్టీ అగ్రనేత గణపతి సహా ఎందరో కేంద్ర, రాష్ట్ర స్థాయి నాయకులను ఇంటర్వ్యూ చేసిన పుస్తక రచయిత మావోయిస్టులు అధికారికంగా చెప్పే విషయాలకన్నా అనిల్ అనే "ముఖం లేని" మావోయిస్టు, ప్రస్తుతం మావోయిస్టు పార్టీ నుండి వైదొలిగిన సబ్యసాచి పండా చెప్పిన విషయానికి ప్రాధాన్యత ఇచ్చి రాయడం జర్నలిస్టు నైతికతకు పొసగనిది అని కొందరు సమీక్షకులు విశ్లేషించారు. ఇకపోతే ప్రఖ్యాత ట్రేడ్ యూనియన్ నాయకుడు షహీద్ శంకర్ గుహ నియోగి గారి కొడుకు జీత్, కూతురు ముక్తిలతో కూడ మావోయిస్టు పార్టీకి ప్రత్యక్ష సంబంధాలున్నట్టు కూడ శుభ్రాంశు తన పుస్తకంలో అసందర్భంగానే పేర్కొన్నాడు. ఒక రహస్య పార్టీతో, ప్రభుత్వంతో నిషేధానికి గురై తీవ్ర దాడికి గురవుతున్న పార్టీతో ఫలానా వాళ్లకు సంబంధాలున్నాయి అని (అది నిజమైనా, కాకపోయినా) రాయడం ద్వారా ఆ వ్యక్తులను, వాళ్లు ప్రజా జీవితంలో నిర్వహిస్తున్న కార్యకలాపాలను ప్రమాదంలోకి నెట్టివేయడం కాదా? అసలు జర్నలిస్టులుగా చెప్పుకునే వాళ్లు చేసే పనేనా ఇది? ఇలాంటి ప్రశ్నలెన్నిటికో శుభ్రాంశు జవాబు చెప్పాల్సి ఉంది.

ఇంకా ఈ పుస్తకంలో అనేక నెగిటివ్ వ్యాఖ్యలున్నాయి. మావోయిస్టు నాయకత్వాన్ని, మావోయిస్టు ఉద్యమాన్ని కించపరిచే ఉద్దేశ్యం తప్ప మరోటి లేనట్టుగా స్పష్టంగా అగుపిస్తుంది ఈ పుస్తకాన్ని చదివినపుడు. ముఖ్యంగా మావోయిస్టు అగ్రనేతను కలిసి కూడ అతనితో సమగ్రమైన ఇంటర్వ్యూ జరపకుండా, తిరిగి ఇందుకు అతన్నే బాధ్యున్ని చేసే పద్ధతిలో పుస్తకంలో రాయడాన్ని బట్టి శుభ్రాంశు తాను కోరుకున్న, రాయాలని ముందస్తుగా నిర్ణయించుకున్న వాటి పరిధిలోనే ఆలోచించినట్టు కనిపిస్తుంది. నిజానికి ఏ విషయాన్నీ వస్తుగతంగా కాకుండా తన గందరగోళపు దృక్పథంతోనే ప్రజెంట్ చేశాడు. వీటన్నిటిపై సమగ్రంగా సమీక్ష రావల్సిన అవసరం ఉంది. శుభ్రాంశు రాసిన మరెన్నో విషయాలకు మావోయిస్టు పార్టీ స్వయంగా జవాబివ్వాల్సిన అవసరం కూడా చాలా ఉంది. ఎందుకంటే మావోయిస్టు సానుభూతిపరులకు, సుదీర్ఘకాలంగా మావోయిస్టు ఉద్యమాన్ని పరిశీలిస్తున్న వాళ్లకు మింగుడుపడనివి, అనవసర సందేహాలకు తావిచ్చేవి చాలానే ఉన్నాయి పుస్తకంలో.

మావోయిస్టు ఉద్యమంపై ఒక పుస్తకం రాయడం ద్వారా శుభ్రాంశు రాత్రికి రాత్రే టీవీ స్టూడియోలకు తరచుగా ఆహ్వానించబడే ప్రముఖ విశ్లేషకుల సరసన చేరిపోయాడు. ఈ నేపథ్యంలో మే 25 దాడి జరగడంతో శుభ్రాంశు టీవీ చర్చావేదికలకు అందరికన్నా మిన్నగా ఆహ్వానించబడడం సహజమే. ఈ సందర్భంగా ఆయన మావోయిస్టు నాయకత్వంపై మరి కొన్ని అభ్యంతరకర వ్యాఖ్యలు చేశాడు. ఈ విధంగా చూసినపుడు పుస్తక రచన ద్వారా తాను ప్రారంభించిన విషపూరిత క్యాంపెయిన్‌ను అతను ప్రస్తుతం ఇతర సాధనాల ద్వారా, ఇతర సందర్భాల్లో కూడ కొనసాగిస్తున్నాడని చెప్పవచ్చు. ఈ నేపథ్యంలో జూన్ 5న మావోయిస్టు పార్టీ దండకారణ్య శాఖ ఆయన వ్యాఖ్యలను ఖండిస్తూ ఒక పత్రికా ప్రకటన విడుదల చేసింది. అందులో ప్రధానంగా ఆయన మే 25 తర్వాత చేసిన వ్యాఖ్యలకే పరిమితమైనప్పటికీ, అతని పుస్తకంపై కూడ సంక్షిప్తంగానే అయినా కొన్ని పదునైన వ్యాఖ్యలు చేసింది. ఈ ప్రకటన దరిమిలా శుభ్రాంశును మావోయిస్టు పార్టీ బెదిరిస్తున్నదని "ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ జర్నలిస్ట్స్" ఏషియా-పసిఫిక్ ఛాప్టర్ ఖండనకు

పూనుకుంది. జూన్ 13న అది ఒక పత్రికా ప్రకటన విడుదల చేసింది. మావోయిస్టుల ప్రకటనను ముసుగులో వున్న బెదిరింపుగా అది అభివర్ణించింది. అయితే మావోయిస్టుల ప్రకటనను కవర్ చేసిన ఇంగ్లిష్ దినపత్రిక "ద హిందూ" మాత్రం మావోయిస్టులు శుభ్రాంశును ఎంత మాత్రం బెదిరించలేదని స్పష్టంగానే రాసింది. మావోయిస్టుల ప్రకటనపై డాక్టర్ బినాయక్ సేన్ స్పందిస్తూ తాను దీనిని ఆహ్వానిస్తున్నానని చెప్పినట్టుగా కూడ ఆ పత్రిక పేర్కొంది. "టైమ్స్ ఆఫ్ ఇండియా" వంటి ఇతర దినపత్రికలు కూడ మావోయిస్టుల ప్రకటనను కవర్ చేశాయి కాని ఎవరూ శుభ్రాంశు చౌధరిని మావోయిస్టులు బెదిరించినట్టు చెప్పలేదు.

ఈ నేపథ్యంలో మావోయిస్టులు "శుభ్రాంశు చౌధరి వ్యాఖ్యలు మావోయిస్టు ఉద్యమాన్ని కించపరిచే ప్రయత్నాల్లో భాగమే!" అనే శీర్షికతో హిందీలో విడుదల చేసిన పత్రికా ప్రకటన పూర్తి పాఠాన్ని తెలుగు పాఠకుల కోసం అనువదించి అందిస్తున్నాం. "నూరు పూవులు వికసించనీ, వేయి భావాలు సంఘర్షించనీ" అని నమ్మే, ఆచరించే సంస్థగా మేం దీన్ని అవసరంగా భావిస్తున్నాం.

"మే 25న చత్తీస్‌గఢ్‌లోని జీరంఘాటీ దగ్గర పీఎల్‌జీఏ జరిపిన దాడిలో మహేంద్ర కర్మ, నందకుమార్ పటేల్ సహా మరి కొందరు చనిపోయిన దరిమిలా, విలేకరి శుభ్రాంశు చౌధరి బీబీసీ హిందీ డాట్ కామ్‌లో "మాస్టర్ చేతిలో నక్సలైట్ల కమాండ్?" అనే శీర్షికతో ఒక వ్యాసం రాశాడు. ఈ వ్యాసాన్ని మరి కొన్ని మీడియా సంస్థలు కూడ ప్రచురించాయి, ప్రసారం చేశాయి. అందులో ఆయన ఈ దాడిని మా పార్టీ దండకారణ్య యూనిట్ నాయకత్వంలో జరిగిన మార్పుతో లంకె వేయాలని చూశాడు. కామ్రేడ్ కోస స్థానంలో కామ్రేడ్ రామన్న కార్యదర్శిగా ఎన్నికవడం వల్ల ఇప్పుడు హింసాత్మక చర్యలపై ఎక్కువగా మొగ్గు చూపుతారని నిరూపించడానికి ప్రయత్నించాడు. తన కపోల కల్పిత విశ్లేషణను వాస్తవమని నమ్మించడం కోసం ఆయన "కోస వంటి నాయకులను రామన్న ఇష్టపడడు" అని కూడ రాశాడు. ఇదంతా ఉత్త చెత్త వాగుడే తప్ప మరేమీ కాదని మా దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ భావిస్తున్నది. ఈ సందర్భంగా కామ్రేడ్ రామన్నతో తాను జరిపిన సంభాషణను ఉటంకిస్తూ ఆయన పలు అభ్యంతరకర మాటలు రాశాడు. మా స్పెషల్ జోనల్ కమిటీ శుభ్రాంశు చేసిన అమర్యాదకర వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నది.

నేడు దోపిడీ రాజ్యం, మా పార్టీ నాయకత్వంలో సాగుతున్న విప్లవోద్యమాన్ని నిర్మూలించడానికి భారీ అణచివేత యుద్ధాన్ని నిర్వహిస్తున్నది. మానసిక యుద్ధం ఇందులో ఒక ముఖ్యమైన భాగం. దీంట్లో భాగంగా మీడియా ద్వారా, తదితర పలు సాధనాల ద్వారా అబద్ధాలను, కట్టుకథలను, పుకార్లను వ్యాపింప జేస్తున్నారు. ఇందులో ప్రత్యేకించి ఉద్యమ నాయకత్వాన్ని టార్గెట్ చేస్తున్నారు. నాయకత్వం మధ్యన విభేదాలు, మనస్పర్ధలు ఉన్నట్టుగా దుష్ప్రచారాన్ని పెద్ద ఎత్తున చేస్తూ, ప్రజలను తప్పుదారి పట్టించాలని చూస్తున్నారు. తెలిసో, తెలియకో శుభ్రాంశు చౌధరి కూడ ఇందులో భాగమయ్యాడని మేం భావిస్తున్నాం.

ఆ తర్వాత జూన్ 1న బి.బి.సి. రేడియో వీక్లీ కార్యక్రమం "ఇండియా బోల్"లో పాల్గొన్న శుభ్రాంశు మా ఉద్యమ సంబంధంలో మరిన్ని వ్యాఖ్యలు చేశాడు. మావోయిస్టుల రాజకీయ లక్ష్యం, వాళ్ల నాయకత్వంలో పోరాడుతున్న ఆదివాసుల సమస్య రెండూ, వేరు వేరని ఆయన పేర్కొన్నాడు. ఆయన ప్రకారం, "కొంత మంది మావోయిజం పేరుతో ప్రపంచంలో రాజకీయాలను మార్చాలని కోరుకుంటున్నారు. కాగా అత్యధికులు... వాళ్లను మీరు ఆదివాసులని అంటారు, వాళ్లను నేను దిగువ స్థాయి సైనికులు (ఫూట్ సోల్జర్స్) అంటాను, వీళ్లు వాళ్లతో ఎందుకు కలుస్తారంటే నేటి వ్యవస్థ ద్వారా వీళ్లకు న్యాయం లభించడం లేదు కనుక. మావోయిస్టులు ఎర్రకోటపై ఎర్రజెండా ఎగురవేయాలనుకుంటున్నారు. మావోయిస్టుల పోరాటం అడవి కోసం, భూమి కోసం చేస్తున్న పోరాటం కాదు... వాళ్లు ఈ ప్రపంచంలో సోషలిజం, ఆ తర్వాత కమ్యూనిజం తేవాలనుకుంటున్నారు...".

"శుభ్రాంశు చౌధరి ఇటీవలే మావోయిస్టు ఉద్యమం గురించి "లెటజ్ కాల్ హిమ్ వాసు" అనే పేరుతో ఒక పుస్తకం రాశాడన్నది గమనార్హం. అయితే విచారకరమైన విషయం ఏమంటే తన పుస్తకంలో మావోయిస్టులతో ఏడేళ్ల పాటు సంబంధం కొనసాగించినట్టు చెప్పుకున్న శుభ్రాంశు మా ఉద్యమాన్ని లోతుగా అర్థం చేసుకోవడానికి ఎప్పుడూ సీరియస్‌గా ప్రయత్నించనే లేదు. వర్గ పోరాట మౌలిక సూత్రాలను కూడ అర్థం చేసుకోవడానికి అతను ప్రయత్నించలేదు. ఆదివాసుల పోరాటాలన్నీ - వాటికి నాయకత్వం మావోయిస్టులు వహించినా, వహించక పోయినా - రాజ్యానికి వ్యతిరేకంగా సాగుతున్న వర్గ పోరాటంలో భాగమే. దీర్ఘకాలిక దృష్టితో చూసినపుడు లేదా అంతిమంగా భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) లక్ష్యం రాజ్యాధికారాన్ని చేజిక్కించుకోవడమే అనే దాంట్లో సందేహానికి తావే లేదు. లేదంటే మనం మన దేశ ప్రజానీకాన్ని సామ్రాజ్యవాద, భూస్వామ్య, దళారీ నిరంకుశ బూర్జువా బంధనాల నుండి విముక్తి చేయలేం. అంటే ఈ విధంగా తప్ప మరే విధంగా కూడ అన్యాయమైన ప్రస్తుత సామాజిక-ఆర్థిక వ్యవస్థను మార్చలేం. అయితే కమ్యూనిస్టులకు, ఆ మాటకొస్తే కార్ల్ మార్క్స్‌కు కూడ సాయుధ విప్లవం ద్వారా రాజ్యాధికారాన్ని చేజిక్కించుకొని సోషలిజాన్ని, కమ్యూనిజాన్ని స్థాపించాలనే కలేమీ రాలేదు. అది కార్మికవర్గం, తదితర పీడిత వర్గాల సమస్యల, సమాజపు ఆర్థిక-రాజకీయ -సామాజిక పరిస్థితుల, యావత్ వర్గ పోరాటాల సమగ్ర, శాస్త్రీయ విశ్లేషణా సారం. ప్రస్తుత రాజ్యాన్ని కూకటివేళ్లతో పెకిలించి కార్మిక-కర్షక ఐక్యతా పునాదిపై నాలుగు వర్గాల - ఇందులో దేశీయ, చిన్న తరహా పెట్టుబడిదార్లు కూడా ఉంటారు - ఐక్య సంఘటన ద్వారా రాజ్యాధికారాన్ని చేజిక్కించుకోవడమనే రాజకీయ వ్యూహం భారత సమాజ నిర్దిష్ట, సమగ్ర విశ్లేషణ ఆధారంగానే రూపొందింది తప్ప కొద్ది మంది మెదళ్లలో పుట్టిన ఊహలతో కాదు. ఇది మా పార్టీ తక్షణ కార్యక్రమం. దీనినే మేం నూతన ప్రజాస్వామిక విప్లవం అని అంటున్నాం.

భారత అర్ధభూస్వామ్య, అర్ధవలస సమాజంలో కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు, చిన్న, మధ్య స్థాయి పెట్టుబడిదార్లు తదితర పీడిత వర్గాలకు' ఆదివాసులు, దళితులు, మతపరమైన మైనారిటీలు, మహిళలు మొదలైన పీడిత సెక్షన్లకు చెందిన మౌలిక సమస్యలన్నీ ఈ వ్యవస్థను సమూలంగా మార్చివేసినపుడే, పీడిత వర్గాల ప్రజాస్వామిక రాజ్యాధికారాన్ని నెలకొల్పినపుడే శాశ్వతంగా పరిష్కారం కాగల్గుతాయి. ఈ విప్లవకర ప్రక్రియకు మా పార్టీ నాయకత్వం వహిస్తున్నది.

ఈ లక్ష్యంతోనే మా పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) అనేక దశాబ్దాలుగా పీడిత ప్రజలను సంఘటితం చేస్తున్నది. ఆదివాసులు ఇందులో ఒక ముఖ్య భాగం. ప్రజల ప్రయోజనాలే మా పార్టీ ప్రయోజనాలు. జల్-జంగల్-జమీన్ సహా ప్రజల దైనందిన సమస్యలన్నిటినీ చేపట్టి మా పార్టీ ప్రజా పోరాటాలను నిర్మిస్తున్నది. పీడిత ప్రజలను వివిధ ప్రజా సంఘాల్లో సంఘటితం చేస్తున్నది. చరిత్రను పరిశీలిస్తే ఇప్పటి వరకు జరిగిన విప్లవాలేవీ కూడ ప్రజల దైనందిన సమస్యలతో ముడిపడకుండా విడిగా లేవు. నిజానికి ప్రజల ఆకాంక్షలకు, అవసరాలకు సరైన వ్యక్తీకరణ గానే విప్లవాలు విజయవంతం అవగలిగాయి. 1917 రష్యా విప్లవం విజయవంతమైంది "శాంతి-రొట్టె" అనే నినాదంతోనే. అలాగే భారతదేశంలో కూడ జల్-జంగల్-జమీన్ సమస్య నూతన ప్రజాస్వామిక విప్లవంలో ఇరుసైన వ్యవసాయ విప్లవంలో భాగమే. కాని శుభ్రాంశు మావోయిస్టు ఉద్యమంలో భాగస్వాములైన ఆదివాసులకు, ఉద్యమ నాయకత్వానికి మధ్య కృత్రిమ విభజన చేసి వాళ్ల లక్ష్యాలు వేరు వేరని చూపడానికి వృథా ప్రయత్నం చేస్తున్నాడు. మావోయిస్టు ఉద్యమంలో భాగమైన ఆదివాసులను "దిగువ స్థాయి సైనికులు"గా అభివర్ణించడం కూడ అతని కొంచెపు బుద్ధినే ఎత్తి చూపుతున్నది.

ఆదివాసులు ఎవరో ఇతరుల "రాజకీయ లక్ష్యం" కోసం కాక, తమ విముక్తి కోసమే పోరాడుతున్నారని శుభ్రాంశు అర్థం చేసుకోలేకపోతున్నాడు. దేశ చరిత్రలో నేటి వరకూ ఆదివాసులు చేసిన ఏ పోరాటమయినా, తిరుగుబాటయినా ఏదో ఒక రూపంలో జల్-జంగల్-జమీన్‌తో ముడిపడి ఉన్నదే. జల్-జంగల్-జమీన్ల సమస్యకు రాజ్యాధికారంతో సూటి సంబంధం ఉంది. శుభ్రాంశు "దిగువ స్థాయి సైనికుల"ని పేర్కొంటున్న ఆదివాసులు వలస పాలనా కాలంలో, బ్రిటిష్ వాళ్లకు వ్యతిరేకంగా పదుల సార్లు తిరుగుబాట్లు చేశారు. ఒకవేళ ఎవరైనా ఆనాటి ఆదివాసుల సమస్య వేరు, భారత స్వాతంత్ర్య లక్ష్యం వేరు అని మాట్లాడితే అది హాస్యాస్పదమే అవుతుంది. నిజానికి ఆదివాసుల పట్ల శుభ్రాంశు దృష్టే చాలా అస్తవ్యస్తంగా ఉంది. ఆయన ఆదివాసుల సమస్యల గురించి మాట్లాడడం అయితే చేస్తాడు కాని, ఆ సమస్యలు ఎలా పరిష్కారము అవుతాయనేది అతనికి తెలియనే తెలియదు. సామ్రాజ్యవాదులతో కుమ్మక్కయిన భూస్వాముల, దళారీ నిరంకుశ పెట్టుబడిదారుల చేతిలో రాజ్యాధికారం వున్నంత కాలం, ఆదివాసులకు జల్-జంగల్-జమీన్లపై అధికారం గాని లేదా శుభ్రాంశు ప్రకారం "న్యాయం" గాని దక్కదు గాక దక్కదనే నిజాన్ని అతను గ్రహించ లేకపోతున్నాడు. నేడు దేశవ్యాప్తంగా, ప్రత్యేకించి ఆదివాసీ ప్రాంతాల్లో గనులు, భారీ ప్రాజెక్టులు, భారీ పరిశ్రమలు, ఎక్స్‌ప్రెస్ హైవేలు, అభయారణ్యాలు, సైనిక కేంద్రాలు నిర్మించే పథకాల వలన కోట్లాది ప్రజలు నిర్వాసితులవుతున్నారు. ఆదివాసులను జీవన్మరణ పోరాటంలోకి ఈడ్చుతున్న ఈ కార్పొరేటు నిలువుదోపిడీకి, ప్రస్తుత వ్యవస్థతోనూ, అది అమలు చేస్తున్న నయా ఉదారవాద విధానాలతోనూ ఉన్న సంబంధాన్ని కూడా శుభ్రాంశు అర్థం చేసుకోలేకపోతున్నాడు. లేదా బహుశా అతను ప్రస్తుత దోపిడీ, పీడక వ్యవస్థను యథాతథంగా ఉంచుతూనే కొన్ని "బ్యాండ్‌ఎయిడ్ పరిష్కారాల"తో ప్రజల సమస్యలను పరిష్కరించవచ్చనే లేదా పరిష్కరించాలనే భ్రమలో ఉన్నాడు.

నేడు దండకారణ్యంలో, దేశంలోని విభిన్న ప్రాంతాల్లో ఆదివాసులు మావోయిస్టు ఉద్యమంలో సంఘటితం అయ్యారంటే, మొదటి నుండి వాళ్లను మా పార్టీ రాజ్యాధికారాన్ని గుంజుకోవాలనే లక్ష్యంతోనే ప్రేరేపించిందనే విషయాన్ని మరచిపోవద్దు. వాళ్ల పోరాటాలన్నిటికి తొలి నుండీ రాజ్యాధికార సమస్యనే కేంద్ర బిందువుగా ఉంది. ప్రజల ప్రజాస్వామ్య రాజ్యాధికారపు పిండరూపమైన క్రాంతికారీ జనతన సర్కార్ నేడిక్కడ నిర్మాణమయింది. వాళ్లలో చాలా మంది, శుభ్రాంశు తన పుస్తకంలో పలు మార్లు అసంతృప్తి స్వరంతో పేర్కొన్నట్టుగా, రాయపూర్, ఢిల్లీ లాంటి నగరాల్నైతే చూడకపోవచ్చు కాని గత అరవై అయిదేళ్లలో ఢిల్లీ, రాయ్‌పూర్‌లు వాళ్లకు ఏం ఒరగబెట్టాయో అనేదయితే అర్థం అయింది. శుభ్రాంశు అంటున్నట్టు ఎర్రకోట మీద ఎర్రజెండా ఎగురవేయాలనేది భాకపా (మావోయిస్టు) కల మాత్రమే కాదు. అది మొత్తం భారత శ్రామిక, పీడిత, అణగారిన ప్రజా సముదాయాలు దశాబ్దాలుగా కంటున్న కల. ఎందుకంటే, అప్పుడు మాత్రమే వాళ్లకు కూడూ, గుడ్డా, గూడులతో పాటు గౌరవప్రదంగా బతికే హక్కుకు హామీ ఉంటుందని వాళ్లకు తెలుసు.

ఇక చివరన అతని పుస్తకంపై మా కమిటీ సంక్షిప్తంగా కొన్ని వ్యాఖ్యలు చేయదలుచుకుంది. ఈ పుస్తకం బోలెడన్ని అబద్ధాలతో, ఎన్నో అర్ధ సత్యాలతో, స్వల్ప వాస్తవాలతో కూడిన కలగూరగంప మాత్రమే. ఆయన రాసిన వాస్తవాలు కూడ చాలా వరకు వక్రీకరణకే గురయ్యాయి. ఈ పుస్తకంలో రాసిన చాలా అంశాలు పచ్చి అబద్ధాలే. ప్రత్యేకించి డాక్టర్ బినాయక్‌సేన్ విషయంలో, జీత్-ముక్తిలతో మా పార్టీ సంబంధాల గురించి, ఎస్సార్ కంపెనీ నుండి డబ్బులు తీసుకున్నామన్న విషయంలో... ఈ మూడు విషయాలపై అతను రాసినదాన్ని మా కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నది. ప్రజాస్వామిక ఉద్యమాలకు, విప్లవోద్యమాలకు, ఆ ఉద్యమ శ్రేయోభిలాషులకు నష్టం చేకూర్చాలని కోరుకునే వాళ్లు, ఆ ఉద్యమాలపై నిర్బంధాన్ని ప్రయోగిస్తున్న రాజ్యం సరసన నిలబడాలనుకునే వాళ్లు మాత్రమే ఇటువంటివి రాయగలరని మేమనుకుంటున్నాం."



'నైరుతి ఋతుపవనాల కాలమిది!'

- వరవరరావు

నక్సల్బరీ వసంత మేఘ గర్జనతో కేరళ వైనాడు అడవుల్లో వర్గీస్ ప్రారంభించి తమిళనాడు ఎల్గురి కొండల్లో, ధర్మపురి మైదాన ప్రాంతాల్లో అపు, బాలన్, రవీంద్రన్‌లు కొనసాగించిన విప్లవాన్ని పడమటి కనుమల్లో విస్తరింపచేయాలని కర్ణాటకలో కలలు కన్న విప్లవ స్వాప్నికుడు సాకేతరాజన్. ఇవన్నీ 1960ల ఉత్తరార్థం నుంచి ఎగసి విరిగిన అలలుగా, రగిలి ఆరిన అడవి నిప్పుల్లా, పూసి రాలిన కొండ సిగలోని పూవుల్లా ఆయా దశాబ్దాల్లో 2005 దాకా ఆటుపోట్లకు గురవుతూనే ఉన్నాయి. ఈ మూడు రాష్ట్రాల్లోనూ నక్సల్బరీ, శ్రీకాకుళ పోరాటాల సెట్‌బ్యాక్ నుంచి గుణపాఠాలు తీసుకుని విప్లవానికి బాట వేసుకున్న 'జగిత్యాల జైత్రయాత్ర' వెలుగులోనే ఈ ప్రయత్నాలు, కృషి జరిగినవి.

మూడు రాష్ట్రాలనూ కలుపుతూ విస్తరించిన సర్వమంగళం అడవుల్లో, సముద్రతీరంలో, పడమట కనుమల వరుస పొడవునా, దండకారణ్యం వలె, బీహార్, ఝార్ఖండ్‌ల వలె-ఒక విముక్త ప్రాంత వ్యూహం లేకుండా భారత విప్లవం విజయవంతం కాదు. ఈ సర్వమంగళం అడవుల్లోనే బహుళజాతి కంపెనీల, బడా కంపెనీల తేయాకు, కాఫీ తోటల స్వార్థ ప్రయోజనాల కోసం, పడమటి కనుమల గనుల తవ్వకం, భారీ ప్రాజెక్టుల నిర్మాణం కోసం - ఒక్క మాటలో సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధ్వంసపూరిత అభివృద్ధి నమూనా అమలు కోసం - 'థండర్‌బోల్టు' ఆపరేషన్ పేరుతో గ్రీన్‌హంట్ ఆపరేషన్‌లో భాగంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై యుద్ధాన్ని అమలు చేస్తున్నాయి.

> నైఋతి ఋతుపవనాల కాలమిది!
> (అనువాద కవిత్వం)
>
> తెలుగు : గోదావరి
>
> ప్రచురణ : స్టోన్ పెల్లర్స్ పబ్లికేషన్స్
>
> వెల : రు. 20/-
>
> పేజీలు : 52

'మావోయిస్టు పార్టీ ఏర్పడిన తర్వాత తూర్పు కనుమలలో జనతన సర్కార్‌లు విముక్తి ప్రాంతం దిశగా కొనసాగుతున్న నేపథ్యంలో ఈ ప్రాంతం తిరిగి కొత్తగా మళ్ళీ మొలకెత్తింది. ఇక్కడి పశ్చిమకనుమల, తూర్పుకనుమల చెయ్యందుకొని తిరిగి కవితలు నేర్చుకుంటున్నాయి. ఆ సందర్భంగా పశ్చిమ కనుమలు ఆలపిస్తున్న లేత పచ్చిక రాగమిది. జ మలయాళం (అప్పు, బషీర్‌బాలన్, వేణు, కుంజుణ్ణి), తమిళం (కణ్ణగి, భాస్కరన్, మాంబళం రమ, ఈశ్వర్, ప్రతాపన్ వన్నియార్, స్వామినాథన్ సెలిన్- పుదుచ్చేరి), కన్నడం (వర్గీస్‌రాజన్, సాకేత్), కొంకణి (ఉష), తుళు (జయ) భాషల్లో వెలువడిన 'పశ్చిమ కనుమల లేత పచ్చిక గానాన్ని' తెలుగులో వినిపిస్తున్న 'గోదావరి' అనువాద కవిత్వమిది - 'నైరుతి ఋతుపవనాల కాలమిది!'

ఇందులో 'కెవడ' రాసిన కవిత 'పశ్చిమ కనుమలకో ప్రేమలేఖ' కూడా ఉంది. అన్ని అనువాద కవితల సారాన్ని పట్టి యిచ్చే కవిత కూడా ఒకటుంది. (పేజీ. 51)

ఈ 'ఉడల్‌రందు ఉయిరే ఒన్ను' అనువాద కవిత్వం ఆజాద్, సాకేత్ రాజన్‌లకు అంకితమైంది. ఉడుకుతున్న అన్నాన్ని పట్టి ఇచ్చే ఒక మెతుకు (పేజీ. 23)

మూడవ ముద్రణ ఇప్పుడు అందుబాటులో ఉంది!



మార్క్సిజం లెనినిజం మావోయిజం
స్టడీ నోట్స్
వెల : రు. 100/-
న్యూ విస్టాస్ పబ్లికేషన్స్

చదవండి!
చదివించండి!

మార్క్సిస్టు తత్వశాస్త్రం
ఒక పరిచయం
వెల : రు. 80/-
న్యూ విస్టాస్ పబ్లికేషన్స్

ప్రతులకు : మైత్రి బుక్ హౌజ్ విజయవాడ, దిశ పుస్తక కేంద్రం, హైదరాబాద్, నవోదయ పబ్లిషింగ్ హౌస్, కాచిగూడ, హైదరాబాద్, సహచర బుక్‌మార్క్స్, హైదరాబాద్.

పుస్తక పరిచయం



అంజుమ్ జమురుద్ హబీబ్ రాసిన 'ఖైదీ నెం: 100' పుస్తక పరిచయం

- బెల్లపు అనూరాధ

కొద్ది రోజుల క్రితం నా మిత్రుల నుంచి నాకొక పార్సెల్ వచ్చింది. రెండు పుస్తకాలు ఉన్నాయందులో. రెండూ మహిళా ఖైదీలకి సంబంధించినవే. ఒకటి మహిళా ఖైదీల గురించి బయటివారు పరిశోధించి రాసినదైతే మరొకటి స్వయంగా మహిళా ఖైదీ రాసిన పుస్తకం. అందువల్ల కూడా నేను రెండో పుస్తకాన్ని మొదలుపెట్టాను. నన్నాకర్షించిన రెండో విషయం రచయిత కాశ్మీరీ మహిళ కావడం, అందునా రాజకీయ ఖైదీ కావడం. "స్వతంత్ర్య కాశ్మీర్" ఆకాంక్షను బలంగా బలపరిచే వ్యక్తిగా నేను సహజంగానే ఆ పుస్తకాన్ని వెంటనే మొదలుపెట్టాను. ఆ పుస్తకం పేరు ఖైదీ నెం:100. రచయిత అంజుమ్ జమురుద్ హబీబ్. ఈ పుస్తకాన్ని ఉర్దూలో రాశారు. సబాహుస్సేన్ దీనిని ఇంగ్లిషులోకి అనువదించారు.

అంజుమ్ 2003 ఫిబ్రవరి నుంచి 2007 డిసెంబర్ వరకూ ఐదేళ్ళపాటు పోటా చట్టం కింద ఢిల్లీలోని తీహార్ జైలులో శిక్ష అనుభవించారు. హజారీబాగ్ కేంద్రీయ కారాగారం (ఝార్ఖండ్) లో విచారణలో ఉన్న ఖైదీగానూ, తీహార్ జైలు గురించిన రంగురంగుల రిపోర్టులు వార్తపత్రికల్లో అనేకసార్లు చదివిన కారణంగానూ, సహజంగానే ఆ పుస్తకం నన్నాకర్షించింది. తీహార్ జైలు గురించి ఒక లోపలి వ్యక్తిగా ఆమె అనుభవం చాలా విలువైనది కాబట్టి తీహార్ గురించి తెలుసుకోవడం అనేది మరొక ఆకర్షణీయమైన విషయం.

మొదలు అంజుమ్ అరెస్ట్ అయిన వైనం గురించి చెప్పుకుందాం. అంజుమ్ కాశ్మీర్‌లోని ప్రముఖ రాజకీయ పార్టీ హురియత్ కాన్ఫరెన్స్‌కు వ్యవస్థాపక సభ్యులు, హురియత్ మహిళా విభాగం ముస్లిం ఖవాతీన్ మర్కాజ్ కి చైర్‌పర్సన్. ఆమె "ఆజాద్ కాశ్మీర్" కోసం అనేక ఆందోళనల్లో పాల్గొనడమే కాకుండా, వాటిని నిర్వహించడం మహిళలని సమీకరించడం, ఆయా సందర్భాలకి తగిన పాటలు పాడటం వంటి కార్యకలాపాలు చేస్తుండేవారు. ఆమె అరెస్ట్ అయ్యే సమయానికి, ఆమె కాశ్మీర్‌లోని యుద్ధ వితంతువులు, అనాథ పిల్లల స్థితిగతులకి సంబంధించి ఒక సర్వే చేశారు. ఆ సర్వే వివరాలను రికార్డు చేయడానికి సంబంధించి ఈ పుస్తక అనువాదకురాలు సబాహుస్సేన్ తో కూడా చర్చించారు. యు.ఎస్, థాయ్‌లాండ్, పాకిస్తాన్‌లలో జరగనున్న సెమినార్లలో పాల్గొనడానికి ఆమె తన ప్రయాణ ఏర్పాట్ల కోసం ఢిల్లీ వచ్చి ఉన్నారు. ఆమె వీసా కోసం పాకిస్తాన్ ఎంబసీలో, పాకిస్తాన్ డిప్యూటీ హైకమిషనర్‌తో ఉన్న అపాయింట్‌మెంట్‌కి వెళ్ళి, వీసా ఫీజు జమ చేసి, థాయ్‌లాండ్ ఎంబసీకి వెళ్తుండగా దారిలో భారత ఇంటలిజెన్స్ బ్యూరో అధికారులు ఆమెను అరెస్టు చేసి అక్కడ్నించి హురియత్ కార్యాలయానికి తీసుకుపోయి అక్కడ కార్యాలయాన్ని మొత్తం సోదాచేసి, కంప్యూటర్లు, పుస్తకాలు ఎత్తుకెళ్ళారు. మరికొందరు హురియత్ సభ్యులను కూడా తీసుకెళ్ళి ఒకరోజు విచారణ తర్వాత వాళ్ళని వదిలేశారు. అంజుమ్‌ను, మరొక కార్యకర్తని మాత్రం కస్టడీలోకి తీసుకుని విచారించారు. అంజుమ్‌కు ఎదురుగానే ఆమె డైరీలో కొన్ని సంస్థల పేర్లు ఎక్కించారు. ఆమెని దుర్భాషలాడారు, అవమానించారు. "వివస్త్రని చేసి ఫోటోలు తీసి పోస్టర్లు వేస్తాం" అని బెదిరించి తెల్ల కాగితాల మీద సంతకాలు తీసుకున్నారు. తర్వాత పోటా ట్రయల్ కోర్టుకు తీసుకుపోయారు. ఆమె తన నిర్దోషిత్వాన్ని మీడియా ముందు చెప్పబోగా మీడియా ఎదురుగానే ఆమె చెంప మీద కొట్టి నోరు మూసి తీసుకుపోయారు. తర్వాత అనేక రోజుల పాటు కస్టడీలో ఇంటరాగేషన్ పేరిట చిత్రహింసలు పెట్టారు.

ఆమె మీద మోపిన నేరం ఏంటి? ఆమె టెర్రరిస్టు అని, పాకిస్తాన్ డిప్యూటీ హైకమిషనర్‌ను అందుకే కలిసిందని "కొరియర్" గా పనిచేస్తుందని. ఆయన నుండి ఆమెకు 3 లక్షల రూపాయలు టెర్రరిస్టు సంస్థల కోసం అందాయని, వాటిని అందించడం కోసమే వెళ్తుండగా అరెస్ట్ అయిందనీ ఆ సంస్థల వివరాలు ఆమె డైరీలో దొరికాయని ఆమె పైన ఆరోపణలు. తర్వాత భారత హైకమిషన్ పాకిస్తాన్ డిప్యూటీ హైకమిషనర్‌ను 24 గంటలలోపు భారతదేశం వదిలిపెట్టిపోవాలని అల్టిమేటం ఇచ్చింది. జవాబుగా పాకిస్తాన్‌లోని ఇండియన్ ఎంబసీ అధికారులను పాకిస్తాన్ వాపసు పంపింది.

ఇవన్నిటికన్నా కూడా ఆమె ఎదుర్కొన్న పెద్ద షాక్ హురియత్ కాన్ఫరెన్స్ నాయకుడు అబ్దుల్ ఘనీభట్ ఇంటరాగేషన్‌లోనూ తర్వాత విలేఖరుల సమావేశంలోనూ అంజుమ్ ఎవరో తనకి తెలీదని చెప్పడం. అంతేకాదు హురియత్ నాయకులెవరూ ఆమె గురించి పట్టించుకోలేదు. న్యాయసహాయం అందించలేదు. అంజుమ్ కుటుంబసభ్యులు కాళ్ళరిగేలా హురియత్ చుట్టూ తిరిగినా కాశ్మీరీ ఖైదీల విడుదల కోసం భారత ప్రభుత్వంతో వాళ్ళు జరిపిన చర్చలలో ఎక్కడా అంజుమ్ పేరు ప్రస్తావించలేదు. అంజుమ్‌తో పాటు అరెస్ట్ అయిన కార్యకర్తను మాత్రం విడుదల చేయించారు. ఆర్థిక ఇబ్బందులు లేని అంజుమ్ కుటుంబానికి హురియత్ అందించే న్యాయసహాయం అవసరంలేదు. కానీ - హురియత్ ఆమెని పరాయీకరించడం కేసులో ఆమెకి వ్యతిరేకంగా పనిచేసింది. అంతేకాక శిక్ష కూడా పడింది. హురియత్‌లో ఉన్న ఏకైక మహిళా నాయకురాలిని వాళ్ళలా దూరం పెట్టడం, ఒక్క అంజుమ్‌కే కాక మొత్తం కాశ్మీరీ మహిళలకే ద్రోహం చేసినట్టయింది. ఇది ఆమెని తీవ్రంగా కుంగదీసింది. జైల్లో ఆమె ఆరోగ్యం తీవ్రంగా క్షీణించడానికి కేవలం సెల్‌లో నిర్బంధించడమే కాకుండా మానసిక వేదన ప్రధాన కారణమని ఆమె అనుభవం చదివిన తరవాత అనిపించక మానదు. ఆమె అనుభవించిన చిత్రవధ చదివితే విడుదలయ్యాక ఈమె నిలబడుతుందా అనే అనుమానం ఎవరికైనా లీలగా కలిగే ప్రమాదముంది. కానీ వెనుక కవర్‌పై ఉన్న వివరాలు అంజుమ్ తన రాజకీయ విశ్వాసాల పట్ల ఎంత బలంగా నిలబడిందో తెలియజేస్తాయి. ఆమె విడుదలైన ఏడాది తర్వాత కాశ్మీరీ ఖైదీల కుటుంబ సభ్యులతో ఒక అసోసియేషన్‌ని స్థాపించి పనిచేస్తోంది. నిజానికి ఆమె జైలులో ఉన్నపుడు కూడా 2006లో కాశ్మీర్‌లో వేర్పాటువాదులతో భారత ప్రభుత్వం చర్చలకోసం పిలువునిచ్చిన సందర్భంగా, "కాశ్మీర్‌లోని మహిళలు, పిల్లలపై భారత సైన్యం చేసిన అత్యాచారాలు, కాశ్మీర్‌లో జరుగుతున్న మానవహక్కుల ఉల్లంఘనలు"

గురించి ప్రధానమంత్రికి కాశ్మీర్ మహిళల ప్రతినిధిగా ఒక లేఖని పంపారు. ఆ లేఖని ఈ పుస్తకం చివరలో అనుబంధంగా ప్రచురించారు.

ఇక ఖైదీగా ఆమె ఎదుర్కొన్న సమస్యల గురించి కొంచెం చెప్పుకుందాం. ఖైదీలందరి సమస్యలూ ఒకటి కావు. ఖైదీలలో మహిళా ఖైదీలు వేరయా అయితే, అందులో ముస్లిం మహిళ కావడం వల్ల మెజారిటీ మత ఛాందసుల నుంచి ఎదుర్కొనే సమస్యలు కొన్ని. అదనంగా "పాకిస్తాన్ ఏజెంట్, ఉగ్రవాది, దేశద్రోహి" అని ముద్రపడిన వాళ్ళ కష్టాలు సామాన్యమైనవి కావు. అవి అడుగడుగానా ఆమె ఎదుర్కొంది. ముఖ్యంగా జాతీయ పండుగలైన ఆగస్టు 15, జనవరి 26 సందర్భంగానూ, ఇండియా, పాకిస్తాన్ క్రికెట్ మ్యాచ్‌లప్పుడూ చెప్పనే అఖ్ఖర్లేదు. ఇక శిక్ష పడిన సీనియర్ ఖైదీలు కొత్తగా వచ్చే మహిళలను పెట్టే కష్టాలు దాదాపు అన్ని జైళ్ళలోనూ ఒకే రకంగా ఉంటాయి. ఇక "అవినీవి" అనేది ఆసియాలోనే అతి పెద్ద జైలుగా పేరుగాంచిన తీహార్ జైలు మొదలు, కేంద్ర కారాగారాలు, జిల్లా కారాగారాలు, మండల కారాగారాల వరకూ అన్ని చోట్లా అంతే బలంగా పాతుకుపోయింది.

తీహార్ జైలుని ఆదర్శ జైలుగా తీర్చిదిద్దడానికి కిరణ్‌బేడీ ఆధ్వర్యంలో జరిగిన అనేక సంస్కరణల గురించి కూడా అంజుమ్ అనేకసార్లు ప్రస్తావించారు. ఆమె వెళ్ళిపోయాక చాలా వరకూ అవి నామమాత్రం అయిపోయాయని కూడా రాశారు. జైలు జీవితంలో ప్రతి ఖైదీకి ముఖ్యమైనవి కోర్టువాయిదాలు, ములాఖాత్‌లు, నవ్వించినా, ఏడ్పించినా అవి రెండే ఖైదీలకు ఊపిరి. బయటి ప్రపంచానికి కలిపి ఉంచే సన్నని బంధాలు. అంజుకు పుస్తకం నిండా ఆ కోర్టు వాయిదాలు, ములాఖాత్‌ల అనుభవమే చాలా వరకూ ఆక్రమించింది. కోర్టు వాయిదాల సందర్భంగా కోర్టులో ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆ చిన్న కటకటాల గదిలో గడిపే అనుభవం మాత్రం దేశంలో అన్న కోర్టుల్లోనూ ఒకేలా ఉన్నట్టుంది. ముక్కులు పగిలే వాసనొచ్చే టాయిలెట్ ఉండే ఆ చిన్న గదిలో ఏ సౌకర్యాలు లేకుండా 10 నిమిషాల్లో ముగిసిపోయే వాయిదా కోసం రోజంతా గడపడం ఎంత నరకమో ప్రతి ఒక్క ఖైదీకి అనుభవమే. అయితే ఢిల్లీ కోర్టుల కస్టడీలో 4,5 సార్లు చాయ్ ఇస్తారని తెలుసుకొని సంతోషం కలిగింది. అలాంటి సౌకర్యం ఒక్క చోటైనా ఉంటే మెల్లగా అన్ని చోట్లకి విస్తరిస్తుందని ఆశ. కనీసం అలాంటి సౌకర్యం ఉందని తెలిసింది కనుక మిగతా చోట్ల కొట్లాడవచ్చు.

చాలా మంది జైలులో పడ్డాక "భగవంతుణ్ణి" ఆశ్రయిస్తారు. అనుక్షణం ప్రార్థనల్లో/పూజల్లో మునిగిపోవడం ఒక ఉపశమనం. మార్క్స్ అన్నట్టు అదొక మత్తుమందు. అంజుకు కూడా ప్రతి రోజూ ఐదుసార్లు నమాజ్ చేయడమే కాకుండా "భగవంతుడు" మాత్రమే తనకు జైలునుండి "ముక్తి" కలిగించగలడని నమ్మింది. ఏ మతం వారైనా సాధారణంగా జైళ్ళలో ఈ దారినే ఆశ్రయిస్తుంటారు. నాస్తికులైన రాజకీయ ఖైదీలు సాధారణంగా తలమునకలుగా పుస్తకాలలో మునిగిపోతుంటారు. నాస్తికులు కాని వాళ్ళైనా కూడా రాజకీయ ఖైదీలు సాధారణంగా జైలు బయట తమ కార్యకలాపాలలో మునిగి తేలుతుంటారు కాబట్టి ఈ సమయాన్ని పుస్తకాలు చదవడానికి ఉపయోగించుకోడానికి ప్రయత్నిస్తుంటారు. అంజుమ్‌కు ఒక్కసారి ములాఖాత్‌లో కొన్ని పుస్తకాలు వచ్చాయని తప్ప మరెక్కడా పుస్తకాల గురించి ప్రస్తావించలేదు. ఆమె పుస్తకాలు చదువుతూ ఉండి ఉంటే (సాహిత్యమైనా, రాజకీయ విషయాలైనా ఏమైనా గానీ) ఆమె జైలులోని ప్రతికూల పరిస్థితులను మరింత ధృడంగా ఎదుర్కోగలిగి ఉండేదనిపించింది. ముఖ్యంగా ఆమె కున్న సాహిత్యాభిలాష ఆమె అడుగడుగానా ఉటంకించిన అనేక ఉర్దూ కవితలు చూసి అర్థం అవుతుంది.

ఒక రాజకీయ విశ్వాసం కలిగి దానికోసం అంత ధృడంగా పనిచేసిన అంజుమ్ "రాజ్యం స్వభావాన్ని" సరిగా అర్థం చేసుకోలేకపోయిందేమో అనిపించింది. ఎందుకంటే "ఆజాద్ కాశ్మీర్" వంటి సున్నిత అంశం కోసం పోరాడుతూ అంత భయంకరమైన అణచివేతను ఎదుర్కొన్న ప్రాంతంలో అలాంటి క్రూరత్వానికి బలైన వారి కోసం పనిచేస్తూ కూడా – స్వయంగా తానే దాని క్రూరత్వాన్ని ఎదుర్కోవలసి వచ్చినపుడు అడుగడుగునా నిర్ఘాంతపోయింది అంజుమ్. ఆ తర్వాత విపరీతంగా కుంగిపోయింది. ముఖ్యంగా తనకి వ్యతిరేకంగా ఒక పోలీసు అధికారి తప్పుడు సాక్ష్యం ఇస్తుంటే నిర్ఘాంతపోవడమే కాకుండా తర్వాత పదేపదే "అతనలా ఎందుకు చేసాడు?" అని గుర్తుచేసుకుని మరీ కుంగిపోయింది. రాజకీయ విశ్వాసాలను ప్రజాస్వామిక ఆందోళనలనూ అణచివేయడానికి రాజ్యం చేపట్టే ఎత్తుగడలలో ఇలాంటి తప్పుడు సాక్ష్యాలు ఇవ్వడం పోలీసులు చాలా మామూలుగానూ, అలవోకగానూ చేసే పని. దేశ వ్యాప్తంగా అనేక ప్రజాస్వామిక, ప్రగతిశీల ఆందోళనలను అణచివేసే సందర్భంగా అనేక ఘటనల్లో ఇది మనం చూస్తున్నదే, అనుభవిస్తున్నదే.

ఒక రాజకీయ ఖైదీగా – విద్యావంతురాలైన వ్యక్తిగా అంజుమ్ నుంచి ఏ మాత్రం ఊహించని కొన్ని ప్రతిస్పందనలు కొన్ని ఘటనల్లో వ్యక్తమయ్యాయి. దీని గురించి అనువాదకురాలు సబా హుస్సేన్ కూడా ఆమెతో ప్రస్తావించానని అయినా "అవి నా వ్యక్తిగత భావాలు" అని ఆమె జవాబిచ్చిందని ముందుమాటలో రాశారు. తోటి ఖైదీలతో జరిగిన వాగ్వాదాల సందర్భంగా వ్యక్తమైన భావాలు ఇవి. ఉదాహరణకి పాకిస్తాన్, ఇండియాల క్రికెట్ మ్యాచ్ సందర్భంగా తన ఎదురుగా ఉన్న సెల్‌లోని హిజ్రా ఒకరు పెద్దగా రేడియో పెట్టి గట్టిగా చప్పట్లు కొడుతూ దేశభక్తి పాటలు పాడుతుండగా ఆమెతో జరిగిన వాగ్వాదంలో – ఆ హిజ్రా "దేశం కోసం ప్రాణాలిస్తానని" అంటే, "దేశం కోసం ఆడవాళ్ళు, మగవాళ్ళు ప్రాణాలిస్తారు. కానీ నువ్వేమిస్తావ్? చప్పట్లు కొట్టడం ఒక్కటే నువ్వు చేయగలిగింది" అనడం. కొత్తగా వచ్చే పేద మహిళా ఖైదీలను మురికిగా ఉంటారని చీదరించుకోవడం. నల్లజాతి ఖైదీలను ఉద్దేశించి రేసిస్టు వ్యాఖ్యలు చేయడం. వాళ్ళు ఆమెని తక్కువ సతాయించలేదు. భౌతిక దాడి కూడా చేసారు అనే వాస్తవం అలా ఉన్నప్పటికీ వాళ్ళని వ్యక్తులుగా కాకుండా నల్ల జాతీయులుగా చూడడం. పావురాన్ని వండుకుని తిన్న ఎయిడ్స్ పేషెంట్‌ని సైతం ఆమె క్షమించలేకపోయింది. ఎయిడ్స్ పేషెంట్‌లకు వండుకొని తినడానికి ఇచ్చే అవకాశాన్ని ఆమె ఇలా దుర్వినియోగ పరిచిందని వాపోయింది. అంజుమ్ శాఖాహారి అవునో కాదో ఆ పుస్తకం ద్వారా నాకు తెలీలేదు కానీ, జైళ్ళలో పావురాలను పట్టి వండుకొని తినడం చాలా మామూలు విషయం. ఈ విషయంలో మహిళా ఖైదీలు పావురాల వరకూ పరిమితమైతే (నాకు తెలిసినంత వరకూ) మగఖైదీలు పావురాలు, పిల్లులు, ఎలకలు, కప్పల వరకూ కూడా పోతుంటారు. ఇవి వారి, వారి ఆహారపుటలవాట్లకు సంబంధించిన విషయం అనే కన్నా, జైలులో నామ మాత్రంగా తప్ప దొరకని మాంసం కోసం అనేకులు పడే తాపత్రయం.

ఈ విషయాలు వదిలిపెడితే అంజు 5 ఏళ్ళ కారాగారావాసపు అనుభవాన్ని చాలా బాగా రాసింది. అనువాదకులు "సబా" సరళమైన ఇంగ్లిషులో, పట్టుకుంటే వదిలిపెట్టకుండా చదివించేలా అనువాదం చేశారు. దీనిని "జుబాన్" ప్రచురణ సంస్థ 2011లో ప్రచురించింది. తప్పక చదవాల్సిన పుస్తకం.

(ఈ రచనను రచయిత్రి హజారీబాగ్ కేంద్ర కారాగారం (ఝార్ఖండ్) నుండి సెప్టెంబరు 2012లో రాశారు)

పుస్తక పరిచయం

సామాజిక బాధ్యతల్ని చిందించిన స్వేదాశ్రువులు

- దేశాయ్ అనిత

ఈ వేళ ఒక్క రచయితలేకాదు, మేధావులనే కాదు దేశంలో ఈనాడు అందరూ ఒక విచిత్రమైన పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. అదేమంటే తమ బాధ్యత గురించి ఆలోచించ కుండా ఉన్నంత కాలం, తమ బాధ్యతల్ని ఆచరించకుండా ఉన్నంతకాలం "తమ బాధ్యత ఏమిటి" అని తర్కించుకునే అవకాశం వారికి ఉంటుంది. కాని తమ బాధ్యతల గురించి ఆలోచించి, ఆచరించడం మొదలుపెడితే తాము రచయితలుగాను, బుద్ధిజీవులు గాను, మేధావులు గాను మాత్రమే లేము. తమ బాధ్యత అన్నది దానిని మించి మొత్తం తమ జీవితమంతా అందులో 'ఇన్‌వాల్వ్' అయిపోయిందని అర్థం చేసుకొంటున్నారని బాలగోపాల్ ఒకచోట అంటారు. కాబట్టే 'స్వేదాశ్రువులు' కవితా సంపుటిలో ఉద్ధృతంగాలేచి / వ్యర్థంగా పొంగిపొరలి / కడలి లోపల కలిసిపోయే నదులు నీటిని / భగీరథ ప్రయత్నం చేసి / కరువు ప్రాంతాలకు తరలిస్తే / కాదా దేశం/ సంపూర్ణంగా సస్యశ్యామలం? అని అంటున్నారంటే కవిగారు జీవితంలో ఇన్‌వాల్వ్ అయిట్లేనని అర్థమౌతుంది. ఈ కవిత ఒక సీమ ప్రాంతానికే పరిమితం కాదు. దేశంలో నీటిపారుదల లేని అన్ని ప్రాంతాల ప్రజల్ని దృష్టిలో ఉంచుకొని రైతు స్థితి గతులతో ఇన్‌వాల్వ్‌తో అన్న మాట ఇది.

ఈ సంపుటికి పెట్టిన పేరు వల్లనే ఇది ఎవ్వరిని గురించి మాట్లాడుతుందో కవి కవితాత్మకంగానే వ్యక్తీకరించాడు. స్వేదం చిందించే అశ్రువులు అని అర్థం చేసుకొంటే సమాజంలో అన్ని రంగాలలో పనిచేస్తున్న వారిని గురించి ఈ కావ్యం మాట్లాడుతుందని అర్థం చేసుకోవచ్చు.

స్వేదాశ్రువులు
రచయిత : పి.ఎల్. శ్రీనివాస్‌రెడ్డి
ప్రచురణ :
పండు వెన్నెల ప్రచురణలు
వెల : రు. 50/-
ప్రతులకు : పి. మనోజ్ఞ,
పి. నారాయణ స్వామి
ఎ4, ఎస్.వి. పురం,
అనంతపురం - 515 004.

ఈ సంపుటిలో నలభై కవితలున్నాయి. దిన, వార, మాస పత్రికల్లో ప్రచురితమైన కవితలే ఇవన్నీ, దాదాపు ముప్పైయేండ్లలో విద్యార్థిగా, ఉపాధ్యాయునిగా అనుభవంతో పత్రికా గవాక్షాల ద్వారా చూసిన సంఘటనలే ఈ కవితలకు ప్రేరణలు అని కావ్య రచయిత ఆచార్య శ్రీనివాసరెడ్డి కవితా సంపుటిలోని స్వకీయంలో పేర్కొన్నారు.

ఈ కవితా సంపుటిలో పడిపోతున్న అన్ని సామాజిక విలువల్నీ ఈ నాటికీ సామాజిక బాధ్యతల్ని గుర్తించని రచయితలు ఎంతమంది ఉన్నారో లెక్కపెట్టనవసరం లేదు. సన్మానాలు, కరతాళధ్వనులకు ఉప్పొంగిపోయే కవులు ఎంతమందో, కష్టజీవికి ఇరువైపుల నిలబడేవారు కొంతమందే. స్వేదజలాన్ని బ్యాంకుల్లో ఎంతోహాయిగా పూల మకరందాన్ని పిండుకొనే వారెందరో 'కరువువస్తే, వరదవస్తే' కవితలో ఇటువంటి కవులను నిలదీస్తారు. కవి బాధ్యతల్ని గుర్తుచేస్తారు. కవుల నొక్కరినేకాదు. ఈ దేశ సంక్షేమాన్ని భుజానికి ఎత్తుకున్న మంత్రుల నిజాయితీని ప్రశ్నిస్తారు. వాళ్ళ బాధ్యతా రాహిత్యాన్ని గుర్తుచేస్తారు. స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్ళలో మంత్రి పదవులంటే ముళ్ళకిరీటం లాంటివని అనుకొనేవారు. మంత్రులు తమ శాఖలో అపశృతులు దొర్లితే ఆ శాఖను నిర్వహించడంలో వైఫల్యం చెందామని తమ నిష్క్రియా పరత్వాన్ని, అసమర్థతను అంగీకరించి రాజీనామాలు చేసిన మంత్రులు కొందరైనా ఉన్నారు. కానీ నేడు "ఇప్పుడది / మగువ పెదవి / మధువల చవి/ నవనిధుల తాళపుచెవి" ఈ తాళపు చెవులు లేని మంత్రులు ఈ దేశంలో ఎందరున్నారో కంచుకాగడా పెట్టి వెతకాల్సిందే. సామాజిక సంక్షేమాన్ని గాలి కొదిలేసిన బాధ్యతా రాహిత్యం మరోసారి ఈ కవితను చదివితే గుర్తుకొస్తుంది.

ఒక రాష్ట్రానికి రాజ్యాంగ బాధ్యతలను నిర్వహించే పెద్ద మనిషి ఏ కారణాల చేత పదవీచ్యుతడయ్యాడో, ఒక రాజకీయ పార్టీ అధినేత మధువుల వ్యాపారంలో ఎలా తలమునకలయ్యాడో ఆంధ్రదేశంలోని ప్రజలందరికీ తెలుసు. ఈ కవిత రాసేకాలం నాటికి ఈ సంఘటనలు పత్రికలకు ఎక్కలేదు. కవిత చిన్నదైనా మనస్సుకు సూటిగా ఒడిదుడుకులు లేకుండా స్పష్టంగా హృదయానికి హత్తుకొంటుంది.

ఆచార్య శ్రీనివాసరెడ్డి కవితల్లో అతి చిన్నవి, అతి పెద్దవి కూడా ఉన్నాయి. కవిత ఎలాంటిదైన అందులో భావతీవ్రత అధికంగానే ఉంటుంది. 'రంగస్థలం' అనే కవిత ఆరు పదాలలో మాత్రమే ఉంది. ఆరుపదాలలో ఆరు శతాబ్దలకు పైబడిన సాహిత్య పరిణామాన్ని దాని స్వభావాన్ని వివరించారు. మొన్న గుడి / నిన్నజడ / నేడు అలజడి. మూడు పాదాలు మాత్రమే. భావ కవిత్వం ప్రారంభమైయ్యేంత వరకు వచ్చిన కవిత్వమంతా మత సంబంధమైనదేనని కవి అభిప్రాయం. అది అనువాద సాహిత్యమే కావచ్చు, స్వతంత్ర్యమైనదే కావచ్చు. దాదాపు వేయి సంవత్సరాలు సాహిత్య చరిత్రంతా ఒక్క మాటలో ముగించాడు. అలాగే 'నిన్న జడ' అనడంలో భావ కవిత్వాన్ని అది అమలిన శృంగారమైన కావచ్చు. కవిత్వమంతా సామాజిక బాధ్యతను మరచి స్త్రీ చుట్టే తిరిగింది. భావకవిత్వానికి సామాజిక పునాది లేదని విమర్శకులు చాలామంది అభిప్రాయపడ్డారు. మరికొందరు ప్రబంధ సాహిత్యంలో కంటే స్త్రీకి సముచిత గౌరవాన్నిచ్చిందంటారు. మరికొందరు మానవ సంబంధాల్ని, మానవీయ దృక్కోణంలో చిత్రించింది అంటారు. ఏది ఏమైనా చేతిలోని ముద్దను గురించి ఆలోచించలేదని మనకు అర్థమౌతుంది. మూడో పాదంలో 'నేడు అలజడి' అని అంటారు. ఇరవయ్యవ శతాబ్దం ఉత్తరార్థం నుండి స్వాతంత్ర్యోద్యమం మొదలుకొని నేటిదాకా ప్రతి కవి సమాజపు అట్టడుగు చీకటి పొర్లలో జరుగుతున్న విధ్వంస జీవితాన్ని గురించి చర్చిస్తున్నారు. ఈ సుదీర్ఘసాహితీ చరిత్రను మూడు పాదాల్లో ముగించి పాఠకుని అర్థం చేసుకోమని కవి హెచ్చరిస్తారు.

అల్పాక్షరాలతో అనల్పార్థాన్ని పాల్కురికి సోమన సాధించాడని తెలుగు సాహితీ విద్యార్థులు నేర్చుకున్నారు. శ్రీనివాసరెడ్డి దాదాపు ముప్పైయేళ్ళ బోధనానుభవంతో ఈ కవితలో సాహితీ చరిత్ర స్వభావాన్ని

ఇమిడ్చారు. మరో విశేషమేమిటంటే పాఠకునికి సాహిత్య పరిచయం పైన దాని స్వభావంపైన అవగాహన ఉంటుందనే భరోసాతో ఈ కవితను రచించి ఉంటారు. మరో అంశం ఏమిటంటే కచ్చితమైన ప్రతీకల్ని వాడుకోవడం అలాగే 'ముకురం' అనే కవిత కూడా 'ముకురం' అంటే అద్దం అని అర్థం. ముకురం "మనలోని సొగసుల్ని చూపుకోవడానికే కాదు / మనలోని లొసుగుల్ని రూపు మాపుకోవడానికి కూడా" అని నుతారంగా బుగ్గగిల్లి పాఠకుణ్ణి ఆత్మవిమర్శ చేసుకోని మసలుకోవాలంటాడు. తమ అందచందాల్ని చూచి మురిసిపోవడం కాదు. తమ భాధ్యతల్ని కూడా గుర్తెరిగి మసలుకోవాలనే హెచ్చరిక కూడా ఉంది. నేటి యువతరాన్ని దృష్టిలో పెట్టుకొని రాసిన కవిత ఇది.

రాయలసీమ వరుస కరువుల్తో అలమటిస్తున్న చరిత్ర బ్రిటిష్ కాలం నుంచి నమోదైనది. ఎన్ని క్షామాలెచ్చినా పాలకుల్లో చలనం లేదు. అయినా కవుల్లో రసజ్ఞత చావలేదని మరికొందరు తమను తాము పొగుడుకొని మురిసిపోతారు. ఇటీవలి కాలంలో 'జలస్వప్నం' 'జలగండం' వంటి కావ్యాలు నీటి ప్రాధాన్యతను గురించి వివరిస్తూనే ఉన్నాయి. 'అవేద' నిచ్చెనమెట్ల లోలకం వంటి కావ్యాలు సీమ కరువు కాటకాలకు సాగునీరు, తాగునీరు, కరువు కారణాలను, కారకులను, నిలదీసి అడుగుతున్నారు. ఇదేవరుసలో శ్రీనివాసరెడ్డి దాదాపు ఎనిమిది కవితల్లో నీటి ప్రాధాన్యతను వివరించారు. సంకలనంలోని మొట్టమొదటి కవిత 'పిట్టలు నీళ్ళు'. ఈ కవితలో సమస్యను ఒకే ఒక్క గుక్కలో వివరించారు. పిట్టలు తాము జీవించాలంటే తమపై అణచివేతను ఎదిరిస్తూ అంతిమ పోరాటం చేయక తప్పదు. తమకు కావలసినది కొందరికి మాత్రమే పరిమితమైనప్పుడు అందరికీ కావలసినప్పుడు వాటిని ఏవిధంగా చేజిక్కించుకుంటారో ఈ కవితలో వివరించారు. "గొంతెండిన పిట్టలు గోళ్ళతో గోకి, కొనదేలిన ముక్కులతో కొరికి తాగుతున్నాయి నీటిని నిలబెట్టుకుంటున్నాయి ప్రాణాలని" అని దిక్కుమొక్కులేని జనం ఒక్కటైన పర్యవసానాన్ని పిట్టల కథగా చెప్పినా అది పిట్ట కథ మాత్రం కాదని అర్థమౌతుంది.

గత రెండు దశాబ్దాల కాలంగా నదుల అనుసంధానాన్ని గురించి చర్చ జరుగుతూ ఉంది. దేశవ్యాప్తంగా సాగునీటికి శాశ్వత పరిష్కార వనరు నదుల అనుసంధానమేనని, దేశంలోని మేధావులంతా ముక్తకంఠంతో అన్నారు. ఇదే విషయాన్ని శ్రీనివాసరెడ్డి 'అనేకం' అనే కవితలోనూ 'సంపూర్ణ సస్యశ్యామలం' అనే కవితలోనూ వివరించారు. గంగాఝరి సకల పాపాల్ని కల్మషాల్ని తొలగిస్తుందని భారతీయుల భావనలో వేళ్ళూనింది. ఈ భావాన్ని పూర్వపక్షం చేస్తూ గంగాఝరి "అన్నార్తుల ఆకలి మంటల్ని అంతరింపజేయడానికి కూడా" అని అంటారు.

ఈయనలో గొప్ప భావకుడు కూడా ఉన్నాడని కొన్ని కవితల్ని చూస్తే తెలుస్తుంది. మనకు ప్రత్యక్షంగా కానవచ్చే విషయాల్ని కవితాత్మకం చేయటంలో ఈయనలోని భావకుడు ఎంతటి వాడో తెలుస్తుంది. 'బిందు బంధువులు' అన్న కవితలో "ఆకాశం పరిశ్రమించి అనూనంగా కార్చిన చెమట బిందువులు అన్నార్తుల పాలిటి ఆప్తబంధువులు". అని వర్షం ముక్క అవసరాన్ని దాని ఫలితాన్ని వివరిస్తాడు. ఆకాశం పరిభ్రమించింది అని అనడంలో యాదృచ్ఛికత లేదు. ఒక విశేషమే గోచరిస్తుంది. ఆకాశం ఎందుకు పరిశ్రమించాల్సి వచ్చిందో అనే ప్రశ్నతో అనేక జవాబులు వెతుక్కోవాల్సి వస్తుంది. వాతావరణ కాలుష్యంతో ఓజోన్ పొర దెబ్బతిందని శాస్త్రవేత్తల ఘోష, పర్యావరణ సమతుల్యం దెబ్బతింటుందని మరికొందరి శాస్త్రవేత్తల ఆవేదన. ఖండాతరాలలో పెరిగిన ఉష్ణోగ్రత వల్ల మనదేశంలో ఆకాశం మేఘావృతమై ఉన్నా చుక్కరాలడం లేదని శాస్త్రవేత్తలు తేల్చిన విషాదవాస్తవం. ఇటువంటి సందర్భంలో ఆకాశం చెమట బిందువుల్నే కారుస్తుంది. అది ఎంత సంక్లిష్టమైన సందర్భమో పాఠకుడు ఊహించుకోవాల్సింది.

నీటి ప్రాధాన్యతను గురించి తెలిపే మరోకవిత 'అంతరం' మానవ అవసరాలకి, మానవ పురోభివృద్ధికి తోడ్పడేదే నీరు. సప్తసముద్రాలున్నా అవి గుక్కెడు మంచినీళ్ళు ఇవ్వలేదు. అందుకని కవి సముద్రాల్ని అసహ్యించుకుంటాడు. చెలమ చిన్నదే అయినా పారజల్లిన కొద్దీ మంచి నీటిని ఊరిస్తుంది అందుకే అది 'పాంథుల చెలిమికి' ప్రతీక అయ్యింది. కవితలోని ఉత్తరార్థం ప్రయోజానాన్ని కూడా సాధించారు. శ్రీనివాసరెడ్డి కవితా పత్రికలు చాలా తీక్షణంగా ఉంటాయి. భావతీక్షణత కూడా అధికంగానే ఉంటుంది. పరిస్థితులను గమనించిన భావకునికి కలిగే సహజ స్థితి ఇది.

'ఏమిటి ప్రయోజనం' అనే కవిత సూతారంగానే రాజకీయ నాయకులకు గట్టి చెంపదెబ్బ పెట్టారు. కేవలం వాగ్దానాలతో కాలం వెళ్ళబుచ్చక ప్రయోజనకరమైన పనులు ఏమైనా చేస్తే బాగుంటుందని హెచ్చరిస్తాడు. ఉరుములతో, మెరుపులతో ప్రయోజనం ఉండదని కాలిబూడిదై పోతున్న నేలకు నాలుగు చినుకులైనా రాలితే తప్ప ప్రయోజనం ఉండదని ఈయన హెచ్చరిక. నేల కాలిబూడిదైతే జీవరాసి మిగలదు. అప్పుడు నాలుగు చినుకులతో ఎవరికి ప్రయోజనం ఉంటుందని ప్రశ్నించుకుంటే కాలిబూడిదయ్యేది నేలకాదని, నేలను నమ్ముకున్న రైతని మనకర్థమౌతుంది. కాని మెరిసిన మెరుపులు, ఉరుములు నిజానికి నిష్ప్రయోజనం కావు. నిష్ప్రయోజనం అయ్యేది పాలకుల వాగ్దానాలేనని కవిత భావగర్భితం.

ఈ సంకలనంలో నిర్దిష్ట సమస్యల్నే కాకుండా నిర్దిష్ట విలువల్ని ప్రశ్నించిన కవితలు కూడా ఉన్నాయి. 'దాణా' కవితలో లంచగొండి తనాన్ని 'మనం మనుషులం' అన్న కవితలో డబ్బుకు కక్కుర్తి పడే మనుషుల్ని, 'వింతక్రూర జంతువు' పరభాగ్యోప జీవిని నిరశిస్తాడు. 'సూర్యుడు సముద్రం', 'ఎందుకు' అనే కవితల్లో ప్రకృతి ధర్మాన్ని వివరిస్తాడు. ప్రకృతి ధర్మాన్ని కవిత్వీకరించడంలో గొప్ప భావకుడు కన్పిస్తాడు. సముద్రం సూర్యున్ని నిద్రపుచ్చాలని ఉప్పొంగి పోతోందట, కానీ సూర్యుడు నిద్రిస్తున్న వారిని మేల్కొల్పడానికే వెళుతున్నాడని పిచ్చి సముద్రానికి తెలియదని భావిస్తాడు. అలాగే శిశిరం ఆకులెందుకు రాలుస్తుందని ప్రశ్నించి మండుటెండలో శ్రమజీవుల కోసం "కొత్త ఆకుల గొడుగుల్ని' నింపడానికని భావిస్తాడు. ప్రకృతి ధర్మాలను సామాజిక చర్యలన్నీ మానవుడి పురోభివృద్ధికే అయితే వేమన చెప్పినట్లు కొందరు పుణ్య పురుషుల మూలంగా దాని సమతుల్యత దెబ్బతింటుంది. అలా దెబ్బతినరాదనే భావం కూడా ఈ కవితల్లో కనిపిస్తుంది.

నూతన ఆర్థిక విధానాల వల్ల ఈ దశాబ్దంలో గ్రామాలు కుదేలైపోయాయి. మహారాష్ట్రలోనూ అత్యధికంగా రైతాంగం ఆత్మహత్యల పాలవుతుంది. వ్యవసాయోత్పత్తుల కంటే పారిశ్రామిక ఉత్పత్తులకు ప్రాధాన్యత పెంచిన కారణంగా గ్రామీణ జీవితం బుగ్గిపాలౌతుంది. వ్యవసాయం దండగని పాలకులే సెలవిస్తున్న దౌర్భాగ్యం దాపురించింది. నూటికి డెబ్బై శాతం ప్రజలు గ్రామాల్లో జీవిస్తున్నారని ఇటీవలి గణాంకాలు తెలియజేస్తున్నాయి. రైతాంగం దేశానికి ఊపిరి మాత్రమే కాదు. పాలకుల ఓటు బ్యాంకులు కూడా. రైతాంగ స్థితిని గురించి

(మిగతా 71వ పేజీలో...)

లేఖ

అపార్థం, గందరగోళం

- వి. కవిత

కవికి మాటల విలువ, మాటల బరువు, మాటకు ఉండే ప్రధాన అర్థం, విభిన్న అర్థాలు, ఛాయలు తెలిసి ఉండాలి. ఇతరులు అన్నమాటలకే, అచ్చులో ఉన్నమాటలకే స్పందించాలి గాని లేని మాటలు ఉన్నవనుకుని అపార్థంతో గందరగోళం సృష్టించగూడదు. నా అభిమాన కవుల్లో ఒకరైన రివేరా నా వ్యాసం (గత రెండు దశాబ్దాల విప్లవ కవిత్వం - అరుణతార - 300, కవిత్వ ప్రత్యేక సంచిక) లో కొన్ని మాటలకు లేని అర్థాలు ఊహించుకునీ, నేను అనని మాటలు అన్నానని ఊహించుకునీ ఖండిస్తూ రాసిన లేఖ (అరుణతార - 301, విమర్శ ప్రత్యేక సంచిక) చూసి ఆశ్చర్యం కలిగింది. తన పట్ల కవిగా, ఆలోచనాపరుడిగా, మేధావిగా ఇతరులకు ఉండే గౌరవాన్ని రివేరా తానే స్వయంగా పోగొట్టుకో దలచుకున్నట్టున్నారు. ఇతరులు అనని మాటలు అన్నట్టుగా భావించుకునీ, ఇతరులు రాసిన మాటలను తనకు తోచినట్టుగా అర్థం చేసుకునీ వారి మీద విమర్శ చేయడం రివేరా వంటి సున్నితమైన కవికి, ఆలోచనాపరుడికి తగినవి కావు. ఆయన కోసం కాకపోయినా, ఆయన ఉత్తరం వల్ల పొరపాటు పడే అవకాశం ఉన్న పాఠకుల కోసమైనా చిన్న వివరణ రాయవలసి ఉంది.

నా వ్యాసం లోని రెండు అంశాల మీద రివేరా తన విమర్శను ప్రకటించారు. నేను "విప్లవ సంస్థల (విప్లవ పార్టీ అందాం) ఆచరణతో విప్లవోద్యమానికి, విప్లవ కవిత్వానికి గల అవినాభావ సంబంధాన్ని తుంచివేసే ప్రయత్నం" చేశాననేది ఆయన మొదటి విమర్శ. విప్లవ రచయితల సంఘం అనే మూడు మాటలను నిర్వచించడంలో "కెవిఆర్ తాత్వికతలో దొర్లిన పొరపాటు ఇప్పటికీ విప్లవ సాహిత్య చర్చల్లో పెద్దపీట వేసుకుని" ఉందనీ, నా వ్యాసంలో కెవిఆర్ ను ఉటంకించడంద్వారా నేను కూడ ఆ పొరపాటును కొనసాగించాననేది రెండో విమర్శ. వీటిలో మొదటిది నేను అనని మాటను అన్నాననుకొని చేసిన విమర్శ. రెండవది తనకు తోచినట్టు అర్థం చేసుకుని చేసిన విమర్శ.

దాదాపు ఐదు పేజీలలో సుదీర్ఘంగా, వివరంగా అనేక విషయాలు చర్చించిన తర్వాత, ముగింపుగా నేను రాసిన పేరాలోంచి ఒక మాట తీసుకుని దానికి తనకు తోచిన అర్థం చెప్పుకుని విమర్శించారు రివేరా. ఆ పేరా ఇది: "మొత్తం మీద విప్లవ కవిత్వ ఆటుపోట్లను విప్లవోద్యమ సంస్థల ఆటుపోట్లతో గుర్తించడం సరైన పద్ధతి కాదని పరిశీలకులు తెలుసుకోవాలి. విప్లవోద్యమ సంస్థలకు అనేక కారణాల వల్ల ఆటుపోట్లు, ఎత్తుపల్లాలు, విజృంభణ వెనుకంజలు ఉండవచ్చు, కాని విప్లవోద్యమానికి అవి ఉండవు. ఎందుకంటే పాలకవర్గ దుర్మార్గం సాగినంతకాలం ప్రజల విప్లవావసరానికి, విప్లవాకాంక్షకు ఉధృతి, విస్తరణా తప్ప వెనుకంజ ఉండదు. విప్లవకవిత్వం విప్లవోద్యమ సంస్థల ఫలితం కాదు గనుక, విప్లవోద్యమ ఫలితం గనుక ఆ సంస్థల ఉత్థాన పతనాలతో విప్లవ కవిత్వాన్ని అంచనా కట్టగూడదు. మొత్తంగా చెప్పాలంటే విప్లవ కవిత్వం ఇవాళ ఉండవలసిన స్థాయిలో లేకపోయినా, సరైన దిశలోనే, దశలోనే ఉంది." ఈ పేరాలో "విప్లవ కవిత్వ ఆటుపోట్లను విప్లవోద్యమ సంస్థల ఆటుపోట్లతో..." అనే వాక్యభాగాన్ని తుంచి, విప్లవోద్యమ సంస్థ అనే మాటకు "విప్లవపార్టీ అందాం" అని అర్థం చెప్పి, అనవసరంగా, అసందర్భంగా లెనిన్ నూ మావో నూ కూడ తీసుకువచ్చారు రివేరా. నా మొత్తం వ్యాసం స్ఫూర్తి గాని, ఆ ముగింపు పేరా స్ఫూర్తిగాని ఆయనకు అర్థమైనట్టు కనిపించడం లేదు. నా వ్యాసంలో విప్లవ పార్టీ అనే మాట గాని, దాని గురించి గాని లేదు. విప్లవ సాహిత్య సంస్థలు ఎన్నో ఉన్నాయి. వాటి ఒడిదుడుకులను బట్టి విప్లవ సాహిత్యోద్యమాన్ని అంచనా వేయగూడదని మాత్రమే నేను అక్కడ వాదించాను. అసలు అక్కడ విప్లవపార్టీ అని రివేరా ఎలా అపార్థం చేసుకోగలిగారో తెలియదు. ఎప్పుడైనా ఉద్యమం విశాలమైనది, అనేక సంస్థలు దానిలో భాగం. ఆ భాగాలన్నీ సరిగా పనిచేయాలని కోరుకోవడం ఆదర్శం. కాని ఆ సంస్థల్లో ఒకటో, కొన్నో సరిగా పనిచేయలేని స్థితి కూడ అనేక కారణాలవల్ల రావచ్చు. అప్పుడు ఆ ఒక సంస్థో, కొన్ని సంస్థలో పనిచేయలేకపోవడాన్ని చూపెట్టి అసలు ఉద్యమమే లేదని విమర్శించేవాళ్లకు జవాబుగా, సామాజిక చలనం గురించి, ఆ చలనంలో భాగమైన ఉద్యమం గురించి, దానిలో భాగమైన సంస్థల గురించి అక్కడ ప్రస్తావించాను.

ఇక విప్లవ రచయితల సంఘం అనే మూడు మాటల్లో మొదటిది లక్ష్యానికి, రెండోది కార్యక్షేత్రానికి, మూడోది సమష్టి స్పృహకు సంకేతాలని కెవిఆర్ అన్న మాట విరసం సాహిత్య చర్చలలో అనేకసార్లు వచ్చింది. "విప్లవ రచయితల సంఘం - విరసం - అనే మూడు పదాలలో ప్రతి ఒక్కటీ సార్థకమే. అంతిమలక్ష్యం దృష్ట్యా ఒకానొక రచయితల సంఘం విప్లవ రచయితల సంఘం అయింది. తన కార్యరంగం సాహిత్యం కాబట్టి రచయితల సంఘం అయింది. ఎందరో రచయితల సంఘటిత శక్తి కాబట్టి సంఘం అయింది" అని కెవిఆర్ అన్నారు. దాన్నే నేను నా వ్యాసంలో "కెవిఆర్ మాటల్లో చెప్పాలంటే విప్లవ శబ్దం దాని లక్ష్యాన్నీ, సాహిత్య (రచయితల) శబ్దం దాని కార్యక్షేత్రాన్నీ సూచిస్తాయి. అయితే ఈ మాట ఎంతగా చెప్పుకున్నప్పటికీ ఈ రెంటికీ మధ్య సంబంధాన్ని, దూరాన్ని సరిగా అవగాహన చేసుకోవడంలో లోపాలు తలెత్తుతున్నాయి. ఎప్పుడైనా లక్ష్యంలో రాజకీయ, సామాజిక, పోరాటవ్యూహాల దృష్టి ప్రధానం కాగా, కార్యక్షేత్రంలో ఆ కార్యక్షేత్రానికే సంబంధించిన అంశాలు ప్రాధాన్యత వహిస్తాయి. సాహిత్యం కార్యక్షేత్రమైనప్పుడు, దానిదైన ఒక సాహిత్య వాతావరణం, సాహిత్య సంప్రదాయాలు, శైలీ శిల్పాలు, రూపశ్రద్ధ, ఉద్వేగ భరిత అభివ్యక్తి, నిత్య నూతనత్వం, ప్రయోగశీలత, ఆదానప్రదానాలు, నిరంతర అధ్యయనం, శిక్షణ వంటి ఎన్నో లక్షణాలుంటాయి. విప్లవ సాహిత్యోద్యమంలో, ముఖ్యంగా కవిత్వ రంగంలో ఈ వాతావరణం ఉండవలసినంతగా ఉండడం లేదనే చెప్పాలి" అనే మాటల్లో సాహిత్య రంగంలో జరగవలసిన కృషిని నొక్కి

చెప్పడానికి వాడుకున్నాను.

రివేరా దీన్ని అపార్థం చేసుకుని, "విరసం వంటి విప్లవ సాహిత్యోద్యమ సంస్థలు, విప్లవ పార్టీ లక్ష్యాల కోసమే పని చేస్తున్నాయన్న అభిప్రాయం కలిగించేలా ఉంది ఈ ఉటంకింపు. విప్లవ సాహిత్యోద్యమ సంస్థలు స్వతంత్రంగా వ్యవహరించగలిగింది కార్యక్షేత్రం విషయంలోనేనా? వానికంటూ ఏ లక్ష్యాలూ ఉండవా? లక్ష్యం వేరుగానూ కార్యక్షేత్రం వేరుగానూ ఏ ఉద్యమమైనా ఉంటుందా? ఈ విషయంలో కామ్రేడ్ కెవిఆర్ అవగాహన ఏమిటో తెలిస్తేనే వి. కవిత ఎక్కడ పొరబడ్డారనేది అర్థం కాదు. అత్యంత యాంత్రికమైన పద్ధతిలో విప్లవం, రచయిత, సంఘం అనే పదాలను కామ్రేడ్ కెవిఆర్ విడదీసి నిర్వచించారు... ఈ విషయమై కామ్రేడ్ కెవిఆర్ తాత్వికతలో దొర్లిన పొరపాటు ఇప్పటికీ విప్లవ సాహిత్య చర్చల్లో పెద్దపీట వేసుకొని ఉండటం విస్మయపరుస్తోంది" అని అసందర్భంగా అటు కెవిఆర్ మీద, ఇటు నామీద విరుచుకుపడ్డారు. కెవిఆర్ వాక్యాలలో గాని, నా ఉటంకింపు, వివరణల్లో గాని ఆ మూడు మాటలను విడదీయడం, లక్ష్యాన్ని ఒకరికి, కార్యక్షేత్రాన్ని మరొకరికి వేరుగా చూడడం లేదు, "ఆ మూడిటి సంబంధాన్ని, దూరాన్ని సరిగా అవగాహన చేసుకోవడంలో లోపాల" గురించి మాత్రమే నేను ప్రస్తావించాను. లక్ష్యాన్ని విప్లవ పార్టీకి, రచనను సాహిత్య సంస్థకు ఇస్తే దాని పేరులో విప్లవ ఉండనవసరమే లేదు. అలా విడదీసి నేను వాడని విప్లవపార్టీ అనే మాట చేర్చి గందరగోళ పడినదీ, కెవిఆర్ కు కూడ "పొరపాటు తాత్వికత"ను ఆపాదించినదీ రివేరా మాత్రమే.

నా వ్యాసంలో, ఆ మాటకొస్తే ఎవరి వ్యాసంలోనైనా పొరపాట్లు ఉండవచ్చు, ఉంటాయి. భౌతిక పరిస్థితి గురించిన ఒక వివరణ ఎప్పుడైనా ఒక స్వీయమానసిక అంచనాగానే వెలువడుతుంది గనుక అది ఆమేరకు లోపాలతో ఉంటుంది. దాన్ని వీలయినంత వస్తుగతంగా మార్చగలిగినప్పుడే అది వాస్తవికతకు సరిపోతుంది. నా వ్యాసంలో లోపాలను సవరించే బాధ్యత రివేరా వంటి బాధ్యులు తీసుకోవడం చాల సంతోషం. కాని లోపాలను సరిచేసే పేరుతో వారే లోపభూయిష్టంగా అర్థం చేసుకుని, తమ గందరగోళాన్ని వ్యక్తీకరిస్తే, పాఠకులు మరింత గందరగోళ పడతారు.

(69వ పేజీ తరువాయి...)

ఇదివరకే అనంత కవులు 'పొరవు' కవితా సంకలనాన్ని వెలువరించారు. ప్రసిద్ధ కవులంతా రైతాంగ దుస్థితికి కారణాలు తమ కవితల్లో వివరిస్తూనే ఉన్నారు. ఇదే వరుసలో శ్రీనివాసరెడ్డి స్వేదాశ్రువులు కవితా సంకలనంలో 'గుండెల్లో గునపం', 'మీరెప్పుడు కలుస్తారు' అనే రెండు శీర్షికలతో రెండు కవితలున్నాయి. 'గుండెల్లో గునపం' కవితలో నాసిరకం విత్తనాలు రైతాంగాన్ని నట్టేట ముంచుతున్న క్రమాన్ని వివరిస్తాడు. అలాగే 'మీరెప్పుడు కలుస్తారు' కవితలో ఏకంగా రైతాంగపు ఆత్మహత్యలన్నీ ప్రభుత్వపు హత్యలేనని చాలా ఆక్రోశంతో వివరిస్తారు. సమాజంలో జరిగే అన్ని విధ్వంసాల్ని నిలదీస్తాడు.

ఈ రెండు కవితల్లో మరో రెండు అంశాలున్నాయి. ఒక బాధ తీవ్రతను చెప్పడానికి అంతకంటే ఎక్కువ బాధాకరమైన ప్రతీకల ద్వారా వివరిస్తారు. ఎస్.సి.-1 అణచివేత నిర్దిష్ట సమస్యను పునాదిగా చేసుకొని ప్రపంచ వ్యాప్తంగా సార్వత్రికమైందని ఒక గొప్ప ప్రయోజనాన్ని సాధించారు. వర్షం లేక మొలకెత్తలేని విత్తనాలు 'మింగమెతుకు లేక మృత్యువాతపడుతున్న ఇథియోపియాలో పిల్లల్లా' ఉన్నాయని భావిస్తారు. ఒక దీనస్థితిని అంతకంటే ఎక్కువ దీనస్థితితో వివరించి కవితను సార్వత్రికం చేస్తారు. 'మీరెప్పుడు కలుస్తారు' కవితలో రైతాంగ దుస్థితి అంతా పాలకుల నిర్లక్ష్యమేనని వివరిస్తూ రైతాంగమంతా ఒక్కటైతేనే సమస్యకు పరిష్కారం లభిస్తుందని 'మరి మీరెప్పుడు కలుస్తారు, ఎప్పుడు పిడికిలి బిగిస్తారు, పిడికిలి బిగిస్తే దోపిడీకి తావుండదు' అని పరిష్కారం కూడా చూపుతారు.

నలభై ఏళ్ళ స్వాతంత్ర్య జీవితంలో గ్రామాల స్థితిగతుల్లో ఎలాంటి మార్పులేదు. దళితుల స్థితిగతుల్ని గురించి ఈ సంకలనంలో రెండు కవితలున్నాయి. 'ఇప్పుడైనా చెబుతారా', 'జన్మభూమికి వెళ్ళను గాక వెళ్ళను' ఈ రెండు కవితల్లో ఈనాటికీ గ్రామాల్లో రెండు గ్లాసుల పద్ధతి కొనసాగడాన్ని, మంచినీళ్ళ బావికి దూరంగా ఉంచడం వంటి సామాజిక వివక్షల్ని ప్రశ్నిస్తాడు.

ఈ సంకలనంలో స్త్రీ, దళిత, రైతాంగ, భాషా సమస్యలు విలువలు అన్నిటినీ స్పృశిస్తారు. కొంత ఆలస్యంగా సంకలనం వెలువరించినా సమాజాన్ని కవి విహంగ వీక్షణంలా అన్ని సమస్యల్ని స్పర్శించారు.

చెప్పే తీరు చాలా సరళంగానే ఉంటుంది. ముక్కుసూటిగా తీవ్రస్వరంతో అన్యాయాల్ని ప్రశ్నించేతత్వం ప్రతి కవితలోనూ కన్పిస్తుంది. కవితలన్నీ కవిత్వం రాయటం కోసమే పనిగట్టుకొని రాసినట్టుగా కాకుండా సమస్యను పరిశీలించి బాధ్యతలు గుర్తించుకొని చెప్పినట్టుగా ఉన్నాయి. ఎంత సరళంగా చెప్పినా అక్కడక్కడ కొని పదబంధాలు ప్రాచీన కవిత్వాన్ని గుర్తు చేస్తాయి. 'రుజాజర్జరిత దేహాల్ని', 'అక్కటికంతో', 'పాంథులు', 'చతుశ్శృంగము', 'సద్యోగర్భము', 'తద్వత్తు' వంటి పదాలు భాషా పరిజ్ఞానం లేని వారికి సులభంగా బోధపడవు. ముప్పైయేళ్ళ పురాణ ప్రబంధ ఆధునిక కవితా అధ్యాపనా క్రమంలో ఆ పదాలు కవికి నచ్చిన పదాలై ఉంటాయేమో? ఈ పదాల వాడుకను బట్టి ఈ కవికి ప్రాచీన కవితా సంచారం కూడా పుష్టిగా ఉన్నట్లు అనుమానించడానికి అవకాశం కలుగుతుంది? ఏది ఏమైనా గత శతాబ్దపు అరభైయ్యవ దశకం లాగా విశ్వవిద్యాలయ అధ్యాపకులు రసాస్వదనతో మునిగి తేలకుండా సామాజిక బాధ్యతను గుర్తెరిగి ముందుకు రావటం నేటి సామాజిక ధర్మం. ఈ కవి అన్నట్లుగానే నేడు వెలువడుతున్నదంతా అలజడి కవిత్వమే. ఒక ప్రాంతంలో వెలువడుతున్న సమకాలిక కవిత్వంలోని తీరుతెన్నులు ఆ కవిత్వంలో రికార్డవుతున్న జనజీవితం, ఇతర ప్రాంతాల భాషాభిమానులకు తెలియవలసిన అవసరం ఎంతైనా ఉంది. దీనివల్ల అన్ని ప్రాంతాలలోని సామాజిక సమస్యల తీరుతెన్నులు పాఠకులకు అర్థమౌతాయి. నేటి కవిత్వంలోని వ్యక్తీరణ లేదా అభివ్యక్తి, భావచిత్రణలు ఇతర భాషా సాహితీ వేత్తలకు పాఠకులకు అనువాదాల ద్వారానే చేరుతాయి. ఎంతో గొప్ప సామాజిక ప్రయోజనం చేకూరుతుంది. ఈ 'స్వేదాశ్రువులు' సంకలనం కన్నడ భాషలోకి అనువాదమై ఆంధ్రదేశాన్ని కన్నడ దేశానికి పరిచయం చేసింది. భావ వినిమయం వల్ల సామాజిక చైతన్యస్థాయి మరో అడుగు ముందుకు వేసే అవకాశం సాహిత్యంలో అనువాదాల వల్ల లభిస్తుంది. ఈ సంకలనం అలాంటి చైతన్య స్థాయితో మరో అడుగు ముందుకు వేయించడానికి ఒక అవకాశం కలిగించింది. ఇటువంటి కవితా సంకలనాలు ఇకముందు కూడా వెలువడాలని ఆశిద్దాం.

లేఖ

(అక్టోబర్ - నవంబర్ 2013 అరుణతారలో విరసం కరపత్రాన్ని ఉద్దేశించి వచ్చిన లేఖ... - సం.)

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రోద్యమం

- గౌతమ్

నాటి తెలంగాణ పోరు నుండి శ్రీకాకుళ గిరిజనుడు
శ్రీకాకుళ పోరు నుండి తెలంగాణ రైతు నేడు
- చెరబండ రాజు

"సాధారణంగా అలాంటి ఉద్యమాల్లో ప్రజల్లో వర్గ దృష్టిని లోపింపజేసి అన్ని వర్గాల ప్రయోజనాలు ఒక్కటేననే అవాస్తవిక వాతావరణం సృష్టింపబడుతుంది. ప్రజల్లో ఉన్న విభిన్న వర్గాల ప్రయోజనాలు భిన్నభిన్నంగా ఉంటాయనే యదార్థం మరుగున పడిపోతుంది. ప్రత్యేకించి పెట్టుబడిదార్లు తమకున్న ప్రచార సాధనాలన్నింటినీ ప్రయోగించి అలాంటి వాతావరణాన్ని సృష్టించడం పై కేంద్రీకరిస్తారు. కాని అలాంటివి జరగకుండా తన శక్తినంతా వినియోగించి కార్మిక వర్గం చైతన్యపూరితంగా కృషి చేయాలి."

తెలంగాణ రాష్ట్రం ఏర్పడబోతున్నది. గడిచిన 60 సంవత్సరాలుగా తెలంగాణ ప్రజల ఆకాంక్షగా ఉన్న తెలంగాణ స్వప్నం సాకారమవుతుంది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ఉద్యమం పీడిత ప్రజల ఉద్యమం కాదు. మిగతా ప్రాంతాలు పీడక ప్రాంతాలు కావు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడటం ఏ పీడిత ప్రజల సమస్యనీ తీర్చదు. ఇది "బతుకు పోరని, పంటిబిగువున అవమానాలనూ దౌర్జన్యాలనూ భరించి, స్వేచ్ఛ కోసం, స్వాతంత్ర్యం కోసం, పొట్టకు కాసిన్ని మెతుకుల కోసం ఆకలి పోరాటం..." అనీ అనడమూ అనుకోవడమూ కూడా తప్పుడు అవగాహనే. భారతదేశంలో ఇంకో రాష్ట్రంగా తెలంగాణ ఇప్పుడు లేని ఏ స్వేచ్ఛని, ఏ స్వాతంత్ర్యాన్ని తీసుకొస్తుంది? ఈ వేళ తెలంగాణలో ప్రజలు ఎదుర్కొంటున్న ఏ ఒక్క సమస్యనైనా పరిష్కరించగల అవకాశం కొత్త తెలంగాణ పాలక వర్గానికుంటుందా?

తెలంగాణ రచయితలు మేధావులు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు పట్ల పీడిత ప్రజల్లో చాలా భ్రమల్ని, ఆకాంక్షల్నీ రేకెత్తిస్తున్నారు. నిజానికి ఇటువంటి ఉద్యమంలో ప్రజావ్యతిరేక పాలక శక్తుల్ని బహిర్గతం చేసి ప్రజల బలాన్నీ, ఆత్మవిశ్వాసాన్నీ అపారంగా పెంచవల్సిన రచయితలు ఆ శక్తులకి వాటిని మించిన సమర్థకులుగా తయారౌతున్నారు. భారతదేశానికి విప్లవ కార్యాచరణ మార్గం చూపిన తెలంగాణ వీరయువకులని తెలంగాణ పాలక వర్గాల తోకగా తయారు చేస్తున్నారు.

అటు విప్లవ రచయితలూ ఇటు ప్రగతిశీలత కలిగిన మేధావులూ అందరూ ఒక అవాస్తవిక వాతావరణాన్ని సృష్టిస్తున్నారు.ఒకర్ని మించి ఒకరు తెలంగాణేతర ప్రాంతాల పైన కత్తులు నూరుతున్నారు. ప్రజల్లో ఉన్న విభిన్న వర్గాల ప్రయోజనాలు భిన్నంగా ఉంటాయనే యదార్థాన్ని మరుగుపర్చి యావత్తెలంగాణ ప్రయోజనాలన్నీ ఒకటేనని చెపుతున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే చాలు స్వర్గం దిగి వస్తుందనేంతగా వర్ణిస్తున్నారు. ఈ ప్రచారంతో పాటు మిగతా ఆంధ్ర ప్రాంతమంతటినీ అన్ని రంగాలలోనూ శత్రువుగా నిలబెడుతున్నరు. రాజకీయాలలో, ఆర్థిక విషయాలలో, సాంస్కృతిక రంగాలలో తెలంగాణకి ఆంధ్ర ప్రాంతం శత్రువని వర్ణిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం మీదా, రాష్ట్ర ప్రభుత్వం మీదా, తెలంగాణ పాలకవర్గం మీదా గురి పెట్టవలసిన తమ బాణాలని విచక్షణా రహితంగా మిగతా ఆంధ్ర ప్రాంతం మీద గురిపెడుతున్నారు. ఈ విషయంలో అందరిదీ ఒకే మాట. కేసీఆర్...రాజనర్సింహ, కృష్ణమాదిగ, కోదండరాం ఎవరైనా ఈ విషయంలో ఒకే మాట మీద ఉన్నారు.

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు పై సిడబ్ల్యుసి తీర్మానం నుండి తెలంగాణేతర ప్రాంతాలలో ఆందోళన మొదలయ్యింది.కేబినెట్‌లో నోట్ పెట్టిన దగ్గర్నుంచీ ఆందోళన తీవ్రతరమైంది. ఇది ప్రతిఘాతుక ఉద్యమమనీ, కోస్తాంధ్ర సంపన్న పెట్టుబడిదారులు బిర్యానీలు, వైన్‌లు పోయించి చేయిస్తున్న ఉద్యమమనీ విరసం నుండి అందరూ చెప్పారు. కానీ నిజానికి సారాంశంలో ఈ ఆందోళన రాజకీయ నాయకుల ద్రోహాల మీద వెల్లువెత్తిన ప్రజాగ్రహం. పైకి 'సమైక్యాంధ్ర' అని కనిపించినా రాజకీయ నాయకుల ప్రజావ్యతిరేక వైఖరుల మీద, వారి స్వార్థపూరిత రాజకీయ కెరీరిజం పట్ల ఆగ్రహం.

తెలంగాణ మేధావులు 1969 నుండి జరిగిన ఉద్యమం గురించి విశ్లేషణలు చేస్తున్నారు గానీ 1969కి 2013కి మధ్య 44 సంవత్సరాల కాలం ఉంది. ఈ కాలం తెచ్చిన మార్పుల గురించి ప్రస్తావించడం లేదు. ఈ కాలంలోనే రాష్ట్రం మొత్తంలో చదువుకున్న మధ్య తరగతి బాగా పెరిగింది. గ్రామాల నుండి పట్టణాలకు వచ్చి స్థిరపడడం పెరిగింది. భౌతికంగా కాకపోయినా మానసికంగా వ్యవసాయం వెనుకబడిన వృత్తి అని, దాన్ని వదిలించుకోవాలనే భావన పెరిగింది.అన్ని రకాల చేతి వృత్తుల ప్రజలూ తమ పిల్లల్ని ఆ వృత్తులలోకి దించకుండా చదివించడం పెరిగింది. (చదువు ఎలా పిల్లల్ని తల్లిదండ్రుల నించి దూరం చేస్తోందో ఎన్ని కథలొచ్చాయి? అల్లం రాజయ్య కథ గుర్తు తెచ్చుకోవాలి) దళిత, మహిళా చైతన్యం పెరిగింది. సాహిత్యంలో వారి ఆధిపత్యం పెరిగింది. రాష్ట్రమంతటా విప్లవోద్యమం, విప్లవ విద్యార్థి ఉద్యమాలు ప్రజల ఆలోచనల్లో కొత్త మార్పుల్ని తీసుకువచ్చాయి.విప్లవోద్యమం గెరిల్లా జోన్ స్థాయికీ, విముక్తి సైన్య నిర్మాణ స్థాయికీ పెరిగి రాష్ట్రాల సరిహద్దుల్ని చెరిపి వేస్తున్నది.రష్యా చైనాల పతనం తరువాత 85 తరువాత కాలంలో ప్రపంచీకరణ భావజాలం వచ్చింది. రాష్ట్రంలో విప్లవోద్యమం తాత్కాలికంగా పరాజయం పాలైంది.

అటు ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ వచ్చాక తెలంగాణలో మారిన

రాజకీయ సంబంధాల పైనా వర్గ సంబంధాలపైనా సాహిత్య, సామాజిక రంగంలో అనేక పరిశోధనలు జరిగాయి. రాష్ట్రమంతటిలో భాగంగానే తెలంగాణలో కూడా కొత్త రాజకీయ తరం పుట్టుకొచ్చింది. విప్లవోద్యమ ఫలితంగా గ్రామాలలోని భూస్వాములు, ధనిక రైతులు పట్టణాలకి తరలి వెళ్ళి అక్కడ కొత్త సంపన్న వర్గంగా ఏర్పడడం గురించి అనేక విశ్లేషణలు వచ్చాయి.

1980ల తరువాత నుంచీ హైదరాబాద్ రాష్ట్ర రాజధానిగా దాని సంపూర్ణ అర్థంలో మారుతూ వచ్చింది. రాజకీయాలకీ, ఆర్థికానికీ, పాలనకీ, సంస్కృతికీ అది రాజధానిగా మారింది. హైదరాబాద్‌లో ఉండే కవులు, కళాకారులు చాలా గొప్పవాళ్ళనీ, వాళ్ళకి నాయకత్వం ఇచ్చేశారు. తెలుగు కవిత్వం, చిత్రకళ, కథ, నవల అన్నింటికీ కేంద్రం హైదరాబాద్ అయ్యింది. కవిత్వంలోనూ, కథ, నవలలోనూ తెలంగాణ జీవితమూ, తెలంగాణ పోరాటాలూ వస్తువులై కవిత్వాన్ని నిర్దేశించే స్థాయికి ఎదిగింది. తెలుగులో బాగా కవిత్వం రాస్తున్న వాళ్ళని లెక్కిస్తే అందులో మొదటి వంద మందీ తెలంగాణ ప్రాంతపు కవులే ఉంటారు.

అలాగే సామాజిక రంగంలో ఎన్.వేణుగోపాల్, కె.శ్రీనివాస్, అల్లం నారాయణ, కంచ ఐలయ్య, చుక్కా రామయ్య, హరగోపాల్, కోదండరాం ఇలా అనేక మంది తెలుగు సామాజిక రంగంపై విశ్లేషణలు చేస్తే వాటిని ఆమోదించి వారి రచనల కోసం ఎదురు చూశారు. నిజానికి ఈ వేళ ఏ రంగంలోనైనా తెలంగాణ స్పర్శ లేని కళాకారుడు గానీ, సామాజిక విశ్లేషకులు గానీ లేనే లేరు.

80ల నుంచీ యువతరానికి ఆశా దీపాలుగా, ప్రజాస్వామిక వాదులుగా వెలిగిన వీరు "రాష్ట్రపతి పాలన కోరుతున్నాం", "ఇక్కడ ఏ విగ్రహమూ ఉండకూడదు", "సభలు జరుపుకోనివ్వం" "వాళ్ళ మీద ఎస్మా ఎందుకు ప్రయోగించరు" అనేంతగా మారడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి?

చరిత్ర, సాహిత్యరంగాలలో తెలంగాణ అయినా, రాయలసీమ అయినా, ఉత్తరాంధ్ర అయినా కోస్తాంధ్ర అయినా వారి పరిశోధనలూ, సృజనాత్మక కార్యక్షేత్రాలూ ఎప్పటికప్పుడు అందరికీ తెలుస్తూనే ఉన్నాయి. ఎక్కువ తక్కువ ఎంపిక ఎంతవరకూ సమంజసమో తెలియదు గానీ ఒకళ్ళకి ఒకళ్ళని పోటీగా, ఒకరి వల్ల ఒకరు అణిగిపోయారనీ గుర్తించలేదనీ రాసే రాతలు తెలుగు జీవితాన్ని స్పష్టంగా చూస్తున్నాయా? సాహిత్య చరిత్రలో ఒక రచయిత కళాకారుడు తన రచనల వల్లా, సృజనాత్మకత వల్లా ఎప్పటికైనా ప్రసిద్ధి పొందడం కొత్తకాదు. పాల్కురికి మీద చర్చ జరగలేదనీ, ఇతర తెలంగాణ రచయితల్ని అణగదొక్కారనీ రాతలు సమంజసమేనా? పాల్కురికి సోమనాథుడిపైన చాలా చర్చ జరిగింది. భారతి వంటి పత్రికలలో ఆయన రచనల మీద ఎన్నో పరిశోధనలూ జరిగాయి. ఇంకా జరుగుతూనే ఉన్నాయి. గురజాడ తన జీవితకాలంలో ప్రసిద్ధి పొందినవాడు కాదు. కమ్యూనిస్టులు గురజాడను మహాకవి చేసారు అనే అభిప్రాయం ఉండేది. శ్రీశ్రీ గురజాడ ద్రష్టత్వాన్ని వివరించేంత వరకూ గురజాడని అంగీకరించిన వాళ్ళెంతమంది?

ఈ సందర్భంలో ఇంకో విషయం గురించి కూడా ఆలోచించాలి. చరిత్రలో కొన్ని భావాలు ఒకానొక నిర్దిష్ట సమయంలో మొదలై కొనసాగుతాయి తప్ప అవి ఏటికి ఎల్లకాలమూ అలాగే ఉండవు. శాతవాహన సామ్రాజ్యం భరత ఖండంలో మొదటి దక్షిణాపథ చక్రవర్తులు స్థాపించిన సామ్రాజ్యం. శాతవాహనులు ఆంధ్రులా.. మరాఠీలా అనే దానిమీద అనేక సంవత్సరాలు చర్చ జరిగింది. తరువాత కాలంలో దొరికిన అనేక ఆధారాల వల్ల శాతవాహనుల జన్మస్థానం తిరుగులేకుండా నిర్ధారణ అయ్యింది. బావరీ, పింగీయుడు తెలంగాణ యువకులు అని రాస్తాడొక రచయిత. గుణాఢ్యుడు తెలంగాణ వాడు అంటారు. పోతన తెలంగాణ వాడంటారు. పాల్కురికి తెలంగాణ వాడంటారు. ప్రాంతీయ ఉద్యమాల సందర్భంలో ఇలాంటి వాదన అసమంజసం ఏమీ కాదు గానీ దీన్ని వేరే ప్రాంతాల మీద దాడికి వినియోగించడమే ఆశ్చర్యం.

ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ యూనిటరీ పోకడల మీదా, రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక స్వభావం మీదా గురిపెట్ట వలసిన రచయితలు, కళాకారులు, మేధావులు "అరవై సంవత్సరాల పెనుగులాట.. ఆరువందల మంది అమరుల తల్లుల కుడపుకోత సభలు" అంటూ ఎందుకు సెంటిమెంటల్ కావాలి? విద్యార్థి, ప్రజా ఉద్యమాలలో ఒకప్పటి హీరోలు, మేధావులు అందిరిదీ ఏ వర్గ భేదమూ లేకుండా ఏ కుల భేదమూ లేకుండా ఒకటే భావజాలం...

"హైదరాబాద్ మీ అయ్యదా... టాంక్‌బండ్ మీ అబ్బ సొమ్మా" అనడిగే ఎంఎఫ్ గోపీనాథ్

"తెలుగు జాతి వేరు.. తెలంగాణ జాతి వేరు. బతుకమ్మ, పీరీలు మా పండుగలు... మీకు సంక్రాంతి అట్లతద్దె పెద్ద పండుగలు. మీకు ఆగస్టు 15 మాకు సెప్టెంబర్ 17. కాలువ మల్లయ్య, వేముల ఎల్లయ్య, అల్లం రాజయ్య రాసిన రాతలు మీరు తలకాయ కింద పెట్టుకుని కాళ్ళు మీద పెట్టినా అర్థం కావు" అనే అన్నవరం దేవేందర్,

"ఐక్యత కుట్రట.. విభజన ప్రజాస్వామికం" అనే జి.వి.రత్నాకర్

"శ్రీశ్రీతో ఊరేగాను నక్సల్బరీని మోసాను కమ్యూనిజాన్ని ఊరేగాను కానీ దిస్ లాండ్ బిలాంగ్స్ టు మీ" అనే అల్లం నారాయణ.

"సహనం బద్దలైతే వచ్చేది ఉపద్రవాలే" అనే చుక్కా రామయ్య

"విధ్వంస రచన నిరాటంకంగా సాగింది" అన్న దామెర రాములు

"ఏ వివరణా సంజాయిషీ అవసరం లేదు పదండి ముందుకు పదండి తోసుకు సెహబాష్ ఉద్యమకారుడా" అనే ప్రసేన్

"కేసీఆర్ తెలంగాణ ప్రదాత" అనే దేశపతి శ్రీనివాస్

శ్రీశ్రీ మీద దాడి చేసే జూలూరి గౌరీశంకర్

"ఏపీ ఎన్జీవోల నాయకులు తెలంగాణ మీద దండయాత్ర చేస్తూ దాడులు చేస్తున్నారు. టెంట్‌లో బిర్యానీలు టెంట్ బయట వైన్‌లతో శిబిరాలు నడిపిస్తున్నారని అక్కడి మిత్రులే చెబుతున్నారు. తెలంగాణ ప్రజల హక్కులను కాలరాచి కోస్తాంధ్ర హక్కులు అడుగుతున్నారు. సమైక్యసభలో జై తెలంగాణ అన్నందుకు విద్యార్థి నాయకుణ్ణి, కానిస్టేబుల్‌ని చితగ్గొట్టిన ఏపిఎన్జీవోలది ఏ ప్రజాస్వామ్యం" అన్న విరసం

"జాతుల సమస్యలో భాగంగానే జరుగుతున్న ప్రత్యేక రాష్ట్ర

ఉద్యమాల్ని నిరశించకుండా తాత్కాలికంగా వేర్వేరు రాష్ట్రాల నేర్పరచుకున్నా భారతదేశంలోని బడా బూర్జువా, బడా భూస్వాముల ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న నూతన ప్రజాస్వామిక విప్లవంలో ఉభయ ప్రాంతాల ప్రజలూ సమైక్యమై సమగ్రమైన జాతిగా రూపొందుతారనే విశ్వాసంతోనే మార్క్సిజాన్ని ఆమోదించే వాళ్ళంతా ఈ పోరాటాలకు మద్దతు ఇవ్వాలి."

1969 తరువాత ఆంధ్రలో జరుగుతున్న నూతన ప్రజాస్వామిక విప్లవంలో భాగంగా సమగ్రమైన జాతిగా రూపొందడానికి సాంస్కృతికంగా బీజాలు పడ్డాయి. తెలంగాణ జానపదాలు... మిద్దెరాములు, చిందు ఎల్లవ్వ.. కాపు రాజయ్య... శేషగిరిరావు, ఏలె లక్ష్మణ్ మొత్తం 'ఆంధ్రప్రదేశ్'ని ఉర్రూతలూగించారు. ముఖ్యంగా జననాట్యమండలి, గద్దర్, గోరటి ఎంకన్న వీరంతా సెలబ్రిటీస్. ఒక కవిత్వం, కథ, నవలల్లో అయితే తెలంగాణ రచయిత అంటేనే అతను ప్రగతిశీల దృక్పథం ఉన్నవాడు అనే అభిప్రాయం నెలకొని స్థిరపడిపోయి ఉంది. తెలుగు కవిత్వం కథ నవలల్లో మాండలిక భాషకి, సాహిత్య రూపాన్నిచ్చి స్థానీయతను నేర్పి తెలుగు సాహిత్యానికి శిఖరాగ్ర స్థానంలో నిలబడింది. సినిమాలు, రికార్డింగ్ డాన్సుల బూతు హోరులో కొట్టుకుపోతున్న కోస్తాంధ్ర ప్రజానీకానికి జానపద సాహిత్య సౌందర్యాన్ని గుర్తు చేసింది.

ఈ క్రమాన్ని ఇగ్నోర్ చేయడం తమ బాణాల్ని అత్యంత పురాతన కాలం నుంచీ ఈ వేళ్టి వరకూ ఉన్న కవులు మేధావుల పైకి ఎక్కుపెట్టడం ఏమి సమంజసం? ఇది తెలంగాణ ప్రజల ఆకాంక్షకి మేలు చేస్తుందా?

సరే....రేపు రాబోయే తెలంగాణలో...

కేసీఆర్, ఆయన కుటుంబం అధికార కేంద్రం అవుతారు. కాంగ్రెస్ పార్టీలోని తెలంగాణవాదులు మంత్రులౌతారు. రాజనర్సింహ ముఖ్యమంత్రి అవుతాడు. బిజెపి అన్నో ఇన్నో సీట్లు గెల్చుకుని బలపడుతుంది. ఆరెస్సెస్ మరింత బలోపేతం అవుతుంది. తెలుగుదేశంలోని తెలగాణావారు ఏదో రకంగా అధికారంలో పాలు పంచుకుంటారు. అల్లం నారాయణ ప్రెస్ క్లబ్ చైర్మన్ అవుతాడు. మందకృష్ణమాదిగ ఎమ్మెల్యే అయి మంత్రి కూడా అవుతాడు. దేశపతి శ్రీనివాస్, జూలూరి గౌరీశంకర్, అన్నవరం దేవేందర్, నందిని సిధారెడ్డి తెలంగాణ సాహిత్య అకాడమీ నాయకులౌతారు.

అందరూ అన్నీ అవుతారు.

కానీ -

ప్రాణాలు కోల్పోయిన వారి తల్లిదండ్రులేమౌతారు?

విప్లవోద్యమంతో సమానంగా తెలంగాణని కోరుకుని అందులో ప్రముఖమైన పాత్ర నిర్వహించిన విప్లవ శక్తులకు తెలంగాణ రాష్ట్రంలో దొరికే స్థానం ఏమిటి?

'ఆంధ్ర, రాయలసీమ, ఉత్తరాంధ్ర, బూర్జువావర్గ వలసాధిపత్యం' నుంచి విముక్తి చెందిన తెలంగాణలో ఆ పోరాటంలో విప్లవోద్యమం కన్నా ఎక్కువ సెంటిమెంట్‌తో పాల్గొన్న విప్లవ సంస్థలు తెలంగాణ పాలనలో పాలు పంచుకుంటాయా? తమ 'వాటా'ని సాధించు కుంటాయా?

దాదాపు విప్లవోద్యమానికి ప్రత్యామ్నాయంగా ఎంచుకుని నిర్వహించిన పోరాటం తర్వాత దాని ఫలితాలని ప్రజలకి అందించేలా చేయడంలో విప్లవ శక్తులు తెలంగాణ పాలక వర్గంతో అధికారాన్ని పంచుకుంటారా?

వరంగల్ డిక్లరేషన్‌లో ఉన్న ఒక్క డిమాండ్‌నైనా నెరవేర్చేలా చేయగలరా? అందుకోసం అధికారంలో పాలుపంచుకుంటారా? లేక తెలంగాణ అనే రాష్ట్రం సాధించలేని ఈ డిమాండ్ల కోసం తమ వాటాని వదులుకుంటారా?

అప్పుడు తెలంగాణ ప్రజలందరూ సమైక్య చెర నుంచి బయటపడ్డందుకూ 'కోస్తాంధ్ర, ఉత్తరాంధ్ర రాయలసీమ బూర్జువా వర్గ వలసాధిపత్యం' నుంచి విముక్తి చెందినందుకు సంబరపడతారు. విప్లవ రచయితలు కోరిన తెలంగాణ వచ్చేసింది గనుక విప్లవాన్ని వదిలి తెలంగాణ పునర్నిర్మాణంలో పాల్గొనమని పిలుపు ఇస్తే విజయపు ఫలితాన్ని ఆస్వాదించకుండా దూరమౌతారా?

శత్రువుతో కలిసి పోరాడవలసిన సందర్భాలలో అన్నింటికన్నా ముఖ్యం కార్మికవర్గ నాయకత్వం. రష్యాలో లెనిన్ బూర్జువా వర్గంతో కలిసి పోరాడిన 1905 నాటి బూర్జువా ప్రజాస్వామిక విప్లవంలో కార్మిక వర్గం నాయకత్వం వహించి బూర్జువా వర్గాన్ని పారదోలాలన్నాడు. చైనాలో మావో ఐక్య సంఘటనలో అతి ముఖ్యమైన సంగతి ఆ ఐక్య సంఘటనకి నాయకత్వం కార్మికవర్గం వహిస్తుందా లేదా...అనేదే అన్నాడు. బూర్జువా వర్గానికి అవధులు లేని మద్దతు ఇచ్చి, ప్రజలకు సంబంధించి ఏ ఫలితాన్నీ సాధించలేని పోరాటంలో పాల్గొనడం నిష్కామ కర్మలాంటిది కాదా?

భారతదేశంలో కమ్యూనిస్టు పోరాటాన్ని ఫలితం కోసం కాకుండా పోరాటం కోసమే పోరాడతారా?

చదవండి
చదివించండి

వెల : రు. 75/-

రివిజనిజం-మావో

విరసం ప్రచురణ

ప్రతులకు :
దిశ పుస్తక కేంద్రం, హైదరాబాద్,
నవోదయ బుక్ హౌస్, కాచిగూడ, హైదరాబాద్,
సహచర బుక్‌మార్క్, హైదరాబాద్,

2014 జనవరి 11-12 తేదీలలో హనుమకొండలో జరిగిన విరసం 24వ మహాసభలలో ఆవిష్కరించిన, అరుణతార స్వీకారం పేజి కోసం వచ్చిన పుస్తకాలు



ప్రజాస్వామ్య తెలంగాణ
చారిత్రక పత్రాలు
ప్రచురణ :
నడుస్తున్న తెలంగాణ ప్రచురణలు
వెల : రు. 70/-
పేజీలు : 140



మార్క్సిస్టు తత్వశాస్త్రం
ఒక పరిచయం
ప్రచురణ :
న్యూ విస్టాస్ పబ్లికేషన్స్
వెల : రు. 80/-
పేజీలు : 198



కరువు కాటకాల కన్నీటి కోన
నేటి రాయలసీమ
(చారిత్రక పరిశీలన)
ప్రచురణ :
విప్లవ రచయితల సంఘం
వెల : రు. 100/-
పేజీలు : 102



విప్లవ మేధావి మహిత
ప్రచురణ :
విప్లవ రచయితల సంఘం
వెల : రు. 10/-
పేజీలు : 14



కార్మికవర్గ పుత్రుడు
వు-యన్-యు స్వీయ చరిత్ర
అనువాదం :
ప్రగతి
ప్రచురణ :
విప్లవ రచయితల సంఘం
వెల : రు. 70/-
పేజీలు : 151

తెలంగాణ రాష్ట్ర ఉద్యమం
రచయిత :
యం. రత్నమాల
ప్రచురణ :
నూతన ప్రచురణలు
వెల : రు. 80/-
పేజీలు : 96



ఉద్విగ్న
అత్యాచార భారతంపై ఓరుగల్లు కవుల నిరసన
ప్రచురణ :
రుద్రమ ప్రచురణలు
వెల : రు. 175/-
పేజీలు : 160



బీఫ్ రాజకీయాలు
తెలంగాణ విద్యార్థి వేదిక
ప్రచురణ :
తెలంగాణ విద్యార్థి వేదిక
వెల : రు. 30/-
పేజీలు : 76



రాజ్య దుర్మార్గం-రాజ్యాంగ వ్యతిరేకం
సల్వాజుడుం
జస్టిస్ బి. సుదర్శన్‌రెడ్డి
జస్టిస్ సురిందర్ సింగ్ నిజ్జర్
ప్రచురణ :
మలుపు బుక్స్
వెల : రు. 40/-
పేజీలు : 72

తుఫానులకెదురు నడవరా!
అనువాద కవిత్వం
తెలుగు :
గోదావరి
ప్రచురణ :
స్టోన్ పెల్లర్స్ పబ్లికేషన్స్
వెల : రు. 10/-
పేజీలు : 32



మరోసారి
ట్రిగ్గర్ మీద వేళ్ళతోనే...
అనామధేయుడు
ప్రచురణ :
స్టోన్ పెల్లర్స్ పబ్లికేషన్స్
వెల : రు. 10/-
పేజీలు : 24



Some Butterflies Can Fly
and four more poems
అనామధేయుడు
ప్రచురణ :
స్టోన్ పెల్లర్స్ పబ్లికేషన్స్
వెల : రు. 50/-
పేజీలు : 80



కా. ఆర్కే
పోరాట జలపాతం
ప్రచురణ :
రికన్నాయిటర్స్ ప్రచురణలు
వెల : రు. 50/-
పేజీలు : 160



విద్యార్థి-యువజన ఉద్యమాలు
ప్రచురణ :
విప్లవ రచయితల సంఘం
వెల : రు. 30/-
పేజీలు : 56



కొత్తనెత్తురు
కవిత్వం
రచయిత :
డా॥ బద్దిపూడి జయరావు
వెల : రు. 75/-
పేజీలు : 112

KLVA101M166

ARUNATARA onthly Journal of Revolutionary Writers' Association (VIRASAM)

● RNI Regn.No.21152/72 ● Published on 10/03/2014 302 - December, 2013

Edited, printed, published and owned by Chalasani Prasad, H.No. 33-13-3, Seetharampuram, Vijayawada - 520 002

Printed at Nagendra Printing Press, Vijayawada - 520 002.

Editor : Chalasani Prasad

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLVA101M166
పుస్తకం పేరు	అరుణతార
తారీఖు	08 February 2025
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	77
పెద్ద సైజు పేజీలు	no
ఖాళీ పేజీలు	no
లేని పేజీలు	no
తయారు చేసినది	Susmitha
పేజీలు విడదీసినది	Bhanusree
స్కాన్ చేసినది	Afsa
పరీక్ష చేసినది	HASEEMA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good